సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 184
మంగళవారం 24-9-2024


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



ఆనంద్ ఎఫెక్ట్...
భారత చెస్‌పై విశ్వనాథన్ ఆనంద్ ప్రత్యేక ముద్ర - 14లో



'ఆస్కార్'కు లాపతా లేడీస్
మహిళా డైరెక్టర్ కిరణ్ రావు తీసిన మహిళా గాథ ఇది. -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాదీ భరతుడి వ్యథే..
ఢిల్లీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆతిశి.. కేజ్రీవాల్‌పై ప్రభుభక్తిని చాటుకున్నారు. ఆయన కూర్చున్న ఎర్ర రంగు కుర్చీ ఖాళీగా ఉంచారు.
- వివరాలు 6లో▶



రేప్ నిందితుడు హతం
బద్లాపూర్‌లో బాలికలపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు అక్షయ్ షిండే పోలీసుల ఎదురుకాల్పుల్లో చనిపోయాడు.
- వివరాలు 6లో▶



ఇజ్రాయెల్ భీకర దాడులు
హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ ఆర్మీ భీకర దాడులకు తెరతీసింది. ఈ దాడుల్లో 356 మంది చనిపోగా, 1,024 మంది గాయపడ్డారు.
- వివరాలు 6లో▶



అన్‌స్టాప'బుల్'
మూడో రోజూ దేశీ స్టాక్ మార్కెట్ల రికార్డులు.. సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 పాయింట్ల మైలురాళ్లకు చేరువయ్యాయి.
- వివరాలు 15లో▶

న్యూస్‌రీల్

బరాజ్‌ల వైఫల్యంలో 20 మంది ఇంజనీర్లు!



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యానికి 20 మంది ఇంజనీర్లు బాధ్యులని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రాథమికంగా తేల్చినట్టు సమాచారం. నెలాఖరుకు పూర్తి స్థాయి నివేదిక రానుంది.
వివరాలు 16లో▶

టీజీసీఎస్‌బీకి ఫిర్యాదుల మోత



సైబర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. టోల్ ఫ్రీ నంబర్‌కు వెల్లువెత్తుతోన్న ఫిర్యాదులే ఇందుకు ఉదాహరణ. టీజీసీఎస్‌బీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న టోల్ ఫ్రీ నంబర్ 1930కు రోజుకు సరాసరి 1,600 ఫోన్‌కాల్స్ వస్తున్నాయి.
వివరాలు 16లో▶

ఖరీఫ్ నుంచే కొత్త నిబంధనలు



కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం కేటాయించిన ధాన్యాన్ని మళ్లించడం, రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖను మోసం చేయడం వంటి చర్యలకు పాల్పడకుండా మిల్లర్లపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం నిర్ణయించింది.
వివరాలు 3లో▶

బాణసంచా పేల్చి.. ఇటుకలు విసిరి!



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగ్రామమైన గోమారంలో ఆదివారం రాత్రి వినాయక శోభాయాత్ర నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో ఈ యాత్ర ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకోగానే కొందరు బాణసంచా కాలుస్తూ ఇంటిపైకి ఇటుకలు విసిరారు.
వివరాలు 12లో▶

ఆల్ ఇన్ వన్!

ప్రభుత్వ పథకాలన్నిటికీ ఇకపై ఒకే కార్డు

ప్రతి కుటుంబానికి ఓ డిజిటల్ కార్డు ఇచ్చే సన్నాహాల్లో సర్కారు
సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో చర్చ

- ఆరోగ్య, సంక్షేమ పథకాలతోపాటు రేషన్‌కు సైతం ఈ కార్డే ఆధారం
- ఆధార్/సెల్ నంబర్‌తో అనుసంధానం కుటుంబసభ్యుల వివరాలన్నీ నమోదు
- పొందుతున్న పథకాలు, ఆరోగ్య సమాచారం నిక్షిప్తం
- ప్రతి నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు
- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి త్వరగా నివేదిక ఇవ్వాలన్న సీఎం



సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్, మంత్రులు దామోదర రాజనరసింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి ఇతర అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతి పథకానికి ఇకపై ఒకే కార్డు ఆధారం కానుంది. అదే డిజిటల్ కార్డు. ప్రతి కుటుంబానికీ ఇచ్చే ఈ డిజిటల్ కార్డులో కుటుంబసభ్యుల వివరాలన్నీ నమోదై ఉంటాయి. ఆరోగ్య, సంక్షేమ పథకాలతో పాటు రేషన్ సరుకులకు సైతం ఉపయోగపడేలా ఈ కార్డును రూపొందించనున్నారు. కుటుంబానికి చెందిన ఆధార్ కార్డు లేదా సెల్ నంబర్‌ను ఈ డిజిటల్ కార్డుతో అనుసంధానిస్తారు. ప్రస్తుతం కర్ణాటక, రాజస్తాన్, మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ కార్డులో పొందుపరిచి ఉపయోగిస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి అన్ని ప్రభుత్వ పథకాలకు చిప్ అమర్చిన ఒకే డిజిటల్ కార్డు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. ఇందులో ఒక్కో పథకానికి ఒక్కో నంబర్‌ను కేటాయిస్తారు. తొలిదశలో ప్రయోగాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఈ విధానాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది. అయితే ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకురావడానికి ముందే ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాన్ని అధ్యయనం చేయాలని, అక్కడ ఎదురవుతున్న సమస్యలు ఇక్కడ తలెత్తకుండా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారుల బృందాన్ని అక్కడకు పంపించాలని నిర్ణయించారు.

అన్ని రికార్డులు ఒకే దగ్గర..: కేవలం ఆరోగ్యానికి సంబంధించిన అంశాలే కాకుండా.. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, ఆ కుటుంబ సభ్యులకు అందుతున్న
మిగతా 3వ పేజీలో ▶

ఆలస్యం లేకుండా వైద్యం

డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, సీఎస్ శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ డిజిటల్ కార్డులో ఆ కుటుంబంలోని సభ్యుల పూర్తి ఆరోగ్య సమాచారం, వారు అంతకుముందు చేయించుకున్న వైద్య పరీక్షల నివేదికలు ఉండేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వంలో ఎంప్యానల్ అయిన ఆసుపత్రులన్నింటిలోనూ ఈ కార్డులను ఉపయోగించి ఎలాంటి ఆలస్యం లేకుండా వైద్యం చేయించుకోవడానికి వీలవుతుందని భావిస్తోంది.

నెయ్యిపై నిగ్గు తేల్చండి

సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణియన్ స్వామి పిల్
నాణ్యత పరీక్షల్లో విఫలమైన ట్యాంకర్లు వెనక్కే.. దశాబ్దాలుగా ఇదే ఆనవాయితీ

ఎన్‌డీడీబీ నివేదిక ఆధారంగా తీవ్రమైన రాజకీయ విమర్శలు చేస్తున్నారు

- అయితే ఆ నెయ్యిని 100 శాతం వాడలేదని ఈవో 'ద ప్రింట్' ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు
- తిరస్కరించిన నెయ్యిని అసలు వాడనప్పుడు నివేదిక పేరుతో ఆరోపణలు ఎలా చేస్తారు?
- టీటీడీ తిరస్కరించిన నెయ్యి.. ఎన్‌డీడీబీ నివేదికలో ఉన్న నెయ్యి ఒకటే అయితే ఇక అపవిత్రం ఎక్కడ?
- అతి సున్నితమైన అంశాన్ని ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీక్ చేసి రాద్ధాంతం
- 'సుప్రీం' పర్యవేక్షణలో కమిటీని నియమించండి
- ఆ ల్యాబ్ నివేదికపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలి



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని నియమించాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్‌స్వామి సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. లడ్డూకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ల్యాబ్ నివేదికపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, టీటీడీ ఈవోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ కేసులో సుబ్రమణియన్‌స్వామి (పార్టీ ఇన్ పర్సన్)గా స్వయంగా వాదనలు వినిపించనున్నారు. ఏ నివేదిక ఆధారంగా అయితే రాద్ధాంతం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారో... ఆ నివేదిక రూపొందించేందుకు ఉపయోగించిన నెయ్యి ఎక్కడిది? టీటీడీ
మిగతా 12వ పేజీలో ▶

ఆ నెయ్యి వాడలేదు..

- తండ్రి చెప్పిన దానికి భిన్నంగా తనయుడి ట్వీట్

చంద్రబాబును అడ్డంగా బుక్ చేసిన లోకేశ్
12లో

స్పీకర్‌కు హైకోర్టు నోటీసులు



ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై విచారణ

- అసెంబ్లీ కార్యదర్శికి, సీఈసీకి, పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు
- కౌంటర్ దాఖలుకు సీజే ధర్మాసనం ఆదేశం
- ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా ఆదేశాలివ్వాలన్న కేఏ పాల్ విజ్ఞప్తికి నో

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో శాసనసభ స్పీకర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇతర ప్రతివాదులు కూడా స్పందించాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా, జీతభత్యాలు నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని తిరస్కరించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఒక పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన శాసనసభ్యులు వెంటనే మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారని.. ఇలాంటి వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరడం ద్వారా ఆయా నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని కూడా వమ్ము చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆ తర్వాత ఆ పార్టీ తరఫున ఏకంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో ఇలాంటి వారంతా ఐదేళ్ల పాటు యథేచ్ఛగా తమ అధికారాలను అనుభవిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఇలాంటి వారిపై వెంటనే అనర్హత వేటు వేసేలా ఆదేశాలు జారీ చేయాలి..' అని విజ్ఞప్తి చేశారు. అయితే ఇదే అంశంపై అప్పటికే సింగిల్ జడ్జి వద్ద పలు పిటిషన్లు
మిగతా 12వ పేజీలో ▶

ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వలేం..

పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపిస్తూ.. 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై శాసనసభ స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ఒక్కోసారి సంవత్సరం నుంచి ఐదేళ్ల వరకు పడుతోంది. ప్రతివాదులైన 10 మంది (దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ) ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా ఆదేశాలు ఇవ్వాలి. అలాగే జీతభత్యాలు కూడా నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి..' అని విజ్ఞప్తి చేశారు. అయితే పిటిషనర్ మధ్యంతర ఉత్తర్వుల విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. అలా ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. స్పీకర్, శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది.



యుద్ధక్షేత్రం పరిష్కారం కాదు

- సమష్టి శక్తిలోనే మానవాళి విజయం
- ఐరాస సదస్సులో మోదీ వ్యాఖ్యలు
- అంతర్జాతీయ సంస్కరణలకు పిలుపు

6లో

"మానవాళి విజయం సమష్టి శక్తిలోనే దాగుంది తప్ప యుద్ధక్షేత్రంలో కాదు. మానవాళి సంక్షేమానికి ఆహార, ఆరోగ్య భద్రతకు దేశాలు ప్రాధాన్యమివ్వాలి. మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టే ఏ చర్యలకైనా మనిషి సంక్షేమమే అంతిమ లక్ష్యం కావాలి. అప్పుడే అవి ఫలిస్తాయి. సంక్షేమ, సుస్థిరాభివృద్ధి పథకాల ద్వారా 25 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి విముక్తం చేశాం." - ప్రధాని మోదీ



చపాటా మిర్చికి త్వరలో జీఐ ట్యాగ్!

- 2022లోనే ఉద్యాన విశ్వవిద్యాలయం దరఖాస్తు
- త్వరలో రైతులతో జరిగే సమావేశంలో నిర్ణయం
- ఆర్మూర్ పసుపు, బాలానగర్ సీతాఫలం తదితర పంటలకు దరఖాస్తుపై కసరత్తు

2లో



రైతుబంధు దరఖాస్తులు తీసుకోండి

- 'ఫార్మా సిటీ'పై అధికారులకు హైకోర్టు ఆదేశం
- వారంలోగా దరఖాస్తులను స్వీకరించండి
- తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం

12లో



చైల్డ్ పోర్న్ చూసినా, వీడియోలున్నా నేరమే!

- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- నేరం కాదనడం ఘోరం: ధర్మాసనం
- మద్రాస్ హైకోర్టు తీర్పు కొట్టివేత
- చైల్డ్ పోర్నోగ్రఫీ అనొద్దని కోర్టులకు ఆదేశం

6లో

ఇలాంటివేంటో



మంచి పని సార్ ! లేదంటే మళ్లీ ఓడిస్తారు!

ట్రాన్స్‌ఫార్మర్లు టపటపా!

1,06,260 గతేడాది కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

అత్యధికంగా దక్షిణ డిస్కం పరిధిలో 71,733 కాలిపోయిన వైనం
రెండో అర్ధ వార్షికంలో ఎక్కువగా ఓవర్ లోడ్

- నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో అత్యధిక ఘటనలు
- నాసిరకం ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లు, మరమ్మతులు సరిగా చేయకపోవడం, నిర్వహణ లోపాలే కారణమనే విమర్శలు
- ఏటా మరమ్మతులకు రూ. వందల కోట్ల వ్యయం

సాక్షి, హైదరాబాద్: వంద, వెయ్యి, పది వేలు కాదు.. ఏకంగా లక్షకు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. అదీ ఒక్క ఏడాదిలోనే. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రాష్ట్ర వ్యాప్తంగా 1,06,260 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్)లు.. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి తాజాగా సమర్పించిన వార్షిక (2024–25) ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)లో వెల్లడించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5,58,932 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, అందులో 19 శాతానికి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఏడాదికి సగటున 50 వేల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. కానీ గతేడాది ఈ సంఖ్య రెట్టింపు కావడంపై విద్యుత్ అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఈ లక్ష ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని ప్రాంతాలకు
మిగతా 3వ పేజీలో ▶





'మాఫీ' కోసం సెల్ఫీ..

ముఖరా(కే)లో పాసుపుస్తకాలతో సెల్ఫీ దిగుతున్న రైతులు

- ముఖరా (కే) రైతుల వినూత్న నిరసన
- సెల్ఫీలు తీసి.. సీఎంఓకు పంపిన వైనం

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలోని ముఖరా(కే) రైతులు రుణ మాఫీకోసం వినూత్న నిరసన చేపట్టారు. రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని సోమవారం రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో సెల్ఫీ దిగి సీఎం కార్యాలయానికి పంపించారు. తమకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతు భరోసా అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖరా(కే)లో 190 మంది వరకు చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో 50 మంది రైతులకే రుణమాఫీ అయిందని, మిగతా 140 మంది అర్హులైనా రుణమాఫీ కాలేదని వాపోయారు. రుణమాఫీకి అన్ని అర్హతలు ఉన్నా అమలు కాకపోవడంతో పొలం పనులు విడిచి రోజుల తరబడి బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోందని తెలిపారు. రైతు భరోసా ఇవ్వకపోవడంతో పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోందన్నారు.



చపాటా మిర్చికి త్వరలో జీఐ ట్యాగ్!

2022 లోనే ఉద్యాన విశ్వవిద్యాలయం దరఖాస్తు.. త్వరలో రైతులతో జరిగే సమావేశంలో నిర్ణయం

ఆర్మూర్ పసుపు, బాలానగర్ సీతాఫలం తదితర పంటలకు దరఖాస్తుపై కసరత్తు.. జీఐ ట్యాగ్ లభిస్తే రైతులకు ఎంతో మేలు

సాక్షి, సిద్దిపేట: ఒక ప్రాంతంలో పండించే పంటలకు, ఉత్పత్తులకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం లభిస్తుంది. రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటివరకు రాష్ట్రానికి చెందిన 17 రకాల ఉత్పత్తులు జీఐ గుర్తింపు పొందాయి. మరిన్ని ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ కోసం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం కసరత్తు మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో త్వరలో వరంగల్ చపాటా మిర్చికి జీఐ గుర్తింపు లభించే అవకాశం ఉంది. వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూగెం, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో చపాటా మిర్చిని పండిస్తున్నారు. సుమారు 7 వేల ఎకరాల్లో దీని సాగు జరుగుతోంది. పంటను వరంగల్, ఖమ్మం, గుజరాత్, ముంబై, అహ్మదాబాద్ మార్కెట్లకు తరలించి అక్కడి నుంచి వియత్నాం, థాయ్‌లాండ్, మలేషియా, ఇంగ్లండ్, అమెరికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆహారంలో కృత్రిమ రంగును నిషేధించిన దేశాల్లో ఈ చపాటా మిర్చికి ఎక్కువ డిమాండ్ ఉంది. కృత్రిమ రంగులకు ప్రత్యామ్నాయంగా ఈ చపాటా మిర్చిని ఉపయోగిస్తారు. ఇందులో నుంచి ఓల్యూరోసిస్ అనే ఎరుపు రంగు ద్రావణాన్ని తీసి ఫుడ్ కలర్‌గా వినియోగిస్తారు. మన దగ్గర వీటిని ఎక్కువగా పచ్చళ్ల తయారీలో వినియోగిస్తారు. తిమ్మంపేట చిల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నర్సంపేట, వరంగల్, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ పంటకు జీఐ ట్యాగ్ కోసం 2022లో దరఖాస్తు చేశాయి. ఎంత మంది రైతులు దీనిని పండిస్తున్నారు. దీని వలన లాభాలు తెలుపుతూ పలు అంశాలతో కూడిన నివేదికను చెన్నైలోని జీఐ కార్యాలయంలో అందజేశారు. ఈ క్రమంలో ఈ నెలలో రైతులతో చెన్నైలో జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. సాగు విధానం, ఉపయోగాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి అయితే చపాటా మిర్చికి జీఐ ట్యాగ్ లభించే అవకాశం ఉంది. సాధారణ మిర్చి క్వింటాల్ రూ.8 వేల నుంచి రూ.18 వేల వరకు విక్రయిస్తుండగా..చపాటా మిర్చి రూ.30 వేల నుంచి 35 వేలు పలుకుతుంది.



మరికొన్ని పంటలకు కూడా..



➤ ఆర్మూరు పసుపునకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దీనికి జీఐ ట్యాగ్ సాధించేందుకు తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఇందుకు నాబార్డు సహకరిస్తోంది. దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతులు ప్రధాన పంటగా పసుపును సాగు చేస్తున్నారు. జీఐ ట్యాగ్ పొందితే ఎగుమతులు పెరిగే అవకాశాలున్నాయి. అధిక ధరలు పలకడంతో రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఇక రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ సీతాఫలాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు, ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తుంటారు. దీనికి జీఐ ట్యాగ్ కోసం కూడా ఉద్యాన వర్సిటీ కసరసత్తును ప్రారంభించింది. వర్సిటీ శాస్త్రవేత్తలు దీనిపై ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. అలాగే కొల్లాపూర్ మామిడి, జగిత్యాల పొడుగు బీరకాయలు, నల్లగొండ పచ్చడి దోసకాయలు, నిజామాబాద్ గుత్తి బీరకాయలు సైతం జీఐ గుర్తింపు కోసం దరఖాస్తు ప్రక్రియలో ఉన్నాయి. ప్లాంట్ అథారిటీలో నల్లగొండ పచ్చడి దోసకాయను నమోదు చేయించేందుకు ఉద్యాన వర్సిటీ దరఖాస్తు చేయించింది. నమోదు జరిగితే ఈ దోసకాయకు చట్టబద్ధమైన రక్షణ ఉంటుంది.

జీఐ ట్యాగ్ ఉన్న 17 ఉత్పత్తులివే..



పోచంపల్లి ఇక్కత్, కరీంనగర్ ఫిలిగ్రీ, గద్వాల చీరలు, నిర్మల్ బొమ్మలు, చేర్యాల నకాశి కళ, నిర్మల్ ఫర్నిచర్, నారాయణపేట చీరలు, పుట్టపాక తేలియా రుమాలు, గొల్లభామ చీరలు, ఆదిలాబాద్ డోక్రా ఇత్తడి బొమ్మలు, వరంగల్ దర్రీస్, నిర్మల్ చిత్రాలు, తాండూరు కందిపప్పు, పాతబస్తీ లక్కగాజులు, హైదరాబాద్ హలీం, పెంబర్తి మెటల్ క్రాఫ్ట్, బంగినపల్లి మామిడి ఉన్నాయి.

ఎన్నో ప్రయోజనాలు



జీఐ ట్యాగ్‌తో పంటల ఎగుమతులు పెరిగేందుకు, అధిక ధరలు లభించేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా రైతులకు మేలు జరుగుతుంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో ఉత్పత్తులకు డిమాండ్ పెరగడంతో పాటు ఆర్థిక వృద్ధికి తోడ్పతుంది. ఈ ఉత్పత్తులను ఇతరులు అనధికారికంగా ఉపయోగించడాన్ని నిరోధిస్తుంది.

– నీరజ ప్రభాకర్, వీసీ, తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

వారంలో ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌లో

- ఈ బుధవారం నుంచే కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో..
- షెడ్యూల్ విడుదల చేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రతీవారంలో ఇద్దరు మంత్రులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీ భవన్‌ను సందర్శించనున్నారు. ఈ మేరకు సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ షెడ్యూల్ విడుదల చేశారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పార్టీ కార్యకర్తలు, సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను గాంధీభవన్‌లో కలుస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రజల ఫిర్యాదులు, అర్జీలను ఆ రోజున తీసుకుంటారని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆ షెడ్యూల్‌లో వివరించారు.

మంత్రుల షెడ్యూల్ ఇలా...

25 సెప్టెంబర్: దామోదర రాజనర్సింహ, 27 సెప్టెంబర్: శ్రీధర్‌బాబు, 2 అక్టోబర్: గాంధీ జయంతి (కార్యక్రమం లేదు), 4 అక్టోబర్: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, 9 అక్టోబర్: పొన్నం ప్రభాకర్, 11 అక్టోబర్: సీతక్క, 16 అక్టోబర్: కోమటిరెడ్డి వెంకటరెడ్డి, 18 అక్టోబర్: కొండా సురేఖ, 23 అక్టోబర్: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, 25 అక్టోబర్: జూపల్లి కృష్ణారావు, 30 అక్టోబర్: తుమ్మల నాగేశ్వరరావు

దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరు

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న చందంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ అమృత్ పథకంలో అవినీతికి పాల్పడి పెద్దఎత్తున కమీషన్లు కొట్టేయడం వాస్తవమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ స్కీంలో చోటుచేసుకున్న అవినీతిని వెలికితీయాలన్నా, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆరోపణల్లో నిజానిజాలు బయటకు రావాలన్నా కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఆధ్వర్యంలో తెలంగాణలో ఈ పథకం అమలుపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సీవీసీకి లేఖ రాయాలని సంజయ్ ఓ ప్రకటనలో సూచించారు. ఒకవేళ అలా రాయకుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్టు భావించాల్సి వస్తుందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం, హైడ్రా కూల్చివేతల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే 'అమృత్ విషయం'లో బీఆర్ఎస్, కాంగ్రెస్ డ్రామాలాడుతున్నాయని బండి సంజయ్ మండిపడ్డారు. దేశంలోని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు మోదీ ప్రభుత్వం అమృత్ పథకాన్ని తెస్తే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతికి పాల్పడ్డాయని ఈ పథకం ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేస్తున్నాయని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో ప్రజారోగ్యం అస్తవ్యస్తం

- బీఆర్ఎస్ 'ప్రజారోగ్య కమిటీ' సభ్యుల మండిపాటు
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాలు జరిగాయని ఆరోపణ
- గాంధీ ఆస్పత్రిలో పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు
- వారిని అడ్డుకున్న పోలీసులు.. ఆందోళనకు దిగిన కార్యకర్తలు
- ఎమ్మెల్యేలు సంజయ్, గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అరెస్టు



పోలీసులతో గోపీనాథ్, సంజయ్ వాగ్వాదం



మాట్లాడుతున్న రాజయ్య. చిత్రంలో మెతుకు ఆనంద్

సాక్షి, హైదరాబాద్/ గాంధీ ఆస్పత్రి: రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని.. మాతాశిశు మరణాలు, విషజ్వరాలు పెరిగిపోతున్నాయని బీఆర్ఎస్ 'ప్రజారోగ్య కమిటీ' మండిపడింది. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదని, ఎమర్జెన్సీ పాలన అని ఆరోపించింది. గాంధీ ఆస్పత్రిలో పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం దారుణమని మండిపడింది.

గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత.. నేతల అరెస్టులు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితుల అధ్యయనం కోసం బీఆర్ఎస్ పార్టీ డాక్టర్ టి.రాజయ్య నేతృత్వంలో.. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌లతో కమిటీని వేసింది. సోమవారం ఉదయం తెలంగాణ భవన్ నుంచి గాంధీ ఆస్పత్రికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని.. మాతాశిశు మరణాలపై నిజనిర్ధారణ చేయాలని ఈ కమిటీ నిర్ణయించింది. అయితే కమిటీకి నేతృత్వం వహిస్తున్న టి.రాజయ్యను పోలీసులు ఉదయమే ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గృహ నిర్బంధం చేశారు. మిగతా ఇద్దరు సభ్యులు డాక్టర్ సంజయ్, డాక్టర్ మెతుకు ఆనంద్ పోలీసుల కళ్లుగప్పి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మరికొందరు పార్టీ నేతలతో కలసి గాంధీ ఆస్పత్రికి వెళ్లారు. పోలీసులు వారిని ఆస్పత్రి ప్రధాన గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు మాగంటి గోపీనాథ్, సంజయ్, మెతుకు ఆనంద్‌లను అరెస్టు చేసి నారాయణగూడ ఠాణాకు.. ఇతర నేతలు, కార్యకర్తలను ఈడ్చుకెళ్లి వ్యాన్లలోకి ఎక్కించి బొల్లారం ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం తర్వాత నేతలు, కార్యకర్తలను వదిలేశారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

గాంధీ ఆస్పత్రి ఘటన తర్వాత తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ప్రజారోగ్య కమిటీ సభ్యులు రాజయ్య, సంజయ్, మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడారు. సీఎం, మంత్రుల సమీక్ష లేకపోవడంతో.. రాష్ట్రంలో ప్రజారోగ్యం కుంటుపడిందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు తగ్గిపోయాయని రాజయ్య ఆరోపించారు. నిజనిర్ధారణ కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్లిన కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో విష జ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వం నిద్రపోతోందని డాక్టర్ సంజయ్ విమర్శించారు. ఆస్పత్రుల్లో డొల్లతనం బయటపడుతుందనే తమకు అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. నిపుణులైన వైద్యులు లేకే, ఆస్పత్రుల్లో మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మాతాశిశు మరణాలపై దాపరికం ఎందుకు?

ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న మాతాశిశు మరణాలపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దాపరికంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. గాంధీ ఆస్పత్రి బయట ఆయన మీడియాతో మాట్లాడారు. తాము నిర్మాణాత్మక అంశాలపైనే పోరాడుతున్నామని, ప్రతిపక్షంగా ఇది తమ బాధ్యత అని చెప్పారు. సీఎం కార్యాలయం నుంచి వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సరైన సహకారం లేదని ఆరోపించారు.

భగీరథ, కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకున్నారు: మంత్రి పొంగులేటి

సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి అల్లుడు



ఓపెన్ జిమ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే కనకయ్య

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/నేలకొండపల్లి: గత ప్రభుత్వం మిషన్ భగీరథ, కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకారం సోమవారం సాయంత్రం జరగగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎంఏయూడీలో అమృత్ స్కీంలో అవినీతికి పాల్పడ్డారని, సృజన్‌రెడ్డికి పనులు ఇచ్చారని కేటీఆర్ చెబుతుండగా.. ఈ విషయమై చర్చకు ఎక్కడైనా వస్తానని, ఆరోపణలు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెబితే సమాధానం ఇవ్వలేదన్నారు. ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే కేటీఆర్ ఎవరో చెప్పిన విమర్శలు చేసే ముందుకు ఆలోచించాలని సూచించారు. పాలేరులో తనపై బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన కందాళ ఉపేందర్‌రెడ్డి అల్లుడే సృజన్‌రెడ్డి అని.. ఆయనకు బీఆర్ఎస్ హయాంలో సబ్ కాంట్రాక్టర్లు ఇప్పించారని తెలిపారు. ఇప్పుడు సృజన్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి బావమరిదిగా చిత్రీకరించే పనిచేస్తున్నారని చెప్పారు. సీఎంను దించడానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుట్ర చేస్తున్నారని చెబుతున్నారని.. కానీ కేటీఆర్ – హరీశ్ రావు మధ్యే అంతర్గత వివాదాలు ఉన్నాయని తెలిపారు.

అధికారులు పద్ధతి మార్చుకోవాలి

పేదవారి కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని.. సర్కారు ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అలా కాకుండా సొంత ఆలోచనలను పాలనలో జొప్పించాలని చూస్తే ఏ స్థాయి అధికారులపైనైనా చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందులో మంగళవారం పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత నిర్వహించిన సమీక్షలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కనకయ్య, కలెక్టర్ పాటిల్, ఎస్పీ సునీల్‌దత్, ఐటీడీఏ పీఓ రాహుల్ సహా అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం తరహాలో ధరణిని అడ్డుపెట్టుకొని ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకోబోమన్నారు.

నాటి చావులు గుర్తులేవా కేటీఆర్?

- గత ప్రభుత్వ నిర్వాకంతోనే పేదలకు వైద్యం అందని పరిస్థితి: మంత్రి దామోదర ఫైర్
- అప్పుడు వరుసగా బాలింతలు చనిపోతే ఏం చేశారు?
- వైద్యులపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు



సాక్షి, హైదరాబాద్: ''గత ప్రభుత్వ హయాంలో 2017లో కోఠి మెటర్నిటీ ఆస్పత్రిలో మూడు రోజుల్లో ఆరుగురు బాలింతలు, అదే ఏడాది ఐదు రోజుల వ్యవధిలో నిలోఫర్ ఆస్పత్రిలో ఐదుగురు బాలింతలు, 2022లో డీపీఎల్ పద్ధతిలో చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో నలుగురు మహిళలు, 2019లో జూన్, జూలై నెలల్లో డెంగీతో 100 మంది చనిపోవడం.. ఇవన్నీ గుర్తులేవా కేటీఆర్? గత ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపకనే పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది..'' అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీచేశారు. గత పదేళ్లలో నిర్వీర్యమైన వైద్య రంగాన్ని తాము గాడిలో పెడుతున్నామని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాజకీయం కోసం ఆస్పత్రులను వేదికగా వాడుకోవడం సరికాదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అనేక దుర్ఘటనలు జరిగాయని.. అవన్నీ బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ తెలంగాణ సమాజానికి చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గాంధీ ఆస్పత్రిపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని డాక్టర్లు విజ్ఞప్తి చేసినా.. కేటీఆర్‌కు తలకు ఎక్కడం లేదని మంత్రి మండిపడ్డారు.

ఖాళీలకు బాధ్యులు ఎవరు?

''తప్పుడు సమాచారంతో ట్వీట్ చేసి, అడ్డంగా దొరికిపోయిన కేటీఆర్.. తప్పును కవర్ చేసుకునేందుకు ఫ్యాక్ట్ ఫైండింగ్ పేరిట డ్రామాలు చేస్తున్నారు. గత పదేళ్ల పాలనా వైఫల్యాలను పది నెలల ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారు. గాంధీ ఆస్పత్రి మరణాలను ప్రభుత్వ వైద్యుల వైఫల్యంగా చిత్రీకరించడం బీఆర్ఎస్ అజ్ఞానానికి నిదర్శనం. అసలు వైద్యారోగ్యశాఖలో ఖాళీలకు బాధ్యులు ఎవరు?'' అని దామోదర రాజనర్సింహ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మూడేళ్లలో హడావుడిగా 25 మెడికల్ కళాశాల ఏర్పాటుకు జీవోలు ఇచ్చి చేతులు ఎత్తేశారని.. 3,368 మంది టీచింగ్ స్టాఫ్ అవసరమైతే, కేవలం 1,078 మందిని భర్తీ చేశారని మండిపడ్డారు. స్టాఫ్, సదుపాయాలు లేకుండా మొక్కుబడిగా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని విమర్శించారు.

త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆస్పత్రులలో అడ్మినిస్ట్రేషన్ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి దామోదర తెలిపారు. త్వరలోనే 612 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ చేపట్టబోతున్నామని వెల్లడించారు. కొత్త వైద్య కళాశాలల్లో డీఎంఈ కింద 19,530 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి ఇస్తే.. గత ప్రభుత్వం భర్తీ చేసింది 1,500 లోపేనని విమర్శించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే అన్ని విభాగాల్లో కలిపి 7,308 పోస్టులు భర్తీ చేసిందని తెలిపారు. మరో 5,660 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాలు 2022లో 500 జరిగితే.. 2023లో 542 ఉండగా, 2024లో ఇప్పటివరకు 309 మరణాలు జరిగాయని వెల్లడించారు. నెలవారీ సగటు చూస్తే 2022లో 42 చొప్పున, 2023లో 45 చొప్పున, 2024లో 39 చొప్పున జరిగాయని వివరించారు.

ఎంక్వైరీ కమిటీని స్వాగతిస్తాం..

స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య

సాక్షి, హైదరాబాద్: తమ సంస్థ లావాదేవీలన్నీ పారదర్శకంగా జరుగుతాయని, ప్రతీ ఏడాది సహకార శాఖ సంస్థ లావాదేవీలను ఆడిట్ చేస్తుందని స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య స్పష్టం చేసింది. తమ సంస్థకు ఎనిమిదేళ్లుగా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ చేసిన ఆడిట్ లో 'ఏ'గ్రేడు ఇచ్చారని సమాఖ్య అధ్యక్షురాలు ఇందిర, ఉపాధ్యక్షురాలు రాఘవదేవి, కోశాధికారి సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు, సభ్యుల సూచనల మేరకు స్త్రీనిధిలో విధి విధానాల రూపకల్పన చేస్తూ, ప్రతి విషయాన్ని స్త్రీనిధి పాలకవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తారని తెలియజేశారు. ఈ సంస్థపై, సిబ్బందిపై ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వం నలుగురు అధికారులచే ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు నిజమైతే తాము దీన్ని స్వాగతిస్తున్నామన్నారు. సరైన కారణం లేకుండా ఏ సిబ్బందిని తొలగించలేదని తెలిపారు. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగేలా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

సాగర్ కాలువ గండిని పూడ్చడం చేతకాదా?: హరీశ్‌రావు

కాంగ్రెస్‌కు కూల్చివేతలు తప్ప పూడ్చివేత తెలియదు

ప్రభుత్వ వైఫల్యంతో 3 లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి

త్వరలో ఖమ్మం జిల్లాకు వెళ్లి రైతులకు మనోధైర్యం ఇస్తాం



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా 22 రోజులుగా నాగార్జున సాగర్ కాలువకు పడిన గండిని పూడ్చడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా నది నిండుకుండలా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పొలాలను ఎండ బెడుతోందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు గండి పడిన కాలువ పక్క నుంచే వెళ్తున్నా మరమ్మతులు జరగడం లేదని ఎద్దేవా చేశారు. దీంతో 'సీఎంను క్షమించు.. రైతులను రక్షించు'అంటూ భద్రాచలం సీతారామచంద్ర స్వామిని వేడుకుంటున్నామని హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలసి మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ తరఫున త్వరలో ఖమ్మం జిల్లాలో పర్యటించి రైతులకు మనోధైర్యం కల్పిస్తామన్నారు.

రైతులతో కన్నీళ్లు పెట్టిస్తున్నారు..

'పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో రైతులు పార్టీలకు అతీతంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆఫీసులను ముట్టడిస్తూ ధర్నాలు చేస్తున్నారు. ఆకాశాన్ని దించుతాం, సూర్యుడిని వంచుతాం అనే డైలాగులు కొడుతున్న రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులకు కాలువ గండి పూడ్చటం చేతకావడం లేదా. 3 లక్షల ఎకరాలు ఎండుతున్నా కాంగ్రెస్ సర్కార్‌కు కూల్చి వేతలు తప్ప పూడ్చివేత రాదా? వరదల్లో కొట్టుకుపోయిన పంటలకు నష్టం పరిహారం ఇవ్వకుండా రైతులతో కన్నీళ్లు పెట్టిస్తోంది'అని హరీశ్‌రావు మండిపడ్డారు. 'వరదల కారణంగా సాగర్ పరీవాహక ప్రాంతంలో 60 వేల ఎకరాలు, కాంగ్రెస్ నిర్వాకంతో లక్ష ఎకరాలు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు నీళ్లిచ్చినా పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదు. పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్లు, డీజిల్, ట్రాక్టర్ల కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వరదల్లో నష్టపోయిన వారికి ఇస్తున్న పరిహారం రూ.10 వేలు ఏ మూలకూ సరిపోవడం లేదు'అని అన్నారు. రాష్ట్రంలో గూండాయిజం పెరిగి, అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయన్నారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రెండు వేల అత్యాచార ఘటనలు చోటు చేసుకున్నాయని హరీశ్ పేర్కొన్నారు.



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద కొనసాగుతున్న సాగర్ ఎడమ కాల్వ కట్ట మరమ్మతు పనులు

పూర్తికావొచ్చిన సాగర్ కాల్వ గండి పూడ్చివేత పనులు

నడిగూడెం: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు ఈనెల 1వ తేదీన గండి పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గండి మరమ్మతు పనులు పూర్తి కావొచ్చాయి. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. గండి పూడ్చివేత పనులు రాత్రింబవళ్లు సాగుతున్నాయి. ప్రస్తుతం 150 మీటర్ల పొడవున, 5 నుంచి 6 మీటర్ల వెడల్పున, 4.8 మీటర్ల ఎత్తు వరకు మట్టితో కట్ట ఏర్పాటు చేశారు. మరో 1.2 మీటర్ల ఎత్తువరకు మట్టిపోస్తే పనులు పూర్తికానున్నాయి. ఒక వైపు కాల్వలో కింది భాగం నుంచి ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు రెండు నుంచి మూడు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పనులను సోమవారం ఇరిగేషన్ శాఖ సీఈ రమేశ్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ పరిశీలించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే మ్యాచ్ ఫిక్సింగ్..

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే మ్యాచ్ ఫిక్సింగ్ నడుస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గత 9 నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ పోరాడుతోందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఎన్నో తప్పిదాలను తాము బయటకు తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు అవినీతిపై బీఆర్ఎస్ నేతలు ఇన్నాళ్లు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కొత్తగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయ డ్రామాలో భాగంగానే పరస్పరం సవాళ్లు చేసుకుంటున్నారని విమర్శించారు. సోమవారం ఆయన మీడియతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ 9 నెలల పాలన, గత ప్రభుత్వ పదేళ్ల పాలనపై చర్చకు మంత్రి పొంగులేటి, కేటీఆర్ సిద్ధమేనా అని సవాల్ విసిరారు. తాను చేసిన ఆరోపణలు, ప్రస్తావించిన అంశాలను నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, నిరూపిస్తే పొంగులేటి, కేటీఆర్ తప్పుకునేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ సర్కార్ తప్పిదాలపై దమ్ముంటే సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

సివిల్ సర్వెంట్లపై దేశ భవిత నిర్మాణ బాధ్యత

ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు ప్రారంభోత్సవంలో స్పెషల్ సీఎస్ గోయల్



సాక్షి, హైదరాబాద్: ప్రజల జీవితాలను తీర్చిదిద్దడం ద్వారా దేశ భవిష్యత్తును నిర్మించే బృహత్తర బాధ్యత సివిల్ సర్వీసెస్ అధికారులపై ఉంటుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. 231 మంది అఖిల భారత సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ రూపొందించిన ప్రత్యేక ఫౌండేషన్ కోర్సును సోమవారం ఆయన ప్రారంభించారు. కోర్సు మాన్యువల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు, ఆకాంక్షలను అర్థం చేసుకొని నిర్ణయాలు తీసుకోవడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుందని చెప్పారు.

28న గురుకుల టీచర్ల చాక్‌డౌన్, పెన్‌డౌన్

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న చాక్‌డౌన్, పెన్‌డౌన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా జేఏసీ ప్రతినిధులు సీహెచ్.బాలరాజు స్పష్టం చేశారు. గురుకులాల్లో సమయపాలన మార్పు చేయాలంటూ సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, జేఏసీ తరపున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, సొసైటీ కార్యదర్శులకు ప్రత్యేకంగా వినతులు సమర్పించినట్లు చెప్పారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్



సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి సవ్యసాచి ఘోష్‌కు పదోన్నతి లభించింది. ప్రస్తుత పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి, 1994 బ్యాచ్‌కు చెందిన సవ్యసాచి ఘోష్‌కు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయనను పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటు చేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (టాస్) ఏర్పాటు చేయాలని గ్రూప్–1 ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. కేరళ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ తరహాలో రాష్ట్రంలోనూ టాస్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సోమవారం గ్రూప్–1 ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ 2015లో టాస్ ఏర్పాటు అధ్యయనానికి ఆరుగురు ఐఏఎస్‌లతో ప్రభుత్వం కమిటీ వేసినా ఇప్పటివరకు కమిటీ తుది నివేదిక సమర్పించలేదన్నారు. త్వరలో సీఎం రేవంత్, చిన్నారెడ్డి కమిటీ, సీఎస్‌ను కలిసి సమస్యలను విన్నవిస్తామన్నారు.

సజావుగా పీఎఫ్ బీమా చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: పీఎఫ్‌లో భాగంగా ఉన్న ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్(ఈడీఎల్ఐ) పథకం కింద మిగిలిన కేసుల్లో చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని ఆర్టీసీ పేర్కొంది. 2023 అక్టోబర్ నుంచి 2024 ఆగస్టు వరకు 574 కేసులకు సంబంధించి రూ.32.04 కోట్ల బీమా సొమ్మును సంబంధీకులకు చెల్లించినట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'బీమా సొమ్ము... ఆర్టీసీ సొంత అవసరాలకు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై వివరణ ఇచ్చింది. ప్రతినెలా రూ.31 లక్షల మొత్తాన్ని ఈ పథకం కోసం డిపాజిట్ చేస్తున్నట్టు వెల్లడించింది. ఈ పథకం కింద చెల్లింపుల్లో నిర్లక్ష్యం లేదని స్పష్టం చేసింది. గతేడాది మార్చి నుంచి చెల్లింపులు ఆగిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొంది. మూడునెలలకోమారు కాకుండా ప్రతినెలా చెల్లిస్తున్నట్లు వెల్లడించింది.

ఓయూ ఎంబీఏ ఈవినింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ ఎంబీఏ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఓయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలో సాయంకాలం కొనసాగుతున్న రెండు సంవత్సరాల ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఎంబీఏ పార్ట్‌టైం కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 24 నుంచి వచ్చేనెల 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పీజీ అడ్మిషన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ జలపతి పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని సూచించార

ఖరీఫ్ నుంచే కొత్త నిబంధనలు

మిల్లర్ల అక్రమాలకు చెక్ పెట్టే దిశగా త్వరలో అధికారిక ఉత్తర్వులు • డిఫాల్ట్, పెండింగ్ కేసులు ఉన్న మిల్లులకు ధాన్యం బంద్

సాక్షి, హైదరాబాద్, : మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా దారి మళ్లించడం, నాణ్యమైన బియ్యం విక్రయించి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖను మోసం చేయడం వంటి చర్యలకు పాల్పడకుండా మిల్లర్లపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. ఈ మేరకు రూపొందించిన మార్గదర్శకాలకు ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోద ముద్ర వేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. సోమవారం మంత్రి ఉత్తమ్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఈ నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్టు తెలిసింది.

డిఫాల్టర్లపై ఉక్కుపాదం

గతంలో అక్రమాలకు పాల్పడినట్టు తేలిన మిల్లర్లకు, ఫేక్ ట్రక్ షీట్లు సృష్టించి కేసుల్లో ఇరుకున్న వారికి, 6 ఏ ఈసీ యాక్ట్, క్రిమినల్ కేసులు పెండింగ్ ఉన్న వారికి ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం కేటాయించకూడదని, వీరికి ఈ సీజన్‌తోపాటు వచ్చే రెండు సీజన్ల వరకు వడ్లు ఇచ్చే ప్రసక్తే లేదంటున్నారు. డిఫాల్ట్ అయిన మిల్లర్లు బకాయి పడ్డ సీఎంఆర్‌ను అప్పగించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకుంటేనే కొత్తగా ధాన్యం కేటాయించనున్నారు. మిల్లర్లు లీజు డీడ్ ఇవ్వడంతోపాటు కేటాయించిన ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి కానుంది.

కెపాసిటీకి అనుగుణంగా కేటాయింపులు

రైస్‌మిల్లులు తమకు కేటాయించిన ధాన్యాన్ని ఏడాదిన్నర వరకు కూడా మిల్లింగ్ పూర్తి చేయకుండా తమ వద్దే నిల్వ ఉంచుకుంటున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. తద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడం, ఎఫ్‌సీఐ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలో ఆలస్యం చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మిల్లులు సీఎంఆర్ కోసం ప్రతిరోజు రెండు షిఫ్టుల్లో 16 గంటలు పనిచేయాలని మార్గదర్శకాల్లో పొందుపరిచారు. ముడి బియ్యం ఇచ్చే రా రైస్ మిల్లులకు వడ్లు కేటాయిస్తే 8 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో రోజుకు 16 గంటలు మిల్లింగ్ చేసి 75 రోజుల్లో కేటాయించిన ధాన్యంలో 67శాతం రా రైస్ ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లుల కెపాసిటీకి అనుగుణంగా ధాన్యం కేటాయించనున్నారు.



25 శాతం బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి

మిల్లింగ్ కోసం ధాన్యం తీసుకునే మిల్లర్లు ధాన్యం విలువకు అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా నిబంధనలు సవరించారు. కేటాయించిన ధాన్యం మిల్లింగ్ కెపాసిటీని బట్టి మిల్లింగ్‌కు వచ్చే 15 రోజుల ముందే 25 శాతం బ్యాంక్ గ్యారంటీని సమర్పించాల్సి ఉంటుంది. లీజు మిల్లుదారుడైతే కేటాయించిన ధాన్యంలో 50 శాతం బ్యాంక్ గ్యారంటీ సమర్పించాల్సి ఉంటుంది. లీజు తీసుకున్న మిల్లులో గతంలో ఓనర్ సీఎంఆర్ డెలివరీ పెండింగ్ లేనట్టు డీఎంల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే మిల్లులకు కేటాయింపులు ఉంటాయి. రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలులో ఉన్న మిల్లర్లకు సైతం ధాన్యం కేటాయింపులు ఉండవని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

కలెక్టర్ల పర్యవేక్షణ...

జిల్లాల వారీగా రైస్‌మిల్లుల్లో సాగే సీఎంఆర్‌పై కలెక్టర్లకే బాధ్యతలు అప్పగించనున్నారు. ధాన్యం కొనుగోళ్ల నుంచి మిల్లింగ్ వరకు వారే కీలకం. బాయిల్డ్ రైస్‌మిల్లర్లు ఫోర్టిఫైడ్ రైస్ ఇచ్చేందుకు డిసెంబర్ 31లోగా ఎఫ్ఆర్‌కే బ్లెండింగ్, సోర్టెక్స్ మెషీన్లు ఇన్‌స్టాల్ చేసుకునేలా ఆయా జిల్లాల కలెక్టర్ చర్యలు తీసుకొని, వారికే ధాన్యం కేటాయించాల్సి ఉంటుంది. జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి అర్హత ఉన్న మేరకే ధాన్యం కేటాయించాలి. మిల్లులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కేటాయించిన ధాన్యం దారిమళ్లినా, ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రైవేట్‌గా విక్రయించినా క్రిమినల్ చర్యలు తప్పనిసరి.

36.80 లక్షల ఎకరాల్లో సన్నరకాల సాగు

ఈసారి 88 లక్షల టన్నుల సన్నాల దిగుబడి అంచనా

- అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సన్నాలకు, దొడ్డు వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు
- మార్కెట్‌కు వచ్చే సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తాం
- 40 లక్షల ధాన్యం నిల్వ కోసం గోదాములు ఏర్పాటు చేసినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వచ్చే జనవరి నుంచి రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇవ్వనున్న నేపథ్యంలో.. ఖరీఫ్‌లో రైతుల నుంచి సన్న వడ్లు కొనుగోలు చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు ఎన్నడూ లేనివిధంగా 36.80 లక్షల ఎకరాల్లో సన్న వడ్లను సాగు చేశారని.. సుమారు 88.09 లక్షల టన్నుల సన్న వడ్ల దిగుబడి ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చే సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో 2024–25 ఖరీఫ్ పంట కొనుగోళ్లపై జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి ఉత్తమ్ చెప్పారు. సన్న, దొడ్డు వడ్లు కలిపి ఖరీఫ్‌లో 60.39 లక్షల ఎకరాల్లో సాగయ్యాయని, మొత్తంగా 1.46 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని వివరించారు. ఇందులో 91.28 లక్షల టన్నులు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సన్నాలు, దొడ్డు వడ్లను వేర్వేరు కేంద్రాల్లో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



ఖరీఫ్ పంట కొనుగోళ్లపై ఉన్నతాధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదు

గతంలో అవకతవకలకు పాల్పడిన మిల్లర్లకు ఇకపై ధాన్యం ఇచ్చేది లేదని మంత్రి ఉత్తమ్ చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ తొలివారంలో మొదలయ్యే ధాన్యం కొనుగోళ్లు జనవరి చివరి వరకు కొనసాగుతాయన్నారు. మొట్టమొదటి సారిగా రాష్ట్ర ప్రభుత్వం 40 లక్షల టన్నుల ధాన్యం నిల్వకు వీలుగా గోదాములను సిద్ధం చేసిందని చెప్పారు. ఖరీఫ్‌లో సేకరించిన సన్నాలను జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో అందిస్తామని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ధాన్యం కొనుగోలు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును ఇస్తున్న మహేశ్‌బాబు దంపతులు



మంత్రి సీతక్కతో నమ్రత

సినీ నటుడు మహేశ్‌బాబు రూ. 50 లక్షల విరాళం



సీఎంకు చెక్కు ఇస్తున్న కోరమండల్ ఎండీ సుబ్రమణియన్, కె.సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబు, ఆయన సతీమణి నమ్రత కలిసి రూ. 50 లక్షలు అందించారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి చెక్కును అందచేశారు. మహేశ్‌బాబు వ్యాపార సంస్థ ఏఎంబీ తరుపున మరో రూ. 10 లక్షలను కూడా ఇచ్చారు.

నేను మీ ఫ్యాన్‌ను.. సీతక్కతో నమ్రత

మహేశ్‌బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మంత్రి సీతక్కను చూసి.. ఆమెతో ఫొటో దిగారు. 'నేను మీ ఫ్యాన్'అంటూ సీతక్కతో నమ్రత చెప్పారు.

రూ. 50 లక్షలు ఇచ్చిన కోరమండల్

కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ఎండీ శంకర సుబ్రమణియన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షల విరాళమిచ్చారు.

ఆల్ ఇన్ వన్!

▶ మొదటి పేజీ తరువాయి

పథకాల వివరాలను కూడా ఈ డిజిటల్ కార్డులో పొందుపర్చనున్నారు. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులుంటే..ఆ కుటుంబానికి ఒక యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్)ను కేటాయించి, కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా ఆ యూఐఎన్‌కు బై నంబర్ కేటాయిస్తారు. ఆ బై నంబర్ ఎదురుగా ఆ కుటుంబ సభ్యుని పేరు, ఆ సభ్యుడి సమస్త సమాచారం ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిజిటల్ కార్డు పూర్తిగా సురక్షితమైనదని, అన్నిరకాల రికార్డులు ఒకే దగ్గర అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కాగా కుటుంబంలోని ప్రతి ఇంటి సభ్యుని హెల్త్ ప్రొఫైల్ అందులో ఉండాలని, తద్వారా దీర్ఘకాలంలో వైద్య సేవలకు ఇది ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సమాచారంతో పాటు, సంక్షేమ పథకాలు కూడా ఒకేచోట ఒకే క్లిక్‌తో లభ్యమవుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎక్కడైనా సేవలు, రేషన్ పొందేలా..

రాజస్తాన్, హరియాణా, కర్ణాటక రాష్ట్రాల్లో కార్డులపై అధ్యయనం చేయాలని, వాటితో కలుగుతున్న ప్రయోజనాలు, ఇబ్బందులపై అధ్యయనం చేసి త్వరగా ఒక సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని సూచించారు. లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఈ కార్డులు ఉండాలని అన్నారు. కుటుంబసభ్యులను జత చేయడం, తొలగింపునకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునేలా ఉండాలని కూడా సీఎం సూచించారు. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పర్యవేక్షణకు జిల్లాల వారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.

పంటలు నష్టపోకుండా చూడాలి: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అన్ని పంటల్లో చీడ, పీడ పురుగుల బెడద పెరిగిందని, పంటలు నష్టపోకుండా అధికారులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతులకు పంటలపై తగిన సలహాలివ్వాలని సూచించారు. వ్యవసాయశాఖ, యూనివర్సిటీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి వచ్చే 3–4 రోజుల్లో పర్యటించాలన్నారు. దీనిపై వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ రఘురాంరెడ్డిలు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

బీడీఎల్ టెక్నికల్ డైరెక్టర్‌గా డీవీ శ్రీనివాస్‌రావు

సాక్షి, హైదరాబాద్: భారత ప్రభుత్వరంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) డైరెక్టర్ (టెక్నికల్)గా డీవీ శ్రీనివాస్ రావు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు బీడీఎల్‌లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహించి, రక్షణ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విస్తృత అనుభవాన్ని గడించారు. ఈ నియామకానికి ముందు ఆర్‌అండ్‌డీ విభాగానికి జనరల్ మేనేజర్ (డిజైన్, ఇంజనీరింగ్)గా పనిచేశారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ల్యాబ్‌లకు సహకారం అందించారు. డీవీ శ్రీనివాస్ రావు బీడీఎల్‌లో అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని స్థాపించడంలో కీలక పాత్ర పోషించగా, ప్రస్తుతం ఇది భారతదేశ రక్షణ దళాలు ఉపయోగించే వివిధ ఆయుధ వ్యవస్థలకు క్లిష్టమైన ఉప–వ్యవస్థలను ఉత్పత్తి చేస్తోంది. శ్రీనివాస్ రావు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీటెక్, హైదరాబాద్‌లోని జేఎన్టీయూ నుంచి డిజిటల్ సిస్టమ్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు ఆధునిక పరిజ్ఞానం

- సాయానికి ముందుకొచ్చిన ప్రపంచ బ్యాంకు
- మంత్రి కోమటిరెడ్డి, అధికారులతో బ్యాంకు ప్రతినిధుల భేటీ



సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించటం, ప్రమాదాల్లో మృతుల సంఖ్యను కనిష్టస్థాయికి తీసుకురావడం లాంటి అంశాలకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారాన్ని అందించడానికి ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ మేరకు సోమవారం ప్రపంచ బ్యాంకు రవాణారంగ ప్రధాన అధికారిణి రినూ అనూజా బృందం సచివాలయంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయింది. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన ఆధునిక విధానాలపై చర్చించారు. తమిళనాడు, రాజస్తాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించి రోడ్డు ప్రమాదాలను తగ్గించిన తీరును ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం ద్వారా మరణాల రేటు కూడా తగ్గుతోందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, రోడ్లు సరిగా లేక ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించే ట్రామా కేర్ సెంటర్లు సరిపడా లేక మృతుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. తమ ప్రభుత్వం ప్రమాదకర ప్రాంతాల్లో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందని వివరించారు. హైదరాబాద్–విజయవాడ హైవేపై ట్రామా కేర్ సెంటర్ నిర్మాణంలో ఉందన్నారు. రోడ్ల అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు ప్రణాళికలతో ముందుకొస్తే వాటి సాధ్యాసాధ్యాలపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఈఎన్సీ మధుసూదన్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య



జస్టిస్ ఈశ్వరయ్యతో సమావేశమైన రమణ, శ్రీనివాస్‌గౌడ్, వద్దిరాజు, మధుసూదనాచారి

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): రిజర్వేషన్ల పెంపుదల అనేది ముమ్మాటికీ సాధ్యమేనని, ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ బీసీ ముఖ్య నాయకులతో ఆయన ప్యారడైజ్‌లోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, శంభీపూర్ రాజు, ఎల్.రమణ, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో ఆయన వివిధ అంశాలపై చర్చించారు. అధికార కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన, సమగ్ర కులగణన, న్యాయపరమైన సాధ్యాసాధ్యాలపై చర్చించారు. అనంతరం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్‌ల ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న బీసీ నాయకులతో సమావేశమై పలు బీసీ అంశాలపై చర్చించామన్నారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు టపటపా!

▶ మొదటి పేజీ తరువాయి

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగడమే కాకుండా, వాటి మరమ్మతులకు డిస్కంలు రూ.వందల కోట్లలో ఖర్చు చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నాసిరకం ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లకు కాంట్రాక్టర్లు సరిగ్గా మరమ్మతులు చేయకపోవడం, చిన్న చిన్న లోపాలను గుర్తించి సరి చేయడానికి వీలుగా పీరియాడిక్ మెయింటెనెన్స్ నిర్వహించడంలో అధికారుల నిర్లక్ష్యం, లైన్లలో లోపాలు ఏర్పడడం వంటి సమస్యలకు ఓవర్ లోడింగ్ సమస్య జతకావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు పటాకుల్లా కాలిపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యాసంగి పంటలకు అధిక వినియోగం

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాలైన నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్‌లో గత ఏడాది అత్యధికంగా 71,733 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లో మరో 34,527 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 2023 తొలి అర్ధవార్షికం (ఏప్రిల్–సెప్టెంబర్)లో 27,596 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, 2023 అక్టోబర్– 2024 మార్చి మధ్యకాలంలో ఏకంగా 44,137 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. వర్షాభావంతో యాసంగి పంటలకు విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో పాటు గృహాలు, ఇతర అవసరాలకు సైతం వినియోగం పెరిగి ఓవర్‌లోడ్ పడటంతో రెండో అర్ధ వార్షికంలో అధిక సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లపై కాలిపోయాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విద్యుత్ అంతరాయాలపై తీవ్ర దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే.

నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యధికం

నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 10,682 ట్రాన్స్‌ఫార్మర్‌లు దగ్ధం కావడం గమనార్హం. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలో 7,162, నాగర్‌కర్నూల్ జిల్లాలో 6,234, సిద్దిపేట జిల్లాలో 5,522, సంగారెడ్డి జిల్లాలో 5,160, యాదాద్రి భువనగిరి జిల్లాలో 4,734 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. జంట నగరాల పరిధిలో అత్యధికంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో 5,076 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. అత్యధికంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 22,578, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 17,992 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం ఈ రెండు జిల్లాల్లో ఓవర్ లోడ్‌కు, నిర్వహణ లోపాల సమస్యలకు అద్దం పడుతోంది. ఇక టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 4,289 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడానికి ప్రధాన కారణాలు...

- అనధికార వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెరగడంతో లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి.
- ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్ల, వర్షాల్లో లోపలికి నీళ్లు వెళ్లకుండా లీకేజీలను అరికట్టకపోవడం వల్ల కాలిపోతున్నాయి.
- జీవిత కాలం ముగిసిన అధిక శాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి.
- సరైన ఎర్తింగ్ లేకపోవడం వల్ల కూడా కాలిపోతున్నాయి.

మరమ్మతులకు భారీగా వ్యయం

గ్రామీణ ప్రాంతాల్లో 25/63/100 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను, పట్టణ ప్రాంతాల్లో 100/160/315/500 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మరమ్మతుల కోసం సగటున కేవీఏకు రూ.200 చొప్పున మొత్తం ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి బిల్లులు లెక్కించి కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రూ.15–20 వేలు, 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రూ.లక్ష వరకు డిస్కంలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్‌లో కాలిపోయిన వైండింగ్ స్థానంలో కొత్త వైండింగ్ ఏర్పాటుతో పాటు ఆయిల్‌ను ఫిల్టర్ చేసి వేస్తారు. ఒక్కోసారి పూర్తి వైండింగ్ కాలిపోతే ఖర్చు అధికం అవుతుంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు ఐదేళ్ల వారంటీ ఉంటుండగా, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసిన తర్వాత ఆరు నెలల గ్యారంటీ పీరియడ్ ఉంటుంది. గ్యారంటీ పీరియడ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే పూర్తి వ్యయం డిస్కంలే భరించాల్సి ఉంటుంది.

కోపంగా ఉండే ప్రతీ నిమిషానికి
నువ్వు అరవై సెకన్ల సంతోషాన్ని కోల్పోతావు.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
మంగళవారం, 24 సెప్టెంబర్ 2024

సంక్షోభ లంకపై నెలవంక!

దాదాపు రెండున్నరేళ్లక్రితం విదేశీ రుణాల చెల్లింపులు అసాధ్యమై దివాలా తీసింది మొదలు వరస సంక్షోభాలను చవిచూస్తున్న శ్రీలంకలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. నూతన అధ్యక్షుడిగా సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించిన అనూర కుమార దిస్సనాయకే వర్తమాన సంక్షోభ పరంపర నుంచి దేశాన్ని గట్టెక్కిస్తారన్న ఆశలు జనంలో దండిగానే ఉన్నాయి. కనుకనే వారసులవైపే మొగ్గే అలవాటున్న ప్రజానీకం ఈసారి మార్క్సిస్టు అయిన దిస్సనాయకేను ఎంపిక చేసుకున్నారు. 2022లో నిత్యావసరాల కొరత, అధిక ధరలు, పన్నుల మోతతో పాటు దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతిపై ఆగ్రహోదగ్రులైన ప్రజలు అధ్యక్ష భవనంపై, పార్లమెంటుపై దాడిచేయటం, నాటి అధ్యక్షుడు గొటబయ రాజపక్స, ఆయన పరివారం దేశం విడిచి పరారుకావటం ప్రపంచాన్ని దిగ్భ్రమపరిచాయి. అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన మూడేళ్లలోపే రాజపక్సకు ఈ దుర్గతి పట్టింది. అందుకే దిస్సనాయకే అత్యంత జాగరూకతతో పాలన సాగించి దేశాన్ని ఒడ్డున పడేయాల్సి వుంటుంది. గతంలో ఎంపీగా, మంత్రిగా పనిచేసి ఉండొచ్చుగానీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశానికి సారథ్యం స్వీకరించటం సామాన్యం కాదు. రనిల్ విక్రమసింఘే ప్రభుత్వం పెను ఆర్థిక విపత్తు నుంచి గట్టెక్కడానికి ఐఎంఎఫ్‌ను ఆశ్రయించినప్పుడు 290 కోట్ల డాలర్ల రుణం మంజూరుచేస్తూ కఠినమైన షరతులు పెట్టింది. పర్యవసానంగా పొదుపు చర్యల పేరుతో జీతాలు, పెన్షన్లు కోత పడ్డాయి. సంక్షేమ పథకాలు అటకెక్కాయి. ప్రజలు అర్ధాకలితో వెళ్లదీస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష జనతా విముక్తి పెరమున (జేవీపీ) నాయకుడిగా భావసారూప్య పార్టీలతో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పేరిట కూటమి ఏర్పరిచి ఘనవిజయం సాధించటం దిస్సనాయకే ఘనత. గత ఎన్నికల్లో కేవలం నాలుగు శాతం ఓట్లతో, పార్లమెంటులో మూడంటే మూడే స్థానాలు గెల్చుకున్న పార్టీ ఈ స్థాయిలో దూసుకురావటం అసాధారణం. కోతలను సరళం చేస్తామన్న ఎన్‌పీపీ హామీ వోటర్లను విశేషంగా ఆకట్టుకుంది. దానికి తోడు సంప్రదాయపక్షాలు, అవి ఇచ్చే అబద్ధపు హామీలతో జనం విసిగిపోయారు. అందుకే కావొచ్చు... ఈ విజయం ఏ ఒక్కరిదో కాదని దిస్సనాయకే అన్నారు. 2022 నాటి 'అరగల్య' (పోరాటం) ఉద్యమంలో జనం సమీకృతులు కావటం వెనక వారిలో గూడుకట్టుకున్న అసంతృప్తితో పాటు జేవీపీ తెర వెనక కృషి కూడా ఉంది. జనాగ్రహాన్ని నిర్మాణాత్మకంగా మలచటంలో, అరాచకం ప్రబలకుండా చూడటంలో ఆ పార్టీ విజయం సాధించింది. అందుకే ఇటీవల బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న పరిణామాల వంటివి అక్కడ జరగలేదు. బంగ్లాలో ఇస్లామిక్ తీవ్రవాదుల ఆధిపత్యం పెరగటం, బురఖా ధరించని మహిళలను బహిరంగ ప్రదేశాల్లో కొట్టి హింసించటం పరిపాటైంది. అంతేగాదు... దేశావిర్భావానికి మూల కారణమైన భాష, ప్రాంతం వంటి అస్తిత్వ అంశాలు సైతం బుట్టదాఖలా అవుతున్నాయి. ఆ పరిస్థితి లంకలో తలెత్తకపోవటం, సంక్షోభంలో సైతం రనిల్ ప్రభుత్వం సజావుగా సాగటంలో జేవీపీ పాత్ర కాదనలేనిది.

అయితే జేవీపీ చరిత్రలో నెత్తుటి అధ్యాయాలు తక్కువేం కాదు. దాదాపు అరవైయ్యేళ్ల క్రితం ఆవిర్భవించి 70, 80 దశకాల్లో దేశంలో హింసాకాండను ప్రేరేపించిన జేవీపీని తుడిచిపెట్టడానికి ప్రభుత్వాలు చేయని ప్రయత్నమంటూ లేదు. మార్క్సిజాన్ని అనుసరిస్తున్నామని మావో, హోచిమిన్, చేగువేరా తమకు ఆదర్శమంటూనే సింహళ జాతీయవాదాన్ని రెచ్చగొట్టి వేలాదిమంది లంక తమిళులను ఊచకోత కోయటం, వారికి అనుకూలంగా మాట్లాడే వందలాదిమందిని హతమార్చటం జేవీపీ చరిత్రలో మాయని మచ్చ. తమ వైఖరిని వ్యతిరేకించే పాత్రికేయులను సైతం ఆ పార్టీ కాల్చి చంపింది. ప్రేమదాస హయాంలో ఉత్తర తూర్పు ప్రాంతంలో తమిళ టైగర్లనూ, ఉత్తరాన జేవీపీ మిలిటెంట్లనూ ఆయన ప్రభుత్వం అణిచేసింది. పొలిట్ బ్యూరోలో ఒక సభ్యుడు మినహా జేవీపీ నాయకత్వం మొత్తాన్ని అంతం చేసింది. అయితే కనుమరుగైందనుకున్న జేవీపీ క్రమేపీ మళ్లీ బలం పుంజుకున్నా ఎప్పటిలాగే దాన్ని అంతర్గత సంక్షోభాలు చుట్టుముట్టాయి. చివరకు పార్లమెంటరీ పంథాకు మెజారిటీ వర్గం మొగ్గుచూపి భారత–శ్రీలంక సైనిక ఒప్పందాన్ని వ్యతిరేకించిన చంద్రికా కుమారతుంగకు మద్దతునిచ్చింది. ఆమె ప్రభుత్వంలో భాగస్వామి అయింది.

చుట్టూతా ఒక్కో దేశమే చైనా ప్రభావంలో పడి భారత వ్యతిరేక రాగం అందుకుంటున్న వర్తమానంలో దిస్సనాయకే గెలుపు మన ప్రభుత్వానికి ఒక రకంగా సమస్యాత్మకమే. మైనారిటీలుగా ఉన్న లంక తమిళులకు స్వయంపాలన ఇచ్చే 13వ రాజ్యాంగ సవరణను అమలు చేయాలని మన దేశం చాన్నాళ్లుగా కోరుతోంది. కానీ రాజపక్స దాన్ని బేఖాతరు చేశారు. దిస్సనాయకే వైఖరి సైతం అదే. అదానీల 450 మెగావాట్ల పవన విద్యుత్ కాంట్రాక్టును రద్దు చేస్తామని ఎన్నికల సభల్లో ఆయన చెప్పాడు. దానికితోడు భావజాలం రీత్యా చైనాకు సన్నిహితుడు. ఆ దేశం ఇచ్చిన అప్పులే దేశాన్ని సంక్షోభంలోకి నెట్టాయని దిస్సనాయకేకు తెలియంది కాదు. 2022 సంక్షోభం అనంతరం మన దేశం లంకకు 400 కోట్ల డాలర్ల అత్యవసర రుణం మంజూరు చేయటంతోపాటు ఐఎంఎఫ్ రుణం రావటంలో కీలకపాత్ర పోషించింది. పదునైన దౌత్యం పరమ శత్రువులను సైతం గెల్చుకోగలదు. మొదట్లో తీవ్ర స్థాయి భారత వ్యతిరేక వైఖరి తీసుకున్న మాల్దీవుల అధ్యక్షుడు మహమద్ మియిజూ ఇందుకు ఉదాహరణ. అందువల్ల అసాధ్యం కానిదేదీ లేదు. ఇంతవరకూ దిస్సనాయకే ఎత్తుగడలు గమనిస్తే ఆయన సవ్యంగా అడుగులు వేస్తారని అంచనా వేయొచ్చు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.సప్తమి సా.5.58 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మృగశిర రా.3.39 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.9.44 నుండి 11.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.42 నుండి 11.30 వరకు, **అమృతఘడియలు:** రా.7.14 నుండి 8.48 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

అస్థిరమైనా ప్రజాస్వామ్యమే మేలు!

విశ్లేషణ

డి. పాపారావు

జమిలి ఎన్నికల గురించిన చర్చ నేడు దేశంలో వాడిగా, వేడిగా జరుగుతోంది. ఈ అంశానికి సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. ఆ మేరకు కేంద్ర క్యాబినెట్ కూడా జమిలి ఎన్నికలకు ఆమోద ముద్ర వేసింది. అయితే ఇటు ప్రజలలోనూ, అటు అనేక రాజకీయ పక్షాలలోనూ అనేక ప్రశ్నలు ఉన్నాయి. జమిలి ఎన్నికల ప్రక్రియ అనేది ఎన్నికల వ్యయాలు, రాజకీయ సుస్థిరతలకు సంబంధించిన అంశం కానే కాదు. ప్రజా తీర్పుల భయం లేకుండా ఐదేళ్లు పాలించడానికి మాత్రమే ఈ ప్రక్రియ ఉపయోగపడగలదు. రాజకీయ పక్షాలను అదుపు చేసేందుకు ప్రజలకు ఉన్న కాస్తంత అవకాశాన్ని కూడా లేకుండా చేయగలదు.

జమిలి ఎన్నికలకు సంబంధించిన రాజ్యాంగ పరమైన లోతుపాతులూ, సాధ్యాసాధ్యాలూ వంటి అంశాలను కాసేపు పక్కన పెడదాం. జమిలి ఎన్నికల అనుకూల వాదనలకు ప్రాతిపదికగా వున్న కొన్ని అంశాలను చూద్దాం. జమిలి ఎన్నికల వలన పదే పదే ఎన్నికలు జరిగే పరిస్థితి పోయి, ఆ మేరకు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి అనేది ఒక వాదన. దేశంలో రాజకీయ సుస్థిరత నెలకొంటుందనేది మరో వాదన.

2019 పార్లమెంటరీ ఎన్నికలకు గాను, దేశ వ్యాప్తంగా అయిన మొత్తం ఖర్చును సుమారుగా 50 వేల కోట్ల రూపాయలుగా అంచనా వేస్తున్నారు. 2024ల ఎన్నికల ఖర్చు, 2019 నాటి కంటే రెట్టింపై అది సుమారుగా 1–1.35 లక్షల కోట్ల రూపాయల మేరకు ఉంది. ఈ ఖర్చులను పైపైన చూస్తే , ఎన్నికల పేరిట చాలా పెద్ద మొత్తంలోనే డబ్బు ఖర్చయిపోతోందని అనిపించక మానదు. కానీ, దీన్ని ప్రభుత్వ లేదా ఎన్నికల కమిషన్ వ్యయాలు... పార్టీలు, అభ్యర్థుల వ్యయాలుగా విడగొట్టి చూస్తే వాస్తవం మెరుగ్గా అర్థం అవుతుంది. 2019లోని ఎన్నికల ఖర్చులో, ఎన్నికల కమిషన్ వాటా కేవలం 15% అనేది గమనార్హం. అంటే, 7,500 కోట్ల రూపాయలు మాత్రమే. ఇదే లెక్క ప్రకారం, 2024లో ఎన్నికల మొత్తం వ్యయంలో 15 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఎన్నికల కమిషన్, ప్రభుత్వ వ్యయంగా ఉంది. ఎన్నికల వ్యయాలలో సింహభాగం నిజానికి ప్రైవేటు అభ్యర్థులది. దీని వలన, అటు దేశ ఖజానాకో, ప్రజల పన్ను డబ్బుకో వచ్చి పడిన ముప్పేమీ లేదు.

సమస్య నాయకులకే!

నిజానికి, రాజకీయాలు వ్యాపారంగా మారిన నేటి కాలంలో, అభ్యర్థులు చేసే ఈ ఖర్చులు, జనం డబ్బును తిరిగి జనానికి చేరుస్తున్నాయి. ఈ కోణం నుంచి ఆలోచిస్తే, పదే పదే ఎన్నికలు రావడం వలన జనానికి వచ్చిపడే నష్టం ఏమీ లేదు. అది కేవలం రాజకీయ నాయకుల సమస్య. 2024 ఏప్రిల్– జూన్ కాలంలో (2024–25 ఆర్థిక సంవత్సరం తాలూకు తొలి త్రైమాసికం) దేశ ఆర్థిక వ్యవస్థ, సుమారు 21 నెలల మందగమనం తర్వాత, కొంత కోలుకోవడాన్ని గమనించొచ్చు. ఆ కాలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, దాని తాలూకు ఖర్చులు ఒక రకంగా దేశ ఆర్థిక వ్యవస్థకూ, ప్రజల కొనుగోలు శక్తికీ ఉద్దీపనలుగా పని చేశాయి. బాడుగ కార్లు మొదలుకొని, బ్యానర్లు, పోస్టర్లు, పబ్లిక్ మీటింగ్‌ల ఖర్చులు, సోషల్ మీడియా ప్రచార ఖర్చులు... వీటితో పాటుగా ఎటుకూడి 'ఓటుకు నోటు'ను జనానికి అలవాటు చేశారు కాబట్టి, ఆ వ్యయాలు కూడా కలగలిపి దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఉద్దీపన కావడంలో ఆశ్చర్యం లేదు.

ఎన్నికలలో ఓట్లను కొనుగోలు చేసిన అనేక మంది రాజకీయ నేతలు గెలిచాక ప్రజలకు అందుబాటులో లేకుండా పోయే పరిస్థితులు దాపురించాయి. కాబట్టి, జమిలి ఎన్నికల రూపంలో ఐదు సంవత్సరాల సుస్థిర పాలనను హామీ చేసుకోవడం అనేది అటు అభ్యర్థులకూ, ఇటు పాలక పార్టీలకూ వెసులుబాటుగానే కనపడినా... అది ప్రజలకు మాత్రం సుదీర్ఘకాల సాధికారత లేని స్థితినీ, పరిపాలన బాగా లేకున్నా భరించక తప్పని స్థితినీ తెచ్చిపెడుతుంది. ఇక్కడి ప్రశ్న రాజకీయ నాయకులకూ, పాలక పార్టీలకూ వాటి పాలనా అధికార వ్యవధిని గ్యారెంటీ చేసే జమిలి ఎన్నికలు మెరుగా? లేదా... ప్రజలకు ఎంతో కొంత నేతల అందుబాటునూ, సాధికారతనూ హామీ చేసే సజీవమైన అస్థిరతే మెరుగా అన్నది!



కాలవ్యవధికి గ్యారెంటీయా?

మన దేశంలో ఉన్నది ప్రధానంగా పార్లమెంటరీ వ్యవస్థ. మన లోక్ సభ, రాజ్య సభలకు తరచుగా మధ్యంతర ఎన్నికలు వస్తూనే ఉండటం తెలిసిందే. గెలిచిన అభ్యర్థుల మరణాలు, వారి రాజీనామాలు తదితర అనేక కారణాల వలన కూడా మధ్యంతర ఎన్నికలు వస్తూ ఉంటాయి. కాబట్టి, జమిలి ఎన్నికల పేరిట ఐదేళ్ల పాటు నికరంగా, సుస్థిరంగా పాలించి తీరగలమన్న ఆశ అంత వాస్తవికమైనదేమీ కాదు. పదే పదే ఎన్నికలు రాకుండా నివారించగలిగితే, పాలక పక్షాలు అనేక విధాన నిర్ణయాలను ధైర్యంగా తీసుకోగలుగుతాయన్న వాదన కూడా ఉన్నది. ఇది కేవలం, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకోవడంలో పాలక పక్షాలకు కావలసిన సుస్థిర పాలనను హామీ చేసే వాదన మాత్రమే.

నిజానికి, గతం నుంచి ఇటువంటి వాదన వేరొక రూపంలో ఉంది. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పక్షాలు ఏ విధంగా పరస్పరం ఆరోపణలూ, ప్రత్యారోపణలూ చేసుకున్నా, ఎన్నికల అనంతరం అటు పాలక పక్షం... ఇటు ప్రతిపక్షమూ రెండూ కలగలిసి దేశ అభ్యున్నతికి పాటు పడాలి అన్నది. ఈ వాదన పూర్తిగా అసంబద్ధమైనది. అధికార పక్షం తాను ప్రాతినిధ్యం వహించే వర్గాల, సమూహాల ప్రయోజనాల కోసం పని చేస్తూ పోతుంటే... మరో పక్కన, భిన్నమైన ప్రయోజనాలు వున్న సామాజిక వర్గాలు, సమూహాలకు ప్రాతినిధ్యం వహించే ప్రతిపక్షాలు అనివార్యంగా పాలక పక్షంతో తలపడక తప్పని స్థితి ఉంటుంది. ఉదాహరణకు, ఒక ప్రభుత్వం కార్మిక చట్టాలను సంస్కరించటం పేరిట, యజమానులు లేదా పెట్టు బడిదారులకు అనుకూలమైన విధానాలను తెచ్చే ప్రయత్నం చేస్తే, అది సహజంగానే కార్మికులకు ప్రాతినిధ్యం వహించే పక్షాల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటుంది. సుస్థిరత పేరిట ప్రభుత్వాలకు ఆ ఐదు సంవత్సరాల కాల వ్యవధిని గ్యారెంటీ చేయడం ఆ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించని ఇతరేతర వర్గాలకు నియంతృత్వంగానే పరిణమించగలదు.

సుస్థిర నియంతృత్వమా? అస్థిర ప్రజాస్వామ్యమా?

నేడు సంస్కరణల పేరిట అమలు జరుగుతోన్న విధానాల క్రమంలో, పేద ప్రజలకూ, సామాన్య జనానికీ ఇచ్చే సబ్సిడీలు లేదా రాయితీలపై నిరంతరంగా కోతలు పడుతున్నాయి. ప్రధాని మోదీనే స్వయంగా 'రేవడి సంస్కృతి' (ఉచితాల సంస్కృతి)పై చర్చ జరగాలంటూ చెప్పడాన్ని గమనించవచ్చు. ఈ సంక్షేమ వ్యయాలు లేదా 'ఉచితాల' గురించిన చర్చ అంతిమంగా అనేక దేశాలలో పొదుపు చర్యల రూపంలో ఆర్థిక మాంద్య స్థితికీ, అస్థిరతకూ కారణం కావడాన్ని కళ్ళ ముందే చూస్తున్నాం. గతంలో, అనేక లాటిన్ అమెరికా దేశాలలోనూ... యూరోప్‌లోని గ్రీస్‌లోనూ... ఈ మధ్య కాలంలోనే ఆసియా ఖండంలోని శ్రీలంక, పాకిస్తాన్ వంటి దేశాలలోనూ సామాన్య జనానికి కల్పించే రాయితీలను పొదుపు చర్యల పేరిట తగ్గించి వేయడం ఏ విధంగా సామాజిక విస్ఫోటనాలకూ, పోరాటాలకూ దారి తీసిందో చూశాం. ఇటువంటి, ప్రజా వ్యతిరేక, సంక్షేమ వ్యతిరేక నిర్ణయాలను మధ్య మధ్యలో వచ్చి పడే ఎన్నికల లేదా ప్రజా తీర్పుల భయం లేకుండా ఐదేళ్ల పాటు నిరాఘాటంగా తీసుకోగలిగేటందుకు మాత్రమే ఈ జమిలి ఎన్నికల ప్రక్రియ ఉపయోగపడగలదు. కాబట్టి, ఇప్పటికే ప్రజలకు దూరమైన రాజకీయ వ్యవస్థలో రాజకీయ పక్షాలు, రాజకీయ నేతలను అదుపు చేయగలిగేటందుకు ప్రజలకు ఉన్న కాస్తంత అవకాశాన్ని కూడా, ఈ జమిలి ఎన్నికలు లేకుండా చేసేయగలవు.

జమిలి ఎన్నికల ప్రక్రియ అనేది కేవలం ఎన్నికల వ్యయాలు లేదా రాజకీయ సుస్థిరతలకు సంబంధించిన అంశం కానే కాదు. అది, దేశ రాజకీయాలపై సామాన్య జనానికి పట్టు వుండాలా... లేదా కార్పొరేట్లు, ధనవంతులు లేదా వారి అనుకూల రాజకీయ పక్షాలకు పట్టు ఉండాలా అనే అంశానికి సంబంధించింది అనేది సుస్పష్టం. సుస్థిర ప్రజా వ్యతిరేక పాలన కంటే, నిరంతరంగా ప్రజలకు లోబడిన, వారికి లొంగి వుండే అస్థిర రాజకీయ వ్యవస్థే మేలు.

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

క్రమమే ముఖ్యం

క్రమశిక్షణే అన్నింటినీ మించిన ప్రేరణ. ఆ క్రమశిక్షణను స్థిరంగా పాటించడమే ఉత్సృష్టత తలుపులు తెరిచే తాళంచెవి!

– శిల్పా శెట్టి కుంద్రా, నటి

ఓపిక లేదా?

ఐఫోన్ కోసం మనం రాత్రంతా ఎదురుచూడగలం, 'కోల్డ్‌ప్లే' (రాక్ బ్యాండ్) ప్రదర్శన కోసం లక్షల మందితో కూడిన క్యూలో నిలబడగలం. కానీ హారన్ కొట్టకుండా 120 సెకన్ల రెడ్ లైట్ సిగ్నల్ దగ్గర మాత్రం వెయిట్ చేయలేం.

– రాహుల్ రాజ్, ఆంట్రప్రెన్యూర్

ఇంకొకరు అవసరమా?

జకీర్ నాయక్, ఆయన కుమారుడు పాకిస్తాన్‌లో పర్యటించనున్నారని వార్త. ఈ ఆహ్వానాన్ని పాకిస్తాన్ తిరిగి పరిశీలించాలి. మత అతివాదులకు నెలవు అవుతుందన్న దేశ ఇమేజ్‌ను బలపరచడమే దీనివల్ల జరిగేది! పాకిస్తాన్‌లో ఇప్పటికే చాలినంత మంది అతివాద బోధకులున్నారు. ఇంకొకరిని దిగుమతి చేసుకోవాల్సిన అవసరమే లేదు.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

విరమణ వయసు

చిత్తవైకల్యం ఉన్న జో బైడెన్ (అమెరికా) అధ్యక్షుడిగా ఉండటం, అసలు అలాంటి మనిషి ఏ దేశానికైనా ఒక్క రోజైనా అధ్యక్షుడిగా ఉండటం దారుణం. ఎటూ రాజకీయ నాయకులు తమ ఆరోగ్య పరిస్థితి గురించి నిజాయితీగా ఉండరు కాబట్టి, రాజకీయాల్లో పదవీ విరమణ వయసును తప్పనిసరి చేయాలి.

– శివమ్ విజ్, జర్నలిస్ట్

ఇలాగా ఎంపిక?

'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ లైట్' లాంటి (ఇప్పటికే 'కాన్'లో బహుమతి గెల్చిన) సినిమా ఉన్నప్పటికీ, భారత అధికార ఆస్కార్ ఎంట్రీగా 'లాపతా లేడీస్'ను ఎంపిక చేశారు. హిందీ సినిమాను దాటి చూడలేని మన ఎంపిక ప్రక్రియకు ఇది నిదర్శనం. ఆస్కార్ వడపోత ఎలా జరుగుతుందో కూడా మన అపెక్స్ బాడీ (ఎఫ్‌ఎఫ్‌ఐ)కి తెలియదని అర్థమవుతోంది.

– పాలోమీ దాస్, సినిమా విమర్శకురాలు

ఒక్కటే చాలదు!

ఆస్కార్ కోసం ఒక సినిమాను పంపించడం అనేది, కేవలం ఆ సినిమా మంచిదా అన్న ఒక్క దానిమీదే ఉండదు. భారీగా ఖర్చయ్యే ఆస్కార్ ప్రచారం కోసం ఆ నిర్మాతల దగ్గర నిధులు, తృష్ణ, కాంటాక్టులు, వ్యవహార జ్ఞానం ఉన్నాయా అన్నది కూడా ముఖ్యమే.

– భరద్వాజ్ రంగన్, సినిమా విమర్శకుడు

స్వాగతించాల్సిన మాట

'చైల్డ్ పోర్నోగ్రఫీ' (చిన్నారులతో తీసే అశ్లీల వీడియోలు) అనే మాటను 'చిన్నారుల లైంగిక దుర్వినియోగ, దోపిడీ సామగ్రి' అని మార్చాలని సుప్రీంకోర్టు సూచించడం; అలాంటి వాటిని చూసినా, డౌన్‌లోడ్ చేసినా 'పోక్సో' చట్టం కింద విచారించాలనడం చాలా ప్రోత్సాహకరమైన అంశం. మొబైల్‌లో ఈ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకున్న 28 ఏళ్ల యువకుడి కేసును కొట్టేయడంలో మద్రాస్ హైకోర్టు పొరబడిందని బెంచ్ చెప్పడం స్వాగతించదగినది.

– ఖుష్బూ సుందర్, నటి, నాయకురాలు

ఇన్ బాక్స్

చదువుకుంటూ సేవామార్గంలో...

విద్యను ఆర్జించే వయసులోనే యువతీ యువకులలో సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహను కల్పించేందుకు జాతిపిత మహాత్మా గాంధీ శతజయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మొదలుపెట్టింది. యావత్ భారతదేశంలో ఈ పథకం రోజు రోజుకూ విస్తరిస్తోంది.

కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుంటాయి. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటు ఉన్న గ్రామాలను ఎంపిక చేస్తాయి. ఆ యా గ్రామాల్లో వారం రోజులపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తాయి. విద్యార్థులు (వలంటీర్లు) రోజూ ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవలందిస్తారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు. మూఢ నమ్మకాలపై చైతన్యవంతం చేస్తారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరిస్తారు. తాగునీటి వనరులను ఆ యా శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి క్లోరినేషన్ చేస్తారు. వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తారు. ప్రభుత్వ పథకాలు పొందడంపై అవగాహన కల్పిస్తారు. ఓటరుగా పేరు నమోదు చేసుకోవడం, ఓటు విలువ తెలియజేయడం; ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండి, సమాజానికి మేలు చేసే వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎంపిక చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తారు. చదువు విలువను తెలియజేసి, అక్షరాస్యతను పెంపొందిస్తారు. ఎన్ఎస్ఎస్‌లో చేరిన విద్యార్థుల్లో వ్యక్తిగత క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయి. ప్రజలకు సామాజిక విలువను తెలియజేస్తున్నారు. ఫలితంగా ప్రజా చైతన్యంతో పల్లెలు ప్రగతిబాట పడతాయి. 'నా కోసం కాదు నీ కోసమే' అనే నినాదంతో సమాజానికి సేవలు అందించడమే ఎన్ఎస్ఎస్ ముఖ్య లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలి.

– నరేష్ జాటోత్; రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు, రామన్నపేట

పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలి!

అభిప్రాయం

డా॥ కాలువ మల్లయ్య

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) సీనియర్ నాయకుడు నారాయణ బోలాశంకర్ మనస్తత్వం గల వ్యక్తి. ఆయన ఓ సందర్భంలో హైడ్రా కూల్చివేతలను గురించి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పులిపై స్వారీ చేస్తున్నాడన్నారు. ఔను! ఒక మంచి పని చేయాలంటే పులిపై స్వారీ చేయడం లాంటి సాహసోపేతమైన చర్యలు చేపట్టాల్సిందే. ఇది కేవలం సాహసం కాదు, బాధ్యత. అందులో భాగమే హైడ్రా ఏర్పాటు. ఒక్కసారి స్వాతంత్ర్య పూర్వకాలంలోకి తిరిగి చూసుకుంటే తెలంగాణ, మరీ ముఖ్యంగా హైదరాబాద్ మహానగరం స్వరూప స్వభావాలు కళ్ళముందు కదులుతాయి.

హైదరాబాద్‌లో ఆ కాలానికి సరిపోయిన అద్భుతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశాడు నైజాం నవాబు. హైదరాబాద్ మహానగరం నిండా ఎక్కడ చూసినా చెరువులు, పార్కులు ఉండేవి. చెట్లు, చెరువులవల్ల చల్లని గాలి, స్వచ్ఛమైన నీరు, కలుషితం కాని గాలి లభించేవి. భూగర్భజలాలు పైపైనే ఉండటం వల్ల నీటికొరతా ఉండేది కాదు. భూతాపమూ ఉండేది కాదు. కాలక్రమంలో నగరం విస్తరించడం మామూలే. కాని ఆ విస్తరణ ఓ క్రమ పద్ధతి లేకుండా ప్రకృతిని కబళించేలా సాగడంతోనే ఇబ్బందులు వచ్చాయి. నగరమొక కాంక్రీటు వనంగా మారింది. పార్కులు, కుంటలు, కొండలు ఏవీ ఆక్రమణకు అనర్హం కావనే స్థితికి వచ్చింది. నాలాలకు అడ్డంగా కట్టడాలు, చెరువులు, కుంటల్లో ఇండ్లు, కాలేజీలు, పాఠశాలలు! పార్కులు, ప్రభుత్వభూముల ఆక్రమణలు విపరీతంగా పెరిగాయి. 'పటాన్‌చెరులో చెరువు లేదు. బతుకమ్మ కుంటలో కుంట లేదు' అనే స్థితి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆక్రమణలు; చెర్లు, కుంటల వినాశనం అనేక రెట్లు పెరిగాయి. స్వాతంత్ర్యానంతరం బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలోనే ఈ విధ్వంసం ఎక్కువగా జరిగింది.



ఒక్క హైదరాబాద్ నగరంలోనే కాదు, ఇంత ఎక్కువగా కాకున్న జిల్లా కేంద్రాలు, చిన్న పట్టణాలు, కొన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు, గుట్టలు, భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయి. ఇవన్నీ సరిచేసి బంగారు తెలంగాణగా మార్చడానికే రేవంత్ కృషి చేస్తున్నాడు. ప్రతిపక్షాలు, భూబకాసురులు చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ నారాయణ లాంటి వాళ్ళు, సామాజికవేత్తలు, ప్రజాస్వామ్యవాదులు చేసే హితకర విమర్శలను పట్టించుకోవాలి. చెర్లు, కుంటలు, నాలాలకడ్డంగా కట్టిన కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేయాల్సిందే. బఫర్‌జోన్‌లో లేకున్నా పర్మిషన్ లేకుండా కట్టిన అక్రమ కట్టడాలను కూల్చేయాల్సిందే. కానీ పేదలు, దిగువ మధ్య తరగతి వాళ్ళు... అప్పులు తీసుకొని నెలనెలా ఈఎమ్ఐ కడుతూ బాకీ తీర్చుకుంటున్న వాళ్ల ఇళ్లు, అష్టకష్టాలు పడి జాగా కొనుక్కొని పర్మిషన్‌తో కట్టుకున్న చిరుద్యోగుల ఇండ్లను కూల్చివేయడం వల్ల వాళ్ళ బతుకులు బజార్న పడుతాయి. ఇలాంటి వారి విషయంలో పర్మిషన్ ఇచ్చిన అధికారులను శిక్షించినంత మాత్రాన ఇండ్లు కోల్పోయేవారికి ఒరిగేదేంటి? దుఃఖం తప్ప. అందువల్ల బఫర్‌జోన్‌లో ఉన్నా చెరువులోకి నీళ్ళు పోకుండా అడ్డుకోకుంటే పర్మిషన్‌తో కట్టుకున్న ఇలాంటివారి ఇండ్లజోలికి పోవద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇలాంటివి కొన్ని కూల్చాల్సివస్తే వాటికి ధర నిర్ణయించి చెల్లించాలి లేదా వేరే చోట స్థలం చూపి ఇల్లు కట్టుకోవటానికి డబ్బులివ్వాలి. ఇలా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని రుజువవుతుంది. ప్రజలే రేవంత్ ప్రభుత్వాన్ని కాపాడుకుంటారు.

వ్యాసకర్త కథా రచయిత । 91829 18567

సజ్జనుడు – దుర్జనుడు

మంచితనం కొందరిలో పుట్టుకతో వచ్చినట్లుగా మూర్తీభవించి ఉంటుంది. ప్రయత్నంతో తెచ్చి పెట్టుకున్నదిగా కనిపించదు. ఎల్లవేళలా సౌమ్యంగా, సాధువర్తనులుగా ఉంటారు వారు. దేనికీ కోపం తెచ్చుకోరు. తోటివారికి సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటారు. అలా సహాయం చేయడంలో వారికి కలిగే లాభ నష్టాలను గురించి ఆలోచించరు. విధి వక్రించి వారికి కలిగిన కష్టాలలో సైతం ధీరులుగానే ఉంటారు. తమకు కలిగిన కష్ట నష్టాలకు ఎవరినీ నిందించరు. భగవంతుని నిర్ణయంగా భావించి, పరమాత్ముడి పైనే భారం వేసి చేయగలిగిన మంచి పనులను తమ శక్తిమేర చేస్తూనే ఉంటారు. పూవును అంటిపెట్టుకుని ఉండే పరిమళాన్ని పోలినది వారిలో సద్గుణం. 'ప్రాణి తోడనె కూడ నుద్భవము జెందుగాని సద్గుణ మొకచోట గల్గి రాదు'– పూవుకు పరిమళంలా కొందరిలో సద్గుణం పుట్టుకతోనే ప్రభవిస్తుంది తప్ప మధ్యలో ఎక్కడినుంచో అకస్మాత్తుగా కలిగి కొనసాగేది కాదు అని తేలిక మాటలలో అర్థమయేలా చెప్పాడు 'సీమంతినీ కళ్యాణము' అనే కావ్యంలో పెనుమళ్ళ సోమ మంత్రి.

జ్యోతిర్మయం

మంచితనం కొందరికి ఎంత సహజంగా అబ్బుతుందో అంత సహజంగానూ కొందరికి మోసకారితనం, ధూర్తత్వం అబ్బుతాయి అని కూడా ఆ సందర్భంలోనే చెప్పాడు. ఒకే తల్లి కడుపున పుట్టిన ఇద్దరు పిల్లలలో సైతం ఈ తేడా కనపడి ఆశ్చర్యాన్ని కలగజేయడంతో పాటు బాధను కూడా కలగజేస్తుంది. ఈ రెండు రకాల మనుషుల మధ్య తేడాను అలతి మాటలలో ఈ కింది తేటగీతి పద్యంలో చెప్పాడు సోమ మంత్రి.

తనకు మేలొనరించు బాంధవున కైన / దోడనే కీడు చింతించు దుర్జనుండు
తనకు గీడొనరించు శాత్రవున కైన / జాల మేలు విచారించు సజ్జనుండు.

తనకు మేలు చేసే బంధువు వంటి వ్యక్తికి కూడా కీడు తలపెడతాడు దుర్జనుడు. తనకు కీడు చేసిన వ్యక్తికి కూడా మేలు చేయడానికే ఆలోచించి, మేలు చేస్తాడు సజ్జనుడు అని పై పద్యం భావం. 'కారణ మేమి లేక యపకారము సేయు దురాత్ము పోలికన్, కారణ మేమిలేక యుపకారము సేయు మహాత్ము డెంతయున్' – మంచి చేసే అలోచన కలిగిన మనిషికి మంచి చేయడానికి ఏ కారణమూ అవసరం లేదు.

– భట్టు వెంకటరావు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
ఎస్.వి. గోసంరక్షణ శాల, తిరుపతి
ఇ-టెండరు ప్రకటన

NIT No.TTD/30021(43)/3/SVGS/TPT/2024 తేది: 20.09.2024

వెటరినరీ డ్రగ్స్ మరియు మెడిసిన్స్ సేకరణ కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లను https://tender.apeprocurement.gov.in కి లాగిన్ అయ్యి, current tendersను సెలెక్ట్ చేసి మరియు more పై క్లిక్ చేసి, ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ఫీల్డ్ వద్ద "Tirumala Tirupati Devasthanams"ను మరియు సర్కిల్/డివిజన్ ఫీల్డ్‌లో "S.V.Gosamrakshana Shala Dairy Farm"ను సెలెక్ట్ చేసి, అపై search బటన్ క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.09.2024 మరియు టెండరు దాఖలుకు చివరి తేది: 27.10.2024. తదుపరి వివరాల కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నం.0877-2264570

TTD-40021(31)/1/2024-PRO SEC (Adv. No.158), Dt.: 23.09.2024 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ ప్రభుత్వము
శ్రీయుత సంచాలకుల వారి కార్యాలయము::
వికలాంగులు & వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ:: హైదరాబాద్

నోటిఫికేషన్ నెం.ఎ4/SPL/NAPSrC/2020-21 తేది:20-09-2024

తెలంగాణ రాష్ట్రం సంచాలకుల వారి కార్యాలయము, వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ: హైదరాబాద్ వారు తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ ఆదేశముల మేరకు, ఈ క్రింద తెలుపబడిన ప్రాజెక్టులను స్థాపించి, నడుపుటకై ఆసక్తి గల సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానించనైనది. ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అర్హులు. అంతే కాకుండా ప్రభుత్వ గుర్తింపు పొందిన చారిటబుల్ ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్, మెడికల్ సంస్థలు/ కాలేజీలు కూడా అర్హులు. క్రమ సంఖ్య 1, ప్రాజెక్టు పేరు: ఫిజియోథెరపీ క్లినిక్, ఖాళీల వివరాలు: 10, ఉమ్మడి జిల్లా వారిగా కేటాయింపులు: ఆదిలాబాద్-1, మహబూబ్‌నగర్-1, కరీంనగర్-1, వరంగల్-1, నల్గొండ-1, హైదరాబాద్-1, రంగారెడ్డి-1, నిజామాబాద్-1, ఖమ్మం-1, మెదక్-1. మొత్తం: 10. దరఖాస్తు పత్రాలు మరియు ఇతర వివరాలు www.wdsc.telangana.gov.in నందు పొందవచ్చును. నిర్ణీత దరఖాస్తు పత్రాలను నింపి, సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి, నోటిఫికేషన్ వెలువడిన (10) రోజులలోగా ఒరిజినల్ దరఖాస్తును ఈ కార్యాలయము (సంచాలకుల వారి కార్యాలయము, వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, మలక్‌పేట, నల్గొండ X రోడ్, హైదరాబాద్) నందు సమర్పించవలెను. ఇట్టి నోటిఫికేషన్‌ను రద్దు పరచుటకుగాని, మార్పులు చేయుటకుగాని పూర్తి అధికారము, శ్రీయుత సంచాలకులు, వికలాంగులు & వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, హైదరాబాద్ వారికి కలదు. ఏదైనా ఇతర వివరాలకు ఫోన్ నెం.040-24559048ను సంప్రదించవలెను.
సూచన- నిర్ణీత తేదీలలో ఒరిజినల్ దరఖాస్తు ఫారాలను ఈ కార్యాలయములో సమర్పించని యెడల అట్టి దరఖాస్తులు తిరస్కరించబడును.

DIPR RO No.4462-PP/CL/Advt/1/2024-25, Dt.23.09.2024 సం/- సంచాలకులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతుల రాస్తారోకో

- రోడ్డుపై పాలు పారబోసి నిరసన

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని కామారెడ్డి- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డుపై పాలు పోసి నిరసన వ్యక్తం చేశారు. గంటసేపు రైతులు బైఠాయించడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైతు ప్రతినిధులు మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో ప్రభుత్వం కొర్రీలు పెడుతూ రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు రైతుబంధు వేయలేదన్నారు. అన్ని రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు విజయ డెయిరీ నుంచి నాలుగు నెలల బిల్లులు రావాలని, వెంటనే వాటిని రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న తాడ్వాయి, గాంధారి ఎస్సైలు తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని రైతుల ఆందోళనను విరమింపజేశారు. అనంతరం రైతులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రహిమొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.



కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా
भारतीय प्रतिभूति और विनिमय बोर्ड

SEBI భవన్-II నుండి షోకాజ్ నోటీసు మరియు హియరింగ్ నోటీసు సేకరించుకోవాల్సిందిగా లేదా SEBI వెబ్‌సైట్ (www.sebi.gov.in) లో హెడింగ్ "Unserved Summons/Notices" క్రింద SCN కాపీని డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా దిగువ తెలిపిన నోటీసీను ఇందుమూలంగా కోరడమైనది.

క్ర.సం.	నోటీసీ పేరు	నోటీసీ చిరునామా	SCN వివరాలు
1.	సిలంకోటి అభిలాష్ (PAN: GWLPS3968A	12-11-1019, వారాసిగూడ, మారేడ్‌పల్లి, ముషీరాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500061	SCN No. - EAD- 4/ADJ/GR/PU/24768/1/2023 తేది : జూన్ 16, 2023 హియరింగ్ నోటీస్ నం. SEBI/HO/EAD/EAD/P/OW/2024/28730/1, తేది:సెప్టెంబర్ 09, 2024

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, SEBI భవన్-II, ప్లాట్ నం. సి-7, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈ), ముంబయి-400051 వద్ద సెప్టెంబర్ 26 తేదీన మ.12.00 గం.కు నోటీసీకి ఒక హియరింగ్ అవకాశం మంజూరు చేయబడినది. ఒకవేళ నోటీసీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా హియరింగ్‌ను కోరుకుంటే, అందుకు సంబంధించి ashas@sebi.gov.in & deeptis@sebi.gov.in పై తెలియజేయబడుతుంది.
ఒకవేళ ప్రత్యుత్తరం స్వీకరించని పక్షంలో లేదా నోటీసీ లేదా అధీకృత ప్రతినిధి హియరింగ్‌కు హాజరుకాని పక్షంలో, రికార్డులో లభించే మెటీరియల్ ఆధారంగా సదరు విషయంలో SEBI తదుపరిగా ముందుకు సాగుతుంది.

తేది : సెప్టెంబర్ 9, 2024
ప్రదేశం : ముంబయి CBC 15204/11/0120/2425

भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वी मंज़िल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुडगाँव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు,
ప్లాట్ పి-6, 7, 8, సెక్టార్-5, IMT మనేసర్,
గుర్గావ్, హర్యానా - 122050
ఇమెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6
బహిరంగ ప్రకటన

[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని ఉప-సెక్షన్ (2) మరియు ఉప-సెక్షన్ (4) మరియు కంపెనీలు (కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్లు తొలగింపు) రూల్స్, 2016లోని రూల్ 7కు అనుగుణంగా]

బహిరంగ ప్రకటన నం. ROC/C-PACE/STK-2/248(2)/2024-25/877 తేది: 03.09.2024

నిర్దేశం:

(1) దిగువ పేర్కొన్న కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 క్రింద తెలంగాణ రాష్ట్రంలోని (21) కంపెనీల పేర్లు కొట్టివేయడం లేదా తొలగింపు విషయంలో:

క్ర.సం.	పని ఐటం	CIN	కంపెనీ పేరు
1	AA9785915	U45100TG1991PTC013573	BABUKHAN PROPERTIES PRIVATE LIMITED
2	AA9372780	U62020TS2023PTC171874	CHITTABATHINA IT CONSULTING SERVICES PRIVATE LIMITED
3	AA9432784	U01100TG2021PTC157792	SUIKA AGRO PRIVATE LIMITED
4	AA9654739	U72900TG2022PTC159429	PRECIOUS PAWS SOFTWARE PRIVATE LIMITED
5	AA9621686	U74999TG2021PTC153579	MERA HUNAR ADVISORY SERVICES PRIVATE LIMITED
6	AA9736424	U70109TG2021PTC149639	VEERANJANEYA PROPERTY PROTECTION SERVICES PRIVATE LIMITED
7	AA9786461	U15549TG2021PTC153057	EZ ENTERPRISES PRIVATE LIMITED
8	AA9666085	U51909TG2021PTC149959	CELERA NEUROSCIENCES PRIVATE LIMITED
9	AA9874350	U45400TG2020PTC139866	HAH INDIA INFRASTRUCTURE PRIVATE LIMITED
10	AA9651080	U74999TG2018PTC127848	MAGES ELECTRONICS PARK PRIVATE LIMITED
11	AA9755646	U70200TG2018PTC125152	SUBHAPRADHAM PROPERTIES PRIVATE LIMITED
12	AA9933175	U40100TG2017PTC118161	ECOREN POSEIDON POWER PRIVATE LIMITED
13	AA9705742	U45201TG2016PTC110291	ASPIRO CONSTRUCTIONS PRIVATE LIMITED
14	AA9855096	U64201TG2011PTC077497	ISQUARE MOBILITY PRIVATE LIMITED
15	AA9724782	U86100TS2023PTC175204	VIPRACURE HOSPITALS PRIVATE LIMITED
16	AA10056547	U72200TG2001PTC037982	VIMUKTI TECHNOLOGIES PRIVATE LIMITED
17	AA9945116	U29253TG2016PTC102751	STOCK AND FLOW PROJECTS PRIVATE LIMITED
18	AA9699430	U92410TG2020PTC139569	SPORTNIQ TECHNOLOGIES PRIVATE LIMITED
19	AA9788232	U70200TG2019PTC130938	SEED PROJECTS PRIVATE LIMITED
20	AA9648022	U72900TG2020FTC145584	RIJYOS TECHNOVATIONS (INDIA) PRIVATE LIMITED
21	AA9931174	U40106TG2013PTC091948	ECOREN CHINNAM WIND PARK PRIVATE LIMITED

(2) పైన పేర్కొన్న కంపెనీలు ప్రారంభమైన ఒక సంవత్సరంలోగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడంలో విఫలమయ్యారని లేదా రెండు ఆర్థిక సంవత్సరాలకు ముందు కాలవ్యవధిలోగా సదరు కంపెనీ(లు) ఏవేని వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా మరియు ఎటువంటి దరఖాస్తులు చేయని కారణంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 క్రింద నిద్రాణ స్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం లేదా మెమోరాండంకు నిద్రాణ కంపెనీల కంపెనీ / సభ్యుల స్థాయిని పొందిన కంపెనీ(లు) కంపెనీ ప్రారంభ సమయంలో చెల్లించడానికి చేపట్టిన సభ్యత్వం చెల్లించని కారణంగా మరియు సెక్షన్ 10ఎ/లోని ఉప-సెక్షన్ (1) క్రింద కంపెనీ ప్రారంభం నుండి 180 రోజులలోగా ఈ ప్రభావానికి సంబంధించి డిక్లరేషన్ దాఖలు చేయని కారణంగా సెక్షన్ 12లోని ఉప-సెక్షన్ (9) క్రింద భౌతిక పరిశీలన తరువాత వెల్లడైనందున ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా తమ / వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించడానికి ఇష్టం లేనివారు కంపెనీల నమోదు నుండి తమ / వారి పేర్లను తొలగించడానికి / కొట్టివేయడానికి అభ్యర్థించారు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 (2) క్రింద కంపెనీల నమోదు నుండి తమ / వారి పేరు(ల) తొలగింపు కోసం పైన పేర్కొన్న కంపెనీల నుండి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ దరఖాస్తులు స్వీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

(3) తదనుగుణంగా, పైన పేర్కొన్న కంపెనీ పేర్లను కంపెనీల నమోదు నుండి తొలగించడానికి లేదా కొట్టివేయడానికి కంపెనీల రిజిస్ట్రార్ ప్రతిపాదిస్తున్నారు.

(4) కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్ల తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనకు అభ్యంతరం తెలిపే ఎవరేని వ్యక్తి అతని లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన తెలిపిన కార్యాలయ చిరునామాకు పంపగలరు.

ఇర్ఫాన్ టిర్కే
అసిస్టెంట్ రిజిస్ట్రార్
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్

CBC 07123/11/0431/2425

గ్రామాల్లో మంచినీటి సహాయకులు

- తాగునీటి మోటార్ పాడైతే అదేరోజు మరమ్మతులు
- అధికారులతో సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయంలో నూతన ఒరవడికి ప్రభుత్వం నాంది పలికిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి గ్రామంలో మంచినీటి సహాయకుడిని నియమించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 15 జిల్లాల్లోని 60 ప్రాంతాల్లో శిక్షణ కొనసాగుతోందని.. ఈ నెలాఖరులోగా అన్ని గ్రామాలకూ సహాయకులను నియమించి శిక్షణ పూర్తి చేస్తామన్నారు. తాగునీటి నాణ్యత పరిశీలనతోపాటు బోర్లు పాడైతే అదే రోజు మరమ్మతులు జరిగేలా, లీకేజీలను సరిచేసేలా గ్రామాల్లో మంచినీటి సహాయకులు కృషి చేస్తారని వివరించారు. సోమవారం సచివాలయం నుంచి శాఖాపరమైన సమీక్ష సందర్భంగా వివిధ విభాగాలవారీగా పనుల్లో వేగం పెంచాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. కొనసాగుతున్న పనుల పురోగతిని ఆమె అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోని పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. విభాగాలవారీగా నూతన పనులకు కార్యాచరణ సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, పీఆర్ ఆర్‌డీ కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీఉల్లా హాజరయ్యారు.

5న గద్దర్ విగ్రహావిష్కరణ

పంజగుట్ట (హైదరాబాద్): గద్దర్ గళం ఆధ్వర్యంలో అక్టోబర్ 5వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, మన్ననూర్ గ్రామంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కార్యక్రమ పోస్టర్, కరపత్రాన్ని గద్దర్ కుమార్తె వెన్నెల, కవి, గాయకుడు ఏపూరి సోమన్నలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, తెల్లాపూర్ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌లతో కలిసి మాట్లాడుతూ.. మొదట 20 అడుగుల గద్దర్ విగ్రహాన్ని తెల్లాపూర్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పుడు మన్ననూర్‌లో, రాబోయే రోజుల్లో తెలంగాణలోని పాత 10 జిల్లాల్లో గద్దర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



గద్దర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను విడుదల చేస్తున్న గద్దర్ కూతురు వెన్నెల, గాయకుడు ఏపూరి సోమన్న తదితరులు

వర్గీకరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసింది. తమిళనాడు, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ చేసి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలు ఆయా రాష్ట్రాల్లో పర్యటించి వర్గీకరణపై అధ్యయనం చేయనున్నా యి. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్రం నుంచి బయలుదేరిన అధికారులు రెండ్రోజుల పాటు ఆయా రాష్ట్రాల్లో పర్యటించిన తర్వాత ప్రత్యేకంగా నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనున్నా రు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, రిజర్వేషన్ల అమలు, వర్గీకరణ విధానంలో అనుసరించిన వ్యూహం, న్యాయపరమైన చిక్కులు లేకుండా తీసుకున్న చర్యలు తదితర కోణాల్లో అధ్యయనం చేయనున్నారు. రెండ్రోజుల క్రితం అధ్యయనానికి బయలుదేరిన కమిటీ అధికారులు బుధవారం తిరిగి రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. ఆ తర్వాత మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీకి అధ్యయన నివేదికలు సమర్పించనున్నట్లు తెలిసింది.

నా హత్యకు సుపారీ ఇచ్చారు

- డీసీసీ అధ్యక్షుడిపై జనగామ డీసీపీకి కంచె రాములు ఫిర్యాదు

జనగామ: తనను హత్య చేసేందుకు కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సుపారీతో ప్లాన్ చేశారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. తాము పార్టీలో వివిధ హోదాల్లో 3 దశాబ్దాలుగా పనిచేస్తున్నామని, న్యాయంగా సీనియర్ నాయకులకు దక్కాల్సిన పదవులను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అమ్ముకుంటున్నారని అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిని మనసులో పెట్టుకుని మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా.. ఇటీవల సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్‌కు చెందిన కారును పెట్రోల్ పోసి తగులబెట్టించారని తెలిపారు. తనను ఇసుక లారీతో యాక్సిడెంట్ రూపంలో హతమార్చడానికి ప్రతాప్‌రెడ్డి తన అనుచరుడు రాహుల శ్రీనివాస్‌రెడ్డికి రూ.25 లక్షలు ముట్టజెప్పాడని వివరించారు. కాగా, తప్పుడు ఆరోపణలతో తనను బద్నాం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఆపరేషన్ సర్కిల్ : మహబూబ్‌నగర్
టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం. 02/2024-25. ఆపరేషన్ సర్కిల్, మహబూబ్‌నగర్‌లో వివిధ విద్యుత్, సివిల్ పనులు చేపట్టుట కొరకు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండరు మరియు ఓపెన్ టెండరు ద్వారా సీల్డు టెండర్లు కోరడమైనది. మొత్తం సమాచారమును వెబ్‌సైట్ www.tgsouthernpower.com నుండి పొందవచ్చును. సర్కిల్ ఆఫీస్ ఫోన్ నం. 9440768928. గమనిక : సర్కిల్ ఆఫీస్, మహబూబ్‌నగర్ నుండి ఓపెన్ టెండరు పనులు, షెడ్యూల్స్ కొరకు.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ : మహబూబ్‌నగర్
DIPR RO No.4465-PP/CL/Advt/1/2024-25, Dt : 23.09.2024

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ
టెండర్ ప్రకటన తేది: 21-09-2024

1) NIT నం.లు మరియు టెండరు కోరబడిన తేదీలు : NIT No. 7 to 11/SE/Unit-III/MBNR/Drains & Roads/523/337/330/377/363/2024-25, తేది: 24-09-2024 నుండి 10-10-2024 వరకు.
2) పనుల పేరు: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో CC డ్రెయిన్లు మరియు VDCC రోడ్లు నిర్మించుట.
3) పనుల మొత్తం వ్యయం: రూ.1930.00 లక్షలు. టెండరు డాక్యుమెంట్లు 24-09-2024న ఉ.10.30 గం. నుండి 10-10-2024న సా.4.30 గం. మధ్య ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో లభిస్తాయి. టెండరు ప్రచురణ తేదీ నుండి (14 రోజులు) టెండరు చెల్లుబాటులో ఉంటుంది. వివరాలను www.tender.telangana.gov.in కి లాగిన్ చేయుట ద్వారా చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), యూనిట్-III, మహబూబ్‌నగర్@హైదరాబాద్
DIPR RO No.4439-PP/CL/Advt /1/2024-25, Dt: 23.09.2024

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

మొత్తం రూ॥ 141.62 కోట్లు కోసం ది చీఫ్ ఇంజనీర్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN: NIT No. 1606-5/DCE(R)/EE-R/DEE-III/AEE-V/2024-25, తేది:21.09.2024 ప్రకారం దిగువ తెలిపిన జిల్లాలలో ఆన్‌లైన్ టెండర్స్ కోరబడుచున్నవి.

క్ర.సం.	జిల్లా	పనుల సంఖ్య	అంచనా వ్యయం (రూ॥ కోట్లలో)
	ప్లాన్-MDR		
1.	నల్గొండ	1	37.50
2.	సంగారెడ్డి	1	20.00
3.	ఖమ్మం	3	77.00
4.	కరీంనగర్	1	6.27
	నాన్-ప్లాన్		
5.	పెద్దపల్లి	1	0.85
	మొత్తం	7	రూ॥ 141.62 కోట్లు

టెండరుదారులు టెండరు షెడ్యూల్సును మరియు తదుపరి వివరాలను http://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ప్లాన్-MDR మరియు నాన్-ప్లాన్ MDR స్కీమ్ క్రింద పైన తెలిపిన పనులకు టెండర్లు స్వీకరించుటకు చివరి తేది 04.10.2024న సా॥ 4.00 గం.ల వరకు.

సం/- చీఫ్ ఇంజనీర్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN
DIPR RO No.4470-PP/CL/Advt/1/2024-25, Dt: 23.09.2024

నవోదయ విద్యాలయ సమితి
విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ, బి-15, సెక్టార్-62, నోయిడా, గౌతమ్ బుద్ధ నగర్, ఉత్తరప్రదేశ్ - 201 309

తరగతి VI JNVST-2025 కొరకు దరఖాస్తుల ఆన్‌లైన్ దాఖలుకు తేదీ పొడిగింపు కొరకు ప్రకటన

తరగతి VI సెషన్ 2025-26కు ప్రవేశం కొరకు **జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష 2025** కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుచున్నది. పరిపాలన కారణాల వలన ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది తదుపరి **07.10.2024** వరకు పొడిగించబడినది. అభ్యర్థులు NVS వెబ్‌సైట్ https://navodaya.gov.in/ లేదా https://cbseitms.rcil.gov.in/nvs/ ను దర్శించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. **GENDER, CATEGORY (GENERAL/OBC/SC/ST), AREA (RURAL/URBAN), DISABILITY & MEDIUM OF EXAMINATION** ఫీల్డ్స్‌లో నమోదిత అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారములలో మార్పులు చేసుకొనుట కొరకు **Correction Window** ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలు చివరి తేది తర్వాత **రెండు రోజుల పాటు** తెరిచే ఉంటుంది.

నవోదయ విద్యాలయ సమితి ద్వారా జారీచేయబడినది

ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా
3వ అంతస్తు, ఉడాన్ భవన్, సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్, న్యూఢిల్లీ-110003.

సర్వీసు మరియు అనుబంధ కార్యకలాపాల యొక్క నాణ్యత, కొనసాగింపు మరియు విశ్వసనీయతకు సంబంధించి ఎయిర్‌పోర్ట్‌ల పనితీరు ప్రమాణాలు రూపకల్పన కొరకు కన్సల్టెంట్ నియామకానికి ప్రతిపాదన కొరకు అభ్యర్థన

సర్వీసు మరియు అనుబంధ కార్యకలాపాల నాణ్యత, కొనసాగింపు మరియు విశ్వసనీయతకు సంబంధించి ఎయిర్‌పోర్ట్‌ల పనితీరు ప్రమాణాల రూపకల్పన కొరకు కన్సల్టెంట్‌గా నియామకానికి ఏజెన్సీల నుండి ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (AERA) ప్రతిపాదనల కొరకు అభ్యర్థిస్తోంది.

2. దానికి సంబంధించిన బిడ్ GeM పోర్టల్ (https://gem.gov.in) లో విడుదల చేయబడినది.

3. విచారణ నిబంధనలు/పని పరిధి, అర్హత ప్రమాణం, మదింపు విధానం, దాఖలుకు చివరి తేది మొ.వాటికి సంబంధించిన వివరాలు GeM పోర్టల్‌లో అప్‌లోడ్ చేయబడిన బిడ్ డాక్యుమెంటులో లభిస్తాయి. GeM పోర్టల్‌లో విడుదల చేయబడిన సంబంధిత RFP యొక్క బిడ్ నంబరు GEM/2024/B/5423497, తేది: 20-09-2024.

4. బిడ్ దాఖలుకు చివరి తేది 15-10-2024. ఇందులో తెలిపిన కాలక్రమాల ప్రకారం GeM పోర్టల్‌లో దాఖలు చేయబడిన బిడ్లు మాత్రమే స్వీకరించబడతాయి.

సం/- అండర్ సెక్రటరీ (పాలసీ మరియు స్టాటిస్టిక్స్)
ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా
3వ అంతస్తు, ఉడాన్ భవన్,
సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్, న్యూ ఢిల్లీ -110003.

CBC - 03112/12/0010/2425

ఇజ్రాయెల్ భీకర దాడులు

లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై గురి

356 మంది మృతి **1,024** మందికి గాయాలు | **300**కు పైగా లక్ష్యాలపై విరుచుకుపడిన ఐడీఎఫ్ | ప్రతిగా డజన్ల కొద్దీ రాకెట్లు ప్రయోగించామన్న హెజ్బొల్లా

జెరుసలేం: ఇజ్రాయెల్ ఆర్మీ, హెజ్బొల్లా మిలిటెంట్ల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ఇవి మరింత ముదిరి తీవ్ర యుద్ధానికి దారి తీసే ప్రమాదముందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఉదయం లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ ఆర్మీ) భీకర దాడులకు తెరతీసింది. ఈ దాడుల్లో 21 మంది చిన్నారులు, 39 మంది మహిళలు సహా 356మంది చనిపోగా, 1,024 మంది గాయపడ్డారని లెబనాన్ తెలిపింది. సరిహద్దులకు 130 కిలోమీటర్ల దూరంలోని బిబ్లోస్ ప్రావిన్స్ అటవీ ప్రాంతంతోపాటు, బాల్బెక్, హెర్మెల్‌లపైనా బాంబు దాడులు జరిగినట్లు లెబనాన్ వెల్లడించింది. తాము లెబనాన్‌లోని 300కు పైగా లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఈ దాడుల గురించి దక్షిణ లెబనాన్ వాసులను ఆర్మీ ముందుగానే హెచ్చరించింది. హెజ్బొల్లా స్థావరాలు, ఆయుధ డిపోలు, ఇతర మౌలిక వసతులకు, భవనాలకు సమీపంలో ఉండే పౌరులు తక్షణమే ఖాళీ చేయాల్సిందిగా కోరింది. ఇజ్రాయెల్ నగరాలు, పౌరులపైకి గురిపెట్టిన వందల సంఖ్యలో క్షిపణులు, రాకెట్లను ధ్వంసం చేసినట్లు అనంతరం ప్రధాని నెతన్యాహు వెల్లడించారు. వచ్చే రోజుల్లో పరిస్థితులు మరింత క్లిష్టతరం కానున్నాయంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. ఉత్తర ప్రాంతంలో సమీకరణాల్ని మార్చాలన్నదే తమ ప్రయత్నమని, ఇందుకు తగ్గ ఫలితం కన్పిస్తోందని అన్నారు. ఈ సమయంలో కలిసికట్టుగా ఉండి అధికారుల సూచనలు, హెచ్చరికలను పాటించాలని నెతన్యాహు ప్రజలను కోరారు. అనంతరం హెజ్బొల్లా హైఫా, గలిలీ ప్రాంతాల్లోని ఇజ్రాయెల్ ఆర్మీ వసతులపైకి డజన్లకొద్దీ రాకెట్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. హెజ్బొల్లా సంస్థ ఆయుధాల డిపోలకు సమీపంలో ఉండే వారు వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆయన కోరారు. గతేడాది అక్టోబర్ నుంచి హెజ్బొల్లా, ఇజ్రాయెల్ ఆర్మీ మధ్య జరుగుతున్న పోరులో కనీసం 600 మంది చనిపోయారు. మృతుల్లో ఎక్కువ మంది మిలిటెంట్లే. వీరిలో 100 మంది వరకు పౌరులుంటారని అంచనా. శుక్రవారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో హెజ్బొల్లా టాప్ కమాండర్లు సహా 45 మంది చనిపోవడం తెలిసిందే. మంగళ, బుధవారాల్లో వాకీటాకీలు, పేజర్లు, రేడియోలు పేలిన ఘటనల్లో 37 మంది చనిపోగా మరో 3 వేల మంది గాయపడ్డారు. ప్రతీకారంగా ఆదివారం హెజ్బొల్లా సరిహద్దులకు సుదూరంగా ఉన్న హైఫాలోని రఫేల్ డిఫెన్స్ సంస్థతోపాటు వివిధ లక్ష్యాలపైకి 150 వరకు రాకెట్లను ప్రయోగించడం తెలిసిందే.



సిడోన్ నుంచి తరలిపోతున్న జనం

వెళ్లిపోవాలంటూ మెసేజ్‌లు


తాముున్న ప్రాంతాలను విడిచి వెళ్లాంటూ 80 వేల మందికి పైగా సెల్‌ఫోన్లలో మెసేజీలు అందాయని లెబనాన్ అధికారులు తెలిపారు. ఇలాంటి వాటిని పట్టించుకోవద్దని కోరారు. భయాందోళనలను, అయోమయాన్ని సృష్టించడం ద్వారా మానసికంగా దెబ్బతీసేందుకు శత్రువు పన్నిన పన్నాగమని ప్రజలకు తెలిపారు. అయితే, తీవ్ర దాడుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో మూటాముల్లె సర్దుకుని అందుబాటులో ఉన్న వాహనాల్లో బీరుట్ దిశగా బయలుదేరారు. దీంతో, తీరప్రాంత సిడాన్ నగరంలో ట్రాఫిక్ స్తంభించింది. 2006లో ఇజ్రాయెల్– హెజ్బొల్లా మధ్య యుద్ధంగా జరిగాక ఇంత భారీగా జనం వలసబాట పట్టడం ఇదే మొదటిసారని పరిశీలకులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో కళాశాలలు, పాఠశాలలను తెరిచి ఉంచాల్సిందిగా లెబనాన్ హోం శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇళ్లు వదిలేసి భారీగా వలస వస్తున్న ప్రజలకు పాఠశాల భవనాల్లో ఆశ్రయం కల్పించాలని కోరింది.

▶ లెబనాన్‌లోని నబాటియేలో ఇజ్రాయెల్ దాడులతో కమ్ముకున్న పొగలు (ఇన్‌సెట్లో) ఇజ్రాయెల్ ఫైటర్ జెట్



దాడులు మరింత తీవ్రం

రాకెట్ లాంఛర్లు తదితరాలతో సరిహద్దులకు దగ్గర్లోని దక్షిణ ప్రాంతాన్ని మిలటరీ స్థావరాలుగా హెజ్బొల్లా మార్చేసిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. అందుకే భారీగా బాంబు దాడులు చేయక తప్పడం లేదంది. హెజ్బొల్లాను నిలువరించేందుకు వైమానిక దాడులపై తమ దృష్టంతా ఉందని పేర్కొంది. దక్షిణ లెబనాన్‌లోని 17 గ్రామాలు, పట్టణాల మ్యాప్‌ను విడుదల చేసింది. ఆపరేషన్లను మరింత విస్తరించనున్నట్లు ప్రకటించింది. రానున్న రోజుల్లో బెకా లోయతోపాటు మరిన్ని ప్రాంతాల్లో తీవ్ర దాడులుంటాయని ఇజ్రాయెల్ మిలటరీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలెవి ప్రకటించారు.



యుద్ధక్షేత్రం పరిష్కారం కాదు

సమిష్టి శక్తిలోనే మానవాళి విజయం ● ఐరాస సదస్సులో మోదీ

ఐరాస: మానవాళి విజయం సమష్టి శక్తిలోనే దాగుంది తప్ప యుద్ధక్షేత్రంలో కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యుద్ధం ఎన్నటికీ సమస్యల పరిష్కార వేదిక కాబోదని కుండబద్దలు కొట్టారు. సోమవారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి 79వ సర్వసభ్య సమావేశంలో భాగంగా 'ప్రపంచ భవితపై శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని ప్రసంగించారు. ఉక్రెయిన్, గాజా యుద్ధాలు, దేశాల నడుమ ఉద్రిక్తతలు, గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పుల వంటి పెను సమస్యల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రపంచ శాంతికి, ప్రగతికి ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. ''మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టే ఏ చర్యలకైనా మనిషి సంక్షేమమే అంతిమ లక్ష్యం కావాలి. అప్పుడే అవి ఫలిస్తాయి'' అని మోదీ సూచించారు. ''నమస్కారం. ప్రపంచ మానవాళిలో ఆరో వంతుకు సమానమైన 140 కోట్ల మంది భారతీయుల తరఫున వారి గళాన్ని విన్పిస్తున్నా'' అంటూ సాగిన ఐదు నిమిషాల ప్రసంగాన్ని పలు దేశాధినేతలు హర్షధ్వానాలతో స్వాగతించారు.

ఉగ్రవాదం పెనుముప్పు

ఉగ్రవాదం ప్రపంచ శాంతికి, భద్రతకు పెను ముప్పుగా పరిణమించిందని మోదీ అన్నారు. మరోవైపు సైబర్, స్పేస్, మారిటైమ్ క్రైమ్ పెను సవాళ్లు విసురుతున్నాయని అభిప్రాయపడ్డారు. ''వీటిని సమూలంగా రూపుమాపాలంటే కేవలం మాటలు చాలవు. నిర్దిష్ట కార్యాచరణతో ప్రపంచ దేశాలన్నీ కలిసి రావాలి. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా, సురక్షితంగా వినియోగించుకునేలా అంతర్జాతీయ స్థాయిలో నియంత్రణ వ్యవస్థ రావాలి'' అని పిలుపునిచ్చారు. ''మానవాళి సంక్షేమానికి ఆహార, ఆరోగ్య భద్రతకు దేశాలు ప్రాధాన్యమివ్వాలి. సంక్షేమ, సుస్థిరాభివృద్ధి పథకాల ద్వారా 25 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి విముక్తం చేశాం. వాటిని మిగతా దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నాం'' అన్నారు.

గాడిన పెట్టేందుకే: గుటెరస్

ప్రారంభోపన్యాసం చేసిన ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలపై మోదీ అభిప్రాయాలతో ఏకీభవించారు. వాటిని బాధ్యతాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రభావశీలంగా తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. ఐరాస భద్రతా మండలిని కాలం చెల్లిన వ్యవస్థగా అభివర్ణించారు! సరైన సంస్కరణలతో పనితీరును సరి చేసుకోకుంటే దాని విశ్వసనీయత అడుగంటడం ఖాయమని హెచ్చరించారు. ఘర్షణలకు ముగింపు కనుచూపు మేరలో కన్పించడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''పట్టాలు తప్పుతున్న ప్రపంచాన్ని దారిన పెట్టేందుకు కఠిన నిర్ణయాలను, చర్యలను సూచించడమే లక్ష్యంగా సదస్సు జరిగింది'' అన్నారు. మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టాల్సిన చర్యలతో కూడిన ఒప్పందాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సమగ్రాభివృద్ధి, అంతర్జాతీయ శాంతిభద్రతలు, శాస్త్ర సాంకేతికత, యువత, భావి తరాలు, అంతర్జాతీయంగా పాలన తీరుతెన్నుల్లో మెరుగైన మార్పులపై ఒప్పందం దృష్టి సారించింది.

పాలస్తీనా అధ్యక్షునితో భేటీ

పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో మోదీ భేటీ అయ్యారు. గాజాలో మానవతా సంక్షోభం పట్ల తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. పాలస్తీనా ప్రజలకు భారత్ అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. కువైట్ రాకుమారుడు షేక్ సబా ఖలీద్ అల్ సబా, నేపాల్ ప్రధాని కె.పి.శర్మ ఓలి తదితరులతో కూడా మోదీ సమావేశమయ్యారు.

ఇజ్రాయెల్ యుద్ధవ్యాప్తినే కోరుకుంటోంది: ఇరాన్

ఐక్యరాజ్యసమితి: మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని విస్తరించాలనే ఇజ్రాయెల్ కోరుకుంటోందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆరోపించారు. తమ దేశాన్ని కూడా సంక్షోభంలోకి లాగాలని కుట్ర పన్నుతోందన్నారు. గాజా యుద్ధాన్ని, ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో వైమానిక దాడులను తాము కోరుకోవడం లేదని న్యూయార్క్‌లో మీడియాకు స్పష్టం చేశారు.

తరలుతున్న అమెరికా బలగాలు

వాషింగ్టన్: ఇజ్రాయెల్, హెజ్బొల్లా దాడులు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఆ ప్రాంతానికి మరిన్ని బలగాలను పంపించాలని అమెరికా నిర్ణయించింది. మధ్యప్రాచ్యంలో ప్రస్తుతం 40 వేల దాకా అమెరికా సైనికులున్నారు. యుద్ధం మొదలయ్యేలా ఉన్నందున లెబనాన్‌లోని తమ పౌరులు తక్షణం వెనక్కి రావాల్సిందిగా అమెరికా సూచించింది.

ఎంపాక్స్ క్లేడ్ 1బీ తొలి కేసు

కేరళ కేసులో నిర్ధారణ

న్యూఢిల్లీ: ప్రపంచంలో 'ఆరోగ్య అత్యయిక స్థితి'కి దారితీసిన 'క్లేడ్1' వేరియంట్ ఎంపాక్స్ వైరస్ భారత్‌లోకి అడుగుపెట్టింది. క్లేడ్ 1బీ పాజిటివ్ కేసు భారత్‌లో నమోదైందని సోమవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి కేరళకు తిరిగొచ్చిన 38 ఏళ్ల వ్యక్తిలో క్లేడ్ 1బీ వైరస్‌ను గుర్తించామని అధికారులు ప్రకటించారు. మలప్పురం జిల్లాకు చెందిన ఈ రోగి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలుస్తోంది. క్లేడ్ 1బీ వేరియంట్ కేసులు విజృంభించడతో ఆగస్ట్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించడం తెల్సిందే. విదేశాల నుంచి వస్తూ ఎంపాక్స్ రకం వ్యాధి లక్షణాలతో బాధపడే వారు తక్షణం ఆరోగ్య శాఖకు వివరాలు తెలపాలని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ సూచించారు.

కోలుకున్న 'క్లేడ్2' రోగి

క్లేడ్2 వేరియంట్‌తో ఢిల్లీలోని లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న 26 ఏళ్ల రోగి కోలుకుని శనివారం డిశ్చార్జ్ అయ్యాడని ఆస్పత్రి వర్గాలు సోమవారం వెల్లడించాయి. హరియాణాలోని హిసార్‌కు చెందిన ఈ వ్యక్తి సెప్టెంబర్ ఎనిమిదో తేదీన ఆస్పత్రిలో చేరడం తెల్సిందే.

పోలీసుల ఎదురుకాల్పుల్లో 'బద్లాపూర్' రేప్ నిందితుడి మృతి

ముంబై: మహారాష్ట్రలో ఆగస్ట్‌లో సంచలనం సృష్టించిన 'బద్లాపూర్' బాలికలపై అత్యాచారం కేసులో నిందితుడు అక్షయ్ షిండే పోలీసుల ఎదురుకాల్పుల్లో చనిపోయాడు. నవీ ముంబైలోని తలోజా జైలు నుంచి థానె జిల్లాలోని బద్లాపూర్ పట్టణానికి తీసుకొస్తుండగా పోలీసుల నుంచి పిస్టల్ లాక్కుని కాల్పులకు తెగబడిన అతడిని పోలీసులు క్షణాల్లో మట్టుబెట్టారు. సోమవారం సాయంత్రం 6.15గంటలకు ముంబ్రా బైపాస్ రోడ్డు వద్ద ఈ ఎదురుకాల్పుల ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. బద్లాపూర్‌లోని ఓ స్కూల్లో స్వీపర్‌గా పనిచేస్తున్న 24 ఏళ్ల అక్షయ్ అక్కడి నాలుగేళ్ల ఇద్దరు బాలికలపై లైంగికంగా దాడిచేశాడని ఆరోపణలు వెల్లువెత్తడం తెల్సిందే. విషయం తెల్సిన మరుక్షణం స్కూలు పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు, నిరసనకారులు వేలాదిగా ఆందోళన చేపట్టడం తెల్సిందే. ఎదురుకాల్పుల ఉదంతంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే విలేకరులతో మాట్లాడారు. '' అక్షయ్‌పై అతని మాజీ భార్య లైంగిక హింస కేసు పెట్టింది. ఈ కేసులో విచారణ నిమిత్తం తలోజా జైలు నుంచి ఇతడిని బద్లాపూర్‌కు ఒక పోలీస్ ఎస్కార్ట్ బృందం తీసుకొస్తోంది. మార్గమధ్యంలో పోలీసు వాహనం ముంబ్రా బైపాస్ చేరుకోగానే పోలీస్ నుంచి పిస్టల్‌ను లాక్కొని నిందితుడు ఒక అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నీలేశ్ మోరేపైకి 2-3 రౌండ్ల కాల్పులు జరిపాడు. హఠాత్ పరిణామం నుంచి తేరుకున్న మరో పోలీసు అధికారి వెంటనే తన తుపాకీతో అక్షయ్‌ను కాల్చాడు. రక్తమోడుతున్న ఇతడిని దగ్గర్లోని కల్వా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆత్మరక్షణ కోసం మాత్రమే పోలీసు ఇతనిపై కాల్పులు జరిపాడు'' అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.

చైల్డ్ పోర్న్ చూసినా, వీడియోలున్నా...

తీవ్ర నేరమే!

పోక్సో చట్టం కిందకే వస్తుంది

- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- మద్రాస్ హైకోర్టు తీర్పు కొట్టివేత
- ప్రపంచవ్యాప్త జాఢ్యమని వ్యాఖ్య
- చైల్డ్ పోర్నోగ్రఫీ పదం వాడొద్దు
- కోర్టులన్నింటికీ ఆదేశాలు
- పోక్సో చట్ట సవరణకు సూచన
- లైంగిక అవగాహనపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచన

న్యూఢిల్లీ: చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి సుప్రీంకోర్టు సోమవారం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. లైంగిక వేధింపుల బారి నుంచి బాలలకు భద్రత కల్పించే పోక్సో చట్టం ప్రకారం ఆ వీడియోలను వ్యాప్తి చేయడం మాత్రమే నేరమన్న వాదన సరికాదని స్పష్టం చేసింది. ''ఆ వీడియోలను కలిగి ఉండటం, డౌన్‌లోడ్ చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో గానీ ఇతరత్రా గానీ వాటిని చూడటం కూడా పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం కచ్చితంగా నేరమే. ఇవి 'ఆరంభ నేరం' కిందకే వస్తాయి'' అని పోక్సో చట్టం సెక్షన్ 15లోని 1, 2, 3 సబ్ సెక్షన్లను, ఐటీ చట్టంలోని సెక్షన్ 67బిని ఉటంకిస్తూ పేర్కొంది. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం, డౌన్‌లోడ్ చేయడం నేరం కాదన్న మద్రాస్ హైకోర్టు తీర్పును ఘోర తప్పిదంగా సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్డీవాలా ధర్మాసనం అభివర్ణించింది. తన మొబైల్‌లో చైల్డ్ పోర్నో వీడియోలున్న ఓ 28 ఏళ్ల వ్యక్తిని నిర్దోషిగా పేర్కొంటూ జనవరి 11న హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తున్నట్టు పేర్కొంది. అతనిపై నేరాభియోగాలను పునరుద్ధరించాల్సిందిగా తిరువళ్లువర్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ సెషన్స్ కోర్టును ఆదేశించింది. ''బాలలపై లైంగిక వేధింపులు అత్యంత ఆందోళనకరమైన అంశం. సమాజంలో లోతుల దాకా వేళ్లానుకుపోయిన ఈ పెను జాఢ్యం ఏ ఒక్క ప్రాంతానికో, దేశానికో పరిమితం కాదు. ప్రపంచవ్యాప్త సమస్య'' అంటూ ఆవేదన వెలిబుచ్చింది. దీని నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం పలు సూచనలు చేసింది. ''న్యాయపరమైన ఉత్తర్వులు, తీర్పుల్లో ఇకపై చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని వాడొద్దు. దానికి బదులు సదరు నేరాలను మరింత నిర్దుష్టంగా పేర్కొనేలా 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్ఈఏఎం)' అని మాత్రమే వాడాలి'' అని అన్ని కోర్టులనూ ఆదేశించింది. పోక్సో చట్టానికి ఈ మేరకు సవరణ చేసే అంశాన్ని పరిశీలించాలని పార్లమెంటుకు సూచించింది. ఆలోపుగా కేంద్రం ఈ మేరకు ఆర్డినెన్స్ జారీ చేయాలని పేర్కొంది. బాలలపై లైంగిక వేధింపుల సమస్యను రూపుమాపడంలో ప్రపంచ దేశాలన్నింటికీ ఈ తీర్పే మార్గదర్శకం కాగలదంటూ న్యాయ వర్గాలు హర్షం వెలిబుచ్చాయి.

తీర్పులో ముఖ్యాంశాలు

- ➤ చైల్డ్ పోర్నో మెటీరియల్ బాలల భద్రతకు పెను ముప్పు. బాలలను లైంగిక అవసరాలు తీర్చుకునే బొమ్మలుగా అది చిత్రిస్తుంది. ఫలితంగా జరగరానిది జరిగితే బాధితుల లేత మనసులపై అది ఎన్నటికీ చెరిగిపోని గాయం చేస్తుంది.
- ➤ విద్యార్థులకు సమగ్ర లైంగిక విద్యా బోధన కార్యక్రమాలను అమలు చేయాలి. ఆరోగ్యకరమైన సంబంధాలు, సరైన ప్రవర్తన వంటివాటిలపై అవగాహన కలిగించాలి.
- ➤ విద్యార్థులు మొదలుకుని సాధారణ ప్రజల దాకా అన్ని స్థాయిల్లోనూ లైంగిక విద్య, అవగాహన కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి.
- ➤ చట్టపరమైన పర్యవసానాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. తద్వారా వాటి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు. ఆ నేరాలకు పాల్పడేందుకు వెనకాడేలా చేయవచ్చు.
- ➤ నేరానికి సంబంధించి బాలల నుంచి సాక్ష్యాల సేకరణ, దర్యాప్తు, విచారణ తదితర ప్రక్రియ వీలైనంత సున్నితంగా జరిగేలా చూడాలి. తద్వారా వారి మనసులు మరింత గాయపడకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి.

లైంగిక విద్య అత్యవసరం

బాలలపై లైంగిక నేరాలు తగ్గాలంటే లైంగిక విద్య, లైంగిక ఆరోగ్యం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన అవసరమని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. దురదృష్టవశాత్తూ దీనిపై భారత సమాజంలో తీవ్ర అపోహలు నెలకొని ఉన్నాయంటూ జస్టిస్ పార్డీవాలా ఆవేదన వెలిబుచ్చారు. ధర్మాసనం తరఫున 200 పేజీల తీర్పును ఆయనే రాశారు. ''లైంగిక విద్యను పాశ్చాత్య భావనగా, మన సంప్రదాయ విలువలను దిగజార్చేదిగా భారత సమాజం భావిస్తుంది. దాంతో స్కూళ్లలో లైంగిక విద్యపై వ్యతిరేకత నెలకొని ఉంది. దానిపై పలు రాష్ట్రాల్లో నిషేధమే ఉంది!'' అని పేర్కొన్నారు. ''సెక్స్, సంబంధిత విషయాలను పిల్లలతో చర్చించడాన్ని ఇబ్బందికరంగా మాత్రమే గాక ఘోర అపరాధంగా, అనైతికంగా మనవాళ్లు చూస్తారు. వాటివల్ల ఎదిగే వయసులో విచ్చలవిడి లైంగిక ధోరణులు తలెత్తుతాయన్న అపోహ వ్యాప్తిలో ఉంది. తల్లిదండ్రులు, పెద్దల్లోనే గాక విద్యావేత్తల్లో కూడా ఈ తిరోగమన ధోరణి నెలకొని ఉండటం దారుణం. దీంతో ఎదిగే పిల్లల్లో లైంగికపరమైన అవగాహన లోపిస్తోంది. అందుకే టీనేజర్లు ఇంటర్నెట్‌లో సులువుగా అందుబాటులో ఉన్న సెక్సువల్ కంటెంట్‌కు ఇట్టే ఆకర్షితులవుతున్నారు. ఎలాంటి నియంత్రణా, వడపోతా లేని ఆ విచ్చలవిడి కంటెంట్ వారిని తప్పుదోవ పట్టించడమే గాక అనారోగ్యకరమైన లైంగిక ప్రవర్తనకు, లైంగిక నేరాలకు పురిగొల్పుతోంది'' అంటూ ధర్మాసనం ఆందోళన వెలిబుచ్చింది. ''కనుక ఈ విషయమై ముందు పెద్దలను చైతన్యవంతులను చేయడం చాలా ముఖ్యం. సమగ్ర లైంగిక విద్య, అవగాహన బాలలకు ఎంత ముఖ్యమో వారికి అర్థమయ్యేలా చేయాలి. చైల్డ్ పోర్నోగ్రఫీ వీక్షణ, వ్యాప్తి, లైంగిక హింస వంటివాటి చట్టపరమైన పరిణామాలను కూడా అర్థం చేసుకుంటారు. కనుక వాటికి దూరంగా ఉంటారు. పరిశోధనల్లో రుజువైన వాస్తవాలివి. మన దేశంలో సమగ్ర లైంగిక విద్య అవసరం చాలా ఉందని అవి తేల్చాయి'' అని పేర్కొంది.



జస్టిస్ పార్డీవాలా



శ్రీలంక అధ్యక్షుడిగా దిస్సనాయకే ప్రమాణం

దేశానికి పునర్వైభవం తెస్తానని ప్రతిన

కొలంబో: శ్రీలంక 9వ అధ్యక్షుడిగా మార్క్సిస్ట్ నేత అనూర కుమార దిస్సనాయకే (56) ప్రమాణం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జయంత జయసూర్య సోమవారం ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూ, అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా చూసినందుకు తాజా మాజీ రణిల్ విక్రమసింఘెకు దిస్సనాయకే కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నా శాయశక్తులా పనిచేస్తాను. రాజకీయ నాయకుల ప్రవర్తనపై ప్రజలకు అనుమానాలు ఉన్నందున వారి గౌరవాన్ని పునరుద్ధరించడానికి నా వంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను'అని ఈ సందర్భంగా దిస్సనాయకే అన్నారు.

నేడు మారిటల్ రేప్ పిటిషన్ల విచారణ

న్యూఢిల్లీ: భార్య సమ్మతి లేకుండా భర్త బలవంతంగా సంభోగం జరిపితే.. అది రేప్ కాదని భారతీయ చట్టాలు చెబుతున్నాయి. భార్య మైనర్ కానంతవరకు అది నేరం కాదంటున్నాయి. కానీ పాశ్చాత్య దేశాల్లో మారిటల్ రేప్ (భార్య అభీష్టానికి విరుద్ధంగా సంభోగం జరపడం)ను నేరంగా పరిగణిస్తున్నారు. మానభంగం కింద విచారిస్తున్నారు. భారత్‌లోనూ మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించాలని చాన్నాళ్లుగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. పితృస్వామ్య వ్యవస్థ, నిరక్షరాస్యత.. తదితర కారణాల వల్ల మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించలేమని కేంద్ర ప్రభుత్వం గతంలో చెప్పింది. సున్నితమైన ఈ అంశంపై దాఖలైన పిటిషన్లను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించనుంది. కక్షిదారు తరఫున హాజరైన న్యాయవాది కరుణా నంది పిటిషన్లపై త్వరగా విచారణ చేపట్టాలని సోమవారం కోరగా.. మంగళవారం వీటిపై విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది. ఐపీసీ 375లోని మినహాయింపు నిబంధన.. మారిటల్ రేప్ నేరంగా కాదని పేర్కొంది. భారతీయ న్యాయ సంహితలోనూ సెక్షన్ 63 (రేప్) మినహాయింపు 2లో 'ఒక పురుషుడు సొంత భార్యతో సంభోగం, లైంగిక చర్యల్లో పాల్గొంటే అది రేప్ కాదు. భార్య 18 ఏళ్లలోపు వయస్కురాలై ఉంటే తప్ప' అని పేర్కొన్నారు. మహిళా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



కేజ్రీవాల్ కుర్చీ పక్కన కూర్చున్న సీఎం ఆతిశీ

నాదీ భరతుడి వ్యథే!

కేజ్రీవాల్ కూర్చున్న కుర్చీని ఖాళీగా వదిలేసిన ఆతిశీ ● ఢిల్లీ సీఎంగా బాధ్యతల స్వీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే ఆతిశి బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ పై తనకున్న ప్రభు భక్తిని చాటుకున్నారు. ఇన్నాళ్లూ ఆయన కూర్చున్న ఎర్ర రంగు కుర్చీని ఖాళీగానే ఉంచి, ఆ పక్కనే మరో తెల్ల రంగు కుర్చీలో కూర్చుని సాదాసీదాగా సోమవారం సచివాలయంలో ఆమె ఢిల్లీ 8వ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆతిశి మీడియాతో మాట్లాడారు.

ఈ కుర్చీ కేజ్రీవాల్‌ది

రామాయణంలో శ్రీరాముడి సోదరుడు భరతుడి మాదిరిగానే తాను వ్యథ చెందుతున్నానని ఆతిశి అన్నారు. 'ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాను. ఆనాడు భరతుడి వ్యథలాగే.. నేడు నా మనసు వ్యథ చెందుతోంది. శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసానికి వెళ్లినప్పుడు భరతుడు అయోధ్య రాజ్య పాలన బాధ్యతలు తీసుకోవాల్సివచ్చింది. శ్రీరాముడి పాదుకలను సింహాసనంపై ఉంచి ఆయన రాజ్యపాలన చేశారు. అదే తీరుగా వచ్చే నాలుగు నెలలు ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తాను. తండ్రికిచ్చిన మాట కోసం శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసం చేశారు. అందుకే మనం ఆయనను మర్యాద పురుషోత్తముడిగా పిలుచుకుంటాం. శ్రీరాముడి జీవితం మర్యాద, నైతికతకు నిదర్శనం. అదే విధంగా కేజ్రీవాల్ కూడా మర్యాద, నైతికతకు నిదర్శనంగా నిలిచారు. గత రెండేళ్లుగా కేజ్రీవాల్‌పై బురదజల్లేందుకు బీజేపీ ఏ అవకాశాన్నీ వదిలిపెట్టలేదు. అయితే, నిజాతీపరుడినని నిరూపించుకునే వరకూ సీఎం పీఠంలో కూర్చోనని ఆయన పదవికి రాజీమా చేశారు. కానీ, ఈ కుర్చీ (తన పక్కనే ఖాళీగా ఉన్న కుర్చీని చూపెడుతూ) కేజ్రీవాల్‌ది. వచ్చే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు తమ ఆశీర్వాదంతో కేజ్రీవాల్‌ను సీఎం పీఠంపై కూర్చో బెడతారనే నమ్మకం నాకుంది'' అని ఆతిశి అన్నారు.

సీఎం పదవికే అవమానం

కేజ్రీవాల్ వాడిని కుర్చీలో కూర్చోరాదంటూ సీఎం ఆతిశి తీసుకున్న నిర్ణయంపై బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా మండిపడ్డాయి. 'ఆతిశి చేసిన పని ఆదర్శం ఎంతమాత్రమూ కాదు. ఆమె సీఎం పదవిని అవమానించడమే కాదు, ఢిల్లీ ప్రజల మనోభావాలను దెబ్బతీశారు'' అని ఆ పార్టీ ప్రతినిధులు ధ్వజమెత్తారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



ట్రాఫిక్‌పై హైలెవల్ కమిటీ

రాజధానిలోని మూడు కమిషనరేట్లలో సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ కోసం పోలీసు, జీహెచ్ఎంసీ, హైడ్రా ఉన్నతాధికారులతో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. –8లో



పాతబస్తీ.. బైకర్స్ మస్తీ..

చార్మినార్ సమీపంలో జనసంచారం అరకొరగా ఉండే ప్లేస్‌ను వెతకాలంటే.. అర్ధరాత్రుళ్లు తప్ప అసాధ్యం. అందుకే సిటీ బైకర్స్ తమ చిట్‌చాట్‌కు అదే టైమ్‌ను ఎంచుకుంటున్నారు. –సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులతో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32 డిగ్రీ, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

సీవరేజీ 'వ్యర్థాల'పై దృష్టి!

నగరంలో వరుసగా కుండపోత వర్షం



పైప్‌లైన్లలో ఇసుకమేట, వ్యర్థాలు

- రంగంలోకి ఎయిర్‌టెక్, జెట్ యంత్రాలు
- మురుగుకాల్వలు స్తంభించకుండా తొలగింపు
- క్షేత్రస్థాయిలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పర్యటన

బ్రాహ్మణవాడి లేన్-1లో సీవరేజీ సమస్యను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: కునుకు తీసే వేళ కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరుసగా మూడు, నాలుగురోజుల నుంచి రాత్రిపూట నగరంలో భారీ వర్షం కురుస్తోంది. దీంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కాకుండా నివారణ చర్యలు చేపట్టారు. మురుగుకాల్వల్లో భారీగా చేరుతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు జలమండలి యుద్ధప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించింది. మరో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించడంతో డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లకుండా పైప్‌లైన్ క్లీనింగ్ పనులను ముమ్మరం చేసింది. ప్రత్యేకంగా నిత్యం మురుగు సమస్య తలెత్తే పైప్‌లైన్లపై దృష్టి సారించింది. జెట్, ఎయిర్‌టెక్, మినీ యంత్రాలను రంగంలోకి దింపి పైప్‌లైన్ల పనులు చేపడుతోంది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి క్షేత్రస్థాయిలో సీవరేజీ పనులు పరిశీలించేందుకు సుడిగాలిలా పర్యటిస్తున్నారు. దీంతో వ్యర్థాల తొలగింపు ప్రక్రియ వేగవంతమైంది. డ్రైనేజీల నుంచి తొలగించిన పూడికను సైతం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది తరలిస్తున్నారు.

ఇసుక మేటలు...

జడివాన కారణంగా డ్రైనేజీల్లో ఇసుకమేట వేస్తోంది. వరదతోపాటు ఇసుక మురుగుకాల్వల్లోకి వచ్చి చేరుతోంది. వాస్తవంగా హైదరాబాద్ మహానగరంలో అడుగు జాగా ఖాళీ లేకుండా పెరుగుతున్న గృహ, వాణిజ్య భవన సముదాయాలతోపాటు చెరువులు, కుంటలు, నాలాలు సైతం ఆక్రమణకు గురికావంతో వర్షపునీరు భూమిలో ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. వరదగా మారి ఇసుకతోపాటు ఇతర చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు వచ్చి డ్రైనేజీలోకి చేరుతుండటంతో మురుగు పైప్‌లైన్లు ఎక్కడికక్కడే స్తంభించిపోతున్నాయి. చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లడం సర్వసాధారణమైంది.

> **సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
>
> 
>
> దీర్ఘకాలికంగా తరచూ సీవరేజీ సమస్యలు తలెత్తే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టనున్నాం. ఇక నుంచి అలాంటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను వారంలో ఒకటి, రెండు రోజులు సందర్శిస్తా.
>
> – జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

600 ప్రాంతాలపైనే..

నగరంలో సుమారు 600 ప్రాంతాలలో వాన వచ్చినప్పుడల్లా మురుగునీటి సమస్య తలెత్తుతోంది. వాస్తవంగా కొన్ని ప్రాంతాల్లో సీవరేజీ పైప్‌లైన్‌లో అధికమొత్తంలో మురుగు, చెత్తాచెదారం చేరడంతో కాల్వలు పగిలి మురుగు పొంగి పొర్లి రహదారులు జలమయమవుతున్నాయి. ఇళ్లల్లోకి వరద, మురుగు నీరు చేరుతున్నాయి.

క్షేత్రస్థాయి పరిశీలన

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పనులను పరిశీలించారు. బ్రాహ్మణవాడి లేన్-1లో దీర్ఘకాలికంగా సీవరేజీ సమస్యపై ఫిర్యాదులు రావడంతో ఆ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. సమస్యను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బేగంపేట్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లానర్స్ ఇండియా(ఐటీపీఐ) ప్రాంతీయ కార్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు.



వదలరు.. కదలరు..

> **చెత్త పనుల కోసమే ఎందుకు ?**
>
> జీహెచ్ఎంసీలో పేరుకే వారు సహాయ వైద్యాధికారులు. వైద్యం మాత్రం చేయరు. చదివింది వైద్యమే, అయినా చేసేది చెత్త పర్యవేక్షణ పనులు. జీహెచ్ఎంసీ చెత్త విభాగంలోని అడ్డగోలు సంపాదనల వల్లే ఈ విభాగంలోని వారు ఎటూ కదలరనే ఆరోపణలు ఎంతగా వెల్లువెత్తుతున్నా, వదిలిపోకుండా ఉండేందుకు భారీస్థాయిలో పైరవీలు చేయడం బహిరంగ రహస్యం. కనీసం వారిని జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోనే ఏర్పాటైన బస్తీ దవాఖానాల్లో వైద్యులుగా నియమించినా ఎందరో పేదలకు మేలు జరుగుతుంది. కానీ, అలాంటి పనులు మాత్రం చేయరు.

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి ఉన్నతాధికారులుగా వచ్చేవారు మారితే పరిస్థితిలో కూడా మార్పు వస్తుందని అందరూ అనుకుంటారు కదా! కానీ, వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా తిష్ట వేసి పాతుకుపోయిన అధికారులు, ఉద్యోగులు వేసే పాచికల ముందు వారు ఏమీ చేయలేనివారుగా మిగిలిపోతున్నారు. జీహెచ్ఎంసీకి డిప్యుటేషన్ల మీద వచ్చినవారిని ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినప్పటికీ కొందరు ఉద్యోగులు కదలకుండా ఇక్కడే కొనసాగుతున్నారు. అంతర్గత బదిలీల్లో సైతం కదలకుండా ఒకేచోట కొనసాగుతున్నవారు, నామ్‌కే వాస్తేగా పక్క సర్కిల్‌కే బదిలీ అయినవారు ఎందరో ఉన్నారు.

మచ్చుకు కొన్ని..

ఒకే సీట్లో మూడేళ్లు దాటిన వారిని నిబంధనల ప్రకారం బదిలీ చేయాలి. కానీ, ఏళ్ల తరబడి స్థానచలనం లేనివారు, బదిలీలు జరగని వారెందరో జీహెచ్ఎంసీలో ఉన్నారు. ఆరోగ్యం, ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువ. ఇటీవల దోమల నివారణ విభాగంలోని ఇద్దరు అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కానీ, వారు తమ స్థానాల నుంచి కదల్లేదు. పోనీ, చాలా దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారా అంటే అదీ కాదు. నగరంలోనే ఉండే వేరే విభాగానికి బదిలీ అయినప్పటికీ, వీరు తమ స్థానాలను వీడలేదు. ఇదే విభాగం పరిధిలోకి వచ్చే సహాయ వైద్యాధికారుల బదిలీలది మరో తంతు. కేవలం ఐదు కిలోమీటర్ల దూరం కూడాలేని పక్క సర్కిల్‌కే బదిలీ అయ్యారంటే, వారి పైరవీ ఏస్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. అలా దశాబ్దానికి పైగా బల్దియాలోనే కొనసాగుతున్న వారు కూడా ఉన్నారు. ఇక ఇంజినీరింగ్ విభాగం బదిలీలది మరో కథ. జోనల్ స్థాయిలోని ఉన్నతాధికారుల బదిలీలు జరగలేదు. సర్కిళ్ల స్థాయిలో బదిలీలు జరిగిన వారందరూ కొత్త పోస్టుల్లోకి వెళ్లిన దాఖలాల్లేవు. ఒకేచోట ఆరేళ్లుగా పనిచేస్తున్న వారినీ ఎవరూ కదల్చలేకపోయారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల్లోనూ బదిలీల బాగోతాలున్నా.. ఇంజినీరింగ్, హెల్త్ విభాగాల్లో ఇలాంటి పరిస్థితులు మరీ దారుణం. ఆ రెండు విభాగాల అంతర్గత బదిలీలు కమిషనర్ స్థాయిలో జరగకపోవడమే అందుకు కారణమనే ఆరోపణలున్నాయి.

మాకు వాళ్లే కావాలి..

దిగువస్థాయిలో ఉండే ఉద్యోగుల బదిలీ అనగానే.. బదిలీ అయ్యేవారి కంటే ఉన్నతాధికారులే ఎక్కువగా ఆందోళన చెందుతారు. ఎందుకంటే వారిపైనే ఈ ఉన్నతాధికారులు పూర్తిగా ఆధారపడతారు. వారు లేకుంటే తమ విభాగం పనులు ముందుకు కదలవని భావించే ఉన్నతాధికారులే సిఫారసు చేసి మరీ యథాస్థానంలో కొనసాగిస్తున్న ఘటనలూ ఉన్నాయి. మిగతా వారికి పనులు రాకపోవడం అందుకు కారణమని చెప్పడం తప్ప, పని రానివారికి నేర్పించాలనే ఆలోచన ఏ అధికారికీ లేకపోవడం గమనార్హం.

ప్రభుత్వం ఆదేశించినా..

పదవీ విరమణ పొందాక సైతం జీహెచ్ఎంసీలో ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్న వారిని వెంటనే ఇళ్లకు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే చీఫ్ ఇంజినీర్ స్థాయిలోని ఓ ఉన్నతాధికారితోపాటు కొందరిని ఆగమేఘాల మీద పంపించినప్పటికీ, ఇంకా కొనసాగున్న కొందరికి మాత్రం ఎక్స్‌టెన్షన్ల మీద ఎక్స్‌టెన్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చెరువుల పరిరక్షణలో భాగస్వాములు కండి

బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్



రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిల్డర్స్

కూకట్‌పల్లి: చెరువులను కాపాడేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో బిల్డర్లు భాగస్వాములు కావాలని, భావితరాల భవిష్యత్ దృష్ట్యా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. సోమవారం ఇక్కడి హోటల్ పద్మరాగ గ్రాండ్‌లో జరిగిన గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే, ఎంతటి వారినైనా వదలబోమని స్పష్టం చేశారు. హైడ్రా కూల్చివేతల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పలువురు బిల్డర్లు రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు, అధ్యక్షుడు కె.రాజారెడ్డి, జనరల్ సెక్రటరీ పీబీఎస్ విశ్వనాథ్, వైస్ చైర్మన్ సమ్మెట ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్, ట్రెజరర్ ఎం.రామ్మోహన్ పాల్గొన్నారు.

పాఠశాలలపై 'ప్రత్యేక' దృష్టి అవసరం



- ఏజీఆర్ రిజిస్టర్ అప్డేట్ చేయాలి
- ప్రత్యేక అధికారులు సమావేశంలో కలెక్టర్ అనుదీప్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక అధికారులను సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు శాతం(ఎఫ్ఆర్ఎస్) పరిశీలించాలని, నెల కంటే ఎక్కువగా హాజరుకాని విద్యార్థుల పేర్లు ఎఫ్ఆర్ఎస్ నుంచి తొలగించి ఏజీఆర్ రిజిస్టర్‌ను అప్డేట్ చేయాలని ఆదేశించారు. అయితే పాఠశాలల్లో పిల్లల హాజరు శాతం పెరిగేలా చూడాలని సూచించారు. పాఠశాలను సందర్శించినప్పుడు అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా నిర్మించిన పనుల నిర్వహణ సరిగా ఉందో, లేదో పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కదిరివన్, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు ఆశన్న, పెరికె యాదయ్య, వడ్డెన్న, కోటాజీ, రాజేందర్, పవన్ కుమార్, ఇలియాజ్ అహ్మద్, డాక్టర్ వెంకట్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

టీజీసెట్-2024 ప్రాథమిక 'కీ' విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్-2024 ప్రాథమిక 'కీ'ని అధికారులు తాజాగా విడుదల చేశారు. అభ్యర్థులు ప్రశ్న, జవాబుల్లోని అభ్యంతరాలను నేటి నుంచి (24న) ఈ నెల 26 వరకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్‌లో అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. అభ్యంతరాలను www.teanfanaret.orf అనే వెబ్‌సైట్ ద్వారా టీజీసెట్-2024కు తెలియజేయాలన్నారు.

శిక్షణలోనే నేర నియంత్రణపై అవగాహన

కానిస్టేబుల్ అభ్యర్థులకు సందీప్ శాండిల్యా సూచన

అంబర్‌పేట: సమాజంలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ నార్కో అనలటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య(టీజీఎన్ఏబీ) అన్నారు. సోమవారం అంబర్‌పేటలోని పోలీస్ ట్రెయినింగ్ సెంటర్(పీటీసీ)లో కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్న 800 మంది అభ్యర్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ మహమ్మారి తీవ్రత గురించి వివరించారు. భవిష్యత్‌లో పోలీస్ శాఖకు మాదకద్రవ్యాల నియంత్రణ సవాల్‌గా మారవచ్చని, దానిపట్ల అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలోనే ప్రతీ నేర నియంత్రణ గురించిన పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి అభ్యర్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ నార్కో అనలటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య

పర్యటిస్తూ.. పరిశీలిస్తూ..

కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

- యూపీ సీఎంను కలిసిన మేయర్ బృందం
- షిల్లాంగ్‌లో డిప్యూటీ మేయర్ బృందం



లక్నోలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసిన నగర మేయర్, కార్పొరేటర్లు



మాల్లీనాంగ్‌లో డిప్యూటీ మేయర్ బృందం

సాక్షి, సిటీబ్యూరో: మేయర్, డిప్యూటీ మేయర్ల నేతృత్వంలో కార్పొరేటర్ల అధ్యయన యాత్ర ఉత్సాహంగా సాగుతోంది. రెండు బృందాల కార్పొరేటర్లు సోమవారం లక్నో, షిల్లాంగ్‌లలో పర్యటించారు. మేయర్ బృందంలోని 40 మంది కార్పొరేటర్లు లక్నో స్మార్ట్‌సిటీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి మూడు కమాండ్ సెంటర్ల కార్యకలాపాలను పరిశీలించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కమాండ్ సెంటర్ నుంచి ఇంటింటి చెత్త సేకరణ పర్యవేక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సేఫ్ సిటీ కమాండ్ సెంటర్ నుంచి ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, స్త్రీలపై వేధింపులు, అత్యాచారాలు జరగకుండా నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు గుర్తించారు. అక్కడి ఆర్టీసీ బస్సులలో కూడా కెమెరాలు ఉండటాన్ని, మహిళలకు ఏదేని సహాయం అవసరమైతే పానిక్ బటన్‌ను నొక్కినట్లైతే కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది వెంటనే స్పందించి వారికి సహాయం అందిస్తున్న తీరును గుర్తించారు. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ కమాండ్ సెంటర్‌లోని సీసీ కెమెరాల ద్వారా అన్ని ట్రాఫిక్ జంక్షన్లను పర్యవేక్షిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం మేయర్, కార్పొరేటర్లు యూపీ దర్శన్ పార్క్‌గా పిలవబడే వేస్ట్ టు వండర్ పార్కును సందర్శించారు. లక్నో పర్యటనలో భాగంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసింది. జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి మేయర్ విజయలక్ష్మి వివరించారు. డిప్యూటీ మేయర్ శ్రీలత ఆధ్వర్యంలోని కార్పొరేటర్లు షిల్లాంగ్‌లో, స్వచ్ఛ గ్రామంగా పేరొందిన మాల్లీనాంగ్‌లో పర్యటించారు. ఆసియాలోనే అత్యంత పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందిన మాల్లీనాంగ్‌లో గ్రామస్తులు పరిశుభ్రత కోసం అనుసరిస్తున్న విధానాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

కావూరిహిల్స్ పార్కుస్థలానికి విముక్తి

అక్రమంగా వెలసిన స్పోర్ట్స్ అకాడమీని కూల్చిన హైడ్రా

మాదాపూర్: ఆక్రమణ చెరలో ఉన్న పార్కు స్థలానికి హైడ్రా విముక్తి కల్పించింది. మాదాపూర్‌లోని కావూరిహిల్స్ పార్కుస్థలంలో ప్రైవేటు వ్యక్తులు షటిల్ కోర్టు, జిమ్‌లను ఏర్పాటు చేసి కొంతకాలంగా వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ స్పోర్ట్స్ అకాడమిని కూడా నిర్వహిస్తున్నారు. అకాడమీని తీసేయాలని కావూరి హిల్స్ అసోసియేషన్ కోరినా లెక్కచేయకపోవడంతో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 7 గంటలకు కోర్టు ఆదేశాల మేరకు రెండు జేసీబీల సహాయంతో అధికారులు నిర్మాణాలను పూర్తిగా తొలగించి జీహెచ్ఎంసీ పార్కు అని బోర్డును ఏర్పాటు చేశారు. కాగా, కావూరి హిల్స్ అసోసియేషన్ నుంచి 25 ఏళ్లకుగాను 2,200 గజాల స్థలాన్ని లీజు కు తీసుకుని స్పోర్ట్స్ అకాడమీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లీజు పూర్తి కాకముందే హైడ్రా అధికారులు అన్యాయంగా నిర్మాణాలను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కావూరిహిల్స్‌లోని ఓపెన్ స్పేస్‌లో ఉన్న ఆక్రమణలను హైడ్రా కూల్చివేసి సదరు స్థలాన్ని జీహెచ్ఎంసీకి అప్పగించింది. ఈ ఆక్రమణలకు సంబంధించి కావూరిహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించిందని, కోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి ఆ స్థలంలో ఉన్న మూడు నిర్మాణాలు, షటిల్ కోర్టును కూల్చివేసినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.





మాదాపూర్‌లోని కావూరిహిల్స్ పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అకాడమీని కూల్చివేసిన దృశ్యాలు

టెర్రరిస్టుల షెల్టర్ జోన్!

నగరంలో తలదాచుకుంటున్న ఉగ్రవాదులు



- స్థానికంగా వారికి కలిసి వస్తున్న పలు అంశాలు
- మరోసారి స్పష్టం చేసిన రిజ్వాన్ అలీ వ్యవహారం
- అరెస్టు అయ్యే వరకు గుర్తించలేకపోతున్న వైనం

సాక్షి, సిటీబ్యూరో: నవీద్, ఫైజల్, అన్వర్ అలీ భగ్వాన్, గులాం జాఫర్ షేక్... ఇతర రాష్ట్ర పోలీసులకు వాంటెడ్‌గా ఉండి నగరంలో ఆశ్రయం పొందిన ముష్కరులు వీళ్లు. రోజుల తరబడి సిటీలో ఉంటూ, స్వేచ్ఛగా సంచరించినా, ఇతర రాష్ట్రాల పోలీసులు వచ్చి పట్టుకునే వరకో, వీళ్ల అక్కడికి వెళ్లి చిక్కేదాక స్థానిక, రాష్ట్ర నిఘా వర్గాలు గుర్తించలేకపోయాయి. పుణే ఐసిస్ మాడ్యుల్‌లో కీలకంగా ఉండి, సైదాబాద్‌లో నివసించి, ఢిల్లీ స్పెషల్ పోలీసులకు చిక్కిన రిజ్వాన్ అలీ వ్యవహారం దీనికి తాజా ఉదాహరణ. ఈ పరిణామాలు చోటు చేసుకోవడానికి కారణాలు అనేకం ఉంటున్నాయి.

నగరం 'విభిన్నాల'సమాహారం

హైదరాబాద్ మహానగరం భిన్న మతాలు, సంస్కృతులు, భాషలతోపాటు అనేక రాష్ట్రాలకు చెందిన ప్రజల సమాహారం. ఇక్కడ అందుబాటులో ఉన్న విద్య, వైద్య, ఉద్యోగ, పారిశ్రామిక, ఐటీ రంగాల్లో దక్షిణాది, ఉత్తరాదిలోని అనేక రాష్ట్రాల వారు, విదేశీయులు సైతం ఇక్కడ పనిచేస్తుంటారు. వీరిని ప్రత్యేకంగా చూసే, అనుమానించే పరిస్థితులు నగరంలో చాలా తక్కువ. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరాన్ని ఉగ్రవాదులు షెల్టర్ జోన్‌గా వాడుకోవడంలో సఫలీకృతం అవుతున్నారు.

పరారీకి మార్గాలు ఎన్నో...

సిటీలో ఆశ్రయం పొందిన ముష్కరులు ఏదైనా ఘాతుకానికి పాల్పడినా, తమను ఎవరైనా అనుమానిస్తున్నారని భావించినా తప్పించుకుని పరారు కావడానికి అవకాశాలు ఎక్కువ. ఒక్క జల మార్గం మినహా మిగిలిన అన్ని రకాల రవాణా సౌకర్యాలు, అన్ని వేళల్లోనూ హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయి. వీటికితోడు వివిధ పనుల మీద నిత్యం నగరానికి వచ్చిపోయే ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల వాళ్లు లక్షల్లోనే ఉంటారు. ఈ కారణంగానే ముష్కరులు ఎవరి దృష్టిలోనూ ప్రత్యేకంగా పడకుండా తప్పించుకుని పారిపోవడానికి మార్గాలు సుగమం అవుతాయి. ఏ భాషలో మాట్లాడినా వారిని ప్రత్యేకంగా చూసే అవకాశం సైతం ఇక్కడ లేకపోవడం ముష్కరులకు అనుకూలంగా మారుతున్న మరో అంశం. కేవలం కొన్ని గంటలు, నిమిషాలపాటు ప్రయాణిస్తే రాష్ట్ర., జిల్లా సరిహద్దులు దాటే సౌలభ్యం సిటీలో ఉండటం కూడా టెర్రరిస్టులకు కలిసివస్తోంది.

పక్కాగా లేని టెనెంట్స్ వెరిఫికేషన్

సిటీలో షెల్టర్ తీసుకోవడానికి వస్తున్న ఉగ్రవాదులు ఉద్యోగం ముసుగులో వివిధ కార్యాలయాలు, వృత్తుల్లో స్థిరపడుతున్నారు. అద్దె ఇళ్లను ఆశ్రయిస్తున్నారు. ఏదైనా ఉదంతం జరిగినప్పుడు మాత్రమే టెనెంట్స్ వెరిఫికేషన్ అంటూ హడావుడి చేసే పోలీసులు ఆ తరవాత పట్టించుకోవట్లేదు. ఈ లోపాలు ముష్కరుల ఉనికి బయటపడకుండా చేస్తున్నాయి. నగరంలోని లాడ్జిలు, అద్దె ఇళ్లల్లో దిగే వారితోపాటు ఉద్యోగాలు చేస్తున్న బయటి రాష్ట్రాల వారి వివరాలును పక్కాగా సేకరించడం, వారి పూర్వాపరాలు పరిశీలించడానికి అవసరమైన యంత్రాంగాలు లేకపోవడం లోపాలుగా మారాయి. అయితే ఇలా నగరంలో తలదాచుకున్న ఉగ్రవాదులు ఇక్కడ ఎలాంటి ఆపరేషన్లు చేయకపోవడమే అంతా ఊపిరి పీల్చుకోవాల్సిన అంశం.

> **సిటీలో చిక్కిన ముష్కరులు**
>
> - ముంబై లోకల్ రైళ్లల్లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో నిందితుడు నవీద్
> - బెంగళూరు వరుస పేలుళ్ల కేసులో నిందితులైన అబ్దుల్ సత్తార్, అబ్దుల్ జబ్బార్
> - దేశవ్యాప్తంగా పేలుళ్లకు పాల్పడ్డ ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది మహ్మద్ తల్హా
> - బిహార్ పోలీసులకు పట్టుబడిన అల్‌ఖైదా ఉగ్రవాది మీర్జాఖాన్ అలియాస్ గులాం రసూల్ ఖాన్
> - డాక్టర్ జలీస్ అన్సారీ మాడ్యుల్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది సయ్యద్ ముసద్దిక్ వహీదుద్దీన్ ఖాద్రీ
> - కర్ణాటక పోలీసులకు వాంటెడ్‌గా ఉన్న పాక్ ప్రేరేపిత లష్కరేతొయిబా ఉగ్రవాది అబ్దుల్ రెహ్మాన్
> - గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్ పేలుళ్ల కేసులో వాంటెడ్‌గా ఉన్న డానిష్ రియాజ్, అన్వర్ అలీ భగ్వాన్
> - ఐసిస్‌తో లింకులు ఉన్నాయనే ఆరోపణలపై 2016లో డిపోర్టేషన్‌కు గురైన కెన్యా యువతి అమీనా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ● వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

బంజారాహిల్స్: వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. సోమవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని హాజరు పట్టిక పరిశీలించి పర్మనెంట్, తాత్కాలిక సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఆలస్యంగా రావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బంది విజయలక్ష్మి సూపర్‌వైజర్ స్టాఫ్(పబ్లిక్ హెల్త్ నర్స్), నాగలక్ష్మి, పార్వతి ఏఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రిలో టెస్టుల వివరాలు, బ్లడ్ శాంపుల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఫార్మసీ కేంద్రం సందర్శించి మందులను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగ కార్తీక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 147 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అందులో గృహ నిర్మాణ శాఖకు 91, పింఛన్లు 23, భూ సమస్యలు 8,గ్యాస్ సబ్సిడీ 3 ఇతరములు 22 వచ్చాయన్నారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దష్టి సారించి త్వరగా పరిష్కరించాలని సూచించారు.

గోవా కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ దందా

● నిందితుడి అరెస్ట్
● రూ.8 లక్షల నగదు స్వాధీనం

సుల్తాన్‌బజార్: గోవా కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్స్ నిర్వహిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టు చేశారు. సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎంజేమార్కెట్ రోడ్డులోని వాల్‌స్ట్రీట్ అపార్ట్‌మెంట్‌కు చెందిన వికాస్ జైన్ (41) మెజిస్ట్రేట్ ప్రైడ్ గోవా ఏజెంట్‌గా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. అతను విక్రమ్, సాగర్, మరికొందరితో కలిసి గోవా కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వికాస్ జైన్‌ను అరెస్టు చేసి అతడి వద్ద రూ.8 లక్షల నగదు, మొబైల్‌ఫోన్, బైక్, నగదు కౌంటింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు నిందితుడు వికాస్ జైన్‌ను రిమాండ్‌కు తరలించారు. మరో 19 మంది పంటర్లు, ఆర్గనైజర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ నిర్వహణకు హై లెవల్ కమిటీ

● భాగస్వాములుగా అన్ని విభాగాల అధికారులు
● అనునిత్యం సమావేశాలు, వర్క్‌షాప్‌ల నిర్వహణ
● వచ్చే ఏడాది కోసం సమగ్ర యాక్షన్ ప్లాన్‌కు రూపం
● కీలక సమావేశంలో నిర్ణయించిన ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో: 'గ్రేటర్' వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పించడానికి ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు, జీహెచ్‌ఎంసీ, హైడ్రా విభాగాలు ఏకతాటి పైకి వస్తున్నాయి. దీనికి సంబంధించిన కీలక సమావేశం సోమవారం బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో ఉన్న హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగింది. నగర కొత్వాల్ సీవీ ఆనంద్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ దీనికి నేతృత్వం వహించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్లలో ఏకరూప స్పందన ఉండేలా, సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ కోసం ఉన్నతాధికారులతో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వీళ్లు తరచూ సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ సమకాలీన అవసరాలకు తగ్గట్టు కార్యాచరణలు సిద్ధం చేయనున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ అధికారులతో పాటు జీహెచ్‌ఎంసీ, హైడ్రా సమన్వయంతో పని చేయడం కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయనున్నారు. దీని ఆధారంగా ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడనుంది. హఠాత్తుగా కురిసే భారీ వర్షాలతో పాటు ఇతర విపత్తుల సమయంలో కీలక జంక్షన్ల వద్ద సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా, వారు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ సహా ఇతర విభాగాల అధికారులు వర్షం కురిసిన తర్వాత రోడ్ల పైకి వస్తున్నారు. అయితే అప్పటికే సమస్యాత్మక జంక్షన్లు జామ్ అయిపోవడంతో పాటు పరిస్థితులు చేతులు దాటేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అధికారులు అసలు చేరాల్సిన చోటుకు చేరలేకపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇకపై వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వెలువడిన వెంటనే సమాచార మార్పిడి చేసుకుని క్షేత్రస్థాయిలోకి అధికారులు వెళ్లేలా చర్యలు తీసుకోనున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తూ ట్రాఫిక్ డైవర్షన్లు, సూచక బోర్డులు తదితరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంజినీరింగ్ మార్పులు చేస్తూ వాటర్ లాగింగ్ ఏరియాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. ట్రాఫిక్ సమస్యల అంశంలో హై లెవల్ కమిటీ ఐటీ కంపెనీలను సంప్రదిస్తూ అవసరమైన చర్యలు తీసుకోనుంది. దీంతో పాటు రాజధానిలోని నీటి వనరుల్లో నీటి మట్టాలు, మార్పుచేర్పులను సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటుంది. ఈ సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు అవినాష్ మహంతి, జి.సుధీర్‌బాబు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిలతో పాటు మూడు కమిషనరేట్ల అధికారులు, బల్దియా జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఆయా అధికారులు నగరంలో ట్రాఫిక్, ముంపు, విపత్తు సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రణాళికలు, ఆలోచనలు వివరించారు. వీటిలో తక్షణం అమలయ్యే వీలున్న వాటిపై అధికారులు దృష్టి పెట్టారు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఓ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు.

స్థల వివాదాన్ని సెటిల్ చేస్తామని..

వైద్యురాలికి రూ. 30 లక్షలు టోకరా..

బంజారాహిల్స్: ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, స్థల వివాదాన్ని సెటిల్ చేస్తామని నమ్మించి ఓ వైద్యురాలి నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి ముఖం చాటేసిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్‌లో నివసించే డాక్టర్ జెంటెల వాసంతి తండ్రి హరినారాయణరావు 1980లో పోల్కంపల్లి గ్రామంలో భూములు కొనుగోలు చేశాడు. అప్పటి గ్రామ పట్వారీగా రాఘవరావు వ్యవహరిస్తుండేవారు. 2020లో హరినారాయణరావు మృతి చెందడంతో సదరు భూములను తమ ఆధీనంలోకి తీసుకోవాలని వాసంతి తన తల్లితో కలిసి రాఘవరావును సంప్రదించారు. అదే ఏడాది ఫిబ్రవరిలో రాఘవరావు అతడి మేనేజర్, డ్రైవర్ ముగ్గురూ కలిసి వాసంతి ఇంటికి వచ్చి భూముల వివాదం సెటిల్ చేయాలంటే ఖర్చవుతుందని చెప్పారు. సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్‌తో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఆర్డీఓ, తహసీల్దార్లతో కూడి మాట్లాడి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందుకు రూ.47 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. తమ వద్ద అంత డబ్బు లేదని, రూ.30 లక్షలు ఇస్తామని వాసంతి ఒప్పందం కుదుర్చుకుని ఆ మేరకు రాఘవరావుకు డబ్బులు ఇచ్చింది. అయితే ఏళ్లు గడిచినా భూముల వ్యవహారం సెటిల్ కాలేదు. రాఘవరావుకు ఫోన్ చేయగా తప్పించుకు తిరుగుతున్నాడు. తమను మోసం చేశాడని గుర్తించిన బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాఘవరావు, డోర్నాల రాజు, పూల రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

లైంగికదాడి బాధితురాలికి మంత్రి సీతక్క పరామర్శ



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లైంగిక దాడి బాధితురాలిని మంత్రి సీతక్క సోమవారం రాత్రి పరామర్శించారు. కుమురంభీం ఆసీఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఈనెల 1న ఓ ఆటోడ్రైవర్ ఆదివాసి మహిళపై అత్యాచారానికి యత్నించిన ఘటనలో గాయపడిన బాధితురాలిని మరింత మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించిన సంగతి విదితమే. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి నేతృత్వంలో డిప్యూటీ సూపరింటెండెంట్, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సుబోధ్ కుమార్ బాధితురాలి ముఖానికి పలుమార్లు సర్జరీ చేయగా ఆమె కోలుకుంది. మంత్రి సీతక్క బాధితురాలిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాంధీ ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతోనే తాను ప్రాణాలతో బయటపడ్డానని బాధితురాలు మంత్రికి తెలిపింది. పూర్తిగా కోలుకునేంత వరకు ఇక్కడే ఉంటానని, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లనని స్పష్టం చేసింది. బాధితురాలికి సొంత ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థికసాయం అందించిందిన మంత్రి సీతక్క మెరుగైన వైద్యసేవలు అందించిన గాంధీ వైద్యులను అభినందించారు.

కోటక్ మహేంద్ర బ్యాంక్ చైర్మన్‌పై ఫోర్జరీ కేసు..

బంజారాహిల్స్: కోటక్ మహేంద్ర బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ ప్రకాష్ ఆప్టే, ఎండీ ఉదయ్ కోటక్‌తో పాటు మరో 5 మందిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-70లోని అశ్విని లేఅవుట్, ప్రశాసన్‌నగర్‌లో నివసించే జి.అర్మితారెడ్డి అప్పటి ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ హిమాయత్‌నగర్ బ్యాంక్‌లో హౌసింగ్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సరిగ్గా ఆమెకు హౌసింగ్ లోన్ మంజూరయ్యే సమయానికి ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ కోటక్ మహేంద్ర బ్యాంక్‌లో విలీనమైంది. తనకు రుణం మంజూరైందని సమాచారంఅందడంతో ఆమె కోటక్ మహేంద్రబ్యాంక్ సోమాజీగూడ బ్రాంచ్‌ను ఆశ్రయించగా అక్కడి బ్యాంక్ అధికారులు ఆమె నుంచి ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకున్నారు. ఆ సమయంలో వడ్డీ రేటు ఒక రకంగా చెప్పి ఆ తర్వాత అదనపు వడ్డీ రేట్లను నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు తెలియకుండా వేశారు. ఉద్దేశపూర్వకంగా ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఒప్పందాలను ఉల్లంఘించి తనను మోసం చేశారంటూ బాధితురాలు 2020 జనవరి 7న జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రాగా పోలీసులు ఆమె ఫిర్యాదును స్వీకరించలేదు. దీంతో ఆమె 17వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కోటక్ మహేంద్ర బ్యాంక్ చైర్మన్ ప్రకాష్ ఆప్టే, ఎండీ ఉదయ్ కోటక్, సోమాజీగూడ బ్రాంచ్ మేనేజర్ జే ప్రదీప్‌కుమార్, హిమాయత్‌నగర్ రీజనల్ మేనేజర్ ఎస్.ప్రశాంత్ కుమార్, సోమాజీగూడ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్.రామచంద్రన్, బ్యాంక్ అధికారి సుధీర్, ఉద్యోగి గుత్తా ఈశ్వర్‌లపై కేసు నమోదు చేశారు. తాను ఈ లోన్ కోసం ఎన్నోసార్లు బ్యాంక్ అధికారుల చుట్టూ తిరిగానని, న్యాయం జరగలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దురుద్దేశపూర్వకంగా తనను మోసం చేశారంటూ ఆమె ఆరోపించారు. తన నుంచి ఖాళీ పేపర్లు, బ్లాంక్ చెక్కులు తీసుకున్న అధికారులు ఇప్పటివరకు వాటిని తిరిగి ఇవ్వలేదన్నారు. తన నుంచి బౌన్స్ చార్జెస్ అక్రమంగా వసూలు చేశారన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మగ శిశువు అమ్మకానికి యత్నం

10 మంది సభ్యుల ముఠా అరెస్ట్

చాంద్రాయణగుట్ట: మగ శిశువు(15 రోజులు)ను విక్రయించేందుకు యత్నించిన 10 మంది ముఠా సభ్యులను చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫలక్‌నుమాకు చెందిన మెహదీ అలీ చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించేవాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు గాను అతను శిశువులను అపహరించి సంతానం కలగని దంపతులకు విక్రయించేందు పథకం పన్నాడు. ఇందులో భాగంగా అత్తాపూర్ న్యూ పహాడీకి చెందిన షేక్ ఇస్మాయిల్, సుల్తానా బేగం దంపతులను కలిసిన వారి మగ శిశువును విక్రయిస్తే రూ.2.5 లక్షలు ఇప్పిస్తానని ఒప్పించాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వారు శిశువును విక్రయించేందుకు సిద్ధమయ్యారు. దీంతో శిశువు ఫొటోలను తీసుకున్న మెహదీ అలీ వాటిని దళారులైన సులేమాన్ నగర్‌కు చెందిన ఫాతీమా రెహ్మత్, సయ్యద్ ఇంతియాజ్ పాషా, నజ్మాబేగం, ఫెరోజ్ ఖాన్, సయిదా షేక్, నఫీజ్ బేగం , సయిదా బేగ్‌లకు షేర్ చేసి విక్రయానికి శిశువు సిద్ధంగా ఉందని సమాచారం అందించాడు.దీంతో వారు పిల్లలు అవసరమైన వారిని గుర్తించేందుకు చాంద్రాయణగుట్టలో చర్చలు జరుపుతున్నారు. దీనిపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు, దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్, ఎస్సైలు జి.ఆంజనేయులు, నర్సింహులు, నవీన్ బృందం సోమవారం దాడి చేసి 10 మంది నిందితులను అరెస్ట్ చేశారు. చిన్నారిని రక్షణ కోసం చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు తరలించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ

సిటీ, కోర్టులు : ఫోన్ ట్యాపింగ్ కేసుపై సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావులను పోలీసులు ఎస్కార్ట్ సహాయంతో కోర్టులో హాజరుపర్చారు.బెయిల్‌పై బయటికి వచ్చిన భుజంగరావుకు వైద్యం కొనసాగుతున్నదని ఆయన తరుపు న్యాయవాదులు కోర్టులో రిపోర్ట్ దాఖలు చేశారు. ప్రధాన నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లపై ఎన్‌బీడబ్ల్యు పెండింగ్‌లో ఉన్నందున సీబీఐ దానిని ఇంటర్‌పోల్‌కు పంపిందని ప్రస్తుతం వారి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలుపుతూ స్టేటస్ రిపోర్ట్‌తో పాటు మెమోను దాఖలు చేశారు. మెడికల్ బెయిల్‌పై బయటికి వచ్చిన భుజంగరావు అక్టోబర్ 1న కోర్టులో హాజరుకావాలని నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ముగ్గురికి అక్టోబర్ 1 వరకు కస్టడీని పొడిగిస్తూ తదుపరి విచారణను ఆ రోజుకు వాయిదా వేసింది.

తలతో బస్సును ఢీకొట్టి వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై కూర్చున్న వ్యక్తి అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి రోడ్డుపై వెళుతున్న బస్సును తలతో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి (40) సోమవారం ఉదయం ఎస్డీరోడ్డులోని ప్లాజా జంక్షన్ వద్ద కోరమండల్ భవనం లోపలికి, బయటకు రావడంతోపాటు ఒక్కో సారిగా రోడ్డు మీదకు వచ్చి అటుగా వెళ్లే కార్లను ఆపి చేతితో కొట్టాడు. దీంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు అతడిని వారించి మంచినీళ్లు తాగించి ఫుట్‌పాత్‌పై కూర్చోబెట్టాడు. ఉన్నట్లుండి అతను మరో మారు రోడ్డుపైకి వెళ్లి అటుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును తలతో ఢీకొట్టాడు. దీంతో అతడి తల ఫుట్‌బోర్డు తగలడంతో చెవిలోనుంచి రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థి మృతి



రహమత్‌నగర్: స్కూలు వదిలాక కాసేపు సరదాగా సైకిల్ తొక్కాలని భావించిన ఓ విద్యార్థిని మృత్యువు బస్సు రూపంలో కబళించింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్సీ ఆర్‌హిల్స్ ఓంనగర్ బస్తీకి చెందిన శివచరణ్ (11)స్థానిక సెయింట్ సాల్మాన్‌హై స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం అతను సైకిల్‌పై ఎస్సీఆర్ హిల్స్ రెండు బొమ్మల వద్ద నుంచి వస్తుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు అతడిని ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు శివచరణ్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోండి



సాక్షి, సిటీబ్యూరో: సినీ నటి, పార్లమెంట్ సభ్యురాలు కంగన రనౌత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మహిళ మోర్చా సోమవారం నగర కొత్వాల్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలోని కమిషనరేట్‌లో సీపీని కలిసిన వారు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఇటీవల ఓ సందర్భంలో కంగనను ఉద్దేశించి మాట్లాడిన దానం నాగేందర్ 'భోగం మేళం' అనే పదం వాడారు. దీనిపై మహిళ మోర్చా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు కేవలం మహిళా మణులనే కాకుండా ఓ కులాన్ని కూడా కించపరిచేలా ఉన్నాయని సీపీ దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో సైతం పరుష, అభ్యంతరకర పదజాలం వాడిన చరిత్ర దానం నాగేందర్‌కు ఉందని మహిళ మోర్చా నాయకులు పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

'గాంధీ'లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం

● హాజరైన కమిషనర్, డీఎంఈ, పాలనాయంత్రాంగం
● త్వరలోనే వసతి గృహ నిర్మాణ పనులు ప్రారంభం
● అందుబాటులోకి ఫెర్టిలిటీ సెంటర్..
● రీఏజెంట్స్ కొనుగోలుకు రూ. 10 లక్షల కేటాయింపు
● డీఎంఈ డాక్టర్ వాణి వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న డీఎంఈ వాణి

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు డీఎంఈ డాక్టర్ వాణి తెలిపారు. ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులపై హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, డీఎంఈ వాణి, అకడమిక్ డీఎంఈ శివరామ్‌ప్రసాద్, గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, ప్రిన్సిపాల్ ఇందిర, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబోధ్‌కుమార్, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి ఇతర అధికారులతో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం డీఎంఈ వాణి మీడియాతో మాట్లాడుతూ గాంధీ వైద్య విద్యార్థుల వసతి గృహ నిర్మాణ పనులను మంత్రి దామోదర రాజనర్సింహ త్వరలోనే ప్రారంభిస్తారని తెలిపారు. గాంధీ మాతాశిశు సెంటర్‌లో ఫెర్టిలిటీ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని, రీఏజెంట్స్ (ద్రావకాలు) కొనుగోలుకు రూ. 10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. డైట్ క్యాంటిన్ బకాయి బిల్లులు తమవద్ద పెండింగ్‌లో లేవని, ప్రభుత్వానికి పంపించామన్నారు. గాంధీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతన బకాయిలు త్వరలోనే చెల్లిస్తామన్నారు. వేతన బకాయిలు చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలని గాంధీ సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓ-1లకు ఆదేశించారు. మాతాశిశు మరణాల డేటా లీకేజీపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. కాలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ (సీడీఎస్)లో బడ్జెట్ లేకపోవడంతోనే గైనకాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు డేటాఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ)లను గతంలోనే తొలగించామని, మాతాశిశు మరణాల డేటా లీకేజీకి, డీఈఓల తొలగింపునకు సంబంధ లేదన్నారు. తొలగించిన డీఈఓలను ఇతర విభాగాల్లో ఎడ్జెస్ట్ చేస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపుల్లో పారదర్శకత పాటించేలా చర్యలు చేపట్టాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. అందరి సహాయ సహకారాలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆమె వివరించారు.

వినూత్న ఉత్పత్తుల అభివృద్ధికి కృషి


సీడ్ ఫండింగ్ అందుకున్న విద్యార్థులు

బంజారాహిల్స్: వినూత్న ఉత్పత్తులను మరింతగా అభివృద్ధి చేసేందుకు ఏడు మంది విద్యార్థుల నేతృత్వంలోని స్టార్టప్‌లు సీడ్ ఫండింగ్‌ను అందుకున్నాయని కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రతినిధులు తెలిపారు. అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ (ఏసీఐసీ)–కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ ఇంక్యుబేషన్‌కు మద్దతుగా నిలిచే ఈ ప్రాజెక్టులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి సారించి సామాజిక అవసరాలకు అనుగుణంగా పనిచేయనున్నట్లు వివరించారు. ఈ సీడ్ ఫండింగ్ విద్యార్థులను తమ ప్రాజెక్టుల్లో ఉత్సాహంగా ముందుకు తీసుకువెళ్లేందుకు దోహదం చేయగలదన్నారు. ఈ సందర్భంగా కేఎల్‌హెచ్ డీమ్డ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీ పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులు సృజనాత్మకతకు అద్దంపట్టేలా రూపొందించబడ్డాయన్నారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా ప్రోత్సహించడంతో పాటు సమాజానికి ప్రయోజనం కలిగించే రీతిలో పరిష్కార మార్గాలను అందిస్తాయని అభిప్రాయపడ్డారు.

జీటీఎస్ దేవాలయం హుండీ ఆదాయం రూ.1,79,339


నగదును లెక్కిస్తున్న మహిళా భక్తులు

వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం హుండీ ఆదాయం రూ.1,79,339లు వచ్చింది. సోమవారం జీటీఎస్ టెంపుల్ హుండీని అధికారుల సమక్షంలో మహిళా భక్తులు లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, కార్యనిర్వహణాధికారి జి.సుధాకర్, ఆలయ పూజారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్, ఈ.ఓలు మాట్లాడుతూ భక్తులు సమర్పించిన నగదును దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం ఆలయ అభివృద్ధికి వెచ్చించనున్నామని పేర్కొన్నారు. కాగా గత రెండున్నర రెండున్నర నెలలకు గాను ఈ ఆదాయం వచ్చిందని అన్నారు. త్వరలో జరగనున్న అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను కూడా అత్యంత వైభవంగా జరుపనున్నట్లు పేర్కొన్నారు.

పరిపాలనా వ్యవస్థకు సివిల్ సర్వెంట్లు వెన్నెముక

ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్

బంజారాహిల్స్: పరిపాలనా వ్యవస్థకు ఆలిండియా సర్వీసెస్ (ఏఐఎస్), సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (సీసీఎస్)లు వెన్నెముకలు అని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్ డీజీ, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్ స్పష్టం చేశారు. సివిల్ సర్వెంట్లకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఏఐఎస్, సీసీఎస్ కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహించారు. దీనికి దేశవ్యాప్తంగా 17 రంగాలకు చెందిన సివిల్ సర్వెంట్స్ హాజరయ్యారు. వీరిని ఉద్దేశించి శశాంక్ గోయల్ మాట్లాడుతూ పరిపాలనా వ్యవస్థను పటిష్టపరచడంతో పాటు మిలియన్ల ప్రజల జీవితాల్లో మార్పుకు సివిల్ సర్వెంట్లు కృషి ఎనలేనిదన్నారు. భారతీయ వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర అమోఘమన్నారు. ఏఐఎస్, సీసీఎస్‌లలో శిక్షణ వారికి ఎంతగానో ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు.

శ్రీశైలం జలవిద్యుత్ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి


ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని చూపిస్తున్న బాధితులు

పంజగుట్ట: అధికారంలోకి రాగానే శ్రీశైల జలవిద్యుత్ ప్రాజెక్టు నీటిముంపు నిర్వాసితులను ఆదుకుంటానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని ముంపు బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండన్న, నారాయణ రెడ్డి, గోవిందులు మాట్లాడుతూ శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టులో ముంపునకు గురైన వారిని ఆదుకుంటామని వారికి ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హామీ ఇచ్చారని కాని అప్పటి నుంచి తమను ఎవ్వరూ ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు బాధితులకు ఉమ్మడి రాష్ట్రంలోనే ఆంధ్రా ప్రాంతం వారికి 2800 మందికి ఉద్యోగాలు ఇవ్వగా, తెలంగాణ వారికి 200 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారని తెలంగాణ వస్తే మాకు కూడా ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని నిరాశే మిగిలిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా 493 మంది బాధితులకు, వనపర్తి జిల్లాలో 1105, నాగర్‌కర్నూల్ జిల్లాలో 239 మంది బాధితులకు ఉద్యోగాలు రావల్సి ఉందని ఇప్పటికే లిస్టు తయారు చేసి ఈఎన్‌సీకి, సెక్రటేరియట్ ఇరిగేషన్ శాఖకు ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు నాగర్‌కర్నూల్, పెబ్బేరు బహిరంగ సభల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

త్వరలో సైట్-3 శ్మశానవాటిక కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న బస్తీ నాయకులు

రహమత్‌నగర్ (బోరబండ): త్వరలోనే బోరబండ సైట్–3 శ్మశాన వాటిక జీహెచ్ఎంసీ అధికార కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని బస్తీ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లకు చెందిన హిందు, క్రైస్తవ మతాలకు ప్రతినిధులతో అధికార కమిటీని ఏర్పాటు చేసుకుని శ్మశాన వాటికలను అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలోనే బోరబండ, రహమత్‌నగర్ కార్పొరేటర్లతో మరోమారు సమావేశమై తుది నిర్ణయ తీసుకుంటామన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తమ సహాయ, సహకారాలు అందిస్తామని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య, నాయకులు బాలయ్య, రాగిని యాదగిరిలు, వెంకటేశ్‌లు స్పష్టం చేశారు. బోరబండ డివిజన్ నాయకులు చెన్నయ్య, దాసరి సతీష్, యాదవరెడ్డి, క్రైస్తవ మత పెద్దలు స్వామిదాస్, కృపాసన్నిధి, సత్యానందం, పాస్టర్ మోజస్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు | బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

పంజగుట్ట: స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు వందశాతం బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఈడీ నిరుద్యోగులు భూక్యా కుమార్, పాండు, అశోక్ చౌహాన్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ సెకండ్రీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) పోస్టులు వందశాతం డీఈడీ వారికే కేటాయించినప్పుడు సూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రం ఎస్‌జీటీ వారికి పదోన్నతుల ద్వారా 70 శాతం, బీఈడీ నిరుద్యోగుల ద్వారా కేవలం 30 శాతం భర్తీ చెయ్యడంతో బీఈడీ నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురౌతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం ఉన్న వారికే పదోన్నతులు ఇస్తారు అసలు ఉద్యోగం లేని వారికి అన్యాయం ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వందశాతం బీఈడీ నిరుద్యోగులతోనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌ను బోర్డ్ ఆఫ్ ప్రైయిమరీ ఎడ్యుకేషన్, బోర్డ్ ఆఫ్ సెకండ్రీ ఎడ్యుకేషన్‌గా విభజించాలని డిమాండ్ చేశారు. అప్పుడే బీఈడీ వారికి డీఈడీ వారికి ఇద్దరికీ న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ చౌహాన్, కిరణ్ కుమార్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

భార్య, పిల్లలను చంపుతానంటూ బెదిరింపు

గతంలో మామ గొంతుకోసి జైలుకు వెళ్ళిన నిందితుడు

వెంగళరావునగర్: భార్య, పిల్లలను చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మహిళకు 2014లో అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉండగా ఆ మహిళ భర్త 2021లో మరణించాడు. దీంతో పాలకొల్లుకు చెందిన పి.సుబ్రమణ్యం అనే వ్యక్తితో 2024 మార్చినెలలో ఆమెకు రెండో వివాహమైంది. నాటి నుంచి ప్రతిరోజు మద్యం సేవిస్తున్న సుబ్రమణ్యం ఆమెను కొడుతూ చంపుతానని బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో యాదగిరినగర్‌లో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు ఆమె వెళ్లిపోయింది. మే 24వ తేదీన సదరు మహిళ కోసం వచ్చిన సుబ్రమణ్యం ఆమె తండ్రి రామారావుపై దాడి చేసి గొంతుకోశాడు. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపగా, ఇటీవల తిరిగి వచ్చిన సుబ్రమణ్యం సదరు మహిళను, ఇద్దరు పిల్లలను కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి సర్వేలో | ఖైరతాబాద్ నెంబర్‌వన్..!

- ఇప్పటికే 93 శాతం సర్వే పూర్తి
- సంతృప్తి వ్యక్తం చేసిన ఎన్నికల అధికారులు
- బీఎల్‌ఓలు, సిబ్బందిని అభినందించిన డిప్యూటీ కలెక్టర్


ఓటరు జాబితా ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ప్రసూనాంబ

బంజారాహిల్స్: ఓటరు జాబితా ఇంటింటి సర్వే ముమ్మరంగా జరుగుతుండగా ఈ ప్రక్రియను చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసు డిప్యూటీ కలెక్టర్ ప్రసూనాంబ పరిశీలించారు. సోమవారం పలు ప్రాంతాల్లో బీఎల్‌ఓలు చేస్తున్న డోర్ టు డోర్ సర్వేను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఖైరతాబాద్ బడా గణేష వద్ద బీఎల్‌ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారిణి, సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అంతకముందు ఖైరతాబాద్ నియోజకవర్గం ఈఆర్‌ఓ ప్రశాంతి, నలుగురు ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. ఎంతమంది ఓటర్లు ఉన్నారు, రిజిస్టర్ల నిర్వహణ ఎలా ఉంది, ఫారం 6, 7, 8 ప్రాసెస్ ఎలా ఉంది అని తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇంటింటి సర్వే 93 శాతం పూర్తయ్యిందని తెలుసుకొని సంబంధిత బీఎల్‌ఓలు, అధికారులను ఆమె అభినందించారు. మిగిలిన 7 శాతం మంగళవారం సాయంత్రం వరకు పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో జీహెచ్ఎంసీ పరిధిలో ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందని అధికారులను అభినందించారు. అలాగే బీఎల్‌ఓలతో కలిసి ఇంటింటికి వెళ్లిన ఆమె ఒక బీఎల్‌ఓతో మాట్లాడుతూ మీరు ఇంటింటి వెళ్లినప్పుడు ఆ ఇంట్లో ఉన్న ఓటర్లు చుదువుతున్నారా? లేదా అని అడిగి ఆ పేర్లన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో సరిచేసుకుంటున్నారా? లేదా అని అడిగారు. ఒకవేళ లేకపోతే సరిచూసుకోవాలన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే వారికి అవగాహన కల్పించాలన్నారు.



ఇక్సోరా కాంట్రాక్టును రద్దు చేయాలి

పంజగుట్ట: మల, మూత్ర శాలల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాధితులు సామ్యూల్, సాయి గణేష్, అనీల్, జ్యోతినాథ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీహెచ్ఎంసీ వివిధ సర్కిల్స్‌లో, పర్యాటక ప్రాంతాల్లో, ఎక్కువగా రద్దీ ఉండేచోట మరుగుదొడ్ల ఏర్పాటుకు కాంట్రాక్ట్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు. దీంతో ఇక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ఈ టెండర్‌ను దక్కించుకుందని, జీహెచ్ఎంసీ టాయిలెట్‌లకు జోడించబడిన వాణిజ్య షాపులు ఏర్పాటుకు ఒక్కోదానికి మూడు లక్షల నలభై వేలు కేటాయించి నీరు, విద్యుత్, డ్రైనేజీ సిస్టమ్ అన్ని జీహెచ్ఎంసీనే ఇచ్చిందిని తెలిపారు. సదరు వాణిజ్య షాపులో వ్యాపారం చేసుకునే వారు మరుగుదొడ్ల మెయింటనెన్స్ చేసుకుని వ్యాపారం చేసుకున్నందుకు ఎలాంటి అద్దె చెల్లించకుండా ఒప్పందం చేసుకుందన్నారు. ఇలా ఒక్కో డివిజన్‌లో 13 చొప్పున 150 డివిజన్లల్లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. టాయిలెట్ బాక్సులు ఏర్పాటు చేసిన ఇక్సోరా సంస్థ వారు ఒక్కొ షాపునకు రూ. 10 వేల నుంచి రూ. 40 వేలు అద్దె వసూలు చేస్తున్నారని, అంతే కాకుండా రద్దీ ప్రాంతాల్లో, పర్యాటక ప్రాంతాల్లో వీటిపై యాడ్స్ వేసుకుని వాటి ద్వారా కూడా వసూళ్లు చేస్తున్నారన్నారు. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఈ కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రేపు అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సదస్సు

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమగ్ర కులగణన–సామాజిక న్యాయం అనే అంశంపై అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ కార్యదర్శి రాపోల్ జ్ఞానేశ్వరతో కలిసి ఆయన మాట్లడుతూ ఈ సదస్సుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యతో పాటు వివిధ పార్టీల ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కుల సంఘాలు, మహిళా నాయకురాళ్లు, యువజన, విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు.

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'ప్రజా సంబరాలు'

బంజారాహిల్స్: హైదరాబాద్ సాంస్కృతిక, వారసత్వ సంపదను ప్రమోట్ చేసే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'ప్రజా సంబరాలు' నిర్వహిస్తున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈ సంబరాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. ప్రాంతీయ కళాకారులు, క్రాఫ్ట్స్‌మెన్, నటులు, క్రియేటర్స్ ఈ ఉత్సవంలో పాల్గొని మన వారసత్వ సంపద వైభవాన్ని చాటనున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వివిధ కళాత్మక ఈవెంట్లు, గజల్స్ తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

ఓజివా ప్రొడక్ట్ పేరుతో ఆన్‌లైన్‌లో మోసం

రూ.17,000 పోగొట్టుకున్న యువతి

వెంగళరావునగర్: ఓజివా ప్రొడక్ట్ పేరుతో యువతి వద్ద నుంచి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గీతాంజన సర్కార్ అనే యువతి నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ స్థానిక మధురానగర్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. ఈనెల 14వ తేదీన ఓజివా అనే ప్రొడక్ట్ సంస్థ నుంచి ప్రమోషన్ కాల్ వచ్చింది. ప్రొడక్ట్ అమ్మకం ద్వారా నగదు వస్తాయని తెలిపారు. ముందుగా రూ.5,197 పంపాలన్నారు. ఆమె గూగుల్ పే ద్వారా పంపింది. జీఎస్‌టీ కోసమని మరోసారి రూ.11,999 పంపాలని కోరారు. వాటిని కూడా పంపింది. త్వరలోనే రూ.56,002 పంపుతామని చెప్పారు. అయితే ఆ నగదు మాత్రం రిఫండ్ కాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు తెలియజేసి అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన 'నెట్ నెట్ వెంచర్స్'..!

- భారీగా అక్రమ నిర్మాణాలు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలోనూ స్పష్టం
- కమిషనర్ చర్యలు తీసుకోవాలి – నందగిరిహిల్స్ వాసులు


మాట్లాడుతున్న యుగంధర్, జితేందర్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45 ప్రధాన రహదారిలో నెట్ నెట్ వెంచర్స్ అనుమతులకు విరుద్ధంగా భారీ కట్టడంలో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చి వెంటనే చర్యలు తీసుకోవాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించి నెలలు గడుస్తోన్నా చర్యలు తీసుకోలేదని నందగిరిహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గం ఆరోపించింది. సోమవారం నందగిరి హిల్స్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు యుగంధర్, కార్యదర్శి రాధిక, సభ్యులు ఏపీ జితేందర్‌రెడ్డి, రాఘవాచార్యులు, వెదిరె శ్రీరామ్‌లు మాట్లాడుతూ అనుమతులు ఒక దగ్గర తీసుకుని నిర్మాణాలు నందగిరిహిల్స్‌లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈ అవకతవకలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించినా ఇంతవరకు కమిషనర్ స్పందించ లేదని దుయ్యబట్టారు. ఈ అక్రమ నిర్మాణాలపై త్వరలోనే హైడ్రా కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేయబోతున్నామని వెల్లడించారు. 2012లో అప్పటి ప్రభుత్వం వేసిన పబ్లిక్ వేలం ద్వారా నెట్‌నెట్ వెంచర్స్ యజమాని జి. అమరేందర్‌రెడ్డి ఇక్కడ కేవలం రూ.13 కోట్లకు 4.74 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని దక్కించుకున్నారన్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందన్నారు. స్థానికుల అభ్యంతరాల మేరకు జీహెచ్ఎంసీకి జరిమానాలు చెల్లించి నందగిరిహిల్స్ కొండను పూర్తిగా తొలగించారన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లో ప్లాట్‌నెంబర్ 1355–జీ1ను కొనుగోలు చేసి ఇక్కడి అనుమతులు చూపిస్తూ సదరు నెట్ నెట్ వెంచర్ అక్రమాలకు తెరలేపిందన్నారు. రోడ్డు నెంబర్–45లో అనుమతులను నందగిరిహిల్స్ సొసైటీకి వర్తింపజేయవచ్చా అని ప్రశ్నించారు. విజిలెన్స్ విచారణలో ఈ నిర్మాణం పూర్తిగా అవకతవకలతో ఉన్నట్లు స్పష్టం చేశారని తెలిపారు. అక్రమంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును జీహెచ్ఎంసీ చూసీచూడనట్లు వదిలేస్తుందని ఆరోపించారు. ఎన్‌జీటీకి కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ ఏప్రిల్‌లో నెట్ నెట్ వెంచర్స్‌కు నోటీసులు ఇచ్చిందని, దానిని జీహెచ్ఎంసీ అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ నిర్మాణాలపై కమిషనర్ స్పందించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రిపోర్టును అమలు చేయాలని కోరారు.


నందగిరిహిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

30న చలో హైదరాబాద్

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఈ నెల 30వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్.రాజు తెలిపారు. రాజ్యాంగ ప్రకారం వర్గీకరణ చెల్లదని స్పష్టం చేశారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీగా చేయడం చెల్లదని ఆయా రాష్ట్రా ప్రభుత్వాలు గమనించాలని ఆయన సూచించారు. ఈ నెల 30వ తేదీన చలో హైదరాబాద్‌లో భాగంగా వేలాది మందితో భారీ ప్రదర్శన, సచివాలయం ముట్టడి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం అయినా వర్గీకరణ జోలికి వెళితే తిరుగుబాటు తప్పదని ఘాటుగా ఆయన హెచ్చరించారు. ఈ నెల 30న జరుగుతున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సలహాదారులు వి.కృష్ణ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా శేషగిరిరావు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శేషగిరిరావు

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ సీపీఎం శాఖ అధ్యక్షునిగా శేషగిరిరావు ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బోరబండలో సోమవారం జరిగిన మహాసభలో శేషగిరిరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం పక్షాన ప్రజా పోరాటాలు చేసేందుకు తాను వెనుకాడనని స్పష్టం చేశారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి, సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో నగర నాయకులు అజయ్‌బాబు, సీపీఎం జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, లక్ష్మణ్, గంగులప్ప, ఎండి యాష్, కృష్ణ, ఎండి నయూమ్, పటేల్, శ్రీను. విష్ణుమూర్తి, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడాలి


మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి బీసీల అభ్యున్నతి కోసం పాటుపడాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి విన్నవించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని బీసీలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటు తరాల అంశాలపై రాష్ట్రస్థాయిలో సమీక్ష సమావేశం వెంటనే నిర్వహించాలని సూచించారు. సోమ వారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతస్థాయి సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసి బీసీల స్థితిగతులపై సమీక్షిస్తే వారి ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తిస్థాయిలో తెలుస్తాయని ఆయన విన్నవించా రు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ పూర్తిస్థాయిలో అమలు చేసి బీసీల పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా కులగణన చేసి తీరుతామని రాహుల్‌గాంధీ కూడా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర స్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఆయన విన్నవించారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిట్జీ టాలెంట్ రివార్డ్ పరీక్ష షురూ

సాక్షి, సిటీబ్యూరో: జీ తదితర ప్రముఖ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ అందించే ఫిట్ జీ.. తమ టాలెంట్ రివార్డ్ ఎగ్జామ్(ఎఫ్టీఆర్ఈ)ని నిర్వహించనుంది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. కనీసం 5వ తరగతి నుంచి 11వ తరగతి వరకూ చదువుకునే విద్యార్థులకు అనూహ్యమైన ప్రయోజనాలు అందించే ఈ పరీక్షను ఆన్లైన్/ఆఫ్లైన్ ద్వారా ఈ నెల 27, 28 తేదీల్లో, అలాగే అక్టోబర్ 4, 5 తేదీల్లో జరిగే ఈ అడ్మిషన్ ప్లస్ స్కాలర్షిప్ టెస్ట్కు హాజరై సత్తాచాటడం ద్వారా నగదు రూపంలో ఇచ్చే స్కాలర్షిప్స్ కూడా అందుకోవచ్చని అన్నారు.

డాక్టర్ సతీష్ కత్తులకు అమెరికా ప్రెసిడెంట్స్ లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డు



బంజారాహిల్స్: అమెరికా అధ్యక్ష కార్యాలయం నుంచి ప్రెసిడెంట్స్ లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డును తొలిసారిగా ప్రఖ్యాత కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ కత్తుల అనే తెలుగు వ్యక్తికి దక్కింది. వాషింగ్టన్లో లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డును అమెరికా అధ్యక్షుడు ప్రెసిడెంట్ జో బైడెన్ జూనియర్ పేరుతో సర్టిఫికెట్, ప్రతిష్టాత్మకమైన గోల్డ్మెడల్ను వాషింగ్టన్ సెనెట్ బిల్డింగ్లో ఆదివారం రాత్రి సెనెటర్ జోయ్ మంచిన్ డాక్టర్ సతీష్ కత్తులకు అందించారు. యూఎస్ ఇండియా ఎస్ఎంఈ అధ్యక్షులు ఎలిషా పులివార్తి అమెరికా ప్రెసిడెంట్స్ లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డుకు డాక్టర్ సతీష్ కత్తుల పేరును ప్రతిపాదించారు. అమెరికాను ఆరోగ్యవంతమైన దేశంగా మలిచే బృహత్తర కార్యక్రమంలో ఆయన కేన్సర్ వైద్యనిపుణులుగా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసి బహూకరించారు. ఆయన తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు కాగా 29 ఏళ్లుగా అమెరికాలో సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ప్రెసిడెంట్స్ లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు తనను వరించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు చేయండి

– మంత్రి సీతక్కకు పార్ట్టైం అధ్యాపకుల వినతి



మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయాలని పార్ట్టైం అధ్యాపకులు మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించారు. సచివాలయంలో పార్ట్టైం అధ్యాపకులకు నెలకు రూ.50 వేల వేతనం చొప్పున ఏడాదిలో 12 చెల్లించాలని సోమవారం మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. పీజీ, పీహెచ్డీ, యూసీజీ నెట్, టీజీసెట్ తదితర ఉన్నత అర్హతలతో పాటు రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ఎంపికైన విశ్వవిద్యాలయాల పార్ట్టైం అధ్యాపకులకు ప్రభుత్వ స్కూల్ టీచర్ వేతనం కంటే తక్కువ తరగతిలో బోధన(క్లాస్ టీచింగ్) పీరియడ్స్ ఆధారంగా నెలకు రూ.15 నుంచి రూ.30 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత, పనికి తగ్గ వేతనం నెలకు రూ.50 వేలు చెల్లిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇంత వరకు అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. ఉన్నత విద్యవంతులైన యూనివర్సిటీల పార్ట్టైం అధ్యాపకుల శ్రమ దోపిడీకి గురిచేయవద్దని మంత్రి సీతక్కను వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డా.రవీందర్గౌడ్, డా.ఎర్రం నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ నిధులు విడుదల చేయాలి

- మంత్రి శ్రీధర్బాబు కలిసిన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య నాయకులు



నాగోలు: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్శర్మ, ఇతర నాయకులు ఐటీశాఖ మంత్రి శ్రీధర్బాబును సోమవారం కలిసి బ్రాహ్మణ పరిషత్ నిధుల విడుదలపై వినతిపత్రం సమర్పించారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా విదేశీ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని, బ్రాహ్మణ పరిషత్ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే మంత్రి శ్రీధర్బాబు స్పందిస్తూ ఆలస్యం కాకుండా త్వరలోనే బ్రాహ్మణ పరిషత్కు నిధుల విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. బ్రాహ్మణులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర నాయకులు మోత్కూరు రామేశ్వర్రావు, నమిలికొండ కిరణ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఓయూలో దసరా సెలవుల్లో పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల విద్యా సంస్థలకు 15 రోజుల పాటు సెలవులు ప్రకటించిన విషయం విదితమే. కానీ ఓయూ పరిధిలో 5 నుంచి 15వ తేదీ వరకు సెలవులను ప్రకటించినప్పటికీ పీజీ బ్యాక్లాగ్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 5 నుంచి 15 వరకు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల బ్యాక్లాగ్ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పండగ సెలవుల్లో పరీక్షలు నిర్వహణపై విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు అభ్యంతరం తెలుపుతున్నారు. సెలవుల్లో పరీక్షలపై యువతులు అధికారులపై మండిపడుతున్నారు. బతకమ్మకు సంబురాలు, నవరాత్రులు, దసరా పూజలు, వ్రతాలు తదితర కార్యక్రమాల్లో పరీక్షలు నిర్వహిస్తే చదివేదెలా అని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఓయూ పరిధిలో 300 కోర్సులు, వేల సంఖ్యలో వివిధ కోర్సుల సెమిస్టర్ పరీక్షల వల్ల సిబ్బంది కొరత పండగ సెలవుల్లో కూడా పరీక్షలు నిర్వహించాల్సి వస్తుందని ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు వివరించారు.

గందరగోళంగా పీజీ ప్రవేశాలు..

ఓయూ పర్మనెంట్ వీసీ లేనందున అల్మానక్ (విద్య సంవత్సరం క్యాలెండర్) గందరగోళంగా మారింది. ఈ విద్య సంవత్సరానికి పీజీ ప్రవేశాలు, పరీక్షలు, ఫలితాలు, హాస్టల్ అడ్మిషన్స్ ఆలస్యం కారణంగా విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. టీజీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి సొంత పనులమీద ఈ నెల మొదటి వారంలో అమెరికాకు వెళ్లడం వలన అన్ని వర్సిటీల్లో పీజీ ప్రవేశాలకు అంతరాయం ఏర్పడింది. ఈ విద్య సంవత్సరం ప్రవేశం పొందిన ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల విద్యార్థులకు వచ్చేనెల 1 నుంచి 5 వరకు ఇండక్షన్ క్లాసులు జరగనున్నాయి. దసరా సెలవుల అనంతరం 17 నుంచి పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రారంభం, హాస్టల్ ప్రవేశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే హాస్టల్ వసతి లేకుండా వచ్చే నెల 1 నుంచి 5 వరకు జరిగే ఇండక్షన్ క్లాసులకు ఎలా ఎక్కడ ఉండి హాజరుకావాలని విద్యార్థులు పేర్కొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్లకు హంగులు

- అత్యుత్తమ సదుపాయాలు, నిపుణులైన కోచ్లు
- తొలిదశలో అమీర్పేట, షేక్పేట స్టేడియాల్లో..
- పీపీపీ విధానంలో ముందుకొచ్చే అకాడమీలకు బాధ్యతలు
- ఒలింపిక్స్లో భారత్ విజయాల నేపథ్యంలో..



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటేలా జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ల్లో ఉత్తమ సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి ప్రతిభావంతులైన కోచ్లతో శిక్షణ ఇప్పించాలని అధికారులు భావిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 9 స్పోర్ట్స్ కాంప్లెక్స్లు, 200కు పైగా ప్లేగ్రౌండ్స్ ఉన్నప్పటికీ వాటిల్లో సదుపాయాలు నాసిరకంగా ఉన్నాయి. వృత్తిపరమైన నిర్వహణ సైతం లేదు. వివిధ పోటీలకు వెళ్లేవారికి ఇవి తగిన విధంగా లేవు. దీంతో వివిధ క్రీడల్లో ప్రతిభ చూపాలనుకునేవారు భారీ ఫీజులు వసూలు చేసే ప్రైవేటు అకాడమీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో తక్కువ ఫీజులతో అత్యుత్తమ సదుపాయాలు, ఉత్తమ శిక్షణ ఇచ్చే కేంద్రాలుగా వాటిని తీర్చిదిద్దాలని భావిస్తున్న జీహెచ్ఎంసీ.. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ) ముందుకొచ్చే అర్హతగల సంస్థలకు వాటి బాధ్యతలను అప్పగించాలని భావిస్తోంది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ను అత్యాధునికంగా అభివృద్ధి చేయడమే కాకుండా వాటి నిర్వహణ బాధ్యతలు సైతం సదరు సంస్థలకే అప్పగించేందుకు సిద్ధమైంది.

ప్యారిస్ పతకాల నేపథ్యంలో..

ప్యారిస్లో ఇటీవల జరిగిన ఒలింపిక్స్లో మన దేశానికి పతకాలు రావడంతో అమీర్పేట ఇండోర్ స్టేడియంలో రైఫిల్ షూటింగ్ సదుపాయాలు కల్పించాలనుకున్నా.. అడుగు ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో కేవలం రైఫిల్ షూటింగ్కే కాకుండా వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా తొలుత రెండు స్పోర్ట్స్ కాంప్లెక్స్లను అభివృద్ధి చేయాలని అధికారులు భావించారు. జోన్కు రెండు వంతున అభివృద్ధి చేయాలనుకున్నప్పటికీ, తొలుత ప్రయోగాత్మకంగా అమీర్పేట స్టేడియంతో పాటు షేక్పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్ను అభివృద్ధి చేసేందుకు ఆర్ఎఫ్పీలు రూపొందించేందుకు కన్సల్టెంట్ల కోసం ఆహ్వానం పలికారు. షేక్పేట, అమీర్పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్లు ఐదేళ్లుగా నష్టాల్లో ఉన్నాయి. వాటిని లాభసాటిగా మార్చడంతో పాటు ఔత్సాహికులకు ఉత్తమ శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పనిచేసే ఏజెన్సీలకు/ అకాడమీలకు పనులు అప్పగించేందుకు ఆర్ఎఫ్పీ బిడ్లను ఆహ్వానించనున్నారు. ఓవైపు అంతర్జాతీయ ప్రమాణాలు కల్పించడంతో పాటు మరోవైపు ఎక్కువ మంది వినియోగించుకునేలా సరసమైన ఫీజులు ఉండాలనేది జీహెచ్ఎంసీ లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

ఆదాయం కోసం..

విదేశాల్లోని క్రీడాకారులకు తీసిపోని విధంగా సదుపాయాలు కల్పించడం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ల ద్వారా తగిన ఆదాయం పొందేందుకు క్రీడాంశాలతో పాటు ఆయా సమయాల్లో ఇతర కార్యక్రమాలకు అద్దెలకివ్వడం, కొన్ని వ్యాపారాలకు ఔట్లెట్స్ ఏర్పాటు వంటివి సైతం పరిగణనలోకి తీసుకొని ఆర్ఎఫ్పీ రూపొందించాల్సిందిగా ముందుకొచ్చే కన్సల్టెంట్లకు జీహెచ్ఎంసీ సూచించింది.

కల్పించాల్సిన సదుపాయాలు

ఆర్ఎఫ్పీల మేరకు నిర్వహణకు ముందుకొచ్చే ఏజెన్సీలు ఔట్డోర్ స్పోర్ట్స్ కోసం ఎఫ్ఐఎఫ్ఏ ప్రమాణాల మేరకు ఫుట్బాల్ ఫీల్డ్స్, ఐసీసీ ప్రమాణాల మేరకు క్రికెట్ గ్రౌండ్, ఐటీఎఫ్ ప్రమాణాలకు అనుగుణంగా టెన్నిస్ కోర్టులు, ఎఫ్ఐబీఏ ప్రమాణాలతో బాస్కెట్బాల్ కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇంకా బాక్స్ క్రికెట్ ఎరీనా, శాండ్ వాలీబాల్ కోర్టు, వాలీబాలు కోర్టులు, కబడ్డీ కోర్టులు, క్రోక్వెట్ పిచ్, స్విమ్మింగ్ పూల్, ఔట్డోర్ జిమ్ వంటివి ఏర్పాటు చేయాలి. ఇండోర్ స్పోర్ట్స్లో భాగంగా టేబుల్ టెన్నిస్ లాంజ్, చెస్లాంజ్, బిలియర్డ్స్ లాంజ్, ఎయిర్ హాకీ, లైఫ్ ఫిట్నెస్ జిమ్, ప్రో షాప్, హెల్త్బార్, బాడ్మింటన్ ఏరియా, జుంబా లాంజ్, స్క్వాష్ కోర్టులు, స్పిన్స్టూడియ తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది.



నగరంలో నేడు

- స్పేస్ టూన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో మధ్యాహ్నం 4 గంటలకు కార్టూన్ ఎగ్జిబిషన్ ఉంటుంది.
- తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి సబ్బండ వర్గాల సంబరాలు రవీంద్ర భారతిలో ఉదయం 9 గంటలకు జరుగుతాయి. వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సామాజిక వర్గాల కార్పొరేషన్ చైర్మన్లకు ఆత్మీయ సన్మానం ఉంటుంది.
- నిమ్స్ ఆస్పత్రిలో యూకే వైద్య బృందం నేతృత్వంలో గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు కొనసాగుతాయి.
- బ్లూ క్రాస్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలు, జంతువుల కోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. తమ పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు వ్యాక్సినేషన్ చేయించాలని మేడ్చల్ మున్సిపల్ అధికారులు ప్రజలను కోరారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మా ప్లాట్లలోకి వెళ్లలేకపోతున్నాం..

- అర్ధరాత్రి గుంపులుగా వచ్చి దాడులు చేశారు
- కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తిని శిక్షించాలి
- సోమలింగేశ్వరనగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోయేషన్



కూల్చేసిన నిర్మాణాలను చూపిస్తున్న సోమలింగేశ్వరనగర్ ప్లాట్ల ఓనర్స్ వెల్ఫేర్ అసోయేషన్ నేతలు

మన్సూరాబాద్: పట్టాదారుడి నుంచి స్థలాన్ని కొనుగోలు చేసి తాము నిర్మాణాలు చేసుకున్నామని, ఆ నిర్మాణాలను ధ్వంసం చేసిన భూకబ్జాదారుడిపై చర్యలు చేపట్టాలని సోమలింగేశ్వరనగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.చంచల్రావు, కార్యదర్శి ఎంపీ రావు, కోశాధికారి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్నగర్ పరిధి బొమ్మలగుడి వద్ద సోమలింగేశ్వరనగర్లో ధ్వంసం అయిన నిర్మాణాల వద్ద సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగ్హయత్నగర్ సర్వే నంబర్ 180, 187లో స్థలం పట్టాదారులైన జెల్ల భిక్షమయ్య, జెల్లా అచ్చిలింగం 1983లో లేవుట్ చేశారు. ఈ లేవుట్లో 1983 నుంచి 1986 వరకు 101మంది వేర్వేరు శాఖలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ పట్టాదారుల వద్ద ప్లాట్లను కొనుగోలు చేశాం. 2004లో సురేందర్రెడ్డి అనే భూకబ్జాదారుడు ఈ స్థలాన్ని కొనుగోలు చేసి నట్లు పత్రాలు సృష్టించాడని, కోర్టులో వివాదం నడిచిందని తెలిపారు. 2019లో హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా భూకబ్జాదారుడు బెదిరింపులకు పాల్పడటంతో మా ప్లాట్లలోకి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్ల ఓనర్లంతా కలిసి గతనెల 24న మా ప్లాట్ల వద్ద జేసీబీ సహాయంతో చదును చేయించి ప్రీకాస్ట్ వాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. 25న తమపై కారుతో దాడి చేశాడని, 29న భూకబ్జాదారుడు ప్రధాన రోడ్డువైపు ఉన్న కొన్ని నిర్మాణాలను కూల్చివేశాడని, ఈ ఘటనపై హయత్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. రెండు జేసీబీలు, 100 మందికి పైగా గుండాలతో ఆదివారం అర్ధరాత్రి తమ స్థలాల్లోని అక్రమంగా ప్రవేశించి తమ నిర్మాణాలను ధ్వంసం చేశాడని తెలిపారు. సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూకబ్జాదారుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని, చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు. ఘటనపై మరోమారు హయత్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. అసోసియేషన్ నేతలు శ్రీనివాస్, ఉమాకాంత్, ప్రసాద్, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

ఆ రోజుల్లోనే కూల్చివేస్తున్నారా?

- సెలవు రోజుల్లో కోర్టులు అందుబాటులో ఉండవని..
- కక్షపూరితంగా షెడ్లను కూల్చి.. బుల్డోజర్లు ఎక్కించి..
- వారసత్వ భూముల్లోని నిర్మాణాలు కూలుస్తున్న హైడ్రా
- పేదలకు పరిహారం అందించాలి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు తదితరులు

కూకట్పల్లి: కూకట్పల్లిలోని నల్ల చెరువులో హైడ్రా కూల్చివేసిన ప్రాంతాన్ని సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రా షెడ్లను కూల్చడమే కాకుండా వాటిపై బుల్డోజర్లు ఎక్కించి కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల బతుకుల పట్ల హీనంగా వ్యవహరిస్తోందన్నారు. శని, ఆది వారాల్లో సామాన్య ప్రజలకు కోర్టులు అందుబాటులో ఉండవని, ఆ రోజుల్లోనే కూల్చివేస్తున్నారా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చెరువులను ప్రభుత్వం కాపాడాలంటే, ముందుగా చెరువుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములను లెక్కించాలన్నారు. ప్రైవేట్ భూములు ఉంటే వారికి పరిహారం చెల్లించి చెరువులను కాపాడాలన్నారు. పేదలపై ఇదేవిధంగా వ్యవహరిస్తే వారు తిరగబడే రోజు వస్తుందన్నారు. కూకట్పల్లిలో నల్ల చెరువు ఒకప్పుడు లక్షలాది మందికి మంచినీరు, వేల ఎకరాల పొలాలకు నీటిని అందించిందని తెలిపారు. ఈ చెరువు గతంలో రికార్డుల ప్రకారం 19 ఎకరాలు మాత్రమే ఉండేదని, ఆ తర్వాత సర్వే చేసినప్పుడు 27 ఎకరాలుగా అధికారులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ చెరువులో ప్రభుత్వ భూమి 7 ఎకరాల 36 గుంటలు మాత్రమే ఉందని తెలిపారు. హైడ్రా కూల్చివేసిన భూములు అక్రమంగా ఆక్రమించుకున్న భూములు కావని, వారసత్వంగా ఈ భూములు సంక్రమించాయన్నారు. కూకట్పల్లి అభివృద్ధి చెందాక ప్రస్తుతం ఇక్కడ వ్యవసాయం చేయడం లేదన్నారు. పేదలకు అండగా ఉంటానని ముఖ్యమంత్రి అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకపోగా సామాన్యుల బతుకుల్లో మట్టికొట్టి ఏమి సాధిస్తావని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కూకట్పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రామికుల ఆదాయం పెంచాలి

- మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్

తుక్కుగూడ: భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే వస్తువుల ఉత్పత్తి కాదు.. ఉత్పత్తి చేసే శ్రామికుల ఆదాయం పెంచాలని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో సోమవారం నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రామికుల దగ్గర కొనుగోలు శక్తి లేకపోతే ఉత్పత్తిదారులు తయారు చేసిన వస్తువులను ఎవరు కొనుగోలు చేయాలని ప్రశ్నించారు. ఏఐటీయూసీ ఆవిర్భావం నుంచి కార్మికులు, కర్షకుల హక్కులు, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతోందని తెలిపారు. దేశంలో పోరాటలు చేస్తున్న బడుగుజీవులను ఎవరూ పట్టించుకోవడం లేదని, పెట్టుబడుదారులు వారి స్వలాభం కోసం విధానాలను మార్చుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చిన కార్మిక చట్టాలు దేశ ఆర్థిక విధానానికి పూర్తి వ్యతిరేకమన్నారు. ఈ చట్టాలతో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, నాయకులు దత్తునాయక్, బాలురాజు, యూసుఫ్, పాలమాకుల జంగయ్య, రవీంద్రచారి, నర్సింహ, సీతారామయ్య, రత్నాకర్రావు, దేవేందర్రెడ్డి, రామస్వామి, జైపాల్రెడ్డి, సత్యనారాయణ, చంద్రయాదవ్, శేఖర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ ఎఫిషియెన్స్ వర్క్షాపు

సాక్షి, సిటీబ్యూరో: పారిశ్రామిక రంగంలో ఇంధనం సమర్థత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) సహకారంతో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సోమవారం హైదరాబాద్లో వర్క్షాపు నిర్వహించింది. గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ (జీఈఎఫ్) తన జీఈఎఫ్–6 సైకిల్ కింద ఎఫిషియెన్సీ కోసం క్రియేటింగ్ అండ్ సస్టెయినబుల్ మార్కెట్ ప్రాజెక్టులో భాగంగా వర్క్షాప్ నిర్వహిస్తోంది. వర్క్షాపులో ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ చైర్మన్ రవీచందన్ పురుషోత్తమన్, బీఇఇ డైరెక్టర్ శ్యామ్, ఇఇఎస్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అనిమేష్ మిశ్రా, ఐఐఐసీ సీఈఓ సంజయ్ దుబే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు బ్రోచర్ను ఆవిష్కరించారు.

స్టాన్ఫోర్డ్ టాప్ శాస్త్రవేత్తల జాబితాలో నగర ప్రొఫెసర్లు

- గోకరాజు రంగరాజు సంస్థ ప్రొఫెసర్లను ఎంపిక చేసిన స్టాన్ఫోర్డ్, ఎల్సెవియర్
- అత్యుత్తమ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరుసగా 2వ సారి



డాక్టర్ రామ్సుబ్బయ్య



స్వదేశ్ కుమార్ సింగ్

సాక్షి, సిటీబ్యూరో: స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా విడుదల చేసే 2 శాతం ప్రఖ్యాత శాస్త్రవేత్తల జాబితాలో నగరంలోని గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు స్థానం లభించింది. కెరీర్–లాంగ్ రీసెర్చ్, రీసెర్చ్ ఇన్ 2023 అనే రెండు విభాగాల్లోని ఈ జాబితాలో గోకరాజు రంగరాజు విద్యాసంస్థలోని ప్రొఫెసర్, డీన్(రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్) డాక్టర్ స్వదేశ్ కుమార్ సింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సుబ్బయ్య స్థానం సంపాదించి అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. వారి అసాధారణ పరిశోధనలతో వరుసగా రెండవ సంవత్సరం ఈ జాబితాలో చోటు పదిలం చేసుకోవడం మరో విశేషం. అనులేఖనాల ప్రామాణిక గణాంకాలు, హెచ్–ఇండెక్స్, వివిధ రకాల బైబిలియోమెట్రిక్ సూచికలను పరిగణలోకి తీసుకుని ఈ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాను రూపొందిస్తారు. ఈ సందర్భంగా గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ జుగ్గే మాట్లాడుతూ.. తమ ప్రొఫెసర్లు పరిశోధనా రంగానికి చేసిన విశేష కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని తెలిపారు. గుర్తింపు పరిశోధన, ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడంలో సంస్థ నిబద్ధతను మరోసారి నిరూపించిందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ జంధ్యాల ఎన్ మూర్తి వివరించారు.

భవిష్యత్ తరాల కోసం.. చెరువుల పరిరక్షణ అవసరం

- మరింత సమయం కావాలని కోరడం సరికాదు
- ప్రభుత్వ తీరును తప్పుబట్టిన సీజే ధర్మాసనం
- 'దుర్గం చెరువు' పిటిషన్లపై మరోసారి విచారణ
- పిటిషనర్ల వాదనలు విని ఎఫ్టీఎల్ నిర్ధారించాలి
- అధికారులను ఆదేశించిన ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: ఒకరి కోసం.. ఇద్దరి కోసం కాదు.. భవిష్యత్ తరాల కోసం చెరువుల పరిరక్షణ అవసరం అని హైకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్లోని దుర్గం చెరువు ఎఫ్టీఎల్పై తుది నోటిఫికేషన్ జారీకి మరింత కొంత సమయం కావాలని ప్రభుత్వం కోరడం సరికాదని చెప్పింది. పిటిషనర్ల నుంచి అభ్యంతరాలను నేటి నుంచి వారంలోగా స్వీకరించాలని, వారి వాదనలతో పాటు డాక్యుమెంట్లను పరిశీలించాలని చెరువుల పరిరక్షణ కమిటీ(ఎల్పీసీ)ను ఆదేశించింది. అప్పటి నుంచి ఆరు వారాల్లోగా ఎఫ్టీఎల్పై నోటిఫికేషన్ నిర్ధారించాలని ఎల్పీసీకి తేల్చిచెప్పింది. ఈ ప్రక్రియంతా పూర్తయ్యే వరకు ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని స్పెషల్ జీపీ చెప్పిన వాదనను కోర్టు నమోదు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్లోని తన ప్లాట్లో అధికారులు జోక్యం చేసుకుంటున్నారని, మెమైర్స్(చిత్రపటాలు) ప్రకారం దుర్గం చెరువు పరిధి 65 ఎకరాల 12 గుంటలు కాగా, నీటి పారుదల అధికారులు 160 ఎకరాలని నిర్ధారించడం చట్టవిరుద్ధం అంటూ హైకోర్టులో నగరంలోని శ్రీనగర్కాలనీకి చెందిన ఉర్మిళదేవి పిటిషన్ దాఖలు చేశారు. అధికారుల నిర్ణయం కారణంగా సర్వే నంబర్ 47లోని తమ ప్లాట్ నంబర్ 79 ప్రభావితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పరిధి 65 ఎకరాల 12 గుంటలుగా నిర్ధారించాలని, తమ ప్లాట్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్రావు ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది.

హెచ్ఎండీఏ అనుమతితోనే నిర్మాణాలు..

పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది దేశాయ్ అవినాశ్, న్యాయవాది రాయ్రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'నీటిపారుదల శాఖలోని దుర్గం చెరువు మెమైర్(చిత్ర పటం) ప్రకారం విస్తీర్ణం 65.12 ఎకరాలు మాత్రమే. అయితే 160 ఎకరాలని అధికారులు చెప్పడం హాస్యాస్పదం. బిల్డింగ్ రూల్స్ 2012లో వచ్చాయి. అప్పటికే హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా అనుమతులతో నిర్మాణాలు చేశారు. ఇప్పుడవి అక్రమ నిర్మాణాలని చెప్పి కూల్చివేత చర్యలు తీసుకోవడం చట్టవిరుద్ధం. ఎఫ్టీఎల్ నిర్ధారణకు ఎల్పీసీ 2014, జూన్ 7న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తే పిటిషనర్లు అదే నెల 14న అభ్యంతరాలు చెప్పారు. ఇంకా తుది నోటిఫికేషన్ కూడా వెలువడలేదు' అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది పి.శ్రీధర్రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఇదే హైకోర్టు చెరువుల ఎఫ్టీఎల్లను నిర్ధారణ చేయాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కూల్చివేతలు చేపడుతున్నాం. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్టీఎల్లను 3 నెలల్లో నిర్ధారించాలని ఇదే హైకోర్టు తీర్పునిచ్చింది' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం.. దుర్గం చెరువు ఎఫ్టీఎల్ నిర్ధారణకు సంబంధించి 2014లో జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్పై పిటిషనర్లు గతంలో వ్యక్తం చేసిన అభ్యంతరాలను మరోసారి ఎల్పీసీకి అందజేయాలని ఆదేశించింది. అక్టోబర్ 4న ఎల్పీసీ ముందు పిటిషనర్లు హాజరై అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలంది. ప్రభుత్వ రికార్డులకు చెందిన పత్రాలను కూడా సమర్పించాలంది. పిటిషనర్లు అభ్యంతరాలు తెలియజేసిన నాటి నుంచి ఆరు వారాల్లోగా ఎల్పీసీ ఎఫ్టీఎల్ నోటిఫికేషన్ను నోటిఫై చేయాలని ఆదేశించింది.

జేఎన్టీయూహెచ్లో క్యాంపస్ ప్లేస్మెంట్ జోరు

- ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు
- రూ.24 లక్షల ప్యాకేజీతో ఇద్దరు
- రూ.19 లక్షల ప్యాకేజీతో 9 మంది..
- 20 మంది విద్యార్థులకు 16 సీటీసీ నుంచి 24 సీటీసీ వరకు..

కేపీహెచ్బీకాలనీ: జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల కాలంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్లో పలువురు విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు దక్కించుకున్నారు. పేరొందిన కంపెనీలతో పాటు దేశ విదేశాల్లో సేవలందిస్తున్న కంపెనీలు ఇటీవల కాలంలో జేఎన్టీయూహెచ్లో ప్రాంగణ నియామకాలు చేపట్టాయి. ఇందులో గోల్డ్మాన్ సాచెస్ సంస్థలో బీటెక్ సీఎస్ఈ విభాగం విద్యార్థులు 9 మందికి రూ.19 లక్షల వార్షిక ప్యాకేజీని దక్కించుకున్నారు. వెరిస్క్ కంపెనీలో ఇద్దరు విద్యార్థులు రూ.17 లక్షల ప్యాకేజీ దక్కించుకున్నారు. అయితే వీరికి కంపెనీ ముందుగా శిక్షణ అందించనుంది. శిక్షణ కాలంలో రూ.40 వేల స్టైఫండ్ ఇవ్వనున్నారు. అదేవిధంగా ఆల్స్టోమ్ ఫ్రెంచ్ కంపెనీలో వివిధ విభాగాలకు చెందిన 33 మంది పీజీ విద్యార్థులు రూ.8.5లక్షల వార్షిక ప్యాకేజీని పొందారు. రూ.6 లక్షల ప్యాకేజీలో ఆరుగురు బీటెక్ విద్యార్థులు, వెల్ ఫార్గో సంస్థలో 15 మంది విద్యార్థులు రూ.16 లక్షల వార్షిక ప్యాకేజీని సొంతం చేసుకున్నారు. జేపీ మోర్గాన్ సంస్థలో ఒకరు 19.7 సీటీసీని, హనీవెల్ సంస్థలో 15మంది విద్యార్థులు రూ.9 లక్షల సీటీసీ, ఎడిగ్లోబ్ సంస్థలో 40 మంది రూ.5 నుంచి రూ.8 లక్షల ప్యాకేజీ పొందారు.

రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు..

ఇటీవల కాలంలో కళాశాల ప్రాంగణ నియామకాల కోసం అనేక సాఫ్ట్వేర్ కంపెనీలు, వివిధ సంస్థలు ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తూ జేఎన్టీయూహెచ్ విద్యార్థులను తమ కంపెనీల్లో నియామకం చేసుకుంటున్నట్లు కళాశాల ప్లేస్మెంట్ అధికారి విష్ణువర్ధన్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జరిగే ప్రాంగణ నియామకాల్లో ఇప్పటికే చాలామందికి ఉపాధి అవకాశాలు లభించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంగణ నియామకాలు జరగనున్నట్లు తెలిపారు.



మోటూరి అమూల్య



చల్లా సాయి మహితారెడ్డి



కంటు కుసుమిత



నందిని మహారాజ్

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 24, సెప్టెంబర్, 2024

సిటీలో చెఫ్‌ల కాంపిటీషన్



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ పర్యాటక దినోత్సవ నేపథ్యంలో నగరంలోని సెంట్రల్ గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్, చెఫ్ కాంపిటీషన్స్–2024ను ఘనంగా నిర్వహించారు. నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్, నేషనల్ బడ్డింగ్ చెఫ్ కాంపిటీషన్ విభాగాల్లో దేశవ్యాప్తంగా 21 హాస్పిటాలిటీ, క్యులినరీ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి ప్రముఖ చెఫ్‌లు పాల్గొంటారు. ఈ నెల 25 వరకూ నిపుణులు, చెఫ్‌ల సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఎఫ్ అండ్ బీ బిజినెస్ ప్లాన్ ప్రెజెంటేషన్, కాక్‌టెయిల్ తయారీ, ఇంటర్నేషనల్ సర్‌ప్రైజ్ బాస్కెట్ కాంపిటీషన్, బేకింగ్–డెజర్ట్ తయారీ విభాగాలున్నాయి. ట్రావెల్, టూరిజం పరిశ్రమ భవిష్యత్తు తారలను ఈ వేదిక ఏకతాటిపైకి తీసుకొస్తుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు.

ఆయోధ్య రాముడి ఆయుధాలకు పూజలు

లక్డీకాపూల్: అయోధ్యలోని శ్రీ బాల రాముడి ఆయుధాలకు నగరంలో రామభక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగ్య నగర సీతారామ సేవా ఫౌండేషన్ 14 కిలోల వెండితో ఈ ఆయుధాలను తయారు చేయించింది. వీటికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పుణ్య క్షేత్రాల్లో పూజలు నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఆయుధాలు నగరానికి చేరుకున్నాయి. వీటికి కాప్రాలోని శ్రీ సాయి సుమ ఎన్‌క్లేవ్ కమిటీ అధ్యక్షుడు రమణ, కార్యదర్శి బోరుకాటి భరత్ రాజుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. దీంతో ఆ ప్రాంగణమంతా జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది.



29న నోవోటెల్‌లో కేక్ మిక్సింగ్

శంషాబాద్: రానున్న క్రిస్మస్ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నోవోటెల్ హోటల్‌లో కేక్‌మిక్సింగ్, గ్రేప్స్ స్టాంపింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హోటల్ జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ ఓ ప్రకటనలో వివరించారు. ఈ నెల 29న క్రిస్మస్ ఆనంద క్షణాలను ఆస్వాధించడానికి నోవోటెల్ ఆహ్వానిస్తోందన్నారు.

'విశిష్ట'లో రాజ్‌వాడ ప్రదర్శన

బంజారాహిల్స్: ప్రఖ్యాతిగాంచిన రాజ్‌వాడ నగల ప్రదర్శన జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని విశిష్ట జ్యువెలర్స్‌లో సోమవారం జరిగింది. ఈ ప్రదర్శనను సినీ నటులు స్రవంతి, వర్షిణి సౌందర రాజన్, పలువురు మోడల్స్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీ నటులు, మోడల్స్ రాజ్‌వాడ కలెక్షన్స్‌ను ధరించి హొయలు పోయారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ రాయల్ లుక్‌కు ప్రతిబింబంగా కనిపించే రాజ్‌వాడ బంగారు ఆభరణాలను అక్టోబర్ 4 వరకూ ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.



గరమ్ చాయ్.. బన్ మస్కా..

సిటీలో ఎక్కడ చాయ్ తాగినా రాని కిక్ ఓల్డ్ సిటీలో ముచ్చట్లతో కలిపి పంచుకుంటే వస్తుందంటారు వాండరర్స్ క్లబ్‌కి చెందిన లలిత్ జైన్. నగరంలోని అత్యంత పాత క్లబ్స్‌లో ఒకటైన వాండరర్స్ తరఫున పర్యాటక రంగ ప్రమోషన్స్ కోసం పాత బస్తీలో తరచూ రైడ్స్ నిర్వహిస్తుంటామని చెప్పారాయన. చాయ్‌తో పాటు ఉస్మానియా బిస్కెట్, బన్ మస్కా వంటివి ఓల్డ్‌సిటీకి మాత్రమే ఫేమస్ అయిన పలు హైదరాబాదీ ఫుడ్ ఐటమ్స్‌ను ఎంజాయ్ చేసేందుకు రద్దీ లేని వేళల్లో రైడ్స్ వేస్తుంటారు బైకర్స్. వెజ్, నాన్ వెజ్‌రైడర్స్ అందరూ ఎంజాయ్ చేసేందుకు అవసరమైన ఫుడ్ అక్కడ దొరుకుతుందని, దీంతో ఓల్డ్ సిటీ రైడ్ అంటే రైట్ అంటామని బైకర్ సిద్ధు చెబుతున్నాడు.





పాత బస్తీ.. బైకర్స్ మస్తీ..

హైదరాబాద్ వైబ్స్

బైకర్ క్లబ్స్ నైట్ అవుట్స్‌కు అడ్డాగా ఓల్డ్ సిటీ

- చారిత్రక నేపథ్యంలో చాయ్, బిస్కెట్‌లతో చిట్‌చాట్
- ఇతర ప్రాంతాల బైకర్స్‌కూ అక్కడే ఆతిథ్యం
- ఫుడ్ అండ్ కల్చర్‌పై ప్రచారానికి వీలుగా
- అడ్వెంచర్ ఫీల్ కోసం నైట్ రైడ్స్

చార్మినార్ సమీపంలో జనసంచారం అరకొరగా ఉండే ప్లేస్‌ను వెదకాలంటే.. అది కేవలం అర్ధరాత్రుళ్లు తప్ప అసాధ్యం. అందుకే సిటీ బైకర్స్ తమ చిట్‌చాట్‌కు అదే టైమ్‌ను ఎంచుకుంటున్నారు. పబ్స్, కేఫ్స్‌లో చిల్ అవుట్ అవడం ఎలా ఉన్నా ఓల్డ్ సిటీలో నైట్ అవుట్ మజాయే వేరు అంటున్నారీ బైకర్స్.

- సాక్షి, సిటీబ్యూరో



నగరంలో విభిన్న రకాల పేర్లతో పదుల సంఖ్యలో బైకర్స్ క్లబ్స్ ఉన్నాయి. జాయ్ రైడ్స్ నుంచి లాంగ్‌రైడ్స్‌కు, ప్రత్యేక సందర్భాల్లో సందేశాత్మక రైడ్స్‌కు సైతం పేరొందిన ఈ క్లబ్స్.. తరచూ తమ ఓల్డ్‌సిటీని చుట్టి వస్తుంటారు. 'ఓల్డ్ సిటీలో కూర్చుని ముచ్చట్లు పెట్టుకోవడం అనేది నగరంలోని బైకర్స్‌కు ఒక సంప్రదాయంగా మారుతోంది. దీనికి తొలిసారి నగరంలో ఈ తరహా ట్రెండ్‌కు శ్రీకారం చుట్టిన క్లబ్స్ కారణం'అంటూ చెప్పారు నగరంలోని ఓ బైకర్స్ క్లబ్‌కు చెందిన శ్రీకాంత్.

పాత బస్తీ అనేది ప్రతి హైదరాబాదీకి ఒక ఎమోషన్ అంటారు రాజ్‌దూత్ బైక్ మీద రైడ్స్ చేసే నగరవాసి ఛటర్జీ. సాధారణ సమయాల్లో విపరీతమైన రద్దీ వల్ల ఆ ప్రాంతాన్ని సరిగా ఆస్వాదించలేమని, అదే బాగా పొద్దుపోయాక వెళితే.. బైక్ లైట్స్ వెలుగులో మిలమిల మెరిసే చార్మినార్ పరిసరాల్ని వదిలి రాలేమని అంటున్నారాయన. ఆయన లాగే అనేక మంది నగరానికి చెందిన మధ్య వయస్కులు తమ యుక్త వయసులోని పిల్లల్ని తీసుకుని మరీ రాత్రుళ్లు.. బైక్స్ మీద ఓల్డ్ సిటీ టూర్ వేస్తుండడం సర్వసాధారణం.

ఓల్డ్ ఈజ్ గోల్డ్..

అర్ధరాత్రి ప్రారంభించి తెల్లవారుఝామున బ్రేక్‌ఫాస్ట్‌తో ముగించడం దాకా అక్కడే గడిపే బైకర్స్ కూడా ఉన్నారు.. బిర్యానీ, క్యారామెల్ పుడ్డింగ్, జఫ్రాన్ టీ వంటి వెరైటీలకు పేరొందిన నయాబ్ హోటల్, మసాలా బ్లాక్ టీ, జిందా తిలిస్మాత్ బ్లాక్ టీలు లభించే చౌక్ ఏరియాలోని డికాక్షన్ పాయింట్, నిహారీ, పాయా, షోర్బాలకు

తెల్లవారు ఝాము దాకా..

పేరొందిన చౌహాముల్లా ప్యాలెస్ సమీపంలోని అల్హాముదులైలాహ్ హోటల్, జ్యూస్‌లు, సలాడ్స్ అంటే గుర్తొచ్చే చార్మినార్ దగ్గర్లోని మిలాన్ జ్యూస్ సెంటర్, సిద్ధి అంబర్ బజార్‌లో ఇడ్లీ దోశలతో ఆహ్వానించే ప్రహ్లాద్, అన్నపూర్ణ టిఫిన్స్.. ఇంకేం కావాలి చెప్పండి అంటున్న బైకర్స్‌కు ఆయా హోటల్స్ యజమానులు అంతా చిరపరిచితులే. దీంతో కాస్త ముందుగా చెబితే చాలు వచ్చేవారి సంఖ్యకు తగ్గట్టు ఐటమ్స్ రెడీ చేసేస్తారు.

అతిథి దేవోభవ..

దేశ విదేశాల్లో పర్యటించే బైకర్స్.. కొన్ని నగరాలు, ప్రాంతాలకు తాము వస్తున్న సమాచారాన్ని తరచూ ఇచ్చి పుచ్చుకుంటుంటారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో, ఊర్లలో ఉన్న బైకర్స్ వెంటనే వారికి ఎదురేగి స్వాగతాలు పలకడం, తమ ప్రాంత విశేషాలను గురించి వారికి వివరించడం చేస్తుంటారు. అదే క్రమంలో నగరానికి వచ్చే ఇతర ప్రాంతాల బైకర్స్‌కు తప్పకుండా సందర్శనీయ స్థలం పాత బస్తీయే అవుతుంటుంది. అలా తరచూ వచ్చే బైకర్స్‌ను స్వాగతించి వారు కోరిన విందు విహారాలతో అతిథి మర్యాదలకు స్థానిక బైకర్స్ పాత బస్తీనే ఎంచుకుంటారు.

నురానీ కేఫ్ నుంచి నాసిక్ హైవేకి..



రాత్రి 12 దాటిన తర్వాత పాతబస్తీలోని నురానీ కేఫ్‌లో చాయ్ తాగి కాసేపు ముచ్చట్లు పెట్టుకోవడం రొటీన్. మరింత లాంగ్‌రైడ్ కోసం అక్కడ నుంచి నాసిక్ హైవే పై 100 నుంచి 120 కిమీ, అలాగే అక్కడి నిమ్రా కేఫ్ కూడా తరచూ మా మీటింగ్ పాయింట్ అవుతుంటుంది. రాత్రి పూట బైక్ మీద చార్మినార్‌కు అత్యంత సమీపానికి వెళ్లడం, అక్కడి చాయ్, చాట్ ఆస్వాదించడం బాగుంటుంది. బయట నుంచి వచ్చిన బైకర్స్‌ను తప్పకుండా పాత బస్తీకి తీసుకువెళతాం. – అమర్, హిందూస్థాన్ రాయల్స్ బుల్లెటీర్స్ క్లబ్స్

అడ్వెంచర్ ఫీల్ కోసం..



రైడ్స్ మధురమైన జ్ఞాపకాలను పోగు చేసుకోడానికే. అందులో రాత్రి పూట రైడ్స్ ప్రత్యేకమైనవి. నైట్ రైడ్ అడ్వెంచర్ ఫీల్ వస్తుంది. మా వాండరర్స్ తరచూ ఫుడ్ రైడ్స్ నిర్వహిస్తుంటాం. రాత్రి పూట హైవే మీది దాబాల లాగే పాత బస్తీలో వెరైటీ ఫుడ్ అందించే ప్రాంతాల్లో రైడ్స్ వేస్తుంటాం. నగరం మీదుగా పర్యటించే బైకర్స్ గురించి తెలుసుకుని ఆహ్వానిస్తాం. పాతబస్తీ చరిత్రతో పాటు ఆహారాన్ని రుచిచూపిస్తాం. మళ్లీ మళ్లీ ఓల్డ్‌సిటీకి రావాలని అనిపిస్తుందంటారు. – రాహుల్.వాండరర్స్ క్లబ్



స్క్రాప్ అశోక్ లేల్యాండ్‌లో 'లాలాజలం కిచెన్స్'

ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యాపారంలోకి

ఘట్‌కేసర్ బైపాస్‌లో పది మందికి ఉపాధి కల్పిస్తూ



లారీలో లాలాజలం..

యువ ఇంజనీర్ వినూత్న ఆలోచన

ఘట్‌కేసర్: స్వయం ఉపాధికి కాదేది అనర్హమని ఓ యువ ఇంజనీర్ నిరూపించాడు. ఇంజనీర్ ఉద్యోగం వదిలిపెట్టి పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు కడపకు చెందిన నూనె పవన్‌కుమార్. కోదాడలో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఓ లారీలో ఏర్పాటు చేసిన హోటల్‌ను చూసి ప్రేరణ పొందాడు. అదే లారీతో ప్రస్తుతం ఉపాధి పొందుతున్నాడు. మొదటి నుంచి అతడికి ఫుడ్ బిజినెస్‌పై ఆసక్తి ఉండేది. అనుకున్నదే తడవుగా ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఘట్‌కేసర్‌కు వచ్చాడు. కోదాడలో పది చక్రాల స్క్రాప్ అశోక్ లేల్యాండ్ లారీని విక్రయానికి పెట్టడంతో తాను కొనుగోలు చేశాడు. ఘట్‌కేసర్‌కు తీసుకొచ్చి లారీని కిచెన్‌కు అనుగుణంగా మరింత అందంగా తీర్చిదిద్ది హోటల్‌ను ప్రారంభించాడు.

లారీ పైఅంతస్తులో..

లారీని రెండు అంతస్తుల బిల్డింగ్ తరహాలో అందంగా తీర్చిదిద్దారు. పై అంతస్తులో కస్టమర్లు కూర్చోడానికి వీలుగా మంచి ఫర్నీచర్‌తో, బ్యాంబూ కర్టెన్స్‌తో అలంకరించాడు. కింది అంతస్తులో టీ హబ్, టిఫిన్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, బిర్యానీ పాయింట్‌ను ఏర్పాటు చేశాడు. హోటల్‌లో ఉన్నారో, లారీలో ఉన్నారో తెలియని విధంగా దీనిని రూపొందించారు. దీంతో లారీపైనున్న 'లాలాజలం కిచెన్స్' హోటల్‌కి ఆహార ప్రియులు క్యూకడుతున్నారు.



నూనె పవన్‌కుమార్

ఫుడ్ బిజినెస్‌పై ఆసక్తితో..

కోదాడలో ఉద్యోగం చేసే సమయంలో అక్కడ ఓ స్క్రాప్ ఐచర్ వ్యాన్‌లో హోటల్ నిర్వహించడం చూశాను. అప్పుడే నాకీ ఆలోచన తట్టింది. వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేశాను. హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు వచ్చి స్క్రాప్ లారీలో 'లాలాజలం కిచెన్స్' ప్రారంభించాను. మొదటి నుంచి నాకు ఫుడ్ బిజినెస్ మీద ఆసక్తి ఉండేది. నాతో పాటు ఇతరులకూ ఉపాధి కల్పిస్తున్నాను.

- చిన్నతనంలోనే తల్లిదండ్రులు దూరం
- కష్టనష్టాలకోర్చి బాడీ బిల్డింగ్‌లో నైపుణ్యం
- కొంతకాలం ఆర్మీ సైనికులకు శిక్షణ
- పోటీల్లో పాల్గొనే వారికి చేతనైన ఆర్థిక సాయం
- నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్న జిమ్ ట్రైనర్ షఫీ సమీ

షరీఫ్ ఆద్మీ సమీ!

బాడీ బిల్డింగ్‌లో ఎదగాలనుకునే వారికి ప్రోత్సాహం



చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు.. అమ్మమ్మ, తాతయ్య చేరదీశారు. కొంతకాలానికి వాళ్లు కూడా దూరమయ్యారు. దీంతో కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. పూట తిండి దొరకడం కూడా కష్టమైన రోజులను చూశాడు. చిన్నతనంలోనే అన్ని కష్టాలూ అనుభవించాడు.. కుటుంబంలో రెజ్లింగ్ నేపథ్యం ఉండటంతో బాడీ బిల్డింగ్‌లో రాణించాలని నిర్ణయించుకున్నాడు. అందుకు ఎన్నో కష్టాలు పడ్డాడు. అయితే పేదరికం తన కలలకు ఆటంకం కావొద్దని అనుకున్నాడు. మొక్కవోని దీక్షతో బాడీ బిల్డింగ్‌లో మెళకువలు నేర్చుకున్నాడు. మిస్టర్ తెలంగాణ, మిస్టర్ హైదరాబాద్, మిస్టర్ ఏపీ, మిస్టర్ సౌత్ ఇండియా వంటి బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఆర్మీ అధికారులకు జిమ్ ట్రైనింగ్ కూడా ఇచ్చాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు పడుతూ పోటీలకు వెళ్లలేని వారికి తన వంతు ఆర్థిక సాయం చేస్తూ పలువురి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు.

- సాక్షి, సిటీబ్యూరో

అమ్మమ్మ, తాతయ్య దూరం కావడంతో చెల్లెలి బాధ్యతలు మీద పడ్డాయి. జిమ్‌కు వెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో పూలబొకేలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. రోజుకు రూ. 20 కూలికి పనిచేసేవాడు. ఆ పని అయిపోయిన తర్వాత జిమ్‌కు వెళ్లి రోజూ రెండు, మూడు గంటల పాటు ప్రాక్టీస్ చేసేవాడు. బాడీ బిల్డింగ్‌లో తన డెడికేషన్ చూసిన ఓనర్ ఉచితంగా జిమ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాడు. కొంతకాలానికి ఓ ప్రైవేటు జిమ్‌లో ట్రైనర్‌గా జాబ్ సంపాదించుకున్నాడు.

ఆర్మీ అధికారులకు..

దాదాపు 200 నుంచి 250 మందికి జిమ్ ట్రైనింగ్ ఇచ్చేవాడు. ఆ తర్వాత ఆర్మీలో ట్రైనర్ జాబ్ ఉందని తెలిసి దరఖాస్తు చేసుకుంటే చివరకు మెహిదీపట్నంలోని మహార్ యూనిట్‌లో ఆర్మీ అధికారులకు ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఎంపికయ్యాడు. దాదాపు 14 నెలల పాటు వారికి శిక్షణ అందించాడు. అదే సమయంలో బిష్ణు అధికారి, అభిజిత్ వంటి పలువురు సెలబ్రిటీలకు ఫ్రీలాన్స్ జిమ్ ట్రైనింగ్ ఇచ్చాడు.

ఎంతోమందికి సాయపడుతూ..

ప్రస్తుతం షఫీ సొంతంగా జిమ్‌లు నడుపుతున్నాడు. అయితే జిమ్ పెట్టుకునేందుకు ఉన్న ఇంటితో పాటు బంగారం అమ్మేశాడు. తాను నమ్ముకున్న వృత్తి తనను కాపాడుతుందనే నమ్మకంతో ముందుకు సాగాడు. ఇప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. ఇక, బాడీ బిల్డింగ్‌లో రాణించాలనుకుని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి తాను ఉన్నానంటూ చేయూత అందిస్తున్నాడు షఫీ. తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, తన తరఫున పలువురు యువకులను బాడీ బిల్డింగ్ పోటీలకు పంపిస్తున్నాడు. వారికి కావాల్సిన పరికరాలు, పోషకాహారం అందించడం, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే ఆర్థిక సాయం చేస్తున్నాడు.



నెయ్యిపై నిగ్గు తేల్చండి

▶ మొదటి పేజీ తరువాయి

తిరస్కరించిన నెయ్యిలో అది ఉందా? ఆ నివేదిక వెనుక రాజకీయ పార్టీల దురుద్దేశాలున్నాయా? అనే విషయాలను కోర్టు తేల్చాల్సిన అవసరం ఉందని స్వామి తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు.

ఈ ప్రశ్నలపై కమిటీ దృష్టి సారించాలి...

'21.06.2024న టీటీడీ ఈవో మంచి నాణ్యమైన నెయ్యితో శాంపిల్ లడ్డూలు తయారు చేయాలని దేవస్థానం కార్మికులకు చెప్పారు. 17.7.2024న ల్యాబ్‌కు నెయ్యి నమూనాలు ఇచ్చారు. నెయ్యి నాణ్యతపై ల్యాబ్ ఇచ్చిన నివేదికను చూస్తే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎన్‌డీడీబీ నివేదిక ఆధారంగా తీవ్రమైన రాజకీయ విమర్శలు చేస్తున్నారు. అయితే ఆ నెయ్యిని 100 శాతం వాడలేదని ఈవో 'ద ప్రింట్' ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. తిరస్కరించిన నెయ్యిని అసలు వాడనప్పుడు నివేదిక పేరుతో ఆరోపణలు ఎలా చేస్తారు? టీటీడీ తిరస్కరించిన నెయ్యి.. ఎన్‌డీడీబీ నివేదికలో ఉన్న నెయ్యి ఒకటే అయినప్పుడు ఇక అపవిత్రం ఎక్కడ? నివేదిక విషయంలో రాజకీయ జోక్యం ఏదైనా ఉందా?' అనే అంశాలను స్వామి తన పిటిషన్‌లో ప్రస్తావించారు.

నాణ్యత ఉన్న నెయ్యి ట్యాంకర్లకే అనుమతి...

'ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్‌పీవో) ప్రకారం నెయ్యి వాహన ట్యాంకర్ రాగానే అధికారులు నమూనాలను సేకరించి మౌలిక పరీక్షలు నిర్వహిస్తారు. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నాణ్యతకు అనుగుణంగా ఆ నెయ్యి నమూనాలు ఉన్నట్లు ఆ పరీక్షల్లో తేలితేనే ఆ నెయ్యిని శ్రీవారి లడ్డూతో సహా అన్ని ప్రసాదాల్లో వినియోగించేందుకు వాడతారు. పరీక్షల్లో విఫలమైన నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేస్తారు. ఇందులో ఎలాంటి రాజీ ఉండదు. దశాబ్దాలుగా ఈ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. అందువల్ల కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో ఉపయోగించారన్నది అవాస్తవం. 'ద ప్రింట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టీటీడీ ఈవో ఆ నెయ్యిని 100 శాతం ఉపయోగించలేదని స్పష్టంగా చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా లడ్డూ విషయంలో తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు భక్తులను తీవ్రంగా ప్రభావితం చేశాయి' అని స్వామి నివేదించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రకటనలు...

'కొందరు వ్యక్తులు ఓ చిన్న కాగితంలోని కొంత సమాచారాన్ని పట్టుకుని దాని ఆధారంగా రాజకీయ ప్రకటనలు చేశారు. వాస్తవానికి దేని ఆధారంగా అయితే వారు రాజకీయ ప్రకటనలు చేశారో అది ప్రజా బాహుళ్యంలో లేదు. దీనిపై తీవ్ర రాజకీయ ప్రతిఘటన మొదలైంది. వెంకటేశ్వరస్వామిని కొలిచే కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అతి సున్నితమైన విషయాన్ని ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీకు చేసి దానిపై రాద్ధాంతం మొదలుపెట్టారు. ఆ సమాచారాన్ని బహిర్గతం చేసిన వ్యక్తులు అలా చేయడానికి ముందు దాన్ని టీటీడీ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చి వాస్తవాలను నిర్ధారించుకోవాల్సింది. అయితే అలా చేయకుండా రాజకీయ ప్రయోజనం కోసం ప్రకటనలు చేయడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో మొత్తం వ్యవహారంలో జోక్యం చేసుకోవాలి' అని సుబ్రమణియన్ స్వామి తన పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు.

స్వతంత్ర విచారణ జరిపించండి


- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించండి
- లోతైన విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల లడ్డూ వ్యవహారంలో స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈమేరకు వైవీ సుబ్బారెడ్డి తరుపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. లడ్డూకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ల్యాబ్‌పై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని అందులో కోరారు. ఆ నివేదికలో పేర్కొన్న నెయ్యిని ఎక్కడ నుంచి సేకరించారన్న దానిపై కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అభ్యర్థించారు. లడ్డూపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న నేపథ్యంలో దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ వ్యవహారాన్ని ప్రచారం చేయడం గానీ, ప్రచురించడం గానీ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, టీటీడీ ఈవోలతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్స్, వనస్పతి ఉన్నట్లు ఈ ఏడాది జూలై 23న ఈవో చెప్పారని నివేదించారు. రెండు నెలల తరువాత సీఎం చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం ఈవో చెప్పిన దానికి భిన్నంగా జంతు కొవ్వులు ఉన్నట్లు చెబుతూ భక్త సమాజంలో తీవ్ర ఆందోళన రేకెత్తించారన్నారు. ఈవో, ముఖ్యమంత్రి చెప్పిన మాటలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఏ నివేదికపై ఆధారపడి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలు చేశారో అందులోనే తమ నివేదిక తప్పయ్యే అవకాశం కూడా ఉన్నట్లు స్పష్టంగా పేర్కొన్నారన్నారు.

ఆ నెయ్యి వాడలేదు..

చంద్రబాబును అడ్డంగా బుక్ చేసిన లోకేశ్.. తండ్రి చెప్పిన దానికి భిన్నంగా తనయుడి ట్వీట్

- జూన్ 12 నుంచి 8 ట్యాంకర్ల నెయ్యి సరఫరా
- అందులో నాలుగు ట్యాంకర్లు వెనక్కి
- ఆ రిపోర్టును ట్వీట్‌కు జత చేసిన లోకేశ్


Lokesh Nara
@naralokesh

తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నాడు. జంతువుల కొవ్వు కలిపిన నీ ఏఆర్ డెయిరీ నెయ్యి లారీలు 4 టీటీడీ తిప్పి పంపింది. అదే ఈ రిపోర్టు చెబుతోంది. ఇదే సీఎం, ఈవో చెప్పారు. మీ పాపం పండింది @ysjagan.

లోకేశ్ 4 లారీలు రిజెక్ట్ అయితే అపచారం ఎలా జరిగిందో మీ 'బాబు'కు చెప్పు

Sl.No	Supplier name	Tanker no.	Date of receip	Date of sampl	Passed / Rejected	Lab report ref no.
1	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	AP26TC4779	12.04.2024	12.6.2024	Passed	G/299/2024 dt:13.6.2024
2	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BA9459	20.6.2024	21.6.2024	Passed	G/311/2024 dt:22.6.2024
3	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	AP26TC4779	25.6.2024	25.6.2024	Passed	G/330/2024 dt:27.6.2024
4	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BA9459	4.7.2024	4.7.2024	Passed	G/350/2024 dt:6.7.2024
5	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	AP26TC4779	6.7.2024	6.7.2024	Rejected	Rejected by External Lab
6	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BA9459	6.7.2024	6.7.2024	Rejected	Rejected by External Lab
7	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BB2151	12.7.2024	12.7.2024	Rejected	Rejected by External Lab
8	M/s AR Dairy Food PVT LTD, Dindigul, Tamil Nadu	TN02BB2070	12.7.2024	12.7.2024	Rejected	Rejected by External Lab

జంతువుల కొవ్వు కలిపిన ఏఆర్ డెయిరీ నాలుగు లారీలను తిప్పి పంపినట్లు మంత్రి లోకేశ్ చేసిన ట్వీట్

సాక్షి, అమరావతి: ఆ వెంకటేశ్వరస్వామే తనతో నిజాలు చెప్పించారేమో అని చెబుతున్న సీఎం చంద్రబాబు తన తనయుడు నారా లోకేష్ వ్యాఖ్యలతో అడ్డంగా దొరికిపోయారు!

శ్రీవారి సాక్షిగా తండ్రీ కుమారుడు తమ బండారాన్ని తామే బయటపెట్టుకున్నారు!!

టీటీడీ లడ్డూల తయారీకి వినియోగించిన నెయ్యి విషయంలో చంద్రబాబు చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా లోకేష్ సోమవారం ఎక్స్‌లో ట్వీట్ చేయడంతో టీడీపీ శ్రేణులు కంగుతిన్నాయి. జంతువుల కొవ్వు కలిపిన ఏఆర్ డెయిరీ నెయ్యిని లడ్డూల తయారీకి ఉపయోగించారని, వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు పదేపదే అబద్ధాలు చెప్పి నమ్మించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. కానీ లోకేష్ మాత్రం తాజాగా ట్వీట్‌లో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి లారీలు నాలుగింటినీ టీటీడీ తిప్పి పంపించేసిందని వెల్లడించి సీఎం స్థానంలో కూర్చున్న తన తండ్రి పచ్చి అబద్ధాల కోరని నిరూపించారు. నాలుగు నెయ్యి లారీలను తిప్పి పంపిన టీటీడీ రిపోర్టును తన ట్వీట్‌కు జత చేశారు. అందులో ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన 8 నెయ్యి ట్యాంకర్లలో నాలుగు టెస్టుల్లో పాసవగా, నాలుగు ట్యాంకర్లలో నెయ్యి ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు స్పష్టంగా పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పేది నిజమా? లేక లోకేష్ చెప్పేది నిజమా? అబద్ధాలు చెప్పడంలో ఇద్దరి మధ్యా సమన్వయం లేదా? కుమారుడికి అబద్ధాల ట్రెయినింగ్ సరిగా ఇవ్వలేదా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది.

జూన్ 12న తొలి ట్యాంకర్ టీటీడీకి

జూన్ 12వ తేదీన ఏఆర్ డెయిరీ నుంచి తొలి ట్యాంకర్ టీటీడీకి చేరింది. అదే నెల 21, 25న రెండు, జూలై 4వ తేదీన మరో ట్యాంకర్ వచ్చాయి. మొత్తం నాలుగు నెయ్యి ట్యాంకర్లు టీటీడీ నిర్వహించిన పరీక్షల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఉన్నాయని తేలింది. అందుకే వాటిని స్వీకరించారు. ఆ తర్వాత జూలై 6వ తేదీన వచ్చిన రెండు ట్యాంకర్లు, 12న వచ్చిన మరో రెండు ట్యాంకర్లు ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో టీటీడీ వాటిని తిరస్కరించింది. లోకేష్ జత చేసిన రిపోర్టులో ఈ విషయం స్పష్టంగా ఉంది. లేబొరేటరీ పరీక్షల్లో ఈ నాలుగు ట్యాంకర్లను తిరస్కరించారంటే అందులోని నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగించలేదని విస్పష్టంగా తెలుస్తోంది. కానీ చంద్రబాబు ఆ నెయ్యిని వాడేసినట్లు, వాటితో తయారైన లడ్డూలను భక్తులను తినేసినట్లు చెబుతూ జనాన్ని తప్పుదోవ పట్టించారు.

మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి ఇష్టం వచ్చినట్లు అడ్డగోలు భాషలో అడ్డంగా మాట్లాడే క్రమంలో లోకేష్ మరోసారి తాను పప్పునని బయట పెట్టుకున్నారు. వైఎస్ జగన్‌ను ఉద్దేశించి కొవ్వు ఎక్కువైందంటూ అధికారం అండతో అభ్యంతరకరమైన పదజాలాన్ని ఉపయోగించిన లోకేష్ అదే ట్వీట్ ద్వారా తమ బాగోతాన్ని బహిర్గతం చేశారని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

తిరుమల పవిత్రత దెబ్బతీయకండి..

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ లబ్ధికోసం తిరుమల ప్రతిష్టను, పవిత్రతను దెబ్బతియ్యొద్దని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూపై ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఎంతో బాధించాయన్నారు. శ్రీవారి ప్రసాదంలో కల్తీ చేయాలని టెర్రరిస్టులు కూడా ఆలోచన చేయరన్నారు. ఇక్కడి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పుత్తా ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. కేవలం రాజకీయం కోసమే చంద్రబాబు విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారం మంచిది కాదని హితవు పలికారు. మహానేత రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనూ ఇదే తరహాలో నిందలు వేశారని శ్రీకాంత్‌రెడ్డి గుర్తుచేశారు. తిరుమలలో కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని ఒక వ్యక్తి పిటిషన్ వేసిన సమయంలో కోర్టుకు సమాధానం ఇవ్వడంలో భాగంగా 27 చదరపు కిలోమీటర్ల వరకు హోలీసిటీ ఉండాలని, రాజకీయాలు ఉండొద్దన్న ఉద్దేశంతో వైఎస్ జీఓ ఇస్తే దానికి వక్రభాష్య చెబుతూ రెండుకొండలు చేశారంటూ నానాయాగీ చేశారన్నారు.

కాంగ్రెస్ నేతలు నన్ను అభినందిస్తున్నారు

- అమృత్ కుంభకోణం బయట పెట్టినందుకు మెసేజ్‌లు వస్తున్నాయి
- 'అమృత్'అంశంలో రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కు బయటపడింది
- సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- 'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అమృత్ టెండర్లలో రేవంత్‌రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతల నుంచి తనకు అభినందన సందేశాలు వచ్చినట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి అక్రమాలపై బీజేపీ నేతల మౌనం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వెళ్లిన పార్టీ అధ్య యన బృందం సభ్యులను పోలీసులు అరెస్టు చేయ డాన్ని కేటీఆర్ ఖండించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసంక్షేమం కోసమే స్వయంగా డాక్ట ర్లతో కూడిన తమ పార్టీ ప్రతినిధి బృందం ఆస్పత్రు లను సందర్శిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎన్ని పిరికిపంద చర్యలకు పాల్పడినా, ప్రజారోగ్య వ్యవస్థ లోపా లను ఎత్తిచూపుతామని ప్రకటించారు. ప్రభుత్వం నిజాలు దాచని పక్షంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తునకు సహకరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పట్టణ పేదలకు ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 400కు పైగా బస్తీ దవాఖానాలను నడపడం రేవంత్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. ఓ వైపు విష జ్వరాలతో నగరవాసులు నరక యాతన పడుతుంటే, అసమర్థ పాలనలో ఆదుకోవాల్సిన బస్తీ దవాఖానాలకే సుస్తీ చేసిందన్నారు.

కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం చేసే ప్రయత్నం చేశారని, సంఘటన వివరాలు, సునీతాలక్ష్మారెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో సునీతాలక్ష్మారెడ్డి లాంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేమనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్ని అరాచకాలకు పాల్పడినా, 60 లక్షల మంది కేడర్ కలిగిన బీఆర్ఎస్ కుటుంబం ప్రతీ ఒక్కరికి అండగా ఉంటుందన్నారు.

పుట్టెడు అబద్ధాలు

స్వార్థ రాజకీయాల కోసం లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సీఎం చంద్రబాబు

- జూన్ 14నే మహాకుతంత్రానికి బీజం వేసిన వైనం
- కల్తీ నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేశామని.. లడ్డూల తయారీలో వాడలేదని తేల్చిన ఈవో
- తన ఘోర అపరాధం బయటపడితే పుట్టగతులుండవనే భయంతో లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వాడారంటూ చంద్రబాబు నిందలు

నందిని నెయ్యి వద్దన్నది బాబే

- దశాబ్దం పాటు టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన నందిని డెయిరీ
- 2015లో నందిని డెయిరీని పక్కన పెట్టేసింది చంద్రబాబు ప్రభుత్వమే
- నాడు మహారాష్ట్ర గోవింద్ డెయిరీకి టెండరు ఖరారు చేసిన బాబు సర్కారు
- వైఎస్సార్‌సీపీ హయాంలో అసలు టెండరే వేయని నందిని డెయిరీ
- దాన్ని కప్పిపుచ్చి.. నందినికి కాంట్రాక్టు ఎందుకు ఇవ్వలేదంటూ చంద్రబాబు రాద్ధాంతం


నేను తప్పు చేసి ఉంటే..

- నేను, నా కుటుంబం నాశనమైపోతాం
- తిరుమలలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రమాణం
- పుష్కరిణిలో స్నానం.. తడి బట్టలతో అఖిలాండం వద్ద కర్పూరం వెలిగించి ప్రమాణం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చంద్రబాబు అబద్ధాల కోరు

- ఆయన అసత్యాలకూ ఓ చరిత్ర ఉంది
- శ్రీవారి భక్తులెవరూ ఆయన మాటలు నమ్మొద్దు
- కేంద్ర మాజీమంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరని, ఆయన అసత్యాలకూ ఓ చరిత్ర ఉందని ప్రముఖ న్యాయవాది, మాజీ రాజ్యసభ సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి సుబ్రమణియన్ స్వామి తీవ్రస్థాయిలో ఆరోపించారు. తిరుమల శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ సీఎం హోదాలోని వ్యక్తి ప్రచారం చేయడాన్ని ఖండించారు. చంద్రబాబు దుష్ప్రచారాన్ని శ్రీవారి భక్తులెవరూ నమ్మొద్దన్నారు. స్వార్థ రాజకీయాల కోసం శ్రీవారిని ఉపయోగించుకోవడం మహా పాపమంటూ చంద్రబాబుకు హితవు పలికారు. తిరుమల లడ్డూ వివాదంపై దర్యాప్తు జరపాలని కోరుతూ సుబ్రమణియన్ స్వామి సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్‌తో కాకుండా సుప్రీంకోర్టుతో విచారణ జరిపించాలని తాను 'సుప్రీం'ను ఆశ్రయించినట్లు సుబ్రమణియన్ స్వామి మీడియాకు చెప్పారు. 'చంద్రబాబును నేను ఎన్నో ఏళ్లుగా గమనిస్తున్నా. ఆయన చేసే పనులకు, చెప్పే మాటలకు పొంతన ఉండదు. గతంలో ఏసుక్రీస్తు ఫొటోలున్నాయని.. కొండపై ఏదో అన్యమత ప్రచారం జరుగుతోందంటూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌ను టార్గెట్ చేసి ఇలాగే దుష్ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దీనిపై హైకోర్టుకు ఆధారాలను చూపించలేకపోయారు' అని అన్నారు. చంద్రబాబే ఆరోపణలు చేసి ఆయనే తన సిట్‌తో విచారణ జరిపించడం అనేది సరైంది కాదని, చంద్రబాబు చీప్‌ట్రిక్స్ అన్నీ బయటకు రావాలంటే ఆయన సిట్‌తో కాకుండా సుప్రీంకోర్టుతో విచారణ జరిపించాలని పేర్కొన్నారు.

స్పీకర్‌కు హైకోర్టు నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

పెండింగ్‌లో ఉండటంతో రిజిస్ట్రీ అభ్యంతరం తెలుపుతూ పిల్‌కు నంబర్ కేటాయించలేదు. కానీ గత విచారణ సందర్భంగా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కాపీని అందజేయడంతో నంబర్ కేటాయించాలని సీజే ధర్మాసనం రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ఈ పిల్‌పై సోమవారం విచారణ చేపట్టింది.

సింగిల్ జడ్జి ఏమన్నారు..

సింగిల్ జడ్జి వద్ద దాఖలైన పిటిషన్లలో ఈ నెల 9న తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేల ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్ల స్టేటస్ చెప్పేందుకు నాలుగు వారాల గడువిస్తున్నామని.. ఆలోగా వివరాలు అందజేయకుంటే తామే ఆదేశా లు జారీచేయాల్సి వస్తుందని స్పీకర్ కార్యదర్శికి జడ్జి తేల్చిచెప్పారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను స్పీకర్ ముందుంచాలని, విచారణ షెడ్యూల్ రూపొందించాలని స్పష్టం చేశారు. దీని వివరాలను రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు అందజేయాలని చెబు తూ కీలక తీర్పు వెలువరించారు. ఈ తీర్పు వెలువడి ఇప్పటికి రెండు వారాల సమయం గడిచింది.

తెలంగాణలో గూండారాజ్!

సీఎం రేవంత్ వ్యాఖ్యల వల్లే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు: హరీశ్‌రావు

- రాష్ట్రానికి ఉన్న మంచిపేరును మంటగలుపుతున్నారని మండిపాటు
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణుల దాడి దారుణమని వ్యాఖ్య


మాట్లాడుతున్న హరీశ్‌రావు. సునీతా లక్ష్మారెడ్డి


గొడవ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు

శివ్వంపేట (నర్సాపూర్): తెలంగాణలో ప్రజాపాలన కాకుండా గూండారాజ్ నడుస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగ్రామం గోమారంలోని ఆమె ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం దారుణమని మండిపడ్డారు. ఆదివారం అర్ధరాత్రి గోమారంలోని సునీతారెడ్డి నివాసం వద్ద బాణసంచా కాలుస్తూ, ఇటుకలు విసురుతూ కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడటం, ఆ సమయంలో బీఆర్ఎస్ నేతలకు, కాంగ్రెస్ నేతలకు మధ్య గొడవ జరగడం నేపథ్యంలో.. హరీశ్‌రావు సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. సునీతారెడ్డి నివాసాన్ని పరిశీలించి, స్థానిక నేతల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

రేవంత్ రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే..

సీఎం రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేటలోని తన కార్యాలయంపై, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, ఇప్పుడు ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులతో దాడులు చేయించారని మండిపడ్డారు. గోమారంలో బీఆర్ఎస్ వారిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేస్తున్న విషయం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇలాంటి దాడులతో తెలంగాణకు ఉన్న మంచి పేరును చెడగొడుతున్నారని మండిపడ్డారు.

బాణసంచా పేల్చి.. ఇటుకలు విసిరి!

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగ్రామమైన శివ్వంపేట మండలం గోమారంలో ఆదివారం రాత్రి వినాయక శోభాయాత్ర నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో ఈ యాత్ర ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటి వద్దకు చేరుకుంది. ఈ సమయంలో కొందరు బాణసంచా కాల్చుతూ ఆమె ఇంటిపైకి విసిరారు. కొందరు ఇటుకలు విసిరారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంట్లో లేరు. అక్కడ కాపలాగా నిద్రిస్తున్న పలువురు యువకులు బాణసంచా, ఇటుకలు విసురుతున్నవారిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు వెంటనే సునీతారెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాటతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

పథకం ప్రకారమే దాడి: సునీతారెడ్డి

కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే ఆదివారం అర్ధరాత్రి తన ఇంటిపై దాడి జరిగిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. తన ఇంటి వద్దకు వినాయక శోభాయాత్ర రాగానే.. పథకం ప్రకారం ఇంటిపైకి బాణసంచా విసురుతూ, రాళ్లతో దాడి చేశారని చెప్పారు. ఇంట్లో పడుకున్న వారిని కొట్టారని.. అడ్డువచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేశారని పేర్కొన్నారు. దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుబంధు దరఖాస్తులు తీసుకోండి

'ఫార్మా సిటీ'పై అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ భూములకు సంబంధించి పిటిషన్లు దాఖలు చేసిన రైతుల నుంచి రైతుబంధు దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. వారంలోగా ఈ దరఖాస్తులను స్వీకరించాలని స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. ప్రతిపాదిత ఫార్మా సిటీలో భూములున్న రైతులు, భూ యజమానులకు రెవెన్యూ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని కుర్మిద్దకు చెందిన పి.నరసింహతోపాటు మరో 37 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇలాగే మరికొందరు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. మేడిపల్లి, కుర్మిద గ్రామాలకు చెందిన పిటిషనర్లు భూసేకరణ ప్రక్రియను సవాల్ చేసి విజయం సాధించామన్నారు. నానక్ నగర్‌కు చెందిన పిటిషనర్లు దాఖలు చేసిన కేసు లకు సంబంధించి కోర్టు స్వాధీన ప్రక్రియపై స్టే విధించిందని.. అయినా అధికారులు తమ భూ ములను నిషిద్ధ జాబితాలోనే కొనసాగించడంతో రైతుబంధు పథకం, పంట రుణాలు, భూముల లావాదేవీలు వంటి ప్రయోజనాలు లేకుండా పోయాయని పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిష నర్ తరఫు న్యాయవాది రవికుమార్ వాదనలు వినిపిస్తూ.. ఫార్మా సిటీకోసం వారి భూములను సేకరించేందుకు జారీచేసిన నోటిఫికేషన్‌ను పరి హారం ప్రకటించినప్పటి నుంచి రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రైతుల భూమి వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడా నికి అధికారులు అనుమతించడం లేదని, వ్యవసాయ భూములకు పూర్తి యాజమాన్య హక్కులను పొందకుండా నిరోధిస్తున్నారని చె ప్పారు. ఫార్మాసిటీని ఏర్పాటు చేయ బోమని సీఎం రేవంత్ పత్రికా ప్రకటన లు చేయడంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పేర్కొందని వెల్లడించారు.

ఫార్మా సిటీపై అప్పీల్ పెండింగ్‌లో ఉంది..

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ''హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ'ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేసినట్టు వస్తున్న వార్తలు నిరాధారమైనవన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు 2016, జూన్ 10న ప్రభుత్వం జారీ చేసిన జీవో 31కి కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంది. రైతులతో చర్చలు జరిపి న్యాయమైన, సహేతుకమైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటుంది. పరిహారంతోపాటు రైతుబంధు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. సింగిల్ జడ్జి భూసేకరణ పరిహార ఉత్తర్వులను గత ఆగస్టులో రద్దు చేశారు. దీనిపై ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్ పెండింగ్‌లో ఉంది'అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ల నుంచి రైతుబంధుకు దరఖాస్తులు స్వీకరించాలని ఆర్డీవోను ఆదేశించారు. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేశారు.

● న్యూస్‌మేకర్

'నాకు కుట్లు అల్లికలు, వంట, పాటలు, భజన వచ్చు. అమ్మ నేర్పింది' అని కొత్త పెళ్లికూతురు అంటే 'అత్తగారింటికి సొంతగా వెళ్లడం నేర్పలేదా?' అని అడుగుతుంది ఒక పెద్దావిడ. అత్తగారి ఊరు ఏదో దానికి ఎలా వెళ్లాలో తెలియని స్థితి నుంచి తామేమిటో తమకు ఏం కావాలో తెలుసుకునే చైతన్యం వరకూ సాగే ఇద్దరు పల్లెటూరి నవ వధువుల కథ 'లాపతా లేడీస్' ఆస్కార్- 2025కు మన దేశం నుంచి అఫిషియల్ ఎంట్రీగా వెళ్లనుంది.
"సినిమాలు చాలానే ఉన్నాయి. కాని భారతీయతను ప్రతిబింబించే సినిమాగా 'లాపతా లేడీస్' ఏకగ్రీవంగా ఎంపికైంది" అని కమిటీ తెలిపింది.
మహిళా డైరెక్టర్ కిరణ్ రావు తీసిన మహిళా గాథ ఇది.


కిరణ్ రావు

ఆస్కార్ అడ్రస్‌కు లాపతా లేడీస్

'పితృస్వామ్యానికి వ్యతిరేక పదం మాతృస్వామ్యం అని చాలామంది అనుకుంటారు. కాని పితృస్వామ్యానికి వ్యతిరేక పదం సమానత్వం. మనకు ఒకరు ఆధిపత్యం వహించే పితృస్వామ్యం వద్దు.. మాతృస్వామ్యం వద్దు... అందరూ సమానంగా జీవించే వ్యవస్థ కావాల్సింది' అంటుంది కిరణ్ రావు.

ఆమె దర్శకత్వంలో మార్చి 2024లో విడుదలైన 'లాపతా లేడీస్' ఆస్కార్ కోసం 'బెస్ట్ ఫారిన్ ఫిల్మ్' కేటగిరీలో 2025 సంవత్సరానికిగాను మన దేశం నుంచి అఫిషియల్ ఎంట్రీగా వెళ్లనుంది. 'పతా' అంటే అడ్రస్. లాపతా అంటే అడ్రస్ లేకపోవడం. లేకుండా పోవడం. సరిగా చెప్పాలంటే మన దేశంలో పెళ్లయ్యాక ఆడపిల్ల అత్తగారింటికి వెళ్లి తన గుర్తింపును తాను కోల్పోవడం. గుర్తింపు నుంచి తప్పిపోవడం... ఆకాంక్షలను చంపుకోవడం... ఇదీ కథ. ఆస్కార్ కమిటీకి ఈ సినిమా నచ్చి నామినేషన్ పొందితే ఒక ఘనత. ఇక ఆస్కార్ సాధిస్తే మరో ఘనత. 'లాపతా లేడీస్' నిర్మాత ఆమిర్ ఖాన్ గతంలో నిర్మించి నటించిన 'లగాన్'కు కొద్దిలో ఆస్కార్ తప్పింది. ఈసారి ఆస్కార్ గెలవడానికి గట్టి అవకాశాలున్నాయని సినిమా విమర్శకులు భావిస్తున్నారు.

ముందడుగును అడ్డుకునే కపట నాటకం

'లాపతా లేడీస్'లో ఇద్దరు వధువులు అత్తగారింటికి వెళుతూ తప్పిపోతారు. ఒక వధువు మరో పెళ్లికొడుకుతో తనకు సంబంధం లేని అత్తగారింటికి చేరితే ఇంకో వధువు పొరపాటున వేరే స్టేషన్‌లో చిక్కుకుపోతుంది. రైల్వేస్టేషన్‌లో ఉన్న వధువుకు తన అత్తగారి ఊరు పేరేమిటో తెలియదు. ఎలా వెళ్లాలో తెలియదు. సొంత ఊరి పేరు చెబుతుంది కానీ భర్త లేకుండా తిరిగి పుట్టింటికి చేరడం తల వంపులని వెళ్లడానికి ఇష్టపడదు. 'మంచి కుటుంబాల నుంచి వచ్చిన ఆడపిల్లలు అలా చేయరు' అంటుంది స్టేషన్‌లో క్యాంటీన్ నడుపుతున్న అవ్వతో. అప్పుడా అవ్వ 'మన దేశంలో ఇదే పెద్ద కపట నాటకం. మంచి కుటుంబాల నుంచి వచ్చిన ఆడపిల్లలు అది చేయకూడదు.. ఇది చేయకూడదు అని అసలు ఏదీ చేయనివ్వకుండా అడ్డుపడుతూ ఉంటారు' అంటుంది. అయితే ఆ వధువు వెరవకుండా ఆ స్టేషన్‌లో ఆ అవ్వతోనే ఉంటూ అక్కడే పని చేసుకుంటూ భర్త కోసం ఎదురు చూస్తూ మెల్లగా ఆత్మవిశ్వాసం నింపుకుంటుంది. మరో వైపు వేరే వరుడితో వెళ్లిన వధువు ఆ అత్తగారింటిలో (వాళ్లంతా అసలు కోడలి కోసం అంటే రైల్వే స్టేషన్‌లో ఉండిపోయిన కోడలి కోసం వెతుక్కుంటూ ఉండగా) ఆశ్రయం పొంది పై చదువులు చదవడానికి తాను అనుకున్న విధంగా పురోగమిస్తుంది. సినిమా చివరలో ఒక వధువు తన భర్తను చేరుకోగా మరో వధువు ఇష్టం లేని పెళ్లి చేసుకున్న భర్తను కాదని పై చదువులకు వెళ్లిపోతుంది. ఈ మొత్తం కథలో దర్శకురాలు కిరణ్ రావు ఎన్నో ప్రశ్నలు ప్రేక్షకుల ముందు ఉంచుతుంది. మన దేశంలో స్త్రీలను పరదాలు, ఘోషాలు, ఘూంఘట్‌ల పేరుతో అవిద్యలో ఉంచి వారికి లోకం తెలియనివ్వకుండా కనీసం తమ వ్యక్తిత్వ చిరునామాను నిర్మించుకోనివ్వకుండా ఎలా పరాధీనంలో (పురుషుడి మీద ఆధారపడేలా) ఉంచుతున్నారో చెబుతుంది. స్త్రీలు స్వతంత్రంగా జీవించగలరు, ఆత్మవిశ్వాసంతో బతగ్గలరు వారినలా బతకనివ్వండి అంటుందీ సినిమా.


'లాపతా లేడీస్'లో ఓ దృశ్యం

పెద్ద హిట్

నాలుగైదు కోట్లతో నిర్మించిన 'లాపతా లేడీస్' దాదాపు 25 కోట్ల రూపాయలు రాబట్టింది. ఒకవైపు థియేటర్లలో ఆడుతుండగానే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అయినా జనం థియేటర్లలో చూడటానికి వెళ్లడం విశేషం. చాలా మంచి ప్రశంసలు ఈ సినిమాకు దక్కాయి. రైల్వే స్టేషన్‌లో అవ్వగా నటించిన ఛాయా కదమ్‌కు, ఇన్‌స్పెక్టర్‌గా నటించిన రవికిషన్‌కు మంచి పేరు వచ్చింది. మిగిలిన కొత్త నటీనటులకు కూడా మంచి గుర్తింపు వచ్చింది.

భారీ పోటీలో

ఆస్కార్ అఫిషియల్ ఎంట్రీ కోసం చాలా సినిమాలు పోటీ పడ్డాయి. తెలుగు నుంచి కల్కి, హనుమ్యాన్, మంగళవారం ఉన్నాయి. తమిళం నుంచి 'మహారాజా', 'తంగలాన్' ఉన్నాయి. జాతీయ అవార్డు పొందిన 'ఆట్టం' (మలయాళం), కేన్స్ అవార్డు పొందిన 'ఆల్ వియ్ ఇమేజిన్ యాజ్ లైట్' కూడా ఉన్నాయి. హిందీ నుంచి 'యానిమల్', 'శ్రీకాంత్' పోటీ పడ్డాయి. కాని 'లాపతా లేడీస్' లోని అంతర్గత వేదన, మార్పు కోరే నివేదన దానికి ఆస్కార్‌కు వెళ్లే యోగ్యత కల్పించింది.

ఇది మాకు దక్కిన గౌరవం

ఆస్కార్ నామినేషన్ కోసం ఫిల్మ్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కమిటీ మా 'లపతా లేడీస్' సినిమాను ఎంపిక చేయడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఈ నామినేషన్‌కు మాతో పాటు మరికొన్ని అద్భుతమైన భారతీయ సినిమాలు పోటీ పడ్డాయి. అయితే కమిటీ మా చిత్రాన్ని నమ్మినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఖండాంతరాలు దాటేందుకు, ప్రజల హృదయాలతో కనెక్ట్ కావడానికి సినిమా అనేది శక్తిమంతమైన మాధ్యమం. భారతదేశంలో 'లాపతా లేడీస్'కు లభించిన ఆదరణ, ప్రపంచ వ్యాప్తంగా కూడా లభిస్తుందని ఆశిస్తున్నాను.
- కిరణ్‌రావు

చెస్ ఒలింపియాడ్-2024

చెస్ 'క్వీన్స్'

'చెస్ అనేది ఆర్ట్. ఆట, సైన్స్‌ల సమాహారం' అంటారు.
ఆ విషయం ఎలా ఉన్నా... చెస్ అనేది ఆత్మవిశ్వాస సంకేతం.
ఆ ఆత్మవిశ్వాస శక్తితోనే చెస్ ఒలింపియాడ్-2024(బుడాపెస్ట్, హంగెరి)లో మన మహిళా మణులు సత్తా చాటారు. చెస్ ఒలింపియాడ్ మహిళల విభాగంలో తొలి స్వర్ణం సాధించారు. మన ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్, వైశాలి రమేష్ బాబు, వంతిక ఆగర్వాల్, తానియా సచ్‌దేవ్‌లు సత్తా చాటారు. స్వర్ణకాంతులతో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు..


దివ్యా దేశ్‌ముఖ్


వంతిక అగర్వాల్


వైశాలి


తానియా సచ్‌దేవ్

ఆమె విజయ రహస్యం

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పుట్టింది దివ్యా దేశ్‌ముఖ్. తల్లిదండ్రులిద్దరూ వైద్యులు. తండ్రి తరచు చెస్‌బోర్డ్ ముందు కూర్చొని కనిపించేవాడు. ఆ దృశ్యాలను పదే పదే చూసిన దివ్యకు చెస్‌పై ఆసక్తి మొదలైంది. ఆ ఆసక్తి కాస్తా నైపుణ్యంగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్, 'వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్' టైటిల్ గెలుచుకుంది.
తన ఆట తీరుతో ఎన్నోసార్లు 'అమేజింగ్ పర్‌ఫార్మెన్స్' అనిపించుకున్న దివ్యా దేశ్‌ముఖ్ 'గంటల కొద్దీ ప్రాక్టీస్, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహమే నా విజయ రహస్యం' అంటోంది.

ఆ క్షణం నుంచి...

ఏడున్నర సంవత్సరాల వయసులో తొలిసారిగా చెస్ బోర్డ్‌ను టచ్ చేసింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన వంతిక అగర్వాల్. ఆ టచ్ చేసిన ముహూర్తం ఎలాంటిదో గాని ఆ క్షణం నుంచే చెస్ ఆటే తన రూట్ అయింది. స్కూల్లో ఫ్రెండ్స్‌తో, ఇంట్లో సోదరుడు విశేష్‌తో చెస్ ఆడేది. చెస్ కెరీర్ ప్రారంభంలోనే ఎన్నో ట్రోఫీలు గెలుచుకొని 'ఔరా' అనిపించింది. రోజుకు ఎనిమిది గంటలు చెస్ ప్రాక్టీస్ చేస్తుంది. పొద్దున యోగా చేయడం, సాయంత్రం బ్యాడ్మింటన్ ఆడడం తప్పనిసరి. మొదట్లో గేమ్‌లో ఓటమిని తట్టుకోలేకపోయేది. ఏడ్చేది కూడా. ఏడుస్తూ నిద్రపోయిన రోజులు కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు తనలో గెలుపు, ఓటములను సమంగా చూసే పరిణతి వచ్చింది. 'నేను ఏమాత్రం నిరాశగా కనిపించినా అమ్మ నాలో ధైర్యం నింపుతుంది. యస్...నువ్వు సాధించగలవు అంటుంది. ఆమె నాకు కొండంత అండ' అంటుంది వంతిక అగర్వాల్.

కుటుంబ బలం

పరిచయం అక్కర్లేని పేరు హారిక ద్రోణవల్లి. ఎంతో మంది ఔత్సాహికులకు ఈ గ్రాండ్ మాస్టర్ స్ఫూర్తిగా మారింది. చెన్నైలో 'చెస్ ఒలింపియాడ్' జరుగుతున్న టైమ్‌లో హారిక తొమ్మిది నెలల గర్భిణి. అయినప్పటికీ పోటీలో పాల్గొని జట్టుకు కాంస్యం దక్కడంలో కీలక పాత్ర పోషించింది. ప్రపంచంలోని టఫెస్ట్ టీమ్‌లు ఏమిటో, ఇండియా టీమ్‌లోని స్ట్రాంగ్ పాయింట్స్ ఏమిటో హారికకు బాగా తెలుసు. బలాబలాలు బేరీజు వేసుకుంటూ ఎలా ముందుకు వెళ్లాలో తెలుసు. 'మనం కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నంత కాలం చెస్‌ను కొనసాగించవచ్చు. వయసు ముఖ్యం కాదు. నేను బాగా ఆడగలుగుతున్నాను అనిపించినంత కాలం ఆడతాను. కుటుంబ బలం నా అదృష్టం' అంటోంది హారిక.


హారిక ద్రోణవల్లి

హార్డ్ వర్క్ ఈజ్ ది బిగ్గెస్ట్ టాలెంట్

2005లో గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించిన తానియా సచ్‌దేవ్ ఢిల్లీలో పుట్టి పెరిగింది. తానియా సచ్‌దేవ్‌కు ఆరేళ్ల వయసులో తల్లి అంజు ద్వారా చెస్ పరిచయం అయింది. తానియా తల్లి బ్యాడ్మింటన్, తండ్రి ఫుట్‌బాల్ ఆడేవారు. ఈ రెండు ఆటలు కాకుండా తానియాకు చెస్ పరిచయం చేయడం యాదృచ్ఛికమే అయినా ఆ చెస్ తనని ఎక్కడికో తీసుకెళ్లింది. 2007లో మహిళల ఆసియా చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది తానియ.
'చెస్‌లో స్టార్‌గా రాణించడం ఏ ఒక్కరికో పరిమితమైన ప్రతిభ కాదు. కష్టపడితే అందరికి సాధ్యమే' అంటున్న తానియా సచ్‌దేవ్ గ్యారీ కాస్పరోవ్ మాట 'హార్డ్ వర్క్ ఈజ్ ది బిగ్గెస్ట్ టాలెంట్'ను పదే పదే గుర్తు తెస్తుంటుంది.

ఆరోజు నుంచి వైశాలి జీవితమే మారిపోయింది!

చెన్నైలో పుట్టింది వైశాలి రమేష్ బాబు. తల్లి గృహిణి. తండ్రి టీఎన్‌ఎస్‌సీ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్. ఆమె సోదరుడు ఆర్. ప్రజ్ఞానంద గ్రాండ్ మాస్టర్. చిన్నప్పుడు వైశాలి టీవీకి అతుక్కుపోయేది. చివరికి అదొక వ్యసనంగా మారింది. ఇది గమనించిన తల్లిదండ్రులు వైశాలిని చెస్ క్లాసులకు పంపించారు.
'నేను వెళ్లను' అని వైశాలి మారాం చేసి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో తెలియదుగానీ 'అలాగే' అంటూ వెళ్లడం ఆమె జీవితాన్నే మార్చేసింది. 2012లో గర్ల్స్ వరల్డ్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ (అండర్-12), 2016లో ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యూఐయం) టైటిల్ గెలుచుకుంది. చెస్‌లో తొలి పాఠం నుంచి 'గ్రాండ్ మాస్టర్' టైటిల్ సొంతం చేసుకోవడం వరకు ఎన్నో విషయాలను నేర్చుకుంది. ఆటకు సంబంధించిన ఇన్‌స్పిరేషన్‌ను ది గ్రేట్ విశ్వనాథన్ ఆనంద్ నుంచి మాత్రమే కాదు తన సోదరుడు ప్రజ్ఞానంద నుంచి కూడా తీసుకుంటుంది. 'అతడికి ఓపిక ఎక్కువ. గెలుపు, ఓటములను ఒకేరకంగా తీసుకుంటాడు. ఓర్పు నుంచి స్థితప్రజ్ఞత వరకు ప్రజ్ఞ నుంచి నేర్చుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయి' అంటుంది వైశాలి.

- పూర్వికుల మాదిరిగా ఆర్గానిక్‌గా అనేక రకాల పంటలు ప్రతి పొలంలోనూ పండించాలి
- ఎత్తు మడులపైనే ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంప జాతి కూరగాయల మిశ్రమ సాగు
- రోజుకో మడిలో విత్తుకోవాలి.. లోకల్ మార్కెట్‌పైనే దృష్టి..
- ఒక ఎకరం సేద్యానికి కూలీలు అక్కర్లేదు.. రైతు దంపతులు చేసుకోవచ్చు..
- ఎకరంలో నెలకు రూ. లక్ష సంపాదన సాధ్యమే : ఆర్గానిక్ మాండ్య వ్యవస్థాపకులు మధు చందన

ఎకరంలో ప్రతి నెలా రూ. లక్ష ఎలా?

బెడ్ కొలతలు





- ఎకరంలో 80 బెడ్లు
- ప్రతి బెడ్ సైజు 300 చదరపు అడుగులు
- 80 బెడ్లు కలిసి 24,000 చదరపు అడుగులు

కర్ణాటకలోని మాండ్య పట్టణంలో వ్యవసాయ శాస్త్రవేత్త కుటుంబంలో పుట్టిన మధు చందన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పదేళ్ల తర్వాత... స్వస్థలంలో రైతులు అప్పులపాలై ఆత్మహత్యల పాలవుతున్న వార్తలతో కలత చెందారు. భూములున్న చిన్న, సన్నకారు రైతులు కూడా పొట్ట చేతపట్టుకొని బెంగళూరు వలస పోయి చిన్నా చితకా పనులు చేసుకుంటూ దుర్భరంగా జీవిస్తున్న విషయం మధు చందనను అమెరికాలో నిలవ నివ్వలేదు. ఏదైనా రైతుల బతుకుల్లో గుణాత్మక మార్పు తేవటానికి కృషి చేయాలన్న సంకల్పంతో భార్య బిడ్డలు సహా అమెరికా నుంచి 2014లో తిరిగి మాండ్య వచ్చేశారు.


మాండ్య ప్రాంత రైతు కుటుంబాలు తాతల నాటి నుంచి వ్యవసాయం ద్వారా ఆర్థిక, ఆహార, ఆరోగ్య భద్రతను ఇచ్చిన విషయం గుర్తుంది. ఇప్పుడు వ్యవసాయ సంక్షోభానికి కారణం ఏమిటని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. రసాయనిక వ్యవసాయం, ఏకపంటల సాగే మూల కారణాలుగా గుర్తించి సేంద్రియ సాగు బాట పట్టారు. మాండ్య ఆర్గానిక్ ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించి, ఇప్పటికి 12 వేల మందికి సేంద్రియ సేద్యంలో శిక్షణ ఇచ్చారు. గృహిణుల చేత సేంద్రియ ఇంటిపంటలు సాగు చేయిస్తున్నారు. పదేళ్లు గడిచేటప్పటికి మాండ్య జిల్లాలోని 320 గ్రామాలకు సేంద్రియ సేద్యం విస్తరించింది. స్నేహితులతో కలసి 'ఆర్గానిక్ మాండ్య' పేరుతో ఆర్గానిక్ రెస్టారెంట్‌ను, సూపర్ మార్కెట్‌ను మాండ్యలో జాతీయ రహదారి పక్కనే నెలకొల్పారు. ఇప్పుడు బెంగళూరులో 18 స్టోర్లున్నాయి. బాలారిష్టాలను అధిగమించి రైతుల ఆదాయం పెంచటంలో మధు చందన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణలోనూ రైతులకు ఎకరంలో ప్రతి నెలా కనీసం రూ. లక్ష సంపాదించే సేంద్రియ సాగు, మార్కెటింగ్ పద్ధతులపై శిక్షణ ఇవ్వాలని ఆర్గానిక్ మాండ్య ఫార్మర్స్ ఫౌండేషన్ సంకల్పించింది. ఈ నేపథ్యంలో మధు చందనతో 'సాక్షి సాగుబడి' ముచ్చటించింది.

ఎకరంలో 80 ఎత్తు మడులు

సేంద్రియ వ్యవసాయం ద్వారా ఎకరం పొలంలో ప్రతి నెలా రూ. లక్ష ఆదాయం పొందే నమూనాలో ఎత్తు మడులపైనే అనేక కూరగాయ పంటలు సాగు చేస్తారు. ఎకరం అంటే.. 43,560 చదరపు అడుగులు. ఎకరంలో 80 ఎత్తు మడు (రెయిజ్డ్ బెడ్)లు ఏర్పాటు చేసుకోవాలి. బెడ్ వెడల్పు 3 అడుగులు, పొడవు 100 అడుగులు (పొలం కొలతలను బట్టి బెడ్ పొడవు మార్చుకోవచ్చు). 80 బెడ్ల విస్తీర్ణం 24,000 చదరపు అడుగులు. మిగతా స్థలంలో ఇల్లు, పశువుల కొష్టం, బెడ్ల మధ్య దారులకు పోతుంది. బెడ్ల మధ్య 1.5 అడుగుల్లో కాలువ తీసి, ఆ మట్టినే ఎత్తుగా వేసి బెడ్ సిద్ధం చేసుకోవాలి. 5 రోజులు పని. 2 రోజులు విరామం. ఒక బెడ్‌పై విత్తనాలు/మొక్కలు నాటుకోవాలి. రైతు దంపతులే స్వయంగా చేసుకోవాలి. ఎకరం సేద్యానికి కూలీల అవసరం ఉండదు. ఈ బెడ్స్‌పై విత్తే పంటలు 120 రోజులు (4 నెలల్లో) పూర్తవుతాయి. ఆ తర్వాత మళ్లీ విత్తుకోవాలి. ఏడాది పొడవునా పంటలు సాగు చేస్తూ ఉండాలి.

బెడ్స్‌పై ఏడాది పొడవునా 4 పంటల మిశ్రమ సాగు

బెడ్ పద్ధతిలో సూచించిన పంటల కాలం 4 నెలలు. ఏడాదిలో 3 దఫాలుగా పంటలు పండించుకోవచ్చు. వాతావరణాన్ని, అవసరాలను బట్టి పంటల సరళిని మార్చుకోవచ్చు.



ఆకుకూరలు: పాలకూర, కొత్తిమీర, మెంతికూర, తోటకూర. కూరగాయలు: టొమాటో, వంగ, బెండ, బీన్స్, మిరప. దుంప పంటలు: బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగి, ఉల్లి. తీగజాతి కూరగాయలు: బీర, కాకర, గుమ్మడి, కీరదోస. మొదట్లో అందుబాటులో వున్న విత్తనంతో ప్రారంభించాలి. వీలైనంత త్వరగా దేశీ/నాటు విత్తనానికి మారాలి. వంద అడుగుల పొడవైన బెడ్‌పై మొదట 0.5 (అర) అడుగు దూరంలో, 200 అడ్డ గీతలు గీసి, వాటిలో ఆకుకూర విత్తనాలు ఇసుకలో కలిపి విత్తుకోవాలి (25 ఆకుకూర మొక్కల్ని ఒక కట్ట కట్టాలి). బెడ్‌పై అడుగు దూరంలో, రెండు వరుసలుగా, టొమాటో వంటి కూరగాయ (బెడ్‌కు 100) మొక్కలు నాటుకోవాలి.
బెడ్ అంచులపై రెండువైపులా ముల్లంగి వంటి దుంప పంటల విత్తనాలను ఇసుకలో కలిపి (వెయ్యి మొక్కలు) విత్తుకోవాలి (ఒక్కో దుంప సగటున 70 గ్రాములు పెరుగుతుందని అంచనా). బెడ్ మధ్యలో 2 అడుగులకో చోట (75) బీర వంటి తీగజాతి కూరగాయ మొక్కలు నాటుకోవాలి. అదే బెడ్‌పైన 25 అడుగులకో చోట అడ్డంగా 3 మునగ విత్తనాలు విత్తాలి. ఈ మునగ మొక్కలపైకి బీర వంటి తీగలను పాకించాలి. విత్తనం, భూసారం, వాతావరణం తదితర పరిస్థితులను బట్టి ఏడాది పొడవునా వచ్చే సాధారణ సగటు దిగుబడి అంచనాలను పట్టికలో పొందుపరిచారు. 3 అడుగుల వెడల్పు బెడ్‌పై రెండు వరుసలు డ్రిప్ వెయ్యాలి. చీడపీడల నియంత్రణ కోసం ఎకరానికి 4 దానిమ్మ మొక్కలు, బంతి మొక్కలు అక్కడక్కడా వేయాలి. ఏకపంటలు సాగు చేసే రైతులు మధ్యవర్తులకు పంటను అమ్ముకుంటారు. అయితే, బెడ్ మెథడ్‌లో ఆర్గానిక్‌గా అనేక పంటలు సాగు చేసే రైతులు స్థానికంగానే నేరుగా అమ్ముకుంటే సగటున వచ్చే ఆదాయ వివరాల అంచనాలను పట్టికలో పొందుపరిచారు. ఈ లెక్క కొంచెం అటు ఇటు కావచ్చు.

ఎకరంలోని 80 ఎత్తు మడుల ద్వారా వచ్చే కనీస ఆదాయం (అంచనా)

పంట రకం	మొక్కల సంఖ్య	మొక్క దిగుబడి	మొత్తం దిగుబడి	కిలో/కట్ట ధర (రూ.)	ఆదాయం
కూరగాయలు	50	2 కిలోలు	100 కిలోలు	20	2,000
దుంప పంటలు	1,000	0.07 కిలోలు	70 కిలోలు	30	2,100
తీగ జాతి పాదులు	75	0.1 కిలోలు	7.5 కిలోలు	40	300
ఆకుకూరలు	2,500	0.04 కట్టలు	100 (కట్టలు)	8	800
4 నెలల పంట కాలంలో ఒక బెడ్ ద్వారా ఆదాయం					రూ. 5,200
ఎకరంలో బెడ్ల సంఖ్య					80
4 నెలల్లో ఎకరం నుంచి మొత్తం ఆదాయం					రూ. 4,16,000
నెలకు సగటు ఆదాయం					రూ. 1,04,000

రానున్న కాలం ఆర్గానిక్ రైతులదే!

ప్రతి ఇంట్లో 40 నుంచి 60 రకాల ఆహారోత్పత్తుల్ని వాడుతుంటాం. కానీ, ఒకటో రెండో పంటలు పండించి అమ్ముకోవటానికి ఇబ్బంది పడుతూ అన్నీ మార్కెట్‌లో కొనుక్కుంటూ ఉంటాం. ఇది మారితేనే రైతు జీవితం మారుతుంది. ఎత్తు మడులపై అనేక రకాల కూరగాయలు, ఆహార అడవుల్లో పండ్లు సాగు చేసుకోవాలి. రోజుకో మడిలో కూరగాయ విత్తనాలు వేసుకుంటూ ఒక ఎకరంలో రైతు దంపతులు ఇద్దరు సాగు చేసుకోవచ్చు. 4 ఎకరాలు చేసే రైతులకు ముగ్గురు కూలీలు చాలు. వారికి పీఎఫ్, ఇఎస్‌ఐ, ఐడి కార్డు ఇచ్చి గౌరవంగా చూడండి. సమస్య ఉండదు. మీరు పంటలు పండించే తీరును సోషల్ మీడియాలో ప్రచారం చేయండి. నలుగురికీ తెలుస్తుంది. విశ్వాసం పెరుగుతుంది. పండించిన పంటలను మీ బంధుమిత్రులకు అమ్మండి. మీ గ్రామంలో వారికి, సంతల్లో అమ్మండి. ఎక్కువ ఎకరాల్లో పండిస్తే షాపు పెట్టండి. పూర్తిగా నిమగ్నమై ఇష్టంగా సేంద్రియ వ్యవసాయం చేసే వారిదే రానున్న ఆర్గానిక్ విప్లవ కాలమంతా! ఈ సాగు ప్రణాళికతో ఎకరానికి నెలనెలా రూ. లక్ష ఆదాయం సులభసాధ్యమే. అంతకన్నా ఎక్కువ ఆదాయం తీసే వారున్నారు. సేంద్రియ వ్యవసాయం, మార్కెటింగ్‌లో మెళకువలు నేర్పటానికి తెలంగాణ రైతులకు కూడా శిక్షణ ఇవ్వదలిచాం. వివరాలకు సంప్రదించండి: స్నేహ - 89044 14317.
– మధు చందన, సేంద్రియ రైతు, ఆర్గానిక్ మాండ్య వ్యవస్థాపకులు, కర్ణాటక



సాగుబడి
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
ఇ హస్త కార్తె: 27 నుంచి

పాల ఉత్పత్తి పెరిగేదెలా?

హోమియో మందులతో ప్రయోజనం

పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోవటం చూస్తుంటాం. ఇందుకు అనేక రకాల కారణాలు, సమస్యలు ఉంటాయి. వీటిని హోమియో మందుల ద్వారా తక్కువ ఖర్చుతో, సులువుగా పరిష్కరించుకోవచ్చు. అదెలాగో ఇప్పుడు చూద్దాం. ఆవులు, గేదెల్లో పాల ఉత్పత్తి తగ్గడానికి దారితీసే కొన్ని సాధారణ కారణాలివి.. 1. **పోషక లోపాలు:** ఫీడ్ నాణ్యత లోపించటం లేదా పరిమాణం, తగినంత నీరు తీసుకోకపోవటం. ప్రొటీన్, శక్తి లేదా ఖనిజాలు తదితర అవసరమైన పోషకాలలో లోపాలు. 2. **ఆరోగ్య సమస్యలు:** పొదుగు వాపు, అతిసారం లేదా అజీర్ణం వంటి జీర్ణాశయ సమస్యలు, కీటోసిస్ (మెటబాలిక్ డిజార్డర్), పాల జ్వరం. 3. **పునరుత్పత్తి సమస్యలు:** గర్భస్రావం, హార్మోన్ల అసమతుల్యత, గర్భాశయ అంటువ్యాధులు లేదా ప్రోలాప్స్, అండాశయ తిత్తులు లేదా ఇతర పునరుత్పత్తి సమస్యలు, దూడ చనిపోవటం. 4. పాల ఉత్పత్తిని నియంత్రించే హార్మోన్లలో అసమతుల్యత.

ఈ సమస్యల పరిష్కారానికి చక్కగా పనిచేసే హోమియో మందులు:

1. **కాల్కేరియా ఫాస్ఫోరికా (కాల్కా ఫాస్):** పోషకాహార లోపంతో ఉన్న లేదా బలహీనమైన ఆవులలో పాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. మోతాదు: 200సి. 3 సార్లు (రోజువారీ, పరిస్థితి తీవ్రతను బట్టి)
2. **లక్టిఫ్లోరేటమ్:** ఆవులు ఊహించిన దాని కంటే తక్కువ పాలు ఇస్తున్నప్పుడు లేదా అకస్మాత్తుగా పాల ఉత్పత్తి తగ్గినప్పుడు సహాయపడుతుంది. మోతాదు: 200సి. ప్రతి రోజూ 1 మోతాదు. 7 రోజులు.



3. **రిసినస్ కమ్యూనిస్:** ఆవులు, మేకల్లో పాల ఉత్పత్తిని పెంచడానికి ఉపయోగపడుతుంది. మోతాదు: 200సి. ఒక వారం లేదా మెరుగుదల కనిపించే వరకు.. రోజుకు 3 సార్లు. 4. **ఉర్టికా యురెన్స్:** ఆవుల పాల ఉత్పత్తి అకస్మాత్తుగా పడిపోయిన సందర్భాల్లో పాల ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. మోతాదు: 200సి. పాల దిగుబడి పెరిగే వరకు ప్రతి రోజూ 2 నుండి 3 సార్లు. 5. **అగ్నస్ కాస్టస్:** ఈనిన తర్వాత హార్మోన్ల అసమతుల్యతతో పాలు తగ్గితే ఈ మందు ఉపయోగపడుతుంది. మోతాదు: 200సి. కొన్ని వారాలపాటు రోజుకు 2 నుంచి 3 సార్లు.
6. **పల్సటిల్లా:** వేడి వాతావరణం వల్ల పాల ఉత్పత్తి తగ్గినపుడు వాడాలి. మోతాదు: 200సి. 3-4 సార్లు. ఒక రోజు. 7. **లాక్టోడెక్టస్ మక్టాన్స్:** పొదుగువాపు తరువాత పాల ఉత్పత్తి తగ్గితే ఈ మందు సహాయపడుతుంది. మోతాదు: 200సి. 3-4 సార్లు. ఒక రోజు.
8. **సెపియా, ఇగ్నేషియ:** దూడ చనిపోయినపుడు పాలు తగ్గినప్పుడు ఉపయోగపడుతుంది. మోతాదు: 200సి. 3-4 సార్లు. ఒక రోజు. 9. **పాలు ఎగచేపు.. హోమియోపతి కలయిక మందులు:** రిసినస్ 200 : మోతాదు 15 చుక్కలు. గోరువెచ్చని నీటిలో వేసి ఉదయం సాయంత్రం ఇవ్వాలి. **సేపియ 200, ఇగ్నేషియ 200, పల్సటిల్ల 200:** ప్రతి ఒక్కటి ఉదయం 10 మాత్రలు, సాయంత్రం 10 మాత్రలు ఇచ్చినట్లయితే పాలు ఎగసేపు సమస్య తీరుతుంది.

సూచనలు: ● సందర్భాన్ని బట్టి పై మందులు కొన్నిటిని కలిపి ఇవ్వవలసి ఉంటుంది. ● హోమియోపతి మందులు చిన్న మొత్తంలో గుళికల రూపంలో లేదా ద్రవ రూపంలో ఉంటాయి. వాటిని నీటిలో కరిగించి.. నోటి ద్వారా గాని, దాణాలో కలిపి గాని ఇవ్వాలి.● రోజుకు 2-3 సార్లు ఇవ్వండి. పశువు కోలుకుంటున్న కొద్దీ తగ్గించండి. ● వారంలో మెరుగుదల కనిపించకపోతే, పశువైద్యాధికారిని సంప్రదించండి.
– డా. జి.రాంబాబు (94945 88885), పశువైద్యాధికారి, కడప

వ్యక్తిగత స్పర్ధలతో...


వంతిక అగర్వాల్


దివ్య దేశ్‌ముఖ్


దొమ్మరాజు గుకేశ్


ఇరిగేశి అర్జున్

ఆనంద్ ఎఫెక్ట్

భారత చెస్‌పై విశ్వనాథన్ ఆనంద్ ప్రత్యేక ముద్ర

తొలి గ్రాండ్‌మాస్టర్‌గా అందరికీ స్ఫూర్తి

అకాడమీ ద్వారా యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశనం

ఒలింపియాడ్‌లో భారత జట్ల మెరుగైన ప్రదర్శనకు కృషి



స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు ఓవరాల్ టీమ్ విన్నర్స్ ట్రోఫీతో విశ్వనాథన్ ఆనంద్

'చదరంగపు సంస్కృతి కనిపించని దేశం నుంచి వచ్చిన ఒక కుర్రాడు ప్రపంచ చాంపియన్ కావడమే కాదు, ఆటపై ఆసక్తి పెంచుకొని దానిని ముందుకు తీసుకెళ్లగలిగేలా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవడం నిజంగా నమ్మలేని విషయం, అసాధారణం. ఆ దిగ్గజమే విశ్వనాథన్ ఆనంద్'... భారత జట్టు ఒలింపియాడ్‌లో విజేతగా నిలిచిన తర్వాత టాప్ చెస్ ప్లేయర్, ప్రపంచ 2వ ర్యాంకర్ నకమురా ఆనంద్ గురించి చేసిన ప్రశంస ఇది. భారత చెస్ గురించి తెలిసిన వారెవరైనా ఈ మాటలను కాదనలేరు. ఆటగాడిగా మన చదరంగంపై ఆనంద్ వేసిన ముద్ర అలాంటిది. చెస్ క్రీడను పెద్దగా పట్టించుకోని సమయంలో 19 ఏళ్ల వయసులో భారత తొలి గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించిన ఆనంద్... ఇప్పుడు 55 ఏళ్ల వయసులో కొత్త తరానికి బ్యాటన్‌ను అందించి సగర్వంగా నిలిచాడు. ఆనంద్ జీఎంగా మారిన తర్వాత ఈ 36 ఏళ్ల కాలంలో మన దేశం నుంచి మరో 84 మంది గ్రాండ్‌మాస్టర్లుగా మారగా... ఇందులో 30 మంది తమిళనాడుకు చెందిన వారే కావడం విశేషం.

'వాకా'తో విజయాలు...

నాలుగేళ్ల క్రితం ఆనంద్ తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటూ మెల్లగా తాను ఆడే టోర్నీల సంఖ్యను తగ్గించుకుంటున్న సమయమది. తన ఆట ముగిసిపోయాక భవిష్యత్తులో ప్రపంచ చెస్‌లో భారత్ స్థాయిని కొనసాగించేలా ఏదైనా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని భావించాడు. ఈ క్రమంలో వచ్చిందే చెస్ అకాడమీ ఏర్పాటు ఆలోచన. చెన్నైలో వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీ (వాకా)ని అతను నెలకొల్పాడు. ఇక్కడి నుంచి వచ్చిన ఫస్ట్ బ్యాచ్ అద్భుత ఫలితాలను అందించి ఆనంద్ కలలకు కొత్త బాట వేసింది. దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలి ఇందులో ఉన్నారు. ఆ తర్వాత తెలంగాణ ప్లేయర్ అర్జున్ ఇరిగేశి కూడా ఇక్కడ శిక్షణ పొందాడు. 'విషీ సర్ లేకపోతే ఇవాళ మేం ఈ స్థాయికి వచ్చేవాళ్లం కాదు'... గుకేశ్, ప్రజ్ఞానంద తరచుగా చెబుతూ రావడం వారి కెరీర్ ఎదుగుదలలో ఆనంద్ పాత్ర ఏమిటో చెబుతుంది. యువ చెస్ ఆటగాళ్ల కెరీర్ దూసుకుపోవడంలో తల్లిదండ్రులు, ఆరంభంలో కోచింగ్ ఇచ్చిన వారి పాత్రను ఎక్కడా తక్కువ చేయకుండా వారిపైనే ప్రశంసలు కురిపించిన ఆనంద్ 'వాకా'తో తాను ఎలా సరైన మార్గ నిర్దేశనం చేశాడో ఒలింపియాడ్ విజయానంతరం వెల్లడించాడు.

జూనియర్ దశను దాటుతూ...

యువ ఆటగాళ్లను విజయాల వైపు సరైన దిశలో నడిపించడం అకాడమీ ఏర్పాటులో ముఖ్య ఉద్దేశమని అతను చెప్పాడు. తన కెరీర్ ప్రారంభంలో సోవియట్ యూనియన్‌లో ఉన్న చెస్ సంస్కృతిని చూసి అకాడమీ ఆలోచన వచ్చినట్లు ఆనంద్ పేర్కొన్నాడు. అక్కడ దిగువ స్థాయికి పెద్ద ప్లేయర్‌గా ఎదిగే క్రమంలో ఈ అకాడమీలు సంధానకర్తలుగా వ్యవహరిస్తాయని అతను వెల్లడించాడు. 'భారత ఆటగాళ్లు ర్యాంకింగ్‌పరంగా తరచుగా టాప్–200లోకి దూసుకొస్తున్నారు. కానీ టాప్–100లోకి మాత్రం రాలేకపోతున్నారు. కాబట్టి ప్రతిభావంతులను ఆ దిశగా సాధన చేయించడం ముఖ్యమని భావించా. వారి విజయాల్లో మా పాత్రను పోషించడం సంతృప్తినిచ్చే విషయం' అని ఆనంద్ తన అకాడమీ ప్రాధాన్యతను గురించి పేర్కొన్నాడు. 14 ఏళ్ల కంటే ముందే గ్రాండ్‌మాస్టర్లుగా మారిన ఆటగాళ్లను ఆనంద్ తన అకాడమీలోకి తీసుకున్నాడు. జూనియర్ స్థాయిలో సంచలనాలు సాధించి సీనియర్‌కు వచ్చేసరికి ఎక్కడా కనిపించకపోయిన ప్లేయర్లు చాలా మంది ఉంటారు. అలాంటిది జరగకుండా జూనియర్ స్థాయి విజయాలను సీనియర్‌లోనూ కొనసాగిస్తూ పెద్ద విజయాలు సాధించేలా చేయడమే తన లక్ష్యమని ఆనంద్ చెప్పుకున్నాడు.

అనూహ్య వేగంతో...

'నా తొలి గ్రూప్‌లో ఉన్న ప్లేయర్లంతా గొప్పగా రాణిస్తున్నారు. నిజానికి వీరు తొందరగా శిఖరానికి చేరతారని నేనూ ఊహించలేదు. వారు మంచి పేరు తెచ్చుకుంటారని అనుకున్నా గానీ అదీ ఇంత వేగంగా, నమ్మశక్యం కానట్లుగా జరిగింది' అంటూ యువ ఆటగాళ్లపై ఆనంద్ ప్రశంసలు కురిపించాడు. ఆనంద్ ఇంకా అధికారికంగా తన రిటైర్మెంట్‌ను ప్రకటించలేదు. తనకు నచ్చిన, ఎంపిక చేసిన టోర్నీల్లోనూ అతను ఇంకా ఆడుతూనే ఉన్నాడు. కొన్ని నెలల క్రితం స్పెయిన్‌లో జరిగిన లియోన్ మాస్టర్స్‌లో అతను విజేతగా కూడా నిలిచాడు. ఒకవైపు ప్లేయర్‌గా కొనసాగుతూ మరో వైపు యువ ప్లేయర్లకు అతను మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. నిజంగా భారత జట్టుకు ఒలింపియాడ్‌లో విజేతగా నిలిచే సత్తా ఉందంటే అది ఈ జట్టుతోనే సాధ్యం అని ఒలింపియాడ్‌కు వెళ్లే ముందే ఆనంద్ తన అభిప్రాయాన్ని ఇలా వెల్లడించాడు. టీమ్‌లోని ఆటగాళ్లపై అతను చూపిన విశ్వాసం అది. దానిని వారంతా నిజం చేసి చూపించారు. 'భారత చెస్‌లో అద్భుత సమయం నడుస్తోంది. ఇలాంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లతో మనం కచ్చితంగా మంచి విజయాలు ఆశిస్తాం. ఇప్పుడు అదే జరిగింది. సరిగ్గా చెప్పాలంటే వారు మనందరి అంచనాలకు మించి రాణించారు. ముందుముందు ఇవి కొనసాగాలని కోరుకుంటున్నా' అని ఆనంద్ భావోద్వేగంతో అన్నాడు. ఒలింపియాడ్ బహుమతి ప్రదానోత్సవంలో ఆనంద్ చాలా ఉత్సాహంగా పాల్గొన్నాడు. అతడిని వేదికపైకి ఆహ్వానిస్తూ అంతర్జాతీయ చెస్ సమాఖ్య ఆనంద్‌ను 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ చెస్ బూమ్' అంటూ ప్రశంసలు కురిపించడం అతని విలువను చాటి చెప్పింది.

– సాక్షి క్రీడా విభాగం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ప్రధానమంత్రి ప్రశంస

చెస్ ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిచిన భారత ఆటగాళ్లను దేశ ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. స్వర్ణాలు సాధించిన పురుషుల, మహిళల జట్ల ఘనతను ఆయన కొనియాడారు. '45వ చెస్ ఒలింపియాడ్‌లో అటు ఓపెన్, ఇటు మహిళల విభాగాల్లో టైటిల్స్ గెలిచి భారత్ చరిత్ర సృష్టించింది. ఈ రెండు టీమ్‌లకు కూడా నా అభినందనలు. భారత క్రీడల్లో ఇదో సరికొత్త అధ్యాయం. చెస్‌లో అగ్ర స్థానానికి చేరాలని పట్టుదలగా ఉన్న ఉత్సాహవంతులకు కొన్ని తరాల పాటు ఈ ఘనత స్ఫూర్తిగా నిలుస్తుంది' అని మోదీ అన్నారు.

సినిమా

సంక్రాంతికి మజాకా


సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రానికి 'మజాకా' అనే టైటిల్ ఖరారైంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయడంతో పాటు సినిమాని సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''మాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'మజాకా'. ఈ సంక్రాంతికి పర్ఫెక్ట్ మూవీగా అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రావు రమేశ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సహ–నిర్మాత: బాలాజీ గుత్తా.



"కె.విశ్వనాథ్‌గారి సినిమాలంటే నాకు ఇష్టం. కానీ, ఇప్పుడు అలాంటి కథలు రావడం లేదు. అయితే 'సత్యం సుందరం' కథ చదివినప్పుడు ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి. ఇలాంటి స్క్రిప్ట్ ఎలా రాస్తారా? అనిపించింది. ఈ సినిమా తప్పకుండా కె.విశ్వనాథ్‌గారి తరహా లాంటి ఒక మంచి చిత్రం అవుతుందనిపించింది" అని కార్తీ అన్నారు. '96' మూవీ ఫేమ్ సి.ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సత్యం సుందరం'. 2డి ఎంటర్‌టైన్‌మెంట్‌పై సూర్య, జ్యోతిక నిర్మించిన ఈ సినిమా తెలుగులో ఈ నెల 28న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కార్తీ విలేకరులతో పంచుకున్న విశేషాలు...

ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి

– కార్తీ

● మనలోని చాలా ప్రశ్నలకు సమాధానం ఇచ్చే కథ 'సత్యం సుందరం'. నాకు కథ బాగా నచ్చడంతో అన్నయ్యకి(హీరో సూర్య) చెప్పాను. ఆయనకు కూడా చాలా బాగా నచ్చింది. ఆ తర్వాత అన్నయ్య, వదిన(జ్యోతిక) నిర్మించారు. ఇలాంటి మంచి సినిమాకి పారితోషికం ఎక్కువ అడగొద్దు అంటూ నా మార్కెట్ కంటే కొంచెం తగ్గించి ఇచ్చారు(నవ్వుతూ). నా తొలి చిత్రం 'పరుత్తి వీరన్' సినిమా చూసి ఆప్యాయంగా హత్తుకున్న అన్నయ్య మళ్లీ ఇన్నేళ్లకు 'సత్యం సుందరం' లో చాలా బాగా నటించావంటూ గర్వంగా హత్తుకున్నారు. ● బ్రదర్స్ లాంటి రెండు క్యారెక్టర్స్ మధ్య నడిచే కథ ఇది. 'సాగర సంగమం' సినిమా చూసినప్పుడు ఎలాంటి అద్భుతమైన అనుభూతి కలిగిందో 'సత్యం సుందరం' చూస్తున్నప్పుడు కూడా అలాంటి ఓ మంచి అనుభూతిని ప్రేక్షకులు ఆస్వాదిస్తారు. అయితే కె.విశ్వనాథ్‌గారి సినిమాలు కమర్షియల్ బ్లాక్ బస్టర్స్. మా సినిమా కూడా అలాంటిదే. ఈ చిత్రం చూశాక అందరికీ తమ బాల్యం గుర్తొస్తుంది. ● చిన్న పల్లెటూరిలో చీరల దుకాణం నడిపే అమాయకమైన వ్యక్తిత్వం ఉండే పాత్ర నాది. ఈ మూవీలో అరవింద్ స్వామిగారు కాకుండా ఆయన పాత్రలో మరొకర్ని ఊహించలేం. 'ఊపిరి' సినిమాలో ఉన్నట్లు సంతోషకరమైన భావోద్వేగాలున్న కథ ఇది. మా సినిమా తమిళంలో ఈ నెల 27న విడుదలవుతోంది. అయితే అదేరోజు తెలుగులో 'దేవర' లాంటి పెద్ద సినిమా ఉంది. అందుకే మా సినిమాని 28న రిలీజ్ చేస్తున్నాం. 'దేవర' ఒక యుద్ధంలా ఉంటుంది. మాది 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' లాంటి సినిమా(నవ్వుతూ). ● 'సత్యం సుందరం' కి గోవింద్ వసంత్ పాటలు, నేపథ్య సంగీతం బాగుంటాయి. సునీల్, సురేశ్ బాబుగార్లు మా సినిమా రిలీజ్ చేయడం హ్యాపీ. 'ఊపిరి' తర్వాత తెలుగులో నేరుగా సినిమా చేయలేదు. కథలు వింటున్నాను. తప్పకుండా చేస్తాను. ప్రస్తుతం 'సర్దార్ 2' షూటింగ్ జరుగుతోంది. అలాగే 'వా వాతియారే' సినిమా ఉంది. 'ఖైదీ 2' సినిమా 2025లో ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

ఆస్కార్ బరిలో లాపతా లేడీస్

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన ఘనత దక్కింది. వచ్చే ఏడాది మార్చిలో లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న 97వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం పోటీ పడేందుకు 'లాపతా లేడీస్' చిత్రం బరిలో నిలిచింది. భారతదేశం తరఫున ఈ సినిమాను ఆస్కార్ నామినేషన్ ఎంపిక కోసం పంపిస్తున్నట్లు 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎఫ్ఐ) సోమవారం ప్రకటించింది. 29 చిత్రాలు పరిశీలించి 'లాపతా లేడీస్'ని ఏకగ్రీవంగా ఇండియా ఎంట్రీగా ఆస్కార్ నామినేషన్‌కి పంపేందుకు ఎంపిక చేసినట్లు 'ఎఫ్ఎఫ్ఐ' కమిటీ డైరెక్టర్ ఆర్.జహ్ను బారువా తెలిపారు. కిరణ్‌రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'లో నితాన్షి గోయల్, ప్రతిభా రంతా, స్పర్శ్ శ్రీవాస్తవ్ ప్రధాన పాత్రధారులుగా, రవికిషన్, ఛాయాకదం ఇతర పాత్రల్లో నటించారు. ఆమిర్‌ఖాన్, కిరణ్‌రావు, జ్యోతిదేశ్ పాండే నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది సెప్టెంబరులో జరిగిన 48వ టోరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో తొలిసారి ప్రదర్శించబడి ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత ఈ ఏడాది మార్చి 1న థియేటర్స్‌లో విడుదలై, సూపర్‌హిట్ ఫిల్మ్‌గా నిలిచింది.



లాపతా లేడీస్ పోస్టర్

1958లో జరిగిన 30వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'మదర్ ఇండియా', 1989లో జరిగిన 61వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'సలామ్ బాంబే', 2002లో జరిగిన 74వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'లగాన్' చిత్రాలు ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్‌ను దక్కించుకున్నప్పటికీ అవార్డులను గెలుచుకోలేదు. గత ఏడాది 'ఎఫ్ఎఫ్ఐ' ఆస్కార్‌కు పంపిన మలయాళ చిత్రం '2018: ఎవ్రీవన్ ఈజ్ ఏ హీరో' కూడా నామినేషన్ దక్కించుకోలేదు. తాజాగా 'లాపతా లేడీస్' ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్‌ను దక్కించుకుంటే.. 23ఏళ్ల తర్వాత ఈ విభాగంలో ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకున్న భారతీయ చిత్రంగా నిలుస్తుంది. వచ్చే ఏడాది జనవరి 17న ఆస్కార్ నామినేషన్స్‌ను అధికారికంగా ప్రకటించనున్న సంగతి తెలిసిందే.

'లాపతా లేడీస్' ప్రత్యేక కథనం 'ఫ్యామిలీ'లో..

వీరమల్లు డేట్ ఫిక్స్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హరి హర వీరమల్లు' రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. మార్చి 28న ఈ మూవీ ప్రేక్షకులముందుకు రానుంది. జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ హీరోయిన్. బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని తొలిపార్టు 'హరి హర వీర మల్లు పార్ట్–1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' ను 2025 మార్చి 28న రిలీజ్ చేయనున్నట్లుగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ సోమవారం నుంచి విజయవాడలో ప్రారంభమైంది. పవన్ కల్యాణ్ పాల్గొంటుండగా భారీ యుద్ధ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి.


పవన్ కల్యాణ్

మిస్టర్ సెలబ్రిటీ సక్సెస్ కావాలి

గోపీచంద్


గోపీచంద్, సుదర్శన్

పరుచూరి సుదర్శన్ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. వరలక్ష్మి శరత్ కుమార్, శ్రీ దీక్ష, నాజర్ ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకు రవి కిషోర్ దర్శకత్వం వహించారు. చిన్న రెడ్డయ్య, ఎన్. పాండు రంగారావు నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'నీ జతగా..' పాట లిరికల్ వీడియోను హీరో గోపీచంద్ విడుదల చేసి, మాట్లాడుతూ–''పరుచూరి వెంకటేశ్వరరావుగారి మనవడు సుదర్శన్ హీరోగా చేస్తున్నాడు. ఈ చిత్రం టీజర్ బాగుంది, సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు. గణేశా రచించిన 'నీ జతగా..' పాటను జావెద్ అలీ పాడారు. ఈ సినిమాకు వినోద్ యాజమాన్య స్వరకర్త.



సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవీ చైతన్య జోడీగా నటిస్తున్న చిత్రం 'జాక్'. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ నేపాల్‌లో జరుగుతోంది. కాగా సోమవారం(సెప్టెంబర్ 23) 'బొమ్మరిల్లు' భాస్కర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సెట్స్‌లో ఆయన బర్త్‌డే వేడుకలు నిర్వహించారు మేకర్స్. సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవీ చైతన్య, నటుడు ప్రకాష్ రాజ్, బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

అందులో వాస్తవం లేదు

– నిర్మాత రవిశంకర్



అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌ను లైంగికంగా వేధించాడనే ఆరోపణలపై కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై తాజాగా 'పుష్ప' సినిమా నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ స్పందించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన 'మత్తు వదలరా 2' సినిమా సక్సెస్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'జానీమాస్టర్ వ్యవహారంలో హీరో అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. దానిపై మీ స్పందన ఏంటి?' అనే ప్రశ్నకు రవిశంకర్ బదులిస్తూ... ''ప్రస్తుతం నడుస్తున్న వివాదం పూర్తిగా వాళ్ల (జానీ మాస్టర్, బాధితురాలు) వ్యక్తిగతం. 'పుష్ప 2: ది రూల్' సినిమాకి గణేశ్ ఆచార్య మెయిన్ కొరియోగ్రాఫర్. విజయ్ పోలకి, ఆ అమ్మాయి (బాధితురాలు) అడిషనల్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. 'పుష్ప 2: ది రూల్' ప్రారంభం నుంచే ఆ అమ్మాయిని తీసుకున్నాం. సినిమాలోని అన్ని పాటలకు ఆమె పని చేస్తారు. ఐదారు నెలల క్రితం మేము రిలీజ్ చేసిన ఓ లిరికల్ వీడియోలోనూ ఆమె పేరు ఉంటుంది. ప్రస్తుతం రెండు పాటలు బ్యాలెన్స్ ఉన్నాయి. అక్టోబర్ 15 తర్వాత ఆ పాటల చిత్రీకరణకు సన్నాహాలు చేశాం. ఈ సినిమాలోని ఓ ప్రత్యేక పాటని జానీ మాస్టర్‌తో చేయించాలనుకున్నాం. ఇంతలోగా ఈ గొడవ తెరపైకి వచ్చింది. ఎవరైనా డ్యాన్స్ మాస్టర్స్, డ్యాన్సర్ గుడ్ మార్నింగ్, గుడ్ ఈవెనింగ్ చెబితే స్పందించడం తప్ప హీరోకు (అల్లు అర్జున్) ఏమీ తెలియదు. ఈ విషయంపై బాధ్యత కలిగిన ప్రధాన మీడియా వార్తలు రాయడం లేదు. కానీ, కొత్తగా వచ్చిన కొన్ని యూట్యూబ్ ఛానల్స్ సెన్సేషన్ కావడం కోసం ఇష్టం వచ్చినట్లు రాస్తున్నారు. జానీ మాస్టర్‌ని ఆపి ఆ అమ్మాయిని ప్రమోట్ చేయాలనే వ్యక్తిత్వం బన్నీ గారిది కాదు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఇదంతా కొందరి అలజడి మాత్రమే. వారిద్దరి మధ్య గొడవలు ఉన్నా అది వారి వ్యక్తిగతం.. దాని గురించి మనం మాట్లాడటానికి కూడా ఏం లేదు'' అన్నారు.

చూడకయ్యోలో సాహిత్యం బాగుంది

– చంద్రబోస్


విఘ్నేష్, చంద్రబోస్, మార్కండేయ

''ప్రణయ గోదారి' సినిమాలోని 'చూడకయ్యో..' అనే పల్లవితో సాగే పాట చాలా బాగుంది. మార్కండేయ చక్కని సాహిత్యంతో పాటు ఆకట్టుకునే స్వరకల్పన చేశాడు'' అని ప్రముఖ పాటల రచయిత చంద్రబోస్ అన్నారు. సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మించారు. మార్కండేయ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'చూడకయ్యో.. నెమలికళ్ల తూగుతున్న తూనీగల్లా..' అంటూ సాగే మెలోడీ పాటను చంద్రబోస్ విడుదల చేశారు. ''ప్రణయ గోదారి' పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని మేకర్స్ తెలిపారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
24-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
384	148
84,929	25,939

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,975	▲ 26
డోజోన్స్	42,077	▲ 14
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,260	▲ 30
డాక్స్	18,847	▲ 127
షాంఘై	2,749	▲ 12
నికాయ్	37,724	▲ 569

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	74,467
బంగారం (99.5 స్వచ్ఛత)	74,169
వెండి (కిలో)	87,756

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.05	84.07
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.98	112.62
€	యూరో	ఒకటి	92.09	94.49
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.24	58.56
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.10	58.06
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.39	67.06
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.86	23.64
¥	చైనా యువాన్	ఒకటి	10.97	12.79

పసిడి.. పరుగో పరుగు!



న్యూయార్క్/న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పసిడి పరుగు కొనసాగుతోంది. నైమెక్స్ ఫ్యూచర్స్ మార్కెట్‌లో చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ కాంట్రాక్ట్ ఔన్స్ (31.1గ్రా) ధర క్రితం ముగింపుతో పోల్చితే సోమవారం 12 డాలర్లు పెరిగి సరికొత్త రికార్డు 2,659.7 డాలర్లను తాకింది. ఈ వార్త రాస్తున్న రాత్రి 9 గంటల సమయంలో దాదాపు అదే స్థాయిలో ట్రేడవుతోంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫండ్ రేటు కోతతో మార్కెట్‌లో ద్రవ్య లభ్యత పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు, పలు దేశాల్లో కొనసాగుతున్న ద్రవ్యోల్బణం భయాలు పసిడి పరుగుకు కారణం. ఇక దేశీయంగా కూడా పసిడి ధర పటిష్టంగానే కొనసాగుతున్నప్పటికీ, కస్టమ్స్ సుంకాల తగ్గింపు, రూపాయి బలోపేత ధోరణి పసిడి పరుగును కొంత నిలువరిస్తున్నాయి. న్యూఢిల్లీలో 10 గ్రాముల ధర రూ. 600 ఎగసి రూ. 76,950కి చేరింది. దేశీయ ఫ్యూచర్స్ ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల ధర రూ.255 పెరిగి రూ.74,295కు చేరింది.

మూడో భారీ ఎకానమీ దిశగా భారత్!

- దేశ వృద్ధిలో భాగమవ్వండి; అవకాశాలు అందిపుచ్చుకోండి
- అమెరికా సీఈవోలకు ప్రధాని మోదీ పిలుపు



గ్లోబల్ టెక్ సీఈఓలతో సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ

న్యూయార్క్: భారత్ త్వరలో మూడో అతి పెద్ద ఎకానమీగా ఆవిర్భవించనున్న నేపథ్యంలో దేశ ఆర్థిక వృద్ధిలో భాగమవ్వాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని అమెరికన్ దిగ్గజ సంస్థల సీఈవోలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తాము అధికారం చేపట్టిన మూడో విడత కాలంలో (2024–29) భారత్‌ను భారీ ఎకానమీల్లో మూడో స్థానానికి చేర్చేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తామని మోదీ స్పష్టం చేశారు. ప్రస్తుతం 3.9 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ తర్వాత భారత్ అయిదో స్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. దేశ ఆర్థిక, సాంకేతికత ప్రగతితో లభించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని కంపెనీలకు ప్రధాని సూచించారు. యావత్ ప్రపంచం కోసం ఉత్పత్తులు, సేవలను రూపొందించేందుకు, ఉత్పత్తి చేసేందుకు భారత్‌తో చేతులు కలపాలని ఆయన పేర్కొన్నారు. మేధోహక్కుల పరిరక్షణకు, టెక్నాలజీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తయారీ, సెమీకండక్టర్లు తదితర విభాగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని వివరించారు. 'సెమీకండక్టర్ల తయారీకి గ్లోబల్ హబ్'గా భారత్‌ను తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు.

'టెక్ సీఈవోలతో సమావేశం ఫలప్రదంగా జరిగింది. టెక్నాలజీ, నవకల్పనలు మొదలైన అంశాలు చర్చకు వచ్చాయి. ఆయా విభాగాల్లో భారత పురోగతిని వివరించాను' అని ఎక్స్‌లో మోదీ పోస్ట్ చేశారు. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ నిర్వహించిన సమావేశంలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఎడోబ్ సీఈవో శంతను నారాయణ్, యాక్సెంచర్ సీఈవో జూలీ స్వీట్ తదితరులు పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలకు అనుకూలమైన విధానాలతో భారత్, అంతర్జాతీయ టెక్నాలజీ హబ్‌గా ఎదుగుతోందని సీఈవోలు కితాబిచ్చారు.

ఎన్‌విడియా, గూగుల్ మరింత ఫోకస్

భారత్‌పై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు గూగుల్, ఎన్‌విడియా తదితర టెక్ దిగ్గజాలు వెల్లడించాయి. దేశీయంగా కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ వినియోగంపై ఫోకస్ పెట్టనున్నట్లు మోదీతో భేటీ అనంతరం సీఈవోలు తెలిపారు. డిజిటల్ ఇండియా విజన్ ద్వారా భారత్‌లో పరివర్తన తేవడంపై ప్రధాని దృష్టి పెట్టారని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. 'హెల్త్‌కేర్, విద్య, వ్యవసాయం వంటి విభాగాల్లో వినూత్న సొల్యూషన్స్ రూపొందించాలని ఆయన సూచించారు. భారత్‌లో ఏఐపై భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నాం. మరింతగా కలిసి పనిచేయడంపై ఆసక్తిగా ఉన్నాం' అని పేర్కొన్నారు. భారత్‌తో తమకు ఇప్పటికే వివిధ విభాగాల్లో భాగస్వామ్యం ఉందని, అధునాతన టెక్నాలజీ లను అందుబాటులోకి తెస్తున్నామని ఎన్‌విడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ తెలిపారు.

రియల్ బూమ్!

2047 నాటికి రియల్టీ మార్కెట్ @ రూ.830 లక్షల కోట్లు

- 2021 చివరికి రూ.16.6 లక్షల కోట్లు
- ఆర్థిక వృద్ధి, పట్టణీకరణతో డిమాండ్
- క్రెడాయ్, కొలియర్స్ ఇండియా నివేదిక

న్యూఢిల్లీ: దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరో రెండు దశాబ్దాల పాటు భారీ బూమ్‌ను చూడనుంది. 2021 చివరికి 0.2 ట్రిలియన్ డాలర్లు (రూ.16.6 లక్షల కోట్లు సుమారు)గా ఉన్న మార్కెట్.. 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 830 లక్షల కోట్లు) వృద్ధి చెందుతుందని క్రెడాయ్, కొలియర్స్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. అంతేకాదు, ఇళ్లకు బలమైన డిమాండ్ కొనసాగుతోందని, మందగమన సంకేతాలు లేవని క్రెడాయ్ స్పష్టం చేసింది. ''2021 నాటికి 0.2 ట్రిలియన్ డాలర్లతో భారత జీడీపీలో రియల్ ఎస్టేట్ రంగ వాటా 6–8 శాతం మధ్య ఉంది. గణనీయంగా పెరిగి 2031 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. 2047 నాటికి 3 నుంచి 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు. ఇది కనీస అంచనా మాత్రమే. వాస్తవానికి 5–7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఆశావహంగా చూస్తే 7–10 ట్రిలియన్ డాలర్లకు సైతం చేరుకునే అవకాశాలున్నాయి. అప్పటికి భారత జీడీపీలో రియల్ ఎస్టేట్ రంగం వాటా 14–20 శాతం మధ్య ఉంటుంది'' అని క్రెడాయ్, కొలియర్స్ ఇండియా నివేదిక తన అంచనాలను విడుదల చేసింది. అన్ని రియల్ ఎస్టేట్ విభాగాల్లోనూ స్థిరీకరణకు తోడు సంస్థల పాత్ర పెరుగుతున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఆఫీస్, నివాస రియల్ ఎస్టేట్‌తోపాటు, డేటా సెంటర్లు, వృద్ధుల ప్రత్యేక నివాసాల వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడుల సాధనాల్లో బలమైన వృద్ధిని అంచనా వేస్తున్నట్టు పేర్కొంది.



చిన్న పట్టణాలకూ విస్తరణ..

రియల్ ఎస్టేట్ వృద్ధి పెద్ద పట్టణాలను దాటి చిన్న పట్టణాలకూ చేరుకుంటుందని క్రెడాయ్–కొలియర్స్ ఇండియా నివేదిక తెలిపింది. ''వేగవంతమైన పట్టణీకరణ, మధ్య వయసు జనాభా పెరుగుతుండడం, టెక్నాలజీ పరంగా పురోగతితో కొత్త తరం వృద్ధి, వైవిధ్య దశకంలోకి అడుగు పెట్టాం''అని క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. 2047 నాటికి భారత జనాభాలో 50 శాతం పట్టణాల్లోనే నివసించనున్నట్టు అంచనా వేశారు. దీంతో ఇళ్లు, కార్యాలయాలు, రిటైల్ వసతులకు ఊహించనంత డిమాండ్ ఏర్పడనున్నట్టు తెలిపారు.

జీఎస్‌టీ ఇన్‌పుట్ క్రెడిట్ అవసరం

రియల్టీ రంగానికి జీఎస్‌టీ ఇన్‌పుట్ క్రెడిట్ ప్రయోజనం కల్పించాలని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ డిమాండ్ చేశారు. అందుబాటు ధరల ఇళ్ల నిర్వచనాన్ని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. చివరిగా 2017లో రూ.45 లక్షల వరకు ధరల్లోని వాటిని అందుబాటు ధరల ఇళ్లుగా పేర్కొనడం గమనార్హం.

ఈ వృద్ధి నాన్‌స్టాప్!

ఇళ్లకు డిమాండ్ బలంగా కొనసాగుతోందని, మందగమన సంకేతాల్లేవని క్రెడాయ్ స్పష్టం చే సింది. క్రెడాయ్ నాట్కాన్ సదస్సు సోమవారం ఢిల్లీలో మొదలైంది. ఈ నెల 26 వరకు ఇది కొనసాగనుంది. డిమాండ్‌కు తగ్గ ఇళ్ల సరఫరా అవసరం ఉందని క్రెడాయ్ తెలిపింది. ఏదైనా ఓ త్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు తగ్గడం అన్నది, కొత్త ఆవిష్కరణలు తక్కువగా ఉండడం వల్లేనని పేర్కొంది. కరోనా విపత్తు తర్వాత ఇళ్లకు మొదలైన డిమాండ్ ఇప్పటికీ బలంగానే ఉన్నట్టు వివరించింది. డిమాండ్‌కు తగ్గ నిల్వలు లేవని ప్రెస్టీజ్ గ్రూప్ సీఎండీ, క్రెడాయ్ మాజీ ప్రెసిడెంట్ ఇర్ఫాన్ రజాక్ తెలిపారు.

అన్‌స్టాప‘బుల్’!

మూడో రోజూ రికార్డులే!


85,000 చేరువకు సెన్సెక్స్ • 384 పాయింట్లు జూమ్
నిఫ్టీ 148 పాయింట్లు అప్ • 26,000 సమీపంలో ముగింపు

వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్టాలను అందుకున్నాయి. సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 పాయింట్ల మైలురాళ్లకు చేరువయ్యాయి. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోత బాట పట్టడం సెంటిమెంట్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

ముంబై: ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు, చౌక విదేశీ నిధులు దేశీయంగా ఇన్వెస్టర్లకు జోష్‌నిస్తున్నాయి. దీంతో తాజాగా సెన్సెక్స్ 384 పాయింట్లు ఎగసి 84,929 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 148 పాయింట్లు బలపడి 25,939 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 436 పాయింట్లు జంప్‌చేసి 84,980ను అధిగమించగా.. నిఫ్టీ 165 పాయింట్లు పురోగమించి 25,956కు చేరింది. వెరసి మరోసారి స్టాక్ ఇండెక్సులు చరిత్రాత్మక గరిష్టాల రికార్డులను సాధించాయి. కాగా.. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,980 పాయింట్లకుపైగా పుంజుకోవడం గమనార్హం!

ప్రభుత్వ బ్యాంక్స్ స్పీడ్: ఎన్ఎస్ఈలో ప్రధానంగా పీఎస్‌యూ బ్యాంక్స్ 3.4 శాతం జంప్‌చేయగా.. రియల్టీ, ఆయిల్–గ్యాస్, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ 2.2–1.2% మధ్య ఎగశాయి.

రూ. 8.3 లక్షల కోట్లు ప్లస్: వరుసగా మూడు రోజులపాటు దేశీ స్టాక్ మార్కెట్లు జోరు చూపడంతో ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ. 8.31 లక్షల కోట్లమేర బలపడింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ 4,76,03,923 కోట్లను అధిగమించింది.



స్టాక్ హైలైట్స్..

→ సిటీగ్యాస్ నెట్‌వర్క్ విస్తరణకు 37.5 కోట్ల డాలర్లు (రూ.3,130 కోట్లు) వెచ్చించనున్న వార్తలతో అదానీ టోటల్ గ్యాస్ కౌంటర్‌కు డిమాండ్ నెలకొంది. దీంతో షేరు 6% జంప్‌చేసి రూ.836 వద్ద ముగిసింది.

→ 4జీ, 5జీ సేవల విస్తరణకు వీలుగా నోకియా, ఎరిక్సన్, శామ్‌సంగ్‌లకు ఉమ్మడిగా రూ. 30,000 కోట్ల విలువైన కాంట్రాక్టులను జారీ చేయడంతో వొడాఫోన్ ఐడియా వెలుగులో నిలిచింది. ఇంట్రాడేలో షేరు 14 శాతం (ఎన్ఎస్ఈ) దూసుకెళ్లి రూ. 11.94ను తాకింది. చివరికి 3.7 శాతం లాభంతో రూ. 10.85 వద్ద ముగిసింది.

→ ప్రభుత్వ రంగ దిగ్గజం ఎన్‌టీపీసీ నుంచి రూ. 6,100 కోట్ల విలువైన థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆర్డర్ లభించడంతో పీఎస్‌యూ దిగ్గజం బీహెచ్ఈఎల్ షేరు 3 శాతం ఎగసింది. బీఎస్ఈలో రూ. 274 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రిటైల్ షాపింగ్ మాల్స్‌కు డిమాండ్
ఉద్యోగులకు ప్రైవేట్ బ్యాంకుల ఆఫర్లు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌సీ-వెస్టర్న్ రైల్వేలో 5,066 అప్రెంటిస్‌లు

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–వెస్టర్న్ రైల్వే.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి వెస్టర్న్ రైల్వే పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్‌లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 5,066.
» **డివిజన్/వర్క్‌షాప్‌లు:** బీసీటీ డివిజన్, బీఆర్‌సీ డివిజన్, ఏడీఐ డివిజన్, ఆర్‌టీఎం డివిజన్, ఆర్‌జేటీ డివిజన్, బీవీపీ డివిజన్, పీఎల్ వర్క్‌షాప్, ఎంఎక్స్ వర్క్‌షాప్, బీవీపీ వర్క్‌షాప్, డీహెచ్‌డీ వర్క్‌షాప్, పీఆర్‌టీఎన్ వర్క్‌షాప్, ఎస్‌బీఐ ఇంజనీరింగ్ వర్క్‌షాప్, ఎస్‌బీఐ సిగ్నల్ వర్క్‌షాప్, హెడ్ క్వార్టర్ ఆఫీస్.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, మెకానిక్, పీఎస్ఏఏ, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, వైర్‌మ్యాన్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, పైప్ ఫిట్టర్, ప్లంబర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, స్టెనోగ్రాఫర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 22.10.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీఐ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.10.2024
» **వెబ్‌సైట్:** https://www.rrcwr.com

సీటెట్-2024

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) డిసెంబర్–2024 ఏడాదికి సంబంధించి సీటెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతి ఏటా రెండుసార్లు సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్)ను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది.

» **అర్హత:** పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** పరీక్షలో మొత్తం రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదో తరగతులకు బోధించాలనుకునే ఉపాధ్యాయుల కోసం, రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్‌కు లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.10.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 21.10.2024 నుంచి 25.10.2024 వరకు
» **పరీక్ష తేది:** 01.12.2024.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
» **వెబ్‌సైట్:** http://https//ctet.nic.in

సీబీఎస్ఈ సింగిల్ గర్ల్ చైల్డ్ మెరిట్ స్కాలర్‌షిప్

తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాలికలను విద్యలో ప్రోత్సహించడమే లక్ష్యంగా 2006 నుంచి సింగిల్ గర్ల్ చైల్డ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను సీబీఎస్ఈ అమలు చేస్తుంది.

» **అర్హత:** సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల్లో 11, 12వ తరగతులు అభ్యసిస్తుండాలి. పదో తరగతిలో కనీసం 60 శాతం మార్కులు(ఐదు సబ్జెక్టుల్లో) సాధించిన వారు ఈ స్కాలర్‌షిప్ అవార్డుకు అర్హులు. తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న అమ్మాయిలు మాత్రమే అర్హులు.
» **స్కాలర్‌షిప్:** నెలకు రూ.500 చొప్పున రెండేళ్ల పాటు అందజేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.10.2024.
» **వెబ్‌సైట్:** https://www.cbse.gov.in

బీమా రంగంలో ఆఫీసర్ కొలువు!

» 170 పోస్టులకు ఎన్ఐఏసీఎల్ నోటిఫికేషన్
» జనరలిస్ట్, స్పెషలిస్ట్ విభాగాల్లో కొలువులు
» స్కేల్–1 హోదాతో నెలకు వేతనం రూ.88 వేలు
» మూడు దశల్లో నియామక ప్రక్రియ

బీమా రంగం.. బీఎఫ్ఎస్ఐ రంగంలో కీలకమైన విభాగం! ఇటీవల కాలంలో ఇన్సూరెన్స్ రంగం వేగంగా విస్తరిస్తోంది. దీంతో.. ఈ రంగంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమ కార్యకలాపాల విస్తరణకు అవసరమైన మానవ వనరుల కోసం నియామకాలు చేపడుతున్నాయి. తాజాగా ప్రభుత్వ రంగ సంస్థ న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐఏసీఎల్).. జనరల్, స్పెషలిస్ట్ విభాగాల్లో మొత్తం 170 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎన్ఐఏసీఎల్ ఏఓ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..



మొత్తం పోస్టులు 170

తాజా నోటిఫికేషన్ ద్వారా న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ.. రెండు కేడర్లలో 170 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. జనరలిస్ట్ కేడర్‌లో 120, అకౌంట్స్ విభాగంలో 50 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- జనరలిస్ట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- అకౌంట్స్ విభాగంలో పోస్టులకు సీఏ/కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్‌తోపాటు ఏదైనా విభాగంలో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులవ్వాలి లేదా కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ ఫైనాన్స్/పీజీడీఎం ఫైనాన్స్/ఎంకామ్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 01.09.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం నెలకు రూ.88 వేలు

న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కొలువులు సొంతం చేసుకున్న వారు నెలకు రూ.88 వేల వేతనం పొందొచ్చు. స్కేల్–1 ఆఫీసర్ హోదాలో రూ.50,925–రూ.96,765 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

100 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు), రీజనింగ్ ఎబిలిటీ (35 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో విభాగానికి 20 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం 60 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి సెక్షన్‌కు నిర్దిష్ట సమయం నిబంధన అమలు చేస్తారు. ఆ సమయం పూర్తయ్యాకే మరో సెక్షన్ ప్రశ్నలకు సమాధానానికి అవకాశం కల్పిస్తారు.

మెయిన్ ఎగ్జామ్ ఇలా

ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 15 మందిని చొప్పున మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష జనరలిస్ట్ కేడర్‌కు, అకౌంట్స్ కేడర్‌కు వేర్వేరుగా ఉంటుంది.

- **జనరలిస్ట్ ఏఓ మెయిన్:** జనరలిస్ట్ ఏఓ మెయిన్ ఎగ్జామ్ నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి 50 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- **అకౌంట్స్ ఏఓ మెయిన్ పరీక్ష:** అకౌంట్స్ విభాగంలోని స్పెషలిస్ట్ కేడర్ పోస్టులకు అయిదు విభాగాల్లో 200 మార్కులకు మెయిన్ పరీక్ష ఉంటుంది. టెస్ట్ ఆఫ్ రీజనింగ్ (40 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు), టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (40 ప్రశ్నలు), స్పెషలిస్ట్ స్ట్రీమ్ (40 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

డిస్క్రిప్టివ్ పరీక్ష

జనరలిస్ట్, స్పెషలిస్ట్ ఏఓ పోస్టులకు సంబంధించి మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగానే ఆబ్జెక్టివ్ టెస్ట్‌తో పాటు మరో 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు లెటర్ రైటింగ్(10 మార్కులు), ఎస్సే రైటింగ్ (20 మార్కులు) రాయాల్సి ఉంటుంది. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో 30 నిమిషాల వ్యవధిలో ఈ పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు కంప్యూటర్ ద్వారా లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మెయిన్ ఎగ్జామ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బీమా రంగంపై ఉన్న అవగాహన, తాజా పరిణామాలపై పట్టును పరిశీలిస్తారు. దీంతోపాటు దరఖాస్తు చేసుకున్న పోస్ట్, అర్హతలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

మెరిట్ జాబితా

మూడు దశల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత నియామకాలు ఖరారు చేసే క్రమంలో వెయిటేజ్ విధానాన్ని అనుసరిస్తారు. మెయిన్ పరీక్షలో పొందిన మార్కులకు 75 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇస్తారు. అభ్యర్థులు పొందిన మార్కులను ఈ వెయిటేజీకి అనుగుణంగా క్రోడీకరించి తుది జాబితా రూపొందించి నియామకం ఖరారు చేస్తారు.

ఏడాది ప్రొబేషన్

నియామకం ఖరారు చేసుకున్న వారికి తొలుత ఏడాది పాటు ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలోనే ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే నాన్–లైఫ్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రొబేషన్ పూర్తయినట్లుగా పరిగణిస్తారు. లేదంటే మరో ఆరు నెలలు పొడిగిస్తారు. దీంతో పాటు అభ్యర్థులు కనీసం నాలుగేళ్ల పాటు సంస్థలోనే పని చేస్తామని సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు పదోన్నతుల ద్వారా డీజీఎం, జీఎం స్థాయికి చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 29
- **ప్రిలిమినరీ (ఫేజ్–1) రాత పరీక్ష తేదీ:** 2024, అక్టోబర్ 13
- **మెయిన్ (ఫేజ్–2) రాత పరీక్ష తేదీ:** 2024, నవంబర్ 17
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.newindia.co.in/recruitment/list

రాత పరీక్షలో రాణించే మార్గం

టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్‌ను అనుసరించడం మేలు చేస్తుంది.

టెస్ట్ ఆఫ్ రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ కీలకమైన రీజనింగ్ కోసం సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్,ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్,సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై అవగాహన పెంచుకోవాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితో పాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే ప్రిలిమ్స్, మెయిన్స్ రెండిటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్

ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

స్పెషలిస్ట్ స్ట్రీమ్

మెయిన్ పరీక్షలో ఉండే స్పెషలిస్ట్ స్ట్రీమ్ విభాగం కోసం అకౌంట్స్ విభాగానికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేస్తూ అడుగులు వేయాలి.గత ప్రశ్న పత్రాలు ప్రాక్టీస్ చేయాలి.

నాలుగు గుండెలకు ప్రాణం పోశారు!

- నిమ్స్‌లో చిన్న పిల్లలకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలు
- ఈ నెల 30వ తేదీవరకు ప్రత్యేక వైద్య శిబిరం

లక్డీకాపూల్ (హైదరాబాద్): గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్న పిల్లలకోసం నిమ్స్ ఆస్పత్రి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తోంది. పేద వర్గాల వారికి చేయూతను అందించేందుకు యూకే (బ్రిటన్)కు చెందిన డాక్టర్ రమణ ధన్నపునేని వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచితంగా గుండె జబ్బులకు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తోంది. ఈ బృందం వైద్యులు సోమవారం నలుగురు పిల్లలకు శస్త్ర చికిత్సలు చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగే శిబిరంలో దాదాపు 20 మంది పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో పిల్లలకు ఉచితంగా 2డీ ఎకోకార్డియోగ్రామ్ స్క్రీనింగ్‌లను కూడా నిర్వహిస్తున్నారు. డాక్టర్ రమణ నేతృత్వంలో ప్రతి సంవత్సరం గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు ప్రత్యేక శిబిరం ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు అందిస్తున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. నాలుగేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా, గుండె జబ్బులకు సంబంధించి సుమారు 25 శాతం కేసులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నట్టు నిమ్స్ కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అమరేశ్‌రావు తెలిపారు. తమ ఆస్పత్రిలో ప్రతి నెల సగటున 30 క్లిష్టమైన సర్జరీలు చేస్తున్నామన్నారు. ఓపీ సేవల కోసం వస్తున్న రోగుల్లో 80 శాతం మంది చిన్నపిల్లలే ఉంటున్నారని, కార్పొరేట్ హాస్పిటల్స్ నుంచి కూడా రిఫరల్ కేసులు వస్తున్నాయని ఆయన చెప్పారు.

తెలుగు సహా 10 భాషల్లో ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నిఘంటువు

ఆవిష్కరించిన కేంద్రమంత్రి బీఎల్ వర్మ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు సహా 10 భారతీయ భాషల్లో ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (ఐఎస్ఎల్) నిఘంటువు అందుబాటులోకి వచ్చింది. సంకేత భాషా దినోత్సవం-2024 సందర్భంగా సోమవారం ఢిల్లీలో జరిగిన వేడుకల్లో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ సంకేత భాష నిఘంటువును ఆవిష్కరించారు. బధిరులకు విద్య, ఉపాధి అవకాశాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా సైన్స్, సోషల్ సైన్స్, గణితం, ఇంగ్లిష్‌తో సహా 6వ తరగతి సబ్జెక్టుల కోసం భారతీయ సంకేత భాష (ఐఎస్ఎల్)లో 100 ఫౌండేషన్ కాన్సెప్ట్ వీడియోలను విడుదల చేశారు. ఐఎస్ఎల్ డిక్షనరీలో 2,500 కొత్త సంకేత పదాలను పరిచయం చేశారు. కమ్యూనిటీని ప్రేరేపించడానికి ఇండియన్ సైనింగ్ హ్యాండ్స్ డెవలప్ చేసిన డెఫ్ రోల్ మోడల్ వీడియోలు విడుదల చేశారు. కాగా శ్వాస్ ప్లాట్‌ఫారం ప్రారంభోత్సవంతోపాటు 25 నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లు/కాంపోజిట్ ప్రాంతీయ కేంద్రాలు, మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లకు యాక్సెస్‌ను అందిస్తోంది.

'దేవర' అదనపు షోలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా తెరకెక్కిన దేవర చిత్రం అదనపు షోల ప్రదర్శనతోపాటు టికెట్ రేట్ల తాత్కాలిక పెంపునకు ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్ర వ్యాప్తంగా 29 థియేటర్లలో 27న తెల్లవారుజామున అదనపు షో వేసేందుకు, ఈ షోకు టికెట్ ధరపై అదనంగా రూ.100 వసూలుకు ఓకే చెప్పింది. అలాగే అన్ని థియేటర్లలో 27న 6 ఆటలను ప్రదర్శించేందుకు అనుమతించడంతోపాటు టికెట్ ధరపై రూ. 100 అదనంగా పెంచుతూ ఉత్తర్వులిచ్చింది. ఈనెల 28 నుంచి అక్టోబర్ 6 వరకు తొమ్మిది రోజులపాటు అన్ని థియేటర్లలో రోజుకు ఐదు షోలకు అనుమతించింది. సింగిల్ థియేటర్లలో టికెట్ ధరపై అదనంగా రూ. 25 పెంపు, మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరపై అదనంగా రూ. 50 పెంపు ఈ తొమ్మిది రోజులు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.



కర్ర జారిందా.. ప్రాణం గోవిందా

సగం కూలిన సీసీ రోడ్డును కర్ర ఆపుతుందా..? ఈ చిత్రం చూస్తే విషయం మీకే అర్థమవుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా కురవిలోని ముత్యాలమ్మ కుంట కట్టపై నిర్మించిన సీసీ రోడ్డు కింది భాగం వరద తాకిడికి కోతకు గురైంది. దీంతో మట్టిపై ఒక కర్రను సీసీ రోడ్డుకు పెట్టి రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షానికి మట్టి కూలినా.. కర్ర జారినా.. ఆ సమయంలో ఎవరైనా రోడ్డుపైనుంచి నడిచినా.. ఇక అంతే సంగతులు. అధికారులు స్పందించి సీసీ రోడ్డును పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

కురవి

దోశ అతుక్కోదు



అనారోగ్యం అతుక్కుంటుంది

నాన్‌స్టిక్ వంటపాత్రల వాడకంలో జాగ్రత్తలు పాటించకుంటే అనారోగ్యం తప్పదంటున్న నిపుణులు

ముఖ్యంగా టెఫ్లాన్ ఫ్లూ ముప్పు పొంచి ఉందని హెచ్చరిక

సన్నని మంటపై వాటిని వాడితేనే మేలని సూచన

సాక్షి, హైదరాబాద్: తావా, ప్యాన్, కడాయ్.. పేరేదైనా వంటకాలు అడుగంటకుండా లేదా మాడిపోకుండా ఉండేందుకు అందరూ వాడుతున్నవి నాన్‌స్టిక్ పాత్రలే. టెఫ్లాన్ కోటింగ్‌తో ఉండే ఆ పాత్రలను సరిగ్గా ఉపయోగించకపోతే అనారోగ్య సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా టెఫ్లాన్ ఫ్లూ ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ టెఫ్లాన్ ఫ్లూ అంటే ఏమిటి? దాని లక్షణాలు ఏమిటి?

టెఫ్లాన్ ఫ్లూ అంటే..

నాన్‌స్టిక్ వంటపాత్రలపై టెఫ్లాన్ లేదా పాలీ టెట్రా ఫ్లూరో ఇథిలిన్ (పీటీఎఫ్ఈ) అనే కృత్రిమ రసాయనం పూత పూస్తారు. సాధారణంగా ఇది ఏ పదార్థంతోనూ రసాయనిక చర్య జరపదు. కానీ 500 డిగ్రీల సెల్సియస్‌కన్నా అధిక ఉష్ణోగ్రతలకు ప్యాన్/తావా/కడాయ్‌ను గురిచేసినా లేదా ఖాళీ ప్యాన్‌ను స్టవ్‌పై పెట్టి వేడి చేసినా లేదా ప్యాన్ సైజ్‌తో పోలిస్తే తక్కువ పరిమాణంలో వండుతున్నా దానిపై ఉండే టెఫ్లాన్ కోటింగ్ ఆ వేడికి కరిగిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ భారీ ఉష్ణోగ్రత వంటనూనెల స్మోక్ పాయింట్‌కన్నా చాలా ఎక్కువ కావడం వల్ల వెంటనే దట్టమైన పొగ రావడంతోపాటు టెఫ్లాన్ కోటింగ్ కరిగిపోతుందని అంటున్నారు. ఇలాంటి పొగను పీల్చినా లేదా ఆ వంటపాత్రల్లో వండిన ఆహారం తిన్నా శరీరంలోకి టెఫ్లాన్ రసాయనం ప్రవేశించి టెఫ్లాన్ ఫ్లూ కలిగించొచ్చని హెచ్చరిస్తున్నారు.

లక్షణాలు ఏమిటి?

టెఫ్లాన్ ఫ్లూను పాలీమర్ ఫ్యూమ్ జ్వరం అని కూడా అంటారు. టెఫ్లాన్ పూత నుంచి వచ్చే 'పర్‌ఫ్లోరో ఆక్టానోయిక్ యాసిడ్'తో కూడిన విషపూరిత పొగలను పీల్చడం ద్వారా ఇది వస్తుంది. టెఫ్లాన్ ఫ్లూ వచ్చినప్పుడు చలి జ్వరంతోపాటు దగ్గు, ఛాతీ బరువుగా అనిపించడం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, తలనొప్పి, అలసట, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి. ఈ పొగ పీల్చుకున్న కొద్ది గంటల్లోనే లక్షణాలు కనిపిస్తాయి. దాదాపు 24 గంటల నుంచి రెండు రోజుల వరకు లక్షణాలు ఉంటాయి. అయితే అమెరికా వంటి దేశాల్లో టెఫ్లాన్ ఫ్లూను గుర్తించేందుకు ప్రత్యేక పరీక్షలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా అమెరికాలో దాదాపు 3,500 టెఫ్లాన్ ఫ్లూ కేసులను గుర్తించారు. కానీ మన దేశంలో టెఫ్లాన్ ఫ్లూతో అనేక మంది ఇబ్బంది పడుతున్నా సరైన నిర్ధారణ పరీక్షలు లేకపోవడం వల్ల అవి లెక్కలోకి రావట్లేదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నాన్‌స్టిక్ వంట పాత్రలను వాడేటప్పుడు పెద్ద మంటపై కాకుండా సన్నటి మంటపైనే వంట చేసుకోవాలి.
- ఇలాంటి వంటపాత్రల్లో వండేటప్పుడు స్టీల్, ఇత్తడి, అల్యూమినియం గరిటెలను వాడకూడదు. చెక్కతో చేసిన గరిటెలను మాత్రమే వాడుకోవాలి. లేదంటే స్టీల్ వంటి గరిటెలతో టెఫ్లాన్ కోటింగ్ పోయి, ఆహారపదార్థాల్లో కలిసి శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది.

హలో.. సైబర్ సెక్యూరిటీ బ్యూరో..

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వారి చేతుల్లో డబ్బు పోగొట్టుకుంటున్న బాధితుల సంఖ్య నిత్యం పెరుగుతోంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 1930కు వస్తున్న ఫిర్యాదు కాల్సే ఇందుకు ఉదాహరణ. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకు రోజుకు సరాసరిన 1600 ఫోన్‌కాల్స్ వచ్చి నట్టు అధికారులు తెలిపారు. ఇందులో ఎక్కువగా ఆర్థిక మోసా లకు సంబంధించినవి 50 శాతం కాగా, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు 50 శాతం ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 వరకు మొత్తం 460 మంది సైబర్ నేరగాళ్లను 351 కేసుల్లో అరెస్టు చేసినట్టు అధికారులు చెప్పారు.

టీజీసీఎస్‌బీకి ఫిర్యాదుల మోత

- టోల్‌ఫ్రీ నంబర్ 1930కు రోజుకు 1600 ఫోన్‌కాల్స్
- ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 31 వరకు 351 కేసుల్లో 460 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

➤ టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ప్రతి రోజూ సరాసరిన 330 ఫిర్యాదులు నమోదవుతున్నాయి. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదుల్లో 90 శాతం ఫిర్యాదులకు 1930 కాల్ సెంటర్ సిబ్బంది సమాధానాలు చెబుతున్నారు. ఈ ఏడాదిలో ఆగస్టు 31 వరకు బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వారు పోగొట్టుకున్న సొమ్ములో 13 శాతం సొమ్మును సకాలంలో ఫిర్యాదు చేయడంతో టీజీసీఎస్‌బీ అధికారులు కాపాడారు. ఇలా మొత్తం రూ.163 కోట్లు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చేశారు.



దేశవ్యాప్తంగా **96,686** క్రిమినల్ లింక్‌లు గుర్తించగా, ఇందులో తెలంగాణ నుంచే **16,540** లింక్‌లు ఉన్నాయి.

బ్లాక్ చేసిన సిమ్‌కార్డుల సంఖ్య..	ఐఎంఈఐ బ్లాక్ చేసినవి	యూఆర్ఎల్ బ్లాక్ చేసినవి
13,435	8,292	1,416

ఒకే కేసులో అత్యధికంగా పోగొట్టుకున్న సొమ్ము రూ. **13,16,94,360**

ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 31 వరకు నమోదైన కేసులు రూ. **78,967**

భారీ మోసం కేసుల్లో కీలక అరెస్టులు

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులతో భారీగా లాభాలు వస్తాయని ఆశచూపి హైదరాబాద్‌కు చెందిన ఒకరి నుంచి రూ.5.27 కోట్లు కొల్లగొట్టిన కేసులో నిందితుడు సైదుల్ ఇస్లామ్‌ఖాన్‌ను పశ్చిమబెంగాల్‌లోని పుర్బ మెదినిపూర్‌లో ఈనెల 17న టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు.

హైదరాబాద్ చిక్కడపల్లిలో నివసించే ఓ వ్యక్తి వాట్సాప్ నంబర్‌కు సైబర్ నేరగాళ్లు లింక్‌లు పంపించి రూ.5.4 కోట్లు కొల్లగొట్టిన కేసులో ఇద్దరు కీలక నిందితులను విజయవాడలో ఆగస్టు 17న అరెస్టు చేశారు.

ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 31 వరకు బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రూ. **12,96,39,71,972**

25న బీఎఫ్ఎస్ఐ మినీ డిగ్రీ కోర్సుకు శ్రీకారం

ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి కల్పనలో భాగంగా డిగ్రీ, ఇంజనీరింగ్ చేస్తున్న దాదాపు 10 వేల మంది విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కొత్త కార్యక్రమం ప్రారంభిస్తోంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో వేలాది మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది నుంచే బ్యాంకింగ్ రంగంలోనూ శిక్షణ ఇప్పించనుంది. ఈ నెల 25న శిక్షణా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

20 ఇంజనీరింగ్, 18 డిగ్రీ కాలేజీల ఎంపిక..

'బీఎస్ఎఫ్ఐ'రంగంలో పేరొందిన కంపెనీలన్నీ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. అయితే ఈ రంగంలో శిక్షణ ఖరీదైనది కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని డిగ్రీ విద్యార్థుల కోసం శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. సీఎం రేవంత్ చొరవతో తెలంగాణ ఉన్నత విద్యామండలి.. బీఎఫ్ఎస్ఐ కన్సార్షియంతో ఒప్పందం కుదుర్చుకుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఖరీదైన మినీ డిగ్రీ ప్రోగ్రాంకు రూపకల్పన చేసింది. విద్యార్థులు సాధారణ డిగ్రీ కోర్సుతోపాటే ఈ కోర్సును చదవొచ్చు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే టీజీసీహెచ్ఈ ఎంపిక చేసిన 20 డిగ్రీ కాలేజీలు, 18 ఇంజనీరింగ్ కాలేజీల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ కోర్సులను నిర్వహించనున్నారు. 5 వేల మంది ఇంజనీరింగ్, 5 వేల మంది నాన్ ఇంజనీరింగ్ కేటగిరీల్లో మొత్తం 10 వేల మంది విద్యార్థులకు ఈ వర్క్ కోర్సు నేర్పించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

73 మంది.. ఒకే టీచర్



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల బోధనకు ఆటంకం కలుగుతోంది. 73 మంది విద్యార్థులకు ఒక్కరే బోధిస్తున్నారు. ఇటీవలి బదిలీల్లో భాగంగా పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు వచ్చారు. వారు గత నెలలోనే ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ఒక్క ఉపాధ్యాయిని సరిత మిగిలారు. ఒక నెలలో ఉద్యోగ విరమణ చేసేవారిని పాఠశాలకు కేటాయించారని స్థానికులు విమర్శిస్తున్నారు. సోమవారం ఉపాధ్యాయిని సరిత ఒక్కరే.. 58 మంది విద్యార్థులను వరండాలో కూర్చోపెట్టి బోధిస్తూ కనిపించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్/తాంసి

'బొచ్చె'డంత చేప!




నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఒక జాలరి వలకు 20 కిలోల చేప చిక్కింది. గ్రామానికి చెందిన పూట్నూర్ రాజేశ్.. ఆదివారం రాత్రి ఉప్లూర్ రోడ్డులోని వరద కాలువలో చేపలు పట్టేందుకు వంతెన వద్ద వల వేశాడు. సోమవారం ఉదయం వల తీయగా.. భారీ బరువున్న బొచ్చె జాతికి చెందిన 20 కిలోల చేప చిక్కింది. మెట్‌పల్లికి చెందిన కాంట్రాక్టర్‌కు రూ.2,400కు విక్రయించినట్లు జాలరి వెల్లడించాడు.

కమ్మర్‌పల్లి

పట్టించుకోని బిడ్డలకు మా ఆస్తులెందుకు?

గ్రీవెన్స్‌లో వృద్ధ దంపతుల ఫిర్యాదు



శాయంపేట: ఆస్తులు సంపాదించి ముగ్గురు కుమారులకు ఇచ్చాం. ఇళ్లు కట్టి ఇచ్చాం. వృద్ధాప్యంలో పట్టించుకోని బిడ్డలకు మా ఆస్తులు ఎందుకు? మా ఆస్తులు మాకు ఇప్పించండి.. అంటూ ఓ వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం శాయంపేట ఎంపీడీవో కార్యాలయంలో విలేకర్ల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన చెక్క చంద్రయ్య సారమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చంద్రయ్య హమాలీ పనిచేసి గ్రామంలో 10 ఎకరాల భూమి, పరకాల పట్టణంలో మూడు గుంటల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ముగ్గురు కుమారులకు 2002లో మూడు ఎకరాల చొప్పున భూమిని పంచి ఇచ్చాడు. పరకాలలో మూడు గుంటల్లో కట్టిన ఇంటిని 2012లో సమానంగా పంచాడు. వృద్ధ దంపతులిద్దరు గ్రామంలో ఓ షెడ్డు వేసుకొని అందులో ఉంటున్నారు. వృద్ధాప్యం మీద పడడంతో తమ ఆరోగ్యాలు సరిగ్గా లేవని, ఏ కుమారుడు కూడా పట్టించుకోవడం లేదని చెక్క చంద్రయ్య, సారమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కుమారులు పట్టించుకోకపోవడంతో జూలై 7న పోలీస్‌స్టేషన్‌లో, 8న పరకాల ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చంద్రయ్య తెలిపారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

కటౌట్లతో కోతులకు చెక్



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని కరివిరాలలో కోతుల బెడదకు కొండముచ్చుల కటౌట్లతో పరిష్కారం కనుగొన్నారు. కోతుల బెడద నుంచి రక్షించాలని ఇటీవల గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి ఎండీ అన్వర్‌కు విజ్ఞప్తి చేశారు. అన్వర్ వినూత్నంగా ఆలోచించి కొండముచ్చు కటౌట్లను తయారు చేయించి గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. వాటిని చూసిన కోతులు భయపడి గ్రామంలోకి రాకుండా భయపడి పారిపోతున్నాయి.

నడిగూడెం

బరాజ్‌ల వైఫల్యంలో 20 మంది ఇంజనీర్లు!

సాక్షి, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యానికి 20 మంది ఇంజనీర్లు బాధ్యులని జస్టిస్ పినాకి ఘోష్ కమిషన్ ప్రాథమికంగా తేల్చినట్టు సమాచారం. ఈ బరాజ్‌లపై విచారణ జరిపిన రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో 10 మంది దాకా ఇంజనీర్లు బాధ్యులని తేల్చింది. ఈ మేరకు విచారణకు సంబంధించిన మధ్యంతర నివేదికను కాళేశ్వరం కమిషన్‌కు అందించింది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అలసత్వం బరాజ్‌ల వైఫల్యానికి కారణాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ తన నివేదికలో పేర్కొంది. పూర్తి నివేదిక అందించడానికి మరికొంత కాలం గడువు కావాలని విజిలెన్స్ నివేదించగా.. పత్రాలన్నీ ఇస్తే తామే వైఫల్యానికి కారణాలను తేల్చుకుంటామని కమిషన్ స్పష్టం చేయడంతో నెలాఖరుకల్లా నివేదిక అందించడానికి విజిలెన్స్ అంగీకరించింది. ఇక విచారణను తప్పుదోవ పట్టించిన, నేరపూరితంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలతోపాటు, క్రిమినల్ కేసుల నమోదుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కమిషన్ యోచిస్తోంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుతో ముడిపడిన కేసులో ఉన్న ఇంజనీర్లపై కఠిన చర్యలకు ఉపక్రమించాలని, వీరికి పదోన్నతులు కూడా ఇవ్వరాదని ప్రభుత్వానికి లేఖ రాయాలని కమిషన్ భావిస్తున్నట్టు సమాచారం. చాలామంది అధికారులు అఫిడవిట్ రూపంలో దాఖలు చేసిన సమాచారంలో ఈ విషయాన్ని కమిషన్ గుర్తించింది. విచారణను తప్పుదోవ పట్టించడానికి వీరు ఉద్దేశపూర్వకంగా వ్యవహరించినట్టు తేలింది. ఇక కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతో ముడిపడిన అన్నీ డాక్యుమెంట్లు అందించాలని నీటిపారుదలశాఖను మరోమారు కమిషన్ ఆదేశించింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్, ఎం-బుక్ (మెజర్‌మెంట్ బుక్)లు కూడా కమిషన్‌కు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. రెండురోజులుగా జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఈ రెండు బుక్‌లకు సంబంధించిన ప్రస్తావన పలు సందర్భాల్లో వచ్చింది. దీంతో క్రాస్ ఎగ్జామినేషన్‌లో పేర్కొన్న వివరాలు సరైనవా? కావా? అనేది నిర్ధారణ కావాలంటే కీలకమైన రెండు బుక్‌లను తెప్పించుకోవడమే మేలని కమిషన్ నిర్ణయించింది. కాళేశ్వరంపై ఇదివరకే కాగ్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆ అధికారిని పిలిపించి, సమాచారం సేకరించాలని కమిషన్ నిర్ణయించింది.

ఇదీ పినాకి ఘోష్ కమిషన్ ప్రాథమిక లెక్క

- ఈఎన్‌సీ నుంచి ఏఈఈల దాకా...
- కాళేశ్వరం కమిషన్‌కు నివేదిక ఇచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- నెలాఖరులో పూర్తి నివేదిక



40 మంది ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని..

విచారణలో భాగంగా మంగళవారం నుంచి శనివారం దాకా 40 మంది దాకా ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని కమిషన్ నిర్ణయించింది. తాజా జాబితాలో మాజీ ఈఎన్‌సీతో పాటు పలువురు అధికారులు ఉన్నారు. ఇంజనీర్లను పూర్తిగా ప్రశ్నించిన తర్వాత ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లకు కమిషన్ కబురు పంపనుంది. ఆ పిదప కీలక ప్రజాప్రతినిధులకు కూడా సమన్లు పంపించనుంది. ఇప్పటికే విచారణలో స్పష్టత వచ్చింది.

లాయర్ లేకుండానే క్రాస్ ఎగ్జామినేషన్

లాయర్ లేకుండానే ఒంటరిగా క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని కాళేశ్వరం కమిషన్ నిర్ణయించింది. వాస్తవానికి శుక్ర, శనివారాల్లో మొత్తం 18 మందిని కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఒకవేళ కమిషన్ లాయర్‌ను సమకూర్చుకుంటే..ప్రతివాదులు కూడా లాయర్లను తెచ్చుకుంటున్నారని, దీనివల్ల రోజుకు ఒక్కరిని కూడా క్రాస్ ఎగ్జామినేషన్ చేయలేమనే అభిప్రాయానికి కమిషన్ వచ్చింది. క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియలో లాయర్లను అనుమతించడమంటే... విచారణ ప్రక్రియను మరింత జటిలం, వాయిదా వేయడమే అవుతుందనే అభిప్రాయంలో కమిషన్ ఉంది. అయితే కమిషన్‌కు న్యాయవాదిని సమకూర్చడానికి ప్రభుత్వం ఇదివరకే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది.

బస్సెత్తికెళ్లిపోయాడు



నిర్మల్‌లో ఓ దొంగ ఏకంగా ఆర్టీసీ బస్సు చోరీకి ప్రయత్నించాడు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వెనుక నుంచి ఆదివారం అర్ధరాత్రి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా భైని చెందిన గణేశ్.. లోపలికి చొరబడ్డాడు. డిపోలో నిలిపి ఉంచిన ఏపీ 01జెడ్ 0076 బస్సు ఎక్కి స్టార్ట్ చేశాడు. గేట్ బయటి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లాడు. బస్సు వివరాలు బుక్‌లో ఎంటర్ చేయకపోవడంతో గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు వంశీకి అనుమానం కలిగింది. వెంటనే అక్కడున్న బైక్ తీసుకుని బస్సును వెంబడించాడు. పట్టణ శివారులోని సోఫీనగర్ వద్ద స్థానికుల సహాయంతో బస్సును అడ్డుకున్నాడు. దొంగ మద్యం మత్తులో ఉన్నట్టు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకుని బస్సును డిపోకు తరలించారు. బస్సు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన గణేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నిర్మల్ టౌన్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
మంగళవారం : 24-9-2024

పాల ఉత్పత్తిదారుల సమస్యలు పరిష్కరించండి

సీఎంకు బీజేపీ నేత గూడూరు విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాల ఉత్పత్తిదారులు, రైతులను ఆదుకునేందుకు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతుల నుంచి సేకరించిన పాలకు మూడునెలలుగా ప్రభుత్వ అధీనంలోని డెయిరీ కంపెనీలు డబ్బులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాల ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల కారణంగా...డెయిరీ కార్యకలాపాల్లో నిమగ్నమైన రైతులు తమ ఆవులను మేపలేక కబేళాలకు అమ్ముకునే పరిస్థితులు తలెత్తాయని ఆవేదన వెలిబుచ్చారు. గతంలో ప్రభుత్వ సంస్థ విజయ డెయిరీ ప్రతి 15 రోజులకు పాడి రైతులకు డబ్బులు చెల్లించేదని, ప్రస్తుతం మూడునెలలుగా డబ్బులు అందక, రుణమాఫీ జరగక రైతులు తీవ్ర సమస్యల్లో కూరుకుపోయారని తెలియజేశారు.

హామీలు నెరవేర్చండి

సాక్షి, హైదరాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్ కులస్తులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ ముదిరాజ్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిజ్జన రమేశ్ ముదిరాజ్, టీపీసీసీ నేత బీమా లక్ష్మణ్ ముది రాజ్‌ల ఆధ్వర్యంలో సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్ లకు మంత్రిపదవితో పాటు ఎమ్మెల్సీలుగా, రాష్ట్ర, జిల్లా స్థాయి కార్పొరేషన్‌లకు చైర్మన్‌లుగా అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బీసీ (డి) నుంచి బీసీ (ఎ)కు మారుస్తామని ప్రకటించారని వివరించారు. ఈ హామీలను నెరవేర్చాలని ఆ వినతిపత్రంలో కోరారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఆదివాసీ కాంగ్రెస్ భేటీలో చైర్మన్ బెల్లయ్య నాయక్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ పిలుపు నిచ్చారు. ప్రతిపక్షాలు ఈర్ష్యతో చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని గిరిజన, ఆదివాసీలు తిప్పికొట్టాలని సూచించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా గిరిజనులకు ఇచ్చిన హామీలను ఐదేళ్లలో దశల వారీగా అమలు చేస్తామని చెప్పారు. పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం లభిస్తుందని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బి. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అక్టోబర్ 3వ తేదీన ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తామని, ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉద్యోగుల హెల్త్ కార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- సీఎంకు టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలు, డీఏలు, పీఆర్‌సీలే ఆధారమని, ఈ వర్గాలకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఉద్యోగ సంఘాల జేఏసీ నేత గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలిస్తున్నారని, బదిలీలు పారదర్శకంగా నిర్వహించారని, నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నందుకు ఆ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వానికి సేవచేసే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు వైద్యం అందించే బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని, ఒక్క గంట సమయం ఈ వర్గాల కోసం కేటాయించి హెల్త్ కార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈహెచ్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.





వానరం ఆగదు.. వాహనం సాగదు

నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మహబూబ్ ఘాట్ రోడ్డుపై కోతుల సంచారం పెరగడంతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు ఆహారం వేస్తుండటంతో.. అడవిలోని కోతులన్నీ రోడ్డు వెంట తిరుగుతున్నాయి. ఎవరైనా వాహనం ఆపగానే చుట్టుముట్టేస్తున్నాయి. వారు అందించే పండ్లు, ఇతర ఆహారం తింటున్నాయి. ఘాట్ దిగే సమయంలో వాహనాల వేగం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో కోతులు అడ్డువస్తే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. కోతులూ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జంట గ్రామాల 'ఐ'కమత్యం

నేత్ర, అవయవదానాలతో ఆదర్శం

ముందుకొచ్చిన ఓదెల, అబ్బిడిపల్లి గ్రామస్తులు



ఇప్పటికే నేత్రదానం చేసినవారు

సాక్షి, పెద్దపల్లి: ఆయుష్షు అరవై ఏళ్లు ఉందనుకుంటే.. మరణానంతరం మన కళ్లకు.. మరో అరవైఏళ్లు లోకాన్ని చూసే అదృష్టం కల్పించవచ్చని ఆలోచించారు ఆ జంట గ్రామాల ప్రజలు. పుట్టుకతో చూపు పోయినవారు కొందరు, ప్రమాదవశాత్తు కళ్లు పోయినవారు మరికొందరు.. వారికి జీవితమంతా చీకటే. ఇలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేలా.. చనిపోయిన తర్వాత కూడా కళ్లకు జీవితాన్నివ్వాలన్న గొప్ప ఆలోచన వారిలో తట్టింది. వెరసి ఆ ఊరు ప్రజలంతా మూకుమ్మడిగా నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేత్రదానంతో ఆదర్శంగా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఓదెల, అబ్బిడిపల్లి గ్రామాలపై స్ఫూర్తిదాయక కథనమిది.

ఒక్కరి కృషితో.. ఒక్కొక్కొరుగా కదలివచ్చి

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ఆర్ఎంపీ మేర్గు భీష్మాచారి స్థానికంగా ప్రాథమిక వైద్య చికిత్స చేస్తుండేవారు. ఆయన అత్తమ్మ చనిపోయినప్పుడు.. ఆమె కుమారులు నేత్రదానం చేశారు. నేత్రదానం అంటే.. పూర్తిగా కన్ను తీసుకుంటారనే అపోహలో ఉన్న ఆ ఆర్ఎంపీ.. కార్నియా సేకరణకు సహకరిస్తే.. మరొకరికి చూపు ఇచ్చిన వారవుతారని తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తు కంటిచూపు పోయి ఇబ్బంది పడుతున్న ఎందరినో చూసిన ఆయన.. మరికొందరితో కలిసి 2015లో సదాశయం ఫౌండేషన్ స్థాపించారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. తన వద్దకు వైద్య సాయం కోసం వచ్చేవారిని చైతన్యపరచటం ప్రారంభించారు. అదే స్ఫూర్తితో ప్రజలను చైతన్యపరుస్తూ ఇప్పటివరకు దాదాపు 2,000 మందితో నేత్రదానానికి హామీపత్రాలిచ్చేలా కృషి చేశారు.



హామీపత్రం చూపుతున్న గ్రామస్తులు

ఒకరిని చూసి మరొకరు..

తొలుత ఓదెల మేజర్ గ్రామపంచాయతీలో ఒక్కొక్కరుగా నేత్రదానం చేసేందుకు ముందుకురాగా, వారిని చూసి పక్కనే ఉన్న అబ్బిడిపల్లి గ్రామస్తులు సైతం ముందుకొచ్చారు. ఓదెల గ్రామంలో చనిపోయిన 190 మంది నేత్రదానం చేశారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకున్న సమీప అబ్బిడిపల్లి గ్రామస్తులు అదే స్ఫూర్తి కొనసాగిస్తున్నారు. 500. మంది ఉన్న గ్రామ జనాభా మూకుమ్మడిగా నేత్రదానం చేయడానికి సిద్ధమయ్యారు. నేత్రదానం చేస్తామని.. 2022లో గ్రామ పంచాయతీలో తీర్మానించారు. తీర్మానం ప్రతిని కలెక్టర్‌కు ఇచ్చి గొప్ప కార్యక్రమానికి నాంది పలికారు. నేత్రదానంతోపాటు అవయవదానానికీ సదాశయం ఫౌండేషన్ ఆయా గ్రామాల్లో అవగాహన కల్పిస్తోంది. దీనికి కూడా ప్రజలు ముందుకు వస్తున్నారు.



మా ఆయన కండ్లు ఇచ్చిన..

మా ఆయన జింకిరి మల్లయ్య ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయిండు. నాకు ఐదుగురు బిడ్డలు. మట్టిలో కలిసిపోవడం కంటే మరొకరికి కంటిచూపు ఇవ్వొచ్చని నా కొడుకు నిర్ణయించిండు. మా ఆయన కండ్లు దానం చేసినం. ఓదెల గ్రామానికి చెందిన సదాశయ ఫౌండేషన్ వారికి అప్పగించినం. కళ్లదానం చేసేందుకు ఊరోళ్లందరం ఒక్కటైనం.

- జింకిరి శాంతమ్మ, అబ్బిడిపల్లి



కొంటే దొరకనివి నేత్రాలు

ఏది కొన్నా దొరుకుతుంది.. కానీ నేత్రాలు దొరకవు. అందుకే మా ఊరోళ్లందరం నేత్రదానం చేయాలని మూకుమ్మడిగా తీర్మానం చేసినం. ఈ క్రమంలో గ్రామంలో ఎవరు చనిపోయినా నేత్రదానం చేస్తున్నం. నేను కూడా నేత్రదానం చేస్తానని హామీ పత్రం ఇచ్చిన

- రాపల్లి రవళి, విద్యార్థిని, ఓదెల



సంస్మరణ సభలతో అవగాహన

నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లోని అపోహలు తొలగించేందుకు మా సంస్థ కృషి చేస్తోంది. నేత్ర, అవయవ దానం చేసిన వారికి, దశదినకర్మ రోజు మా సంస్థ సంస్మరణ సభలు నిర్వహిస్తోంది. అక్కడికి వచ్చే బంధువులు, మిత్రులకు అర్థమయ్యేలా వివరిస్తూ, మృతుల కుటుంబ సభ్యులను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందిస్తున్నాం.

- మేర్గు భీష్మాచారి, సదాశయ ఫౌండేషన్, పెద్దపల్లి



సీఎస్‌కు జోగుళాంబ దేవస్థానం ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే అలంపురం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని.. తెలంగాణ ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని జోగుళాంబ దేవస్థానం కోరింది. ఈ మేరకు సోమవారం సీఎస్‌ను జోగుళాంబ దేవస్థానం ఈవో పురేందర్‌కుమార్, ప్రధానార్చకుడు ఆనంద్‌శర్మ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలు అందజేసి.. అమ్మవారి ఆలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలను సీఎస్‌కు వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా'లో టాప్‌లో నిలవాలి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా అక్టోబర్ 2న నిర్వహించనున్న స్వచ్ఛ భారత్ దివస్‌కు సన్నాహకాల్లో భాగంగా చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛతా హీ సేవా విభాగంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్‌డీవో), అదనపు డీఆర్‌డీవోలు, జిల్లా పంచాయతీ ఆఫీసర్ల (డీపీవో)ను ఆదేశించారు. గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి కొనసాగింపుగా 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు అధికారులంతా జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. జిల్లాల్లో ప్రతి రోజూ చేపట్టే కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రాబోయే పది రోజుల్లో ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా కొనసాగించాలని.. 'స్వచ్ఛతా హీ సేవా'లో స్థానిక ప్రజలతోపాటు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని పెంచాలని చెప్పారు.

సీపీఏ ఇండియా రీజియన్ సదస్సు ప్రారంభం

హాజరైన అసెంబ్లీ స్పీకర్, మండలి డిప్యూటీ చైర్మన్

సాక్షి, న్యూఢిల్లీ: దేశం భవిష్యత్తులో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడం, చట్ట సభలు పోషించాల్సిన పాత్ర తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో ఢిల్లీలోని పార్లమెంటు పరిసరాల్లో 10వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్ సోమవారం ప్రారంభమైంది. సీపీఏ ఇండియా రీజియన్ అధ్యక్షుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన 'సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని సాధించడంలో శాసనసభల పాత్ర' అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లెజిస్లేటివ్ సెక్రటరీ వి.నరసింహాచార్యులు, జాయింట్ సెక్రటరీ ఉపేందర్ రెడ్డి కూడా సదస్సులో పాల్గొంటున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, శాసనమండలి సభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 46 మంది ప్రిసైడింగ్ అధికారులు, నలుగురు చైర్మన్లు, 25 మంది స్పీకర్లు, ముగ్గురు డిప్యూటీ చైర్మన్లు, 14 మంది అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్లతోపాటు.. ప్రిన్సిపల్ కార్యదర్శులు, కార్యదర్శులు, అధికారులు సదస్సులో పాల్గొంటున్నారు.

మెస్ చార్జీలను తక్షణమే పెంచాలి

డీఎస్ఎస్ భవన్ ఎదుట కేవీపీఎస్ ఆందోళన

సాక్షి, హైదరాబాద్: పెరిగిన ధరలకు అనుగుణంగా వసతి గృహాలు, గురుకులాల్లో మెస్ చార్జీలను పెంచాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుకుంటున్నది పేదలు, బడుగు, బలహీనవర్గాల పిల్లలు మాత్రమేనని అన్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారుల పిల్లలు వీటిలో చదవకపోవడంతోనే వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మెస్‌చార్జీలు పెంచాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ అంతం కోమటిరెడ్డి తరం కాదు

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌ను అంతం చేయడం మంత్రి కోమటిరెడ్డి కాదు కదా.. ఆయన జేజమ్మ తరం కూడా కాదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, సీహెచ్ వెంకట్రామిరెడ్డితో కలిసి సునీత విలేకరులతో మాట్లాడుతూ, కోమటిరెడ్డి బీఆర్ఎస్ పార్టీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నారని ధ్వజమెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కోమటిరెడ్డి చేసింది శూన్యమని, ఆయన జిల్లా విషయాలు పట్టించుకోకుండా వేరే విషయాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తపాస్‌పల్లికి నీళ్లు తెస్తానని ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలని, రిజర్వాయర్ల నుంచి జిల్లా చెరువులు నింపే అవకాశం ఉన్నా కోమటిరెడ్డి పట్టించుకోవడంలేదని అన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తి చేయకుండా ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఉన్న ప్రభాకర్‌రావును మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు కలిసి ఇండియాకు రానివ్వడంలేదంటారా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల యూఎస్ వెళ్లి ఆయనకు ఏం చెప్పి వచ్చారని నిలదీశారు.

ఇక్కడెందుకు పిటిషన్ వేశారు?

- గ్రూప్–1పై పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షకు సంబంధించి సింగిల్ జడ్జి వద్ద పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా, నేరుగా ఇక్కడ పిటిషన్ ఎందుకు వేశారని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది. రాజ్యాంగ పరమైన ఉల్లంఘనలు ఏమైనా ఉన్నాయని అడిగింది. విచారణను రేపటికి వాయిదా వేస్తూ, ఇక్కడే విచారణ జరపాలా.. లేక సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్‌లకు అటాచ్ చేయాలా అనేది తేలుస్తామని స్పష్టం చేసింది. 2024, ఫిబ్రవరి 19న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం టీఎస్‌పీఎస్సీ రూల్ ఆఫ్ లాను పాటించాలని, ప్రిలిమ్స్, మెయిన్స్.. అన్నింటా రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నల్లగొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన పోగుల రాంబాబు సహా మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మహిళలు, దివ్యాంగుల కేటగిరీలోనూ సమాంతర రిజర్వేషన్లు పాటించాలని, అధికారులు వర్టికల్‌గా రోస్టర్ పాయింట్లు నిర్ధారిస్తున్నారని, మెయిన్స్‌కు 1:50 గా ఎంపిక చేశారని, దీనిలో కూడా సమాంతర రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ లోకస్ లేకుండానే రూల్‌ను చాలెంజ్ చేస్తూ పిటిషన్ వేశారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'చట్టబద్ధమైన రూల్స్ లేనప్పుడు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ దాఖలు చేయాలి కదా, ఇక్కడ ఎందుకు'అని ప్రశ్నించింది. పిటిషనర్ న్యాయవాది సమయం కోరడంతో విచారణ ఈ నెల 25కు వాయిదా వేసింది.

దళితబంధు యూనిట్లపై క్షేత్రస్థాయి పరిశీలన !


సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం కింద ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. నాలుగేళ్ల క్రితం ఈ పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చి..ఒక్కో లబ్ధిదారుకు రూ.10లక్షల చొప్పున ఆర్థికసాయం అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతుల్లో ఏ మేరకు మార్పులు జరిగాయనే కోణంలో పరిశీలించడంతోపాటు యూనిట్ల తాజా పరిస్థితులను తెలుసుకునేందుకు చర్యలకు ఉపక్రమించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 38,476 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, రూ.3847.6 కోట్ల నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 9వేల మందికి పూర్తిస్థాయిలో నిధుల వినియోగానికి ప్రభుత్వం అనుమతించలేదు. వారు ఏర్పాటు చేసిన యూనిట్లకు అయిన ఖర్చులకు అనుగుణంగా నిధులు విడుదల చేసే అంశంపై ప్రభుత్వానికి ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా, ప్రభుత్వం క్షేత్రస్థాయి తనిఖీలు చేసే దిశగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు ఎస్సీ కార్పొరేషన్ కార్యక్రమాలపై ఈనెల 25న సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరగనుంది. సమీక్షలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దళితబంధు పథకం కొనసాగింపు, పేరు మార్పు, కొత్త లబ్ధిదారుల ఎంపిక, ఇతర అంశాలపై సూచనలు చేసే అవకాశముంది.

టీపీసీసీ అధ్యక్షుడితో కర్ణాటక మంత్రి భేటీ

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక రాష్ట్ర మంత్రి బోసురాజు.. సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేశ్‌గౌడ్‌ను కలిసి పీసీసీ అధ్యక్షునిగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, టీపీసీసీ నేత సంగిశెట్టి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బోసురాజు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

హెచ్‌సీఏలో అక్రమాల నిగ్గుతేల్చండి

- విజిలెన్స్ డీజీకి భువనగిరి ఎంపీ చామల ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో ఉన్న సమస్యలు, జరుగుతున్న అవినీతి అక్రమాలపై దర్యాప్తు జరపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాశారు. హెచ్‌సీఏలో టెండర్ ప్రక్రియ, రవాణా సేవలు సహా పలు సమస్యలు, అందులో జరుగుతున్న అవినీతిని విజిలెన్స్ అధికారుల దృష్టికి తెచ్చారు. అపెక్స్ కౌన్సిల్‌తో సరైన సంప్రదింపులు లేకుండా నిర్ణయాధికారాలు కొంతమంది వ్యక్తుల చేతుల్లో, ప్రత్యేకించి ప్రెసిడెంట్, సెక్రటరీ చేతుల్లో కేంద్రీకరించబడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. టెండర్ లేకుండా ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వడం, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా నిర్ణయాలు, అసోసియేషన్ ఉప-చట్టాలను ఉల్లంఘించడాన్ని ప్రస్తావించారు. కేటరింగ్, రవాణా సేవల కోసం టెండర్ ప్రక్రియలో ఉన్న వ్యత్యాసాలను అధికారుల దృష్టికి తెచ్చారు. వీటన్నింటిపైన విచారణ ప్రారంభించి, హెచ్‌సీఏ సమగ్రతను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.



ముద్దబంతుల సోయగం

రకరకాల రంగులతో ఈ బంతిపూల తోటలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రంలో పలువురు రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున బంతిపూల తోటలు సాగుచేశారు. దిగుబడి బాగున్నప్పటికీ గిట్టుబాటు ధర లభించక పోవడంతో డీలాపడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి బంతిపూలు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలుకు ఎగుమతి చేస్తారు. - బాషా, సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బడిబువ్వ తినలేం..

గతేడాది 'గోరుముద్దలు' తినిపించి లాలించిన బడే ప్రస్తుతం ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీలేని కూరలు పెట్టి మధ్యాహ్న భోజనాన్ని మమ అనిపిస్తుంటే ఆ చిట్టి బుర్రలకు ఏమీ పాలుపోవడం లేదు. చేసేదిలేక ఇలా ఇంటినుంచి క్యారియర్లు తెచ్చుకుని తింటున్నారు. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ స్కూల్ విద్యార్థులు ఇలా ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సులు తింటుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఒకరికి ఒకరై..

మా చెవులకు కళ్లున్నాయి.. మా చేతులూ చూస్తాయ్.. తెలుసు మాకు వెలుగేదో.. తెలుసు మాకు చీకటేదో.. అన్న కవి మాటలే స్ఫూర్తిగా ముందుకు కదులుతున్నారీ దివ్యాంగులు. పుట్టుకతో అంధులైనా.. కలిసి నడిస్తే ఎవరి సాయం లేకుండా గమ్యాన్ని చేరుకుంటామనే నమ్మకంతో అడుగులు వేస్తున్నారు. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - పీఎల్ మోహన్‌రావు, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మధుర ఫలం

- జోరుగా సీతాఫలాల వ్యాపారం
- సీజన్‌లో రూ.ఏడున్నర కోట్ల లావాదేవీలు
- రియల్‌ఎస్టేట్ దెబ్బకు చాగల్నాడులో అంతరిస్తున్న తోటలు





జాతీయ రహదారిపై సీతాఫలాల విక్రయాలు

రాజానగరం: రుచిలో సిమ్లా యాపిల్‌ని మరపించే చాగల్నాడు కస్టర్డ్ యాపిల్ (సీతాఫలం)కి తూర్పు గోదావరి జిల్లాలోనే కాదు దేశ రాజధాని ఢిల్లీలో కూడా మంచి పేరు ఉంది. అయితే చాగల్నాడు ప్రాంతంలో రియలెస్టేట్ విస్తరిస్తున్న నేపథ్యంలో సీతాఫలాల తోటలు అంతరించిపోతున్నాయి. ఫలితంగా చాగల్నాడు సీతాఫలాలకు డిమాండ్ పెరిగి ధర కూడా పెరిగిపోయింది. చాగల్నాడు ప్రాంతంలో తోటలు (మామిడి, జీడిమామిడితో కలసి ఉంటాయి) తరిగిపోవడంతో సీతాఫలాల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. సీతాఫలాలు పక్వానికి రావాలంటే శీతలంతో పాటు వర్షాలు కురుస్తూ ఉండాలి. ఈ కారణంగానే ప్రస్తుతం ఈ ప్రాంతంలో అక్కడక్కడా లభిస్తున్న సీతాఫలాలతో ఏజెన్సీ ప్రాంతంలో విరివిగా దొరుకుతున్న సీతాఫలాలను జోడించి వ్యాపారులు స్థానికంగా విక్రయిస్తున్నారు. ఇక్కడ నుంచే జిల్లాలోని పలు ప్రాంతాలకు కూడా రవాణా అవుతున్నాయి. ఈ విధంగా సీజన్‌లో సీతాఫలాలు క్రయవిక్రయాల ద్వారా సుమారు రూ.7.5 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని అంచనా.

గుర్తించడం చాలా కష్టం

రెండు దశాబ్దాల క్రితం జాతీయ రహదారి విస్తరణకు ముందు ఈ ప్రాంతంలో రోడ్లకు ఇరువైపులా సీతాఫలాల తోటలు విస్తారంగా ఉండేవి. రాత్రి సమయాల్లో బస్సుల్లో ప్రయాణించే వారికి లైటింగ్‌లో సీతాఫలాలు నిగనిగలాడుతూ కనిపించేవి. అంతేకాదు సీజన్‌లో దివాన్‌చెరువు కూడలి క్రయ, విక్రయదారులతో కిక్కిరిసిపోయేది. ఒక్కో సమయంలో ట్రాఫిక్ జామ్ కూడా జరుగుతూ ఉండేది. అయితే నేడు ఆ పరిస్థితులు లేవు. మార్కెట్‌లో ప్రస్తుతం లభిస్తున్న సీతాఫలాలు చాగల్నాడు ఫలాలో, ఏజెన్సీవో కూడా తెలియని పరిస్థితి. వీటి మధ్య ఉన్న తేడా స్థానికులకే మాత్రమే కొంత అవగాహన ఉంటుంది. దీంతో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా ప్రయాణికులు చాగల్నాడు ఫలాలుగానే భావించి కొనుగోలు చేసుకుని, తమ ప్రాంతాలకు తీసుకెళుతుంటారు.

ఎందరికో ఉపాధి

సీతాఫలాల ద్వారా సీజన్‌లో ఎందరికో జీవనోపాధి లభిస్తుంటుంది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారి వెంబడి విరివిగా వెలసిన దుకాణాలతో పాటు సైకిళ్ల పైన, తోపుడు బళ్లపైన జిల్లా అంతటా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు కొనుగోలు చేస్తున్నారు. చాగల్నాడు సీతాఫలాలు నిల్వకు ఆగవు. పక్వానికి వచ్చిన వెంటనే కళ్లు విచ్చుకున్నట్టుగా నిగనిగలాడుతూ కనిపిస్తాయి. అయితే ఏజెన్సీ సీతాఫలాలు వారం రోజుల వరకు నిల్వ ఉంటాయి. ఈ సీజన్‌లో సీతాఫలాల వ్యాపారం రూ.ఏడున్నర కోట్లు దాటుతుందని ఒక అంచనా. జూలై నుంచి అక్టోబరు వరకు ఏజెన్సీ సీతాఫలాలను దిగుమతి చేసుకుని, రూ.4.50 కోట్లకు పైబడి వ్యాపారం చేస్తుంటారు. ఇక తోటలు తగ్గినాగాని చాగల్నాడు సీతాఫలాల ద్వారా ఈ సీజన్‌లో (అక్టోబరు) రూ.రెండు కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వ్యాపారులు అంటున్నారు. ఏ విధంగా చూసిన ఈ సీజన్‌లో సీతాఫలాల ద్వారా జిల్లాలో రూ.ఏడున్నర కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా.

వంద ఫలాలు రూ.2,500 పైమాటే..



తోటలు విస్తారంగా ఉన్న సమయంలో వంద సీతాఫలాలను రూ.50 నుంచి రూ.వందకు విక్రయించే వారు. కానీ నేడు ఆ ధరకు అడిగితే ఎగాదిగా చూస్తారు. ఎందుకంటే వందల లెక్కన కొనుగోలు చేసే రోజులు పోయాయి. మామిడి పండ్ల మాదిరిగా డజను, పాతిక, పరక చొప్పున కొనాల్సి వస్తుంది. గతంలో మాదిరిగా వంద ఫలాలు కొనాలంటే రూ.2500 పైనే ధర పలుకుతుంది. అంత మొత్తం పెట్టలేక చాలామంది డజన్ల లెక్కన కొనుగోలు చేస్తున్నారు. కాయల సైజులను బట్టి పరక, డజను లెక్కల్లో డజను రూ.300 నుండి రూ.500కు విక్రయిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి వీటిని కొంతమంది స్థానిక వ్యాపారులు హోల్‌సేల్‌గా తీసుకువచ్చి, జాతీయ రహదారి వెంబడి ఉన్న స్టాల్స్‌కి సరఫరా చేస్తుంటారు.

అక్టోబర్ చివర్లో షోలాపూర్ ఫలాలు..

ఇదిలా ఉండగా దసరా ఉత్సవాల సమయంలో చాగల్నాడు సీతాఫలాలు అందుబాటులోకి వస్తాయి. అయితే తోటలు తక్కువగా ఉండటంతో అవి ఎప్పుడు వచ్చాయి. ఎప్పుడు అయిపోయాయనే విషయం కూడా తెలియకుండా జరిగిపోతుంటుంది. దీంతో ఈ సీజన్ ప్రారంభంతో ఏజెన్సీ సీతాఫలాలను చాగల్నాడు మార్కెట్‌కి వస్తే, ఆఖరులో (అక్టోబరు, నవంబరు) వ్యాపారులు షోలాపూర్ నుంచి కూడా సీతాఫలాలను దిగుమతి చేసుకుని తమ వ్యాపారాలు కొనసాగిస్తుంటారు. ఇవి చూడటానికి చాగల్నాడు సీతాఫలాల మాదిరిగానే నిగనిగలాడుతూ కనిపిస్తుంటాయి. దీంతో ఈ సీజన్‌లో షోలాపూర్ కాయల ద్వారా సుమారు రూ.కోటి వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని ఒక అంచనా. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌కి షోలాపూర్ నుంచి వచ్చే యాపిల్, దానిమ్మల లోడులో వీటిని తీసుకువస్తుంటారు.

సీజన్‌లో దొరికే ఫలాలను తినాలి



సీజన్‌లో దొరికే ఫలాలను తినడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రకృతి మనకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు ఫలాలను ప్రసాదిస్తుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో సీతాఫలాలను తీసుకోవడం వలన ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలను పొందవచ్చు. అందుకనే వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది.

- అద్దంకి సీతారామమ్మ, అచ్యుతాపురం

సీజనల్ పండ్లని నిర్లక్ష్యం చేయవద్దు



నేటి ఆధునిక సమాజంలో అంతా రెడీమేడ్ ఫుడ్‌కు అలవాటు పడటం వలన జనం జబ్బుల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల్లో చేరి, పండ్లు తిని నయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సీజనల్‌గా దొరికే పండ్లని ఒక్కసారైనా తింటే సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి కొంతమేర తప్పించుకోవచ్చు.

- సత్తి త్రిమూర్తులు, ముక్కినాడపాకలు

క్లుప్తంగా...

సీజర్ రాజా ఎన్‌కౌంటర్

కడపలో అదుపులోకి తీసుకున్న తమిళనాడు పోలీసులు

కడప అర్బన్: తమిళనాడుకు చెందిన సీజర్ రాజా అలియాస్ రాజా సోమవారం చెన్నైలోని వెలంబేరిలో తమిళనాడు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజా అలియాస్ సీజర్ రాజా ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో వాహనాలను సీజ్ చేసే పని చేసేవాడు. తరువాత రౌడీగా ఎదిగి దౌర్జన్యాలకు పాల్పడేవాడు. ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో దాదాపు 40 కేసులున్నాయి. ఇటీవల ఓ రాజకీయపార్టీ అధ్యక్షుడి హత్య కేసులో సీజర్ రాజా నిందితుడిగా ఉన్నాడు. హత్య అనంతరం సీజర్ రాజా కడప జిల్లాలో తలదాచుకున్నాడు. తమిళనాడు పోలీసులు ప్రత్యేకంగా కడపకు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకుని వెళ్లారు. సోమవారం అతడు ఎన్‌కౌంటర్‌లో మరణించాడు.

బంగారు దుకాణంలో చోరీ

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టణంలో మిట్టా జ్యువెలర్స్ దుకాణంలో బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగినట్టుగా భావిస్తున్న ఈ సంఘటనకు సంబంధించి అర్బన్ సీఐ సయ్యద్ హాషం తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బద్వేలు రోడ్డుకు చెందిన మిట్టా సురేష్ బాబు కొన్నేళ్లుగా అదే రోడ్డులో మిట్టా జ్యువెలర్స్ పేరుతో బంగారు దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం అతను భార్యతో కలిసి వ్యక్తిగత పనిపై చెన్నై వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వచ్చి దుకాణాన్ని తెరిచేందుకు షట్టర్ తీయగా లోపల వస్తువులన్నీ చెల్లాచెదరుగా పడి ఉండటం గమనించారు. చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అర్బన్ సీఐ సయ్యద్ హాషం చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన దుకాణాన్ని క్లూస్ టీం సభ్యులు పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. దుండగులు రూ.12లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అయితే దుకాణంలో ఇంకా కొన్ని బంగారు, వెండి ఆభరణాలను దుండగులు చోరీ చేయకుండా వదిలేయడం చర్చనీయాంశంగా మారింది. బాధితుడు సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వరల్డ్ ఫుడ్ ఇండియా ఈవెంట్‌లో 'పొదుపు' ఉత్పత్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసే ఉత్పత్తులను దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 19 నుంచి 22 మధ్య ×వరల్డ్ ఫుడ్ ఇండియా -2024₹ ఈవెంట్‌లో ప్రదర్శనకు ఉంచినట్లు సెర్ప్ సీఈవో వీరపాండియన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మన రాష్ట్ర పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు కెన్యా, వియత్నాం, ఇరాన్ దేశాలు ఎక్కువగా ఆసక్తి చూపడంతో పాటు మన దేశంలోని ఒరిస్సా, కేరళ, డెహరాడూన్, సిక్కిం ఎక్కువగా కొనుగోళ్లు చేసినట్లు వివరించారు.

కేరళలో ఓనం...కోనసీమకి వరం

కోనసీమ అంటేనే కొబ్బరికి ప్రసిద్ధి. ఇక్కడి రైతులు వరి కంటే మక్కువగా కొబ్బరికి ప్రాధాన్యమిస్తారు. కొబ్బరికాయ దిగుబడి ఇక్కడ బాగుంది అనుకునేలోపే తమిళనాడు, కేరళ రూపంలో గట్టి సవాల్ ఎదురయ్యేది. దాంతో కాయ ఉన్నా.. సరైన ధర ఎన్నడూ లభించేది కాదు. కానీ ఇప్పుడు కేరళలో ఓనం పండుగ వచ్చి అక్కడి కాయ అక్కడికే సరిపోతోంది. తమిళనాడు, కర్నాటకల్లో సరైన దిగుబడి లేకపోవడం, ఉత్తరాదిన దసరా, దీపావళి, కార్తికమాసం రూపంలో పండగలు క్యూ కట్టడంతో కోనసీమ కొబ్బరికి, రైతులకు ముందే పండగొచ్చింది.

- పెరిగిన కొబ్బరి ధర
- వెయ్యి కాయల ధర రూ.18 వేలు
- కొబ్బరి మార్కెట్‌లో దసరా, దీపావళి ధమాకా
- ఆచితూచి అమ్ముతున్న రైతులు
- రోజుకు 70 లారీల వరకూ ఎగుమతి





అంబాజీపేటలో కురిడీ కొబ్బరి కాయలను ఎగుమతి చేస్తున్న కూలీలు. (ఇన్‌సెట్‌లో) ఎగుమతికి సిద్ధంగా ఉన్న కురిడీ కొబ్బరికాయలు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కేరళలో ఓనం పండుగ... తమిళనాడులో కొబ్బరికాయ అందుబాటులో లేకపోవడం... కోనసీమ కొబ్బరి రైతులకు పండగ వచ్చింది. కొబ్బరికాయ ధర రికార్డ్ స్థాయిలో పెరగడంతో వారికి దసరా... దీపావళి పండగ ముందే వచ్చింది. కొబ్బరి వెయ్యి కాయల ధర సైజును బట్టి రూ.17,500ల నుంచి రూ.18 వేల వరకు పలుకుతుంది. అంబాజీపేట కొబ్బరి మార్కెట్ చరిత్రలో ఇది ఆల్ టైమ్ హై.

కొబ్బరి ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో ఉమ్మడి గోదావరి జిల్లాలోని కొబ్బరి రైతులకు ముందే దసరా, దీపావళి పండగ వచ్చినట్టయింది. వరుస పండగల నేపథ్యంలో కొబ్బరి ధరలు అనూహ్యంగా పెరిగాయి. నెల రోజుల క్రితం వెయ్యి కొబ్బరికాయల ధర రూ.8,500 మాత్రమే ఉండేది. తర్వాత నెమ్మదిగా పెరుగుతూ ఆగస్టు నెలాఖరు నాటికి రూ.10,500కు చేరింది. వినాయక చవితి సమయానికి రూ.11,500 నుంచి రూ.12 వేల వరకు ధర రావడంతో రైతులు చాలా వరకు కోలుకున్నారు. కానీ గత వారం రోజుల నుంచి ధర రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది, తమిళనాడు, కర్ణాటకల్లో కొబ్బరి దిగుబడులు తక్కువగా ఉన్నాయి. కేరళలో ఓనం పండగ కారణంగా స్థానికంగా కొబ్బరి వినియోగం ఎక్కువగా ఉంది. దీనితో ఆ రాష్ట్రం నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతులు మందగించాయి. ఈ కారణంగా ఉత్తరాది మార్కెట్ అవసరాలను ఉమ్మడి గోదావరి జిల్లాల కొబ్బరి తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల గతంలో ఎన్నడూ లేనంత ధర రావడం విశేషం. విజయదశమి, దీపావళి, కార్తికమాసం దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల్లోని కొబ్బరి అమ్మకాలు పెరిగాయి. ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాంచల్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కొబ్బరి ఆర్డర్లు అధికంగా వస్తున్నాయి. సాధారణంగా ఈ రాష్ట్రాలకు డొక్క ఒలిచిన కొబ్బరి ఎగుమతి అవుతుంటుంది. కానీ ఈసారి డొక్కా ఒలువు చేయని కాయను కొనుగోలు చేస్తుండటం గమనార్హం. రాసుల రూపంలో రూ.18 వేల వరకు ధర ఉండగా 60 రకం (పెద్ద కాయ) డొక్కతో వెయ్యి కాయలు ధర రూ.20 వేలు పలుకుతుంది.

ఏడేళ్ల తర్వాత రికార్డు ధర

ఏడేళ్ల తర్వాత కొబ్బరికాయకు రికార్డు స్థాయి ధర వచ్చింది. 2017లో కొబ్బరికాయకు జాతీయ మార్కెట్లో రూ.17 వేల ధర రాగా ఈసారి అంతకుమించి ధర పలుకుతుండటం విశేషం. మార్కెట్లో ఈ స్థాయి ధర రావడం అరుదైన విషయమని కొబ్బరి రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. కొబ్బరికాయతో పాటు మిగిలిన కొబ్బరి ఉత్పత్తుల ధరలు సైతం పెరిగాయి. ప్రస్తుతం పాత కురిడీ కాయ గండేరా వేయింటికి రూ.14 వేలు, గటగటా రూ.17,500, కురిడీ కొత్త కాయ గండేరా రూ.13 వేలు, గటగట రూ.15,500 పలుకుతుంది.



ఆధ్యాత్మిక సమాచారం

లోక కల్యాణార్థం శాంతి హోమం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో లోక కల్యాణార్థం సోమవారం శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకూ శాస్త్రోక్తంగా హోమం జరిగింది. అనంతరం హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వన దుర్గమ్మ ఆలయం దిగువన ఉన్న హోమ మండపంలో పండితులు తొలుత విఘ్నేశ్వరపూజ, మండపారాధన చేశారు. అనంతరం ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ఉపాధ్యాయుల రమేష్, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి, వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ తదితరులు హోమం తదితర పూజలు నిర్వహించారు. దేవస్థానం ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ కెసతీష్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా పల్లకీసేవ



రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా రాయచోటిలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరం గా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాడవీధుల్లో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కార్యక్రమం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోటప్పకొండ ఆలయ ఈఓగా చంద్రశేఖరరావు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయ ఈఓగా డి. చంద్రశేఖరరావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న చంద్రశేఖరరావు సాధారణ బదిలీలల్లో భాగంగా కోటప్పకొండ ఆలయ ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు కోటప్పకొండ ఈఓగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరెడ్డి అమరావతి ఆలయ ఈఓగా బదిలీ అయ్యారు.

నేడు అప్పన్న ఆలయంలో శాంతి హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శాంతి హోమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆలయ కల్యాణమండపంలో హోమాన్ని జరిపేందుకు అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు.

సూర్యప్రభ వాహనంపై వినాయకుడు

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం స్వామిని మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట: స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో సోమవారం స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారికి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో అర్చకులు పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలతోను, ఆలయ కోనేరులోని నీటితో అభిషేకాలు చేసుకున్నారు.

టెర్రకోటలో కొత్త డిజైన్లపై ప్రత్యేక శిక్షణ



కురబలకోట: టెర్రకోట కుండలు,బొమ్మల తయారీపై అన్నమయ్య జిల్లా అంగళ్లు సీఎఫ్‌సీ సెంటర్‌లో శిక్షణ ఇస్తున్నారు. వివిధ ప్రాంతాల హస్త కళాకారులు తర్ఫీదు పొందుతున్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్), టెక్స్‌టైల్ డిజైనర్, బెస్ట్ క్రియేటివ్ అవార్డు గ్రహీత సుగుణ రాజు వీరికి హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇక్కడి కళాకారులు వివిధ రకాల బొమ్మలు, కుండలు తయారు చేశారన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఇక నుంచి దేశ విదేశాల్లో డిమాండు ఉన్న డిజైన్లపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 30 మందికి 25 రోజుల పాటు టెర్రకోట బొమ్మల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



సంగీతంలో పీజీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఎంఏ సంగీతం, డిప్లొమో ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం) కోర్సులకు ఆసక్తిగల విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని, ఆదే నెల 31న స్పాట్ అడ్మిషన్లకు సైతం అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను గానీ 0877-2284524, 81217 87415 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాగార్జున వర్సిటీ ఏసీఈగా ఎస్.యోబు



ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ ఏసీఈ (అదనపు పరీక్షల నియంత్రణాధికారి)గా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్. యోబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా యోబు మాట్లాడుతూ తనను అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నియమించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు మంచి సేవలు అందిస్తానని చెప్పారు.

27న జాబ్‌మేళా

వేముల: వైఎస్సార్ జిల్లా వేముల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 27వ తేదీన శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుగుణావతి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బీజెడ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ఆల్ డిక్సన్ కంపెనీ వారు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని.. టెన్త్, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలన్నారు.

26, 27న విభిన్న ప్రతిభావంతులకు శిబిరం

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో ప్రభుత్వం విభిన్నప్రతిభావంతులకు ప్రత్యేక పరికరాల శిబిరం నిర్వహించనున్నట్లు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరంలో పాల్గొని పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

హెల్త్
సాక్షి ప్లస్
మంగళవారం ॥ 24-9-2024



ఇప్పుడు అంత ప్రమాదకరం కాదు...

'అక్యూట్ ప్రోమైలోసైటిక్ ల్యూకేమియా – ఏపీఎల్' అని పిలిచే ఆ బ్లడ్ క్యాన్సర్ ఒకప్పుడు చాలా ప్రమాదకరం. కానీ ఇటీవల కొత్త చికిత్సా ప్రక్రియలు వస్తున్న కొద్దీ దాని గురించిన భయం తగ్గుతూ వస్తోంది. కొన్ని గణాంకాల ప్రకారం ఈ జబ్బుకు చికిత్స తీసుకున్నవారిలో 99% మంది నాలుగేళ్లు పైబడి జీవిస్తుంటే... ఐదేళ్లకు పైబడి జీవిస్తున్నవారు 86% మంది ఉన్నారు.

• పేషెంటైన ఓ డాక్టర్ విజయ గాథ!

క్యాన్సర్‌కు నమ్మకమే ఆన్సర్



బ్లడ్ క్యాన్సర్ సోకిన డాక్టర్ నేత్రావతి... తన గురించి తన ఆరేళ్ల కొడుకు ఎక్కడ భయపడతాడో, అసలే ఆందోళనలో ఉన్న తనను చూసి అతడెక్కడ బెంగపడతాడో అని తనకు జబ్బును ఆ చిన్నారి నుంచి దాచిపెట్టింది.

తాను స్వయానా డాక్టర్. అందునా ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ కావడంతో కోవిడ్ కేసులు చాలా ఎక్కువగా చూస్తుండేది. దాంతో మొదట్లో తనలో కనిపించిన లక్షణాలను చూసి తనకూ కోవిడ్ సోకిందేమో అనుకుంది. ఎట్టకేలకు అది చాలా తీవ్రమైన ఓ తరహా బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. చికిత్స జరగకపోతే బతికేది రెండువారాలూ... మహా అయితే మూడు వారాలు!! ఇప్పుడామె పూర్తిగా కోలుకుని, తనలా క్యాన్సర్ బారిన పడి ఆందోళనతో బెంబేలెత్తుతున్నవారికీ కౌన్సెలింగ్ చేయడం, ధైర్యం చెప్పడం చేస్తోంది. అదీ తాను చికిత్స తీసుకున్న మణిపాల్ హాస్పిటల్‌లోనే.

ఈలోపు మరికాస్త ఎదిగిన కొడుకు ఆమె వీడియోలను చూసి... 'అమ్మా... నువ్వెంత ధైర్యవంతురాలివి. నిజంగా నువ్వు విజేతవమ్మా" అంటుంటే... క్యాన్సర్ మీద కంటే పెద్ద విజయమిది అంటోంది ఆ తల్లి. ఆ విజయ గాథను విందాం రండి.

●●●

డాక్టర్ నేత్రావతి బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కోవిడ్ బాధితులకు ఊరట కలిగిస్తున్న సమయమది. అప్పట్లో 2020 – 2021 నాటి రోజుల్లో కరోనా వైరస్ ఉధృతంగా ప్రపంచాన్ని పరుగులు పెట్టిస్తున్న ఆ క్షణాల్లో ఒక నాడు తనకూ జ్వరంగా ఉంది. ఒళ్లంతా నొప్పులు. తీవ్రమైన అలసట. ఒకవైపు చెయ్యి లాగేస్తోంది. విపరీతమైన నిద్రలేమి. ఒకవేళ నిద్రపడితే అకస్మాత్తుగా మెలకువ వచ్చి చూసుకుంటే ఒళ్లంతా చల్లటి చెమటలు. ఈ లక్షణాలన్నీ దాదాపుగా కోవిడ్‌నే తలపిస్తున్నాయి. అందునా తాను రోజూ కరోనా రోగులకు సేవలందిస్తూ ఉండటంతో కోవిడ్ సోకిందేమోనని మొదట అనుకుంది.

తీరా చూస్తే తీవ్రమైన బ్లడ్‌క్యాన్సర్...

అసలు సమస్య తెలుసుకోవడానికి రక్తపరీక్ష చేయించుకుని రిపోర్టు చూసుకుంటే ప్లేట్‌లెట్ కౌంట్ 10,000 కంటే కిందికి పడిపోయింది. (ఇవి కనీసం 1,50,000 నుంచి 4,50,000 వరకు ఉండాలి). హిమోగ్లోబిన్ కౌంట్ ఐదు కంటే తక్కువ! (ఇది మహిళల్లో 12 నుంచి 15 వరకు ఉండాలి). తెల్లరక్త కణాల సంఖ్య అనూహ్యంగా చాలా ఎక్కువగా పెరిగిపోయి ఉంది. అవేవీ కోవిడ్‌కు సంబంధించినవి కావు. ఏదో తేడా కొడుతోంది అనుకుంది. మణిపాల్ హాస్పిటల్‌లోని హిమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ మల్లికార్జున కళాషెట్టిని సంప్రదించింది. వ్యాధి నిర్ధారణలో అది 'అక్యూట్ ప్రోమైలోసైటిక్ ల్యూకేమియా – ఏపీఎల్' అనే బ్లడ్ క్యాన్సర్‌గా తేలింది.

నాకే ఎందుకిలా...

డాక్టర్ నేత్రావతి మంచి ఆరోగ్యస్పృహ ఉన్న వ్యక్తి. తానే స్వయానా డాక్టర్. ప్రతి వీకెండ్‌కూ బెంగళూరు కబ్బన్ పార్కులో పచ్చటి చెట్ల మీది నుంచి వచ్చే పచ్చి గాలి పీలుస్తూ కొడుకూ, భర్తతో సైక్లింగ్ చేస్తుంటుంది. ప్రతిరోజూ తప్పనిసరిగా 45 నిమిషాల పాటు వ్యాయామం చేస్తుంటుంది. వేళకు నిద్రలేవడం, సమయానికి నిద్రపోవడంతో పాటు డాక్టర్ కావడంతో మంచి ఆరోగ్య స్పృహతో ఉండటం, ఆరోగ్యకరమైనవి తినడం ఇవన్నీ చేస్తుండేది. తీరా బ్లడ్ క్యాన్సర్ కనిపించాక... అందరూ చెప్పే మాటే తన నోటి నుంచీ వచ్చింది. అందరిలాగే తానూ అనుకుంది... "నాకే ఎందుకిలా?!"

ఆమె వెతలు ఆమె మాటల్లోనే...

"ఎట్టకేలకు చికిత్స మొదలైంది. నిజానికి క్యాన్సర్ వ్యాధి కంటే దాని చికిత్సా... అది మనిషి మీద చూపే శారీరక, మానసిక దుష్ప్రభావాలే ఎక్కువగా కుంగదీస్తుంటాయి. నాకున్న పొడవాటి ఒత్తైన జుట్టును చూస్తూ చూస్తూ కోల్పోవాల్సి వచ్చింది. కీమోతో నోట్లోని, కడుపులోని మ్యూకస్ పొరలు తీవ్రంగా దెబ్బతిని, 'మ్యూకోసైటిస్' అనే ఇన్ఫెక్షన్ వస్తుంది. కీమో మొదలైన రెండు లేదా మూడు వారాల పాటు నోట్లో ఉండే మ్యూకస్ పొరలు దెబ్బ తినడం వల్ల నోట్లో తెల్లటి చీముమచ్చలు వస్తాయి. దాంతో తినడం, తాగడం, మాట్లాడటం కష్టమయ్యేది. కీమోథెరపీలోని మందులు ప్రమాదకరమైన క్యాన్సర్ కణాలను తుదముట్టిస్తూనే ఆరోగ్యకరమైన మంచి కణాలనూ దెబ్బతీస్తుంటాయి. దాంతో ఈ దుష్ప్రభావాలన్నీ కనిపిస్తుంటాయి. కష్టమనిపించనప్పుడు నా ఆరేళ్ల కొడుకు రూపాన్ని కళ్లముందుకు తెచ్చుకున్నా."

డాక్టరే పేషెంట్ అయితే...

"ఈ చికిత్స ప్రక్రియల సమయంలో మరెన్నో కాంప్లికేషన్లు కనిపించాయి. ఉదాహరణకు గుండె, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరింది. కిడ్నీ సరిగా పనిచేయడం మానేసింది. రక్తపోటు పడిపోయింది. ఎందుకు వస్తోందో తెలియని తరచూ వచ్చే జ్వరాల మధ్య ఒక్కోసారి శ్వాస ఆడేది కాదు. ఊపిరి అందడమే కష్టమయ్యేది."

"ఇలాంటి దశలో చాలామంది నిరాశ నిస్పృహలకు లోనవుతుంటారు. తమను తాము తమాయించుకోలేరు. ఇక ఆ బాధితురాలు ఒక డాక్టరైతే... లోపల ఏం జరుగుతోందో నాకు స్పష్టంగా తెలిసిపోతుంటుంది. కాబట్టి అది ఆవేదన మరింత పెరిగేలా చేస్తుంది. అయితే ఒక్కమాటలో చెప్పాలంటే జబ్బుకూ, నాకూ జరిగే ఈ పోరులో... నా మానసిక బలం, నా మీద నాకున్న విశ్వాసం ఇవన్నీ గతంలో నేనేనాడూ చూడని స్థాయికి పెరిగాయి. నేను తట్టుకోగలిగే నా సహనపు చివరి అంచు సరిహద్దును మరింత ఆవలకు నెట్టాను" అంటూ తన ఆవేదనను కళ్లకు కట్టారు డాక్టర్ నేత్రావతి.

చివరగా...

డాక్టర్ నేత్రావతి చెబుతున్న మాటలివి... "జబ్బు తర్వాత మంచి క్రమశిక్షణతో కూడిన జీవితం క్రమం తప్పకుండా ఫాలో అప్, డాక్టర్ సలహాలు ఖచ్చితంగా పాటించడం. ఇతరులు చెప్పే ప్రత్యామ్నాయ చికిత్సలను పెడచెవిన పెట్టడం, ఇంట్లో వండిన భోజనం తీసుకోవడం, ఎనిమిది గంటల నిద్ర, మధ్యాహ్నం ఓ చిన్న పవర్ న్యాప్... ఇవన్నీ చేస్తూ ఎప్పటికప్పుడు కంప్లీట్ బ్లడ్ కౌంట్‌లో తెల్లరక్తకణాలు నార్మల్‌గా ఉన్నాయేమో చూసుకుంటూ ఉన్నా.

• ఆర్థరైటిస్ ఎక్సర్‌సైజ్

స్మార్ట్ & స్లో

ఆర్థరైటిస్‌తో బాధపడేవారు తమ ఎముకలు మరింత కాలం బలంగా ఉండాలంటే వ్యాయామం చేయాల్సిందే. కానీ ఆర్థరైటిస్‌లో ఎముకలు అరిగిపోయి ఉండటం, కీళ్ల దగ్గర ఇన్‌ఫ్లమేషన్ రావడం, కీళ్లనొప్పులతో చాలా ఎక్కువగా బాధపడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కదలడమే కష్టమవుతుంటే వ్యాయామమెలా అనే సందేహం వస్తుంది. అయితే స్మార్ట్‌గా చేస్తే వ్యాయామం సాధ్యమవుతుంది. స్మార్ట్ తెలివైన పద్ధతి అనే కాకుండా అంటే వాళ్లు వ్యాయామానికి అనుసరించాల్సిన సూచనల మొదటి అక్షరాలతో యాక్రనిమ్‌గా రూపొందిన సంక్షిప్త రూపం. అలా స్మార్ట్‌గా వ్యాయామమెలాగో చూద్దాం.



S ఫర్ స్టార్ట్ స్లో అండ్ గో స్లో

శారీరక శ్రమ, ఎముకలు, జాయింట్స్‌లో నొప్పి లేని తేలికపాటి వ్యాయామాన్ని చాలా స్లోగా అంటే మెల్లగా మొదలుపెట్టాలి. ఉదాహరణకు నడకే తీసుకుంటే బ్రిస్క్ వాక్‌లా కాకుండా మొదట్లో మెల్లగా మొదలుపెట్టి కీళ్లనొప్పులు రానంత వరకు చేయవచ్చు. ఇలా మొదలుపెట్టి తర్వాత మెల్లగా వ్యవధినీ, అడుగులను పెంచుకుంటూ పోవచ్చు.

M ఫర్ మాడిఫైయింగ్ ఎక్సర్‌సైజ్ యాక్టివిటీ వెన్ సింప్టమ్స్ ఇంక్రీజ్

ఆర్థరైటిస్ లక్షణాల్లో కీళ్లలో నొప్పులు ఒక్కోసారి పెరుగుతూ తరుగుతూ ఉంటాయి. నొప్పులు పెరిగినప్పుడు వ్యాయామాన్ని పరిస్థితికి అనుగుణంగా మార్చుకోవాలి. ఉదాహరణకు నడక సమయంలో మోకాళ్ల దగ్గర నొప్పి వస్తుంటే, మోకాళ్ల కీళ్ల మీద బరువు పడకుండా స్విమ్మింగ్ చేయవచ్చు లేదా మోకాళ్ల మీద ఏమాత్రం బరువు పడని విధంగా సైక్లింగ్ చేయవచ్చు.

A ఫర్ ఏక్టివిటీస్ షుడ్ బి జాయింట్ ఫ్రెండ్లీ

అంటే ఆర్థరైటిస్ బాధితులు చేసే వ్యాయామాలు కీళ్లను మరింత బాధపెట్టకుండా ఉండటంతో పాటు కొంత కాలం తర్వాత కీళ్లకు ఆరోగ్యం సమకూరడం వల్ల నొప్పులు తగ్గేలా ఉండాలి. ఉదాహరణకు నడక, సైక్లింగ్‌తో పాటు నీళ్లలోకి దిగి చేసే తేలికపాటి వ్యాయామాలు. నీళ్లలో దిగినప్పుడు దేహం బరువు చాలావరకు తగ్గినట్లు అయిపోవడంతో కీళ్లపై భారం పడదు. అందువల్ల కీళ్లమీద బరువు పడకుండా నీళ్లలో ఏరోబిక్స్ వంటివి చేయవచ్చు.

R ఆర్ ఫర్ రికగ్నైజింగ్ సేఫ్ ప్లేసెస్ ఫర్ ఎక్సర్‌సైజ్

ఆర్థరైటిస్ ఉన్నవారిలో అప్పటికే కీళ్లనొప్పులు ఉండటం వల్ల నడక వంటి వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఒకవేళ అక్కడి ఉపరితలం ఎగుడు దిగుడుగా ఉన్నా, ఎక్కడైనా నడుస్తున్నప్పుడు అక్కడ పగుళ్ల వంటివి ఉండి చూసుకోకపోయినా, పాదం మడత పడటం వంటి అనర్థాలు చోటు చేసుకోవచ్చు. అప్పుడు నొప్పులు మరింత పెరిగే అవకాశముంది. అందుకే పార్క్‌లోని ట్రాక్ మీద ఎగుడు దిగుళ్లుగానీ లేదా పగుళ్లు గానీ లేకుండా చూసుకోవాలి. స్లిప్ కాకుండా జాగ్రత్త పడాలి. ఒకవేళ వాకింగ్ రాత్రివేళ చేస్తుంటే అక్కడ తగినంత లైట్ (వెలుగు) ఉండేలా చూసుకోవాలి.

T అంటే టాక్ టు హెల్త్ ప్రొఫెషనల్

ఆర్థరైటిస్ ఉన్నవారు వ్యాయామాలు మొదలుపెట్టడానికి ముందర తమ డాక్టర్‌ను ఒకసారి సంప్రదించి, తమకు ఎలాంటి వ్యాయామాలు సరిపడతాయో తెలుసుకోవాలి. తమ వ్యాధి తీవ్రతను బట్టి ఎలాంటి వ్యాయామ రీతుల్ని ఎంచుకోవచ్చో డాక్టర్ చెబుతారు.

నిద్రలేమితో ఆస్తమా తీవ్రం!



నిద్రలేమి (ఇన్‌సొమ్నియా) సమస్యతో బాధపడేవారిలో ఒక్కోసారి అది ఆస్తమాను ప్రేరేపించవచ్చంటున్నారు నార్వేజియన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిపుణులు. ఆస్తమాతో బాధపడేవారిలో ఆస్తమా అటాక్ రాగానే రాత్రివేళ నిద్రలేకపోవడం, నిద్రలో నాణ్యత లోపించడం మామూలే. అయితే రాత్రివేళ సరిగా నిద్ర పట్టకపోవడం కూడా ఆస్తమాకు దారి తీస్తుందన్న విషయం తెలిసిందనీ, ఇదో వలయం లాగా సాగుతుందని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త లిన్ బీటె స్ట్రాండ్ తెలిపారు. నిద్రలేమితో బాధపడుతున్న 20 నుంచి 65 ఏళ్ల వయసున్న దాదాపు 18,000 మందిపై నిర్వహించిన అధ్యయనంలో చాలా మందికి ఆస్తమా అటాక్ అయినట్టు స్ట్రాండ్ పేర్కొన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక ఇన్‌సొమ్నియా బాధితుల్లో ఈ ముప్పు మరింత ఎక్కువని తెలిపారు.

• కోవిడ్ కక్కిన విషం

స్వీట్ లిటిల్స్‌లో చేదు చక్కెర

కోవిడ్ తర్వాత పిల్లల్లో టైప్– 1 డయాబెటిస్ పెరిగే అవకాశం ఉందేమోనని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి పెద్దగా లక్షణాలు కనిపించకపోయినా ఇది జరిగేందుకు అవకాశముందనే పరిశోధకుల రిపోర్టులు ప్రముఖ మెడికల్ జర్నల్ 'జామా' (జర్నల్ ఆఫ్ మెడికల్ అసోసియేషన్)లో ప్రచురితమయ్యాయి.

పరిశోధకుల అధ్యయన ఫలితాల వివరాలివి... వైరస్ తాలూకు ప్రభావంతో చిన్నారుల సొంత వ్యాధి నిరోధక వ్యవస్థలోని కణాలు.. వారి క్లోమ (ప్యాంక్రియాస్) గ్రంథిలోని బీటా కణాలు దెబ్బ తీయడం వల్ల పిల్లల్లో టైప్–1 డయాబెటిస్ వచ్చే ముప్పుందని పేర్కొంటున్నారు.

అధ్యయన ఫలితాలు చెప్పేదేమిటంటే...

జర్మనీలో ఫిబ్రవరి 2015 నుంచి అక్టోబరు 2023 వరకు అంటే దాదాపు ఎనిమిదేళ్ల పాటు పరిశోధకులు 509 మంది చిన్నారులపై ఓ సుదీర్ఘ అధ్యయనం నిర్వహించారు. ఏడాది మొదలుకొని పదహారేళ్ల వయసున్న పిల్లల్లో మల్టిపుల్ ఐలెట్ యాంటీబాడీలనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తూ ఈ అధ్యయనం సాగింది. ఈ 'మల్టిపుల్ ఐలెట్ యాంటీబాడీస్' అనేవి ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను దెబ్బతీసే ప్రోటీన్లు. ప్యాంక్రియాస్‌ను అవి అలా దెబ్బతీయడంలో చిన్నారుల్లో అది టైప్–1 డయాబెటిస్‌కు కారణమవుతుంది. ఐలెట్ ఆటో యాంటీబాడీస్... ప్యాంక్రియాస్‌ను దెబ్బతీయడం జరిగితే ముందు లక్షణాలు కనిపించకపోయినప్పటికీ... తుదకు అది టైప్–1 డయాబెటిస్‌కు దారితీస్తుంది.

ఈ తరహా పరిశోధనల అవసరమెందుకంటే...

డయాబెటిస్ వ్యాధిలో రక్తంలో చక్కెరను నియంత్రించాల్సిన ఇన్సులిన్ ఉత్పత్తి సరిగా జరగదు. లేదా ఇన్సులిన్ ఉత్పత్తి అయినప్పటికీ దేహం దాన్ని సమర్థంగా ఉపయోగించుకోకపోవచ్చు. దాంతో రక్తంలో చక్కెర ఎక్కువవ్వడంతో తొలిదశల్లో బయటకు ఎలాంటి లక్షణాలూ కనిపించకుండా నిశ్శబ్దంగా దెబ్బతీసే చక్కెర వ్యాధిని 'సైలెంట్ కిల్లర్'గా నిపుణులు చెబుతుంటారు. జీవనశైలి సమస్యల్లో ఒకటైన ఈ వ్యాధిని దురదృష్టవశాత్తూ పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు. దాంతో అది దేహంలోని కీలకమైన అవయాలను... మరీ ముఖ్యంగా గుండె, రక్తనాళాలు, కళ్లు, మూత్రపిండాలు, నరాలను దెబ్బతీస్తుంది. అందువల్ల చిన్నపిల్లల్లో కనిపించే చక్కెరవ్యాధి (జువెనైల్ డయాబెటిస్) అని పిలిచిన ఈ వ్యాధి... ఇప్పుడు యువత పెద్దయ్యాకా వారిని ప్రభావితం చేస్తుండటంతో మనదేశ నిపుణులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు.

గట్ మైక్రోబియమ్ అసమతౌల్యత వల్ల...

జీర్ణవ్యవస్థలో కోటానుకోట్ల మేలు చేసే బ్యాక్టీరియా ఉంటుందనీ, ఈ సూక్ష్మజీవుల సమూహాన్నే 'గట్ బ్యాక్టీరియా' లేదా 'గట్ మైక్రోబియమ్' అంటారనీ, దీనివల్లనే ప్రతి ఒక్కరిలోని వ్యాధినిరోధక వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుందన్నది చాలామందికి తెలిసిన విషయమే. ఏదైనా వైరస్ సోకాక... ఈ గట్ మైక్రోబియమ్‌లో మేలు చేసే బ్యాక్టీరియా సంఖ్య తగ్గి, కీడు చేసేవి పెరగడం వల్ల గట్ మైక్రోబియమ్ సమతౌల్యతలో మార్పుల వల్ల వ్యాధినిరోధక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని, బలహీనమవుతుంది. ఈ పరిణామం డయాబెటిస్, గుండెజబ్బుల వంటి అనేక దీర్ఘకాలిక (క్రానిక్) వ్యాధులకు కారణమవుతుంది.

యాంటిజెన్స్‌కు ఎక్స్‌పోజ్ కానివ్వపోవడంతో...

మునపటి తరంతో పోలిస్తే ఇటీవల పిల్లలను స్వాభావికమైన వాతావరణానికి ఎక్స్‌పోజ్ కానివ్వకుండా అత్యంత రక్షణాత్మకమైన రీతిలో తల్లిదండ్రులు వ్యవహరిస్తున్నారు. పిల్లలు ఆరుబయట ఆడుతూ, ప్రాకృతిక పర్యావరణానికీ, అందులోని కొన్ని వ్యాధికారకాలకు ఎక్స్‌పోజ్ అయినప్పుడు చిన్నారుల్లో ఆ వ్యాధికారకాలను ఎదుర్కొనే యాంటిజెన్స్ ఉత్పన్నం అవుతాయి. కానీ తల్లిదండ్రుల అతిజాగ్రత్త కారణంగా వారు నేచురల్ ఎన్విరాన్‌మెంట్‌లో ఉండటం తగ్గిపోవడంతో కొన్ని రకాల హానికారక అంశాలకు యాంటిజెన్స్ ఉత్పాదన లేకుండా పోయి, సహజ రక్షణ కవచం ఏర్పడకుండా పోయింది. ఈ అంశం కూడా పిల్లల్లో సహజ రక్షణ వ్యవస్థను బలహీనం చేసిందనే అభిప్రాయం కూడా ఇంకొందరు నిపుణులనుంచి వ్యక్తమవుతోంది.

డయాబెటిస్ ఉన్న పిల్లల్లో కనిపించే కొన్ని లక్షణాలు ...

- చాలా ఎక్కువ నీరు తాగుతూ ఉండటం; మాటిమాటికీ మూత్ర విసర్జనకు వెళ్తుండటం.
- రాత్రిళ్లు నిద్రలో పక్కతడిపే అలవాటును మానేసిన పిల్లలు అకస్మాత్తుగా మళ్లీ పక్క తడపటం మొదలుపెట్టడం
- బాగా ఆకలితో ఉండటం; మంచి ఆహారం తీసుకుంటున్నప్పటికీ బరువు తగ్గుతుండటం
- చాలా తేలిగ్గా అలసిపోతుండటం, చాలా నిస్సత్తువగా, నీరసంగా ఉండటం
- కొందరిలో చూపు మసగ్గా కనిపిస్తుండటం (బ్లర్డ్ విజన్)
- జననేంద్రియాల దగ్గర ఫంగల్ ఇన్ఫెక్షన్లు (క్యాండిడియాస్) వంటివి వస్తుండటం.

ఈ లక్షణాలు కనిపించినప్పుడు పిల్లల్లో డయాబెటిస్‌ను వెంటనే గుర్తించి, వెంటనే ఇన్సులిన్‌తో వైద్యం మొదలుపెట్టకపోతే కొన్ని ప్రమాదకరమైన పరిణామాలు సంభవించవచ్చు.

టైప్-1 డయాబెటిస్‌ను ఎదుర్కొనే తీరు

(మేనేజింగ్ టైప్–1 డయాబెటిస్)

పిల్లల్లో టైప్–1 డయాబెటిస్ కనిపించినప్పుడు కింద పేర్కొన్న ఆరు అంశాల ద్వారా దాన్ని మేనేజ్ చేయాలి. అవి...

1. ఇన్సులిన్ : డయాబెటిస్‌తో బాధపడే పిల్లల విషయంలో ప్రస్తుతానికి ఇన్సులిన్ ఇవ్వడం మాత్రమే అందుబాటులో ఉన్న చికిత్స.

2. పర్యవేక్షణ (మానిటరింగ్) : పిల్లల్లో కేవలం ఇన్సులిన్ ఇస్తుండటం మాత్రమే సరిపోదు. వారు తిన్న దాన్ని బట్టి ఎంత మోతాదులో ఇన్సులిన్ ఇస్తుండాలన్న అంశాన్ని నిత్యం పర్యవేక్షించుకుంటూ ఉండాలి. ఈ అంశాన్ని పిల్లలు ఎంత తిన్నారు, ఎలాంటి ఆహారం తీసుకున్నారు, దాని వల్ల రక్తంలో ఎంత గ్లూకోజ్ వెలువడుతుంది... వంటి అనేక అంశాలను పర్యవేక్షించుకుంటూ ఇన్సులిన్ ఇస్తుండాలి.

3. ఆహారం : కేవలం రక్తంలోని గ్లూకోజ్ పాళ్లను చూసుకుంటూ యాంత్రికంగా ఇన్సులిన్ ఇవ్వడం కాకుండా... పిల్లలు ఎదిగే వయసులో ఉంటారు కాబట్టి వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం ఉండేలా చూపుకోవాలి. ఆహారంలో తగిన పాళ్లలో పిండిపదార్థాలను (కార్బోహైడ్రేట్స్) సమకూర్చే కాయధాన్యాలు (హోల్‌గ్రెయిన్స్), మాంసకృత్తులు (ప్రోటీన్లు), ఆరోగ్యకరమైన కొవ్వుపదార్థాలు ఇస్తుండాలి. వీటిని పిల్లల వయసు, బరువు, రోజంతా చేసే శ్రమ వంటి అంశాల ఆధారంగా ఓ ప్రణాళిక రూపొందించి, దానికి అనుగుణంగా అవసరమైన మోతాదుల్లో ఇవ్వాలి.

4. శారీరక శ్రమ : ఈ రోజుల్లో చిన్నారులు ఆరుబయట ఆడుకోవడం చాలా తక్కువ. పిల్లలు ఒళ్లు అలిసేలా ఆడుకోవడం వల్ల వారి ఒంట్లోని చక్కెర మోతాదులు స్వాభావికంగానే నియంత్రితమయ్యేందుకు అవకాశాలు ఎక్కువ. ఇలాంటి పిల్లల్లో ఒళ్లు అలిసేలా ఆడుకోవడం చాలా అవసరం.



5. గ్లూకోజ్‌ను పరీక్షించడం : పిల్లల రక్తంలో గ్లూకోజ్ మోతాదుల్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలి.

6. కీటోన్ మోతాదుల కోసం మూత్రపరీక్ష : మూత్రంలో కీటోన్ మోతాదులను పరీక్షించడం కోసం తరచూ మూత్రపరీక్షలు చేయిస్తూ ఉండాలి.

చిన్నారుల్లో పెరుగుతున్న కేసులు...

కోవిడ్–19 ఇన్ఫెక్షన్ అన్నది ఆటో ఇమ్యూన్ రెస్పాన్స్‌ను పెంచడం వల్ల ఆ అంశం ఈ వ్యాధిని ప్రేరేపిస్తోందంటున్నారు మరికొందరు నిపుణులు. ఇక జామా రిపోర్టును అనుసరించి, కోవిడ్–19 బారిన పడ్డ పిల్లల్లో ఇన్ఫెక్షన్ వచ్చిన ఆర్నెల్ల నుంచి ఏడాది కాలంలోనే టైప్–1 డయాబెటిస్ వచ్చే అవకాశాలు మామూలు పిల్లల కంటే 16% ఎక్కువ. మన దేశంలో నిర్దిష్టమైన గణాంకాలు లేకపోయినప్పటికీ... పాశ్చాత్య దేశాల అధ్యయనాల ప్రకారం చూస్తే కోవిడ్ (సార్స్–సీవోవీ2) ఇన్ఫెక్షన్ తర్వాత టైప్–1 డయాబెటిస్ కేసులు విపరీతంగా పెరిగినట్లు తెలుస్తోంది. ఎంటరోవైరస్, సైటో మెగాలో వైరస్, రుబెల్లా వైరస్‌లు ఎటాక్ అయ్యాకూడా టైప్–1 డయాబెటిస్ రావడం జరిగినట్లే... కోవిడ్19 విషయంలోనూ జరుగుతోందని మరికొందరు నిపుణుల అభిప్రాయం.

కారణాలు

టైప్–1 డయాబెటిస్‌కు జన్యుపరమైన కారణాలను ముఖ్యంగా చెప్పవచ్చు. దాంతోపాటు బాధితులు కొన్ని వైరస్‌లకు గురికావడం కూడా మరో ముఖ్యమైన అంశం. కోవిడ్–19 కూడా ఒక రకం వైరల్ ఇన్ఫెక్షన్ కావడం కూడా ఈ ముప్పును పెంచుతోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్మార్), 2022 నివేదిక ప్రకారం మన దేశంలో టైప్–1 డయాబెటిస్‌తో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 95,600 మంది 14 ఏళ్లలోపు చిన్నారులని తేలింది.

అప్రమత్తంగా ఉండాల్సిందే...

కనబడుతున్న తార్కాణాలను బట్టి, ప్రస్తుతానికి టైప్–1 డయాబెటిస్‌కు మందులేదనే వాస్తవానికి బట్టి రాబోయే భావితరాలను వ్యాధిగ్రస్తం కాకుండా చూసుకునేందుకు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

బిజినెస్ రీల్

ఎంటార్‌కి రూ. 15 కోట్ల ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిఫెన్స్ అవసరాలకు సంబంధించి అధునాతన ఇంజిన్ టెక్నాలజీల తయారీ కోసం కంబస్టర్లు సరఫరా చేసేందుకు రూ. 15.4 కోట్ల ఆర్డరు లభించినట్లు ఎంటార్ టెక్నాలజీస్ వెల్లడించింది. నిబంధనల ప్రకారం ఈ కాంట్రాక్టును 2025 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు వివరించింది. కంపెనీకి హైదరాబాద్‌లో ఏడు తయారీ యూనిట్లు ఉన్నాయి.

ఎయిర్‌బస్-టాటా స్ట్రయివ్ కేంద్రాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ: నైపుణ్యాల అభివృద్ధిలో శిక్షణకు సంబంధించి ఎయిర్‌బస్-టాటా స్ట్రయివ్ కేంద్రాలను కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ప్రారంభించారు. పరిశ్రమ, జాబ్ మార్కెట్ అవసరాలకు తగ్గట్లుగా నైపుణ్యాల శిక్షణ ఉండాలని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ దిశగా ఉన్నత విద్యా సంస్థలతో భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఇరు సంస్థలకు చౌదరి సూచించారు. మరోవైపు అందరికీ ఉద్యోగాలు లభించకపోతుండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతుండవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో యువతలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఢిల్లీ, బెంగళూరులో ఏర్పాటు చేసిన ఎయిర్‌బస్-టాటా స్ట్రయివ్ సెంటర్లలో సైబర్‌సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, వెబ్ డిజైనింగ్ వంటి కోర్సుల్లో వచ్చే మూడేళ్ల వ్యవధిలో ఆర్థికంగా వెనుకబడిన 900 మందికి శిక్షణనివ్వనున్నట్లు ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ రెమి మైయార్డ్ తెలిపారు. టాటా కమ్యూనిటీ ఇనీషియేటివ్స్ ట్రస్ట్‌లో భాగంగా నైపుణ్యాల్లో శిక్షణ కల్పించే విభాగంగా 2014లో టాటా స్ట్రయివ్ ఏర్పాటైంది. 2022 నుంచి ఎయిర్‌బస్ ఇండియా, టాటా స్ట్రయివ్ కలిసి పని చేస్తున్నాయి.

నిరుద్యోగ రేటు 3.2 శాతం

2023 జూలై 2024 జూన్ మధ్య స్థిరం

న్యూఢిల్లీ: నిరుద్యోగ రేటు 2023 జూలై నుంచి 2024 జూన్ కాలంలో స్థిరంగా 3.2 శాతం వద్దే కొనసాగినట్లు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ నిర్వహించిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే'లో వెల్లడైంది. 15 ఏళ్లు, అంతకుమించి వయసులోని కార్మికుల వివరాలను గమనిస్తే.. నిరుద్యోగ రేటు పురుషుల్లో 3.2 శాతానికి తగ్గింది. 2022 జూలై నుంచి 2023 జూన్ కాలంలో ఇది 3.3 శాతంగా ఉంది. కార్మిక శక్తి భాగస్వామ్య రేటు ఇదే కాలంలో 57.9 శాతం నుంచి 60.1 శాతానికి పెరిగింది. పురుష కార్మికుల భాగస్వామ్యం 78.8 శాతంగా ఉంటే, మహిళల వైపు నుంచి ఇది 41.7 శాతంగా ఉంది. అంతకుముందు ఏడాది కాలంలో మహిళా కార్మికుల భాగస్వామ్యం 37 శాతం కాగా, పురుష కార్మికుల భాగస్వామ్య రేటు 78.5 శాతంగా ఉండడం గమనార్హం.

కార్పొరేట్ల నుంచి

రూ.4 లక్షల కోట్ల రుణ డిమాండ్



ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ: భారత్ కార్పొరేట్ రంగం నుంచి ఎస్‌బీఐకి దాదాపు రూ.4 లక్షల కోట్ల పటిష్ఠ రుణ డిమాండ్ ఉందని ఎస్‌బీఐ చీఫ్ సీఎస్ శెట్టి ఒక ఇంటర్వ్యూలో తెలపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రైవేట్ రంగం మూలధన వ్యయం పెరుగుతుందన్న ఆశాభావాన్ని సీఎస్ శెట్టి వ్యక్తం చేశారు. 'మా బ్యాంక్ ప్రైవేట్ మూలధన వ్యయంపై మంచి ఆసక్తిని గమనిస్తోంది. మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్ ఇందులో కీలకమైనది. ప్రధానంగా రోడ్లు, పునరుత్పాదక ఇంధనం, కొన్ని రిఫైనరీల నుండి రుణ డిమండ్ ఉంది'' అని అన్నారు.

సంక్షేమ కార్యక్రమాలకు ఎస్‌బీఐ దన్ను

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కమ్యూనిటీ సంక్షేమ, పర్యావరణహిత కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తోందని హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. ఇందులో భాగంగా దృష్టి లోపం ఉన్న వారి అభ్యున్నతికి పాటుపడుతున్న దేవనార్ ఫౌండేషన్‌కి బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి రూ. 51 లక్షల విరాళాన్ని అందించారు. ఫైర్‌ఫైటింగ్ సిస్టం, రూఫ్‌టాప్ సోలార్ ఫొటోవోల్టెయిక్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. మరోవైపు, ప్రకృతిని పరిరక్షించుకునేందుకు చేస్తున్న కృషిలో భాగంగా బ్యాంకు నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలోనూ శెట్టి పాల్గొన్నారు. గ్రామీణ భారత ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాలను చేపట్టే కార్యక్రమాలను ఎస్‌బీఐ ఫౌండేషన్ నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. అటు స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజీలో విజిలెన్స్ వర్క్‌షాప్‌ను శెట్టి ప్రారంభించారు.

నెక్సాన్ సీఎన్‌జీ వచ్చేసింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ నెక్సాన్ టర్బోచార్జ్‌డ్ ఐసీఎన్‌జీ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఎనిమిది వేరియంట్లలో లభిస్తుంది. ధర ఎక్స్‌షోరూంలో రూ.8.99 లక్షలతో ప్రారంభమై రూ.14.59 లక్షల వరకు ఉంది. 1.2 లీటర్ త్రీ సిలిండర్ ఇంజన్‌తో తయారైంది. కేజీకి 24 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. మాన్యువల్ గేర్‌బాక్స్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ స్టాండర్డ్ ఫీచర్లు. 321 లీటర్ల బూట్ స్పేస్ ఉంది. టాప్ వేరియంట్‌కు 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్‌రూఫ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ చార్జర్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, టైర్ ప్రెజర్ మానిటర్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్స్, ఆటో హెడ్‌లైట్, ఆటో వైపర్స్ వంటివి జోడించారు.

ఈవీ 489 కిలోమీటర్లు..

టాటా మోటార్స్ తాజాగా 45 కిలోవాట్ అవర్ బ్యాటరీతో కూడిన నెక్సాన్ ఈవీని పరిచయం చేసింది. ధర రూ.13.99 లక్షల నుంచి రూ.16.99 లక్షల వరకు ఉంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 489 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. 48 నిముషాల్లో 80 శాతం చార్జింగ్ పూర్తి అవుతుంది. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, టచ్ బేస్డ్ ఏసీ ప్యానెల్, సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, 6 ఎయిర్‌బ్యాగ్స్, 360 డిగ్రీ కెమెరా, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, పార్కింగ్ సెన్సార్స్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ఫీచర్లు జోడించారు. కాగా, టాటా మోటార్స్ నెక్సాన్ ఈవీ రెడ్ డార్క్ ఎడిషన్‌ను రూ.17.19 లక్షల ధరతో ప్రవేశపెట్టింది.

అక్టోబర్‌లో 'రేటు' తగ్గొచ్చు: ఎస్‌అండ్‌పీ

న్యూఢిల్లీ: సరళతర వడ్డీరేట్ల విధానానికి తెరతీస్తూ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటు (ప్రస్తుతం 6.5 శాతం) అక్టోబర్‌లో తగ్గే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఎస్‌అండ్‌పీ అభిప్రాయపడింది. అక్టోబర్ 7 నుంచి 9 మధ్య ఆర్‌బీఐ కీలక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో ఎస్‌అండ్‌పీ ఈ అంచనాలకు వచ్చింది. 2024-25లో 6.8 శాతం, 2025-26లో 6.9 శాతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు నమోదయ్యే అవకాశం ఉందని ఎస్‌అండ్‌పీ విశ్లేషించింది. 2023-24లో ఎకానమీ 8.2 శాతం వృద్ధి సాధించిన సంగతి తెలిసిందే. 2025 మార్చి నాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.11.11 లక్షల కోట్ల బడ్జెటరీ మూలధన వ్యయాలు ఎకానమీకి ఊతం ఇచ్చే అంశంగా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటున రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉంటుందని అంచనావేసింది.



ఐపీవో చేపట్టేందుకు సోలార్ ప్యానళ్ల తయారీ కంపెనీ వారీ ఇంజినీర్స్.. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి పొందింది. ఇదేవిధంగా డిజిటల్ పేమెంట్ల సంస్థ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూకి సైతం సెబీ ఆమోదముద్ర వేసింది. వారీ సెబీకి 2023 డిసెంబర్‌లో, మొబిక్విక్ 2024 జనవరిలో దరఖాస్తు చేశాయి.

రోజుకో కొత్త గరిష్టాన్ని తాకుతున్న సెకండరీ మార్కెట్ల బాటలో ప్రైమరీ మార్కెట్లు సైతం భారీ సంఖ్యలో ఇష్యూలతో కదం తొక్కుతున్నాయి. తాజాగా రెండు కంపెనీలకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. మరో రెండు కంపెనీలు ఐపీవో సన్నాహాల్లో ఉన్నాయి. వివరాలు ఇలా..

-సాక్షి, బిజినెస్‌డెస్క్

ఐపీవోల హవా

- 2 కంపెనీలకు సెబీ గ్రీన్‌సిగ్నల్
- వారీ ఇంజినీర్స్, మొబిక్విక్‌కు సై
- కాసాగ్రాండ్ ప్రీమియర్ దరఖాస్తు
- నవంబర్‌లో ఎన్‌టీపీసీ గ్రీన్ రెడీ



వారీ ఇంజినీర్స్.. రూ. 3,000 కోట్లకుపైగా

వారీ ఇంజినీర్స్ ఐపీవోలో భాగంగా రూ. 3,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా 32 లక్షల షేర్లను ప్రమోటర్‌తోపాటు ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను ఒడిషాలో 6 గిగావాట్ల ఇన్‌గాట్ వేఫర్, సోలార్ సెల్, సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ 2023 జూన్‌కల్లా 12 గిగావాట్ల పీవీ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

మొబిక్విక్.. రూ. 700 కోట్లు

తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా మొబిక్విక్ రూ. 700 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. తద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సై అంటోంది. ఐపీవో నిధుల్లో రూ. 250 కోట్లు ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్ వృద్ధికి వినియోగించనుంది. రూ. 135 కోట్లు పేమెంట్ సర్వీసుల బిజినెస్‌కు దన్నుగా వెచ్చించనుంది. మరో రూ. 135 కోట్లు డేటా, మెషీన్ లెర్నింగ్, ఏఐ, ప్రొడక్ట్ టెక్నాలజీలపై ఇన్వెస్ట్ చేయనుంది. ఈ బాటలో పేమెంట్ పరికరాలపై రూ. 70 కోట్లు పెట్టుబడి వ్యయాలుగా కేటాయించనుంది.

రూ. 10,000 కోట్లపై కన్ను



విద్యుత్ రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ కంపెనీ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ భారీ ఐపీవోకు సిద్ధపడుతోంది. ఇందుకు అనుగుణంగా గత వారమే సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. తద్వారా నవంబర్ తొలి వారంలో ఐపీవోకు వచ్చే వీలున్నట్లు తెలుస్తోంది. ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవో ద్వారా రూ. 10,000 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ముంబైసహా.. సింగపూర్ తదితర దేశాలలో రోడ్‌షోలకు ప్రణాళికలు వేసింది. ఇష్యూ నిధుల్లో రూ. 7,500 కోట్లు అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ రెనెవబుల్ ఎనర్జీ రుణ చెల్లింపులతోపాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఈ మహారత్న కంపెనీ 2024 ఆగస్టుకల్లా 3,071 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు, 100 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను కలిగి ఉంది. ఈ ఏడాది ఇప్పటికే 60 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వచ్చిన నేపథ్యంలోనూ మరిన్ని కంపెనీలు ఇందుకు తెరతీస్తుండటం విశేషం!

ఇదే బాటలో లీలా ప్యాలెస్

లీలా ప్యాలెస్ హోటళ్ల నిర్వాహక సంస్థ ష్లాస్ బెంగళూరు లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. వెరసి దేశీ ఆతిథ్య రంగంలో అతిపెద్ద ఐపీవోగా నిలవనుంది. కాగా.. ఇష్యూలో భాగంగా లీలా ప్యాలెస్ రూ. 3,000 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్ సంస్థ డీఐఎఫ్‌సీ రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు, ఇతర సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ దన్నుగల ష్లాస్ బెంగళూరు వెల్లడించింది.



2024 మార్చికల్లా కంపెనీ రుణ భారం రూ. 4,053 కోట్లుగా నమోదైంది. ద లీలా బ్రాండ్‌తో కంపెనీ విలాసవంత హోటళ్లను నిర్వహిస్తున్న విషయం విదితమే. మొత్తం 3,382 గదులను కలిగి ఉంది.

రూ. 1,100 కోట్ల సమీకరణ



రియల్టీ కంపెనీ కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలకు తెరతీసింది. ఇందుకు వీలుగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 1,100 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులను కంపెనీతోపాటు అనుబంధ సంస్థల రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కాసాగ్రాండ్ బ్రాండుతో కంపెనీ రియల్టీ అభివృద్ధి కార్యకలాపాలు చేపడుతోంది. 2023-24లో రూ. 2,614 కోట్ల ఆదాయం, రూ. 257 కోట్ల నికర లాభం ఆర్జించింది.

14ఏళ్లలో సెప్టెంబర్ బిజీ..బిజీ

ఐపీవోలకు 28 కంపెనీలు

ఈ నెల(సెప్టెంబర్) 14 ఏళ్ల తదుపరి సరికొత్త రికార్డుకు వేదిక కానుంది. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) వివరాల ప్రకారం సెప్టెంబర్‌లో ఇప్పటివరకూ 28 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి. మెయిన్ బోర్డ్, ఎస్ఎంఈలు కలిపి ఇప్పటికే 28 కంపెనీలు లిస్టింగ్‌కు తెరతీశాయి. ఫైనాన్షియల్ మార్కెట్లు పరివర్తనలో ఉన్నట్లు ఆర్థిక వ్యవస్థపై రూపొందించిన సెప్టెంబర్ బులెటిన్‌లో ఆర్‌బీఐ పేర్కొంది. ప్రైమరీ ఈక్విటీ మార్కెట్‌లో చిన్న, మధ్యతరహా సంస్థలు(ఎస్ఎంఈలు)సహా భారీ సందడి నెలకొన్నట్లు తెలియజేసింది. వెరసి 14 ఏళ్ల తరువాత ఈ సెప్టెంబర్ అత్యంత రద్దీగా మారినట్లు వ్యాఖ్యానించింది. దేశీ మ్యూచువల్ ఫండ్స్ తదితర ఇన్వెస్టర్ల ద్వారా ఇష్యూలు భారీస్థాయిలో సబ్‌స్క్రయిబ్ అవుతున్నట్లు వివరించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పరిశీలన ప్రకారం ఐపీవోలలో లభించిన షేర్లలో 54 శాతాన్ని ఇన్వెస్టర్లు లిస్టయిన వారం రోజుల్లోనే విక్రయించారు. 2024లో ఐపీవోల ద్వారా నిధుల సమీకరణ జోరు చూపుతున్నట్లు ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది. ఈ బాటలో తొలి అర్ధభాగానికల్లా ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఐపీవోలు వెలువడిన దేశంగా భారత్ నిలిచినట్లు తెలియజేసింది. ఇందుకు ఎస్ఎంఈలు ప్రధానంగా దోహదపడినట్లు వెల్లడించింది.

నూనెల ధర ఎందుకు పెరిగింది?

కంపెనీల వివరణ కోరిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: వంటనూనెల రిటైల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఎడిబుల్ ఆయిల్ కంపెనీలను ప్రభుత్వం వివరణ కోరింది. పాత సుంకాల ఆధారంగా దిగుమతి చేసుకున్న నూనెల నిల్వలు తగినంత ఉన్నందున ధరలు స్థిరంగా ఉంచాలని ఈ సందర్భంగా సూచించింది. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై 20 శాతం దిగుమతి సుంకం (బేసిక్ కస్టమ్స్ డ్యూటీ) విధిస్తూ కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 14న నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు వీటిపై ఎటువంటి సుంకం లేదు. అలాగే శుద్ధి చేసిన పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని ప్రస్తుతం ఉన్న 12.5 నుంచి 32.5 శాతానికి పెంచారు.

దిగుమతి సుంకంతోపాటు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ సెస్‌తోపాటు సోషల్ వెల్ఫేర్ సర్‌చార్జ్ అదనం. 'వచ్చే పండుగ సీజన్‌లో రిటైల్ ధరలను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. దిగుమతి సుంకం పెంపు ప్రకటన నుండి ధరలు ఎందుకు పెరుగుతున్నాయనే దానిపై కారణాలను వెల్లడించాలని పరిశ్రమను ప్రభుత్వం కోరింది' అని ఆహార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. తక్కువ సుంకాలతో దిగుమతి చేసుకున్న నూనెలు సుమారు 30 లక్షల టన్నుల నిల్వ ఉందని, ఇవి సులభంగా 45-50 రోజుల డిమాండ్‌ను తీరుస్తాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అందువల్ల ప్రాసెసింగ్ కంపెనీలు గరిష్ట రిటైల్ ధరలను పెంచడం మానుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ల్యాప్‌టాప్ 'దిగుమతులకు' డిసెంబర్ 31 వరకు గడువు



న్యూఢిల్లీ: ల్యాప్‌టాప్‌లు, ఐటీ హార్డ్‌వేర్ ఉత్పత్తుల దిగుమతులకు ప్రస్తుతమున్న అనుమతుల ప్రక్రియను డిసెంబర్ 31వరకు పొడిగిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఈ గడువు సెప్టెంబర్ 30వరకే ఉంది. 2023-24లో 9.5 బిలియన్ డాలర్ల విలువ మేర దిగుమతులకు ప్రభుత్వ అనుమతులు మంజూరు చేయగా, వాస్తవ దిగుమతులు 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఎక్కువ భాగం చైనా నుంచే రావడం గమనార్హం. ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, ఆల్ ఇన్ వన్ పర్సనల్ కంప్యూటర్లు, అల్ట్రా స్మాల్ ఫామ్ ఫ్యాక్టర్ కంప్యూటర్ల దిగుమతులపై 2023 ఆగస్ట్ 3న కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో స్థానికంగా వీటి సరఫరా సమస్యలు ఏర్పడతాయన్న పరిశ్రమ ఆందోళనతో, ప్రభుత్వం నుంచి అనుమతితో దిగుమతికి వీలు కల్పించింది.

తయారీకి బంగారు భవిష్యత్

- 'మేక్ ఇన్ ఇండియా'కి పదేళ్లు
- ఈ దిశగా గొప్ప విజయం సాధించాం
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ/సిడ్నీ: భారత్‌లో తయారీ కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో దేశంలో తయారీకి అద్భుతమైన భవిష్యత్ ఉందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మోదీ సర్కారు 2014 సెప్టెంబర్ 25న ప్రారంభించింది. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతోపాటు, తయారీ, డిజైన్, ఆవిష్కరణలకు భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాలు ఇందులో భాగంగా ఉన్నాయి. వ్యాపార సులభతర నిర్వహణ, అవినీతిని ఉపేక్షించకపోవడం, ఎలక్ట్రానిక్స్ తదితర వర్ధమాన రంగాలపై దృష్టి సారించడం 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ) విజయవంతం అయ్యేలా చేసినట్టు ప్రకటించారు. ఇది దేశంలో స్థానిక, విదేశీ పెట్టుబడులు ఇతోధికం కావడానికి సాయపడినట్టు చెప్పారు. భారీ పెట్టుబడుల ప్రణాళికలను చూస్తున్నామంటూ.. వీటి రాకతో లక్షలాది ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీ పాత్ర మరింత పెరుగుతుందని సిడ్నీ పర్యటనలో ఉన్న గోయల్ ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ విధాన నిర్ణయాల ఫలితం..

స్థానికంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల సెంటిమెంట్ బలహీనంగా ఉన్న తరుణంలో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మోదీ సర్కారు చేపట్టినట్టు మంత్రి గోయల్ గుర్తు చేశారు. ''అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ కొంత క్షీణించింది. బలహీన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పేర్కొనేవారు. దీంతో ఇన్వెస్టర్ల విశ్వాసం తిరిగి పొందేందుకు ప్రభుత్వానికి కొంత సమయం పట్టింది. ఒకటే దేశం ఒకటే పన్ను - జీఎస్‌టీ, ఐబీసీ, పారదర్శకంగా గనుల వేలం తదితర ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో అది సాధ్యపడింది''అని మంత్రి గోయల్ వివరించారు. స్థిరమైన, స్పష్టమైన విధానాలతో ఇన్వెస్టర్లలో విశ్వాసం ఏర్పడేలా చేసినట్టు చెప్పారు. ఈ చర్యలతో వ్యాపార సులభతర నిర్వహణలో భారత్ స్థానం 14 స్థానాలు మెరుగుపడి 190 దేశాల్లో 63కు చేరినట్టు తెలిపారు. 2020లో పీఎల్ఐ పథకాన్ని ప్రారంభించి, ఎన్నో రంగాల్లో తయారీకి ప్రోత్సాహకాలు కల్పించినట్టు చెప్పారు. ''పదేళ్ల తర్వాత నాటి చర్యల ఫలితాలను చూస్తున్నాం. భవిష్యత్‌పై ఉత్సాహంతో ఉన్నాం. మొబైల్స్ తయారీలో ఎంతో పురోగతి సాధించాం. ప్రపంచంలో ఇప్పుడు రెండో అతిపెద్ద మొబైల్స్ తయారీ కేంద్రంగా ఉన్నాం'' అని వివరించారు. టెక్స్‌టైల్స్, సిరామిక్స్, ఆటబొమ్మలు, ప్లాస్టిక్స్, కెమికల్స్, ఫార్మా రంగాల్లో దేశీ సామర్థ్యాలు ఇనుమడించాయన్నారు. దేశ అవసరాలు తీర్చడంతోపాటు ఎగుమతులు 2023-24లో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 778 బిలియన్ డాలర్లకు చేరుకునేలా సాయపడినట్టు మంత్రి తెలిపారు. కరోనా మహమ్మారి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రెడ్‌సీ సంక్షోభాల్లోనూ దేశ జీడీపీలో తయారీ రంగం వాటా యాథావిధిగా కొనసాగుతున్నట్టు చెప్పారు.

విదేశీ పెట్టుబడుల ఆకర్షణ

అంతరిక్షం, బొగ్గు తవ్వకం, ఈ-కామర్స్, ఫార్మా, పౌర విమానయానం, కాంట్రాక్టు తయారీ తదితర రంగాల్లో స్థానిక తయారీ ప్రోత్సాహం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ఆకర్షణకు చర్యలు తీసుకున్నట్టు మంత్రి గోయల్ తెలిపారు. గడిచిన పది ఆర్థిక సంవత్సరాల్లో ఎఫ్‌డీఐ రాక, అంతకుముందు పదేళ్ల (యూపీఏ హయాం) కాలంతో పోల్చి చూస్తే 119 శాతం పెరిగి 667 బిలియన్ డాలర్లకు చేరుకుందని, ఇందులో 90 శాతం ఆటోమేటిక్ మార్గంలోనే వచ్చిందన్నారు.



భారత్- ఆస్ట్రేలియా బిజినెస్ అండ్ కమ్యూనిటీ అలయన్స్ (ఐఏబీసీఏ) సిడ్నీలో నిర్వహించిన 'ఎమర్జింగ్ బిజినెస్ లీడర్స్ రిసెప్షన్'లో సెల్ఫీలకు పోజులిచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.

ఆర్‌బీఐ దృష్టికి రియల్టర్ల నిధుల సమస్యలు

రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న రుణ లభ్యత సమస్యలను ఆర్‌బీఐ దృష్టికి తీసుకెళతానని మంత్రి పీయూష్ గోయల్ హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో (మున్సిపాలిటీలు) మాట్లాడతానని భరోసా ఇచ్చారు. రెరా చట్టం రియల్ ఎస్టేట్ పరిశ్రమలో పారదర్శకతను తీసుకొచ్చినట్టు చెప్పారు. జాతి నిర్మాణ అవసరాలు, ఉపాధి కల్పన, జీడీపీలో పన్నుల పరంగా వాటా.. ఇలా రియల్ ఎస్టేట్ రంగం గొప్ప పాత్ర పోషిస్తోందని మంత్రి మెచ్చుకున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-9-2024	
విశాఖ	555-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	160.65	4.32
HINDALCO	719	4.12
POWERGRID	350.6	2.77
TECHM	1,638.75	1.97
ADANIENT	3,100.45	1.86

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,866.70	-2.78
HINDUNILVR	2,952.65	-2.51
GRASIM	2,624.00	-1.61
ULTRACEMCO	11,781.25	-1.51
SHRIRAMFIN	3,518.00	-1.39

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,285
ఎన్ఎస్ఈ	1,25,748
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,49,264
ఎఫ్ఐఐ	- 2,784
డీఐఐ	+ 3,868

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.50	$ 70.37
బ్రెంట్	74.28	$ 73.21



ఫార్మాట్ ఏదైనా...
బుమ్రానే బెస్ట్ బౌలర్

ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ కితాబు

న్యూఢిల్లీ: భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా మూడు ఫార్మాట్లలోనూ అత్యుత్తమ పేస్ బౌలరని ఆస్ట్రేలియన్ మాజీ కెప్టెన్, బ్యాటర్ స్టీవ్ స్మిత్ కితాబిచ్చాడు. నవంబర్‌లో ఇరు జట్ల మధ్య ఆస్ట్రేలియా గడ్డపై 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సమరం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ బుమ్రాకు మాత్రమే సాధ్యమైన శైలి, అరుదైన నైపుణ్యం అతన్ని బెస్ట్ బౌలర్‌గా నిలబెడుతోందని అన్నాడు. 'అతనొక బౌలింగ్ వండర్. అతనితో ఏ బంతి ఎదుర్కోవాలన్నా కష్టమే! కొత్త బంతి, పాత బంతి, కొద్దిసేపు ఆడిన బంతి ఇలా ఏ బంతినైనా ఎదుర్కోనేందుకు నేను ఇబ్బంది పడేవాణ్ని. నిస్సందేహంగా బుమ్రా ఓ పేస్ సంచలనం. మూడు ఫార్మాట్లలోనూ అతనికి సరిలేరెవ్వరు. అతని బౌలింగ్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు అతి పెద్ద సవాల్' అని స్మిత్ విశ్లేషించాడు. 2018 జనవరిలో టెస్టుల్లో అరంగేట్రం చేసి బుమ్రా 37 మ్యాచ్‌లాడి 20.51 సగటుతో 164 వికెట్లను పడగొట్టాడు. మరోవైపు ఇటీవల సంప్రదాయ ఫార్మాట్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్న స్మిత్... భారత్‌తో జరగబోయే సిరీస్‌లోనూ ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు సిద్ధమేనని అన్నాడు. 109 టెస్టులాడిన ఈ వెటరన్ బ్యాటర్ పదివేల మైలురాయిని ఆ సిరీస్‌లో చేరుకోవాలని ఆశిస్తున్నాడు. ఇప్పటివరకు 195 ఇన్నింగ్స్‌ల్లో 56.97 సగటుతో 9685 పరుగులు చేశాడు. ఇందులో 32 సెంచరీలు, 41 అర్ధసెంచరీలున్నాయి.

యూరోప్ జట్టుదే లేవర్ కప్

వరల్డ్ టీమ్‌పై 13–11 పాయింట్లతో విజయం

బెర్లిన్: రెండేళ్ల తర్వాత లేవర్ కప్ టీమ్ టెన్నిస్ టోర్నీలో యూరోప్ జట్టు విజేతగా నిలిచింది. వరల్డ్ టీమ్‌తో మూడు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో యూరోప్ జట్టు 13–11 పాయింట్ల తేడాతో వరల్డ్ టీమ్ జట్టును ఓడించి ఐదోసారి విన్నర్స్ ట్రోఫీని దక్కించుకుంది. యూరోప్ జట్టు తరఫున అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), డానిల్ మెద్వెదెవ్ (రష్యా), కాస్పర్ రూడ్ (నార్వే), దిమిత్రోవ్ (బల్గేరియా), సిట్సిపాస్ (గ్రీస్), ఫ్లావియో కొబోలి (ఇటలీ), జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) బరిలోకి దిగారు. జాన్ బోర్గ్ (స్వీడన్) కెప్టెన్‌గా, థామస్ ఎన్‌క్విస్ట్ (స్వీడన్) వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. వరల్డ్ టీమ్ తరఫున టేలర్ ఫ్రిట్జ్, ఫ్రాన్సెస్ టియాఫో, బెన్ షెల్టన్ (అమెరికా), అలెజాండ్రో తబిలో (చిలీ), ఫ్రాన్సిస్కో సెరున్‌డొలో (అర్జెంటీనా), థనాసి కొకినాకిస్ (ఆస్ట్రేలియా) పోటీపడ్డారు. జాన్ మెకన్రో (అమెరికా) కెప్టెన్‌గా, ప్యాట్రిక్ మెకన్రో (అమెరికా) వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు.

రోజుకు మూడు చొప్పున మొత్తం తొమ్మిది సింగిల్స్ మ్యాచ్‌లు... రోజుకు ఒక డబుల్స్ మ్యాచ్ చొప్పున మొత్తం మూడు డబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించారు. తొలి రోజు మ్యాచ్‌లో గెలిచిన ప్లేయర్‌కు 1 పాయింట్... రెండో రోజు మ్యాచ్‌లో నెగ్గిన ప్లేయర్‌కు 2 పాయింట్లు... మూడో రోజు మ్యాచ్‌లో విజయం సాధించిన ప్లేయర్‌కు 3 పాయింట్లు కేటాయించారు. తొలుత 13 పాయింట్లు సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. రెండు రోజుల మ్యాచ్‌ల తర్వాత వరల్డ్ టీమ్ 8–4 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. అయితే చివరిరోజు యూరోప్ జట్టు మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి 9 పాయింట్లు సాధించగా... వరల్డ్ జట్టు ఒక మ్యాచ్‌లో గెలిచి 3 పాయింట్లు సంపాదించింది. ఓవరాల్‌గా యూరోప్ జట్టు 13–11తో విజయాన్ని దక్కించుకుంది. ఆఖరి రోజు డబుల్స్ మ్యాచ్‌లో కార్లోస్ అల్‌కరాజ్–కాస్పర్ రూడ్ (యూరోప్) జోడీ 6–2, 7–6 (8/6)తో బెన్ షెల్టన్–ఫ్రాన్సెస్ టియాఫో (వరల్డ్) జంటను ఓడించింది. తొలి సింగిల్స్‌లో బెన్ షెల్టన్ (వరల్డ్) 6–7 (6/8), 7–5, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో డానిల్ మెద్వెదెవ్ (యూరోప్)పై గెలిచాడు. రెండో సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (యూరోప్) 6–7 (5/7), 7–5, 10–5తో 'సూపర్ టైబ్రేక్'లో టియాఫో (వరల్డ్)ను ఓడించాడు.



మూడో సింగిల్స్‌లో అల్‌కరాజ్ (యూరోప్) 6–2, 7–5తో టేలర్ ఫ్రిట్జ్ (వరల్డ్)పై నెగ్గడంతో యూరోప్ జట్టుకు టైటిల్ ఖరారైంది. విజేత జట్టులోని ప్రతి సభ్యుడికి 2,50,000 డాలర్ల (రూ. 2 కోట్ల 8 లక్షలు) చొప్పున, రన్నరప్ జట్టులోని ప్రతి సభ్యుడికి 1,25,000 డాలర్ల (రూ. 1 కోటీ 4 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

ఆస్ట్రేలియా దిగ్గజ క్రీడాకారుడు రాడ్ లేవర్ పేరిట 2017 నుంచి ప్రతి ఏడాది ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. యూరోప్ దేశాలకు చెందిన మేటి టెన్నిస్ ప్లేయర్లతో ఒక జట్టు... యూరోపేతర దేశాలకు చెందిన స్టార్ ఆటగాళ్లతో మరో జట్టు ఈ టోర్నీలో పోటీపడతాయి. 2017, 2018, 2019లలో వరుసగా మూడేళ్లు యూరోప్ జట్టు టైటిల్ నెగ్గి హ్యాట్రిక్ సాధించింది. కరోనా కారణంగా 2020లో ఈ టోర్నీని నిర్వహించలేదు. 2021లోనూ యూరోప్ జట్టుకే టైటిల్ లభించింది. 2022, 2023లలో వరల్డ్ టీమ్ జట్టు విజేతగా నిలిచింది.



టైటిల్ పోరుకు విజయ్–జీవన్ జోడీ

హాంగ్జూ (చైనా): భారత సీనియర్ టెన్నిస్ ప్లేయర్ విజయ్ సుందర్ ప్రశాంత్ తన కెరీర్‌లో తొలిసారి అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నాడు. భారత్‌కే చెందిన జీవన్ నెడుంజెళియన్‌తో కలిసి హాంగ్జూ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీ డబుల్స్ విభాగంలో విజయ్ సుందర్ ప్రశాంత్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. సోమవారం జరిగిన సెమీఫైనల్లో 37 ఏళ్ల విజయ్, 35 ఏళ్ల జీవన్ 0–6, 6–2, 10–4తో 'సూపర్ టైబ్రేక్'లో ఏరియల్ బెహర్ (ఉరుగ్వే)–రాబర్ట్ గాలోవే (అమెరికా) జంటపై విజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో కాన్‌స్టాన్‌టిన్ ఫ్రాంట్‌జెన్–హెండ్రిక్ జెబెన్స్ (జర్మనీ) ద్వయంతో విజయ్–జీవన్ జంట తలపడుతుంది.

71 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో తొలి సెట్‌లో ఒక్క గేమ్ కూడా నెగ్గలేకపోయిన విజయ్–జీవన్ ద్వయం రెండో సెట్‌లో తేరుకుంది. రెండు సార్లు ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను బ్రేక్ చేసి తమ సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో భారత జోడీ పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకుంది. విజయ్ కెరీర్‌లో ఇదే తొలి ఏటీపీ–250 టోర్నీ ఫైనల్‌కాగా... జీవన్‌కిది నాలుగో ఫైనల్. 2017లో రోహన్ బోపన్నతో కలిసి జీవన్ చెన్నై ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ గెలిచాడు. 2018లో ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా)తో కలిసి చెంగ్డూ ఓపెన్‌లో, 2023లో శ్రీరామ్ బాలాజీతో కలిసి పుణే ఓపెన్‌లో జీవన్ రన్నరప్ ట్రోఫీని సాధించాడు.

రన్నరప్ సాయిప్రసాద్



మనామా (బహ్రెయిన్): బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సిరీస్–2024లో భారత ఆటగాడు తీగల సాయి ప్రసాద్ రన్నరప్‌గా నిలిచాడు. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన సాయి ఫైనల్లో రెండో సీడ్ విశ్వజీత్ చౌదరి (భారత్)తో తలపడ్డాడు. అయితే ఈ మ్యాచ్‌లో 15–21, 3–6 స్కోరు వద్ద సాయి అనారోగ్యంతో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. అంతకుముందు ఈ టోర్నీలో సాయి ప్రసాద్ ప్రీక్వార్టర్ ఫైనల్లో 19–21, 21–12, 23–21తో ఆదిత్య మీనన్ (యూఏఈ)పై, క్వార్టర్ ఫైనల్లో 11–21, 21–16, 21–17తో ఆమెర్ (సౌదీ అరేబియా)పై, సెమీఫైనల్లో 21–10, 21–15తో నిసర్గ్ తుంగా (యూఏఈ)పై నెగ్గాడు.

కమింగ్స్ గోల్‌తో మోహన్ బగాన్ విజయం



కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం తమ సొంత మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మోహన్ బగాన్ 3–2 గోల్స్ తేడాతో నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టును ఓడించింది. మోహన్ బగాన్ తరఫున డి.బిశ్వాస్ (10వ నిమిషంలో), ఎస్.బోస్ (61వ నిమిషంలో), జేసన్ కమింగ్స్ (87వ నిమిషంలో) గోల్స్ నమోదు చేశారు. నార్త్ ఈస్ట్ ఆటగాళ్లలో ఎం.బీమామర్ (4వ నిమిషంలో), ఎ.అజారై (24వ నిమిషంలో) గోల్స్ కొట్టారు. పోటీలకు నేడు విశ్రాంతి దినం కాగా... బుధవారం న్యూఢిల్లీలో జరిగే మ్యాచ్‌లో పంజాబ్ ఎఫ్‌సీతో హైదరాబాద్ ఎఫ్‌సీ తలపడుతుంది.

ప్రభాత్ స్పిన్... శ్రీలంక విన్

- మొత్తం 9 వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్
- తొలి టెస్టులో 63 పరుగులతో కివీస్‌పై గెలుపు
- 26 నుంచి చివరి టెస్టు



ప్రభాత్ జయసూర్య

గాలే: లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (4/136; 5/68) స్పిన్ మాయాజాలంతో శ్రీలంకను గెలిపించాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టడంతో తొలి టెస్టులో ఆతిథ్య జట్టు 63 పరుగుల తేడాతో న్యూజిలాండ్ జట్టుపై గెలిచింది. ఆఖరి రోజు లాంఛనం ముగిసేందుకు 3.4 ఓవర్లే సరిపోయాయి. ప్రభాత్ తన వరుస ఓవర్లలోనే మిగతా రెండు వికెట్లను పడేయడంతో కివీస్ ఐదోరోజు ఆటలో కేవలం 4 పరుగులే చేయగలిగింది. దీంతో ఓవర్‌నైట్ బ్యాటర్ రచిన్ రవీంద్ర సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 275 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు సోమవారం 207/8 ఓవర్‌నైట్ స్కోరుతో చివరిరోజు ఆటకొనసాగించిన కివీస్ ఆలౌట్ అయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. 70వ ఓవర్ వేసిన ప్రభాత్ జయసూర్య స్పిన్‌ను ఎదుర్కోలేక రచిన్ రవీంద్ర (168 బంతుల్లో 92; 9 ఫోర్లు, 1 సిక్స్) తన క్రితం రోజు స్కోరుకు కేవలం పరుగు మాత్రమే జోడించి వికెట్ల ముందు దొరికిపోయాడు. మళ్లీ తన తదుపరి ఓవర్లో ప్రభాత్... ఆఖరి వరుస బ్యాటర్ విలియమ్ ఓ రూర్కే (0)ను బౌల్డ్ చేయడంతో 71.4 ఓవర్లలో 211 పరుగుల వద్ద న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌కు తెరపడింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 305 పరుగులు చేయగా, కివీస్ 340 పరుగులు చేసి స్వల్ప ఆధిక్యం సంపాదించింది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు (309) మూడొందల పైచిలుకు పరుగులు చేయడంతో ఉపఖండపు స్పిన్ పిచ్‌లపై 275 పరుగుల లక్ష్యం న్యూజిలాండ్‌కు అసాధ్యమైంది. ఇదే వేదికపై చివరి రెండో టెస్టు ఈ నెల 26 నుంచి 30 వరకు జరుగుతుంది.



సహజ



రష్మిక

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సహజ, రష్మిక

సాక్షి, హైదరాబాద్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత రైజింగ్ స్టార్స్, తెలంగాణ క్రీడాకారిణులు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లను అందుకున్నారు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 23 ఏళ్ల సహజ మూడు స్థానాలు ఎగబాకి 295వ స్థానంలో... 22 ఏళ్ల రష్మిక 22 స్థానాలు పురోగతి సాధించి 318వ స్థానంలో నిలిచారు. సహజ భారత నంబర్‌వన్‌గా కొనసాగుతుండగా... రష్మిక భారత మూడో ర్యాంకర్‌గా ఉంది. ఈ ఏడాది సహజ అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తోంది. మొత్తం 23 టోర్నీల్లో పోటీపడింది. 29 మ్యాచ్‌ల్లో విజయం సాధించి, 22 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. లాస్‌ఏంజెలిస్‌లో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ15 టోర్నీలో సహజ సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించింది. మరోవైపు రష్మిక కూడా ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. 21 టోర్నీల్లో పాల్గొన్న రష్మిక 25 మ్యాచ్‌ల్లో గెలిచి, 21 మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. ఇండోర్‌లో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ35 టోర్నీలో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ



చెంగ్డూ (చైనా): భారత డబుల్స్ స్టార్ ప్లేయర్ యూకీ బాంబ్రీ ఈ ఏడాది మూడో టైటిల్ సాధించేందుకు విజయం దూరంలో నిలిచాడు. చెంగ్డూ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 7–6 (11/9)తో రెండో సీడ్ ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)–రాఫెల్ మాటోస్ (బ్రెజిల్) జంటను ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో సాడియో డుంబియా–ఫాబియన్ రెబూల్ (ఫ్రాన్స్)లతో యూకీ–ఒలివెట్టి తలపడతారు. ఈ ఏడాది యూకీ తన భాగస్వామి ఒలివెట్టితో కలిసి జిస్టాడ్ ఓపెన్, మ్యూనిక్ ఓపెన్ టోర్నీల్లో టైటిల్స్ సాధించాడు.

గావస్కర్ ఉపయోగించని ప్లాటు రహానేకు

మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు





ముంబై: భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌కు గతంలో కేటాయించిన స్థలాన్ని వెటరన్ బ్యాటర్ అజింక్య రహానేకు బదలాయిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముంబైలోని ఖరీదైన బాంద్రా ప్రాంతంలో 2000 చదరపు మీటర్ల (2391 గజాలు) స్థలాన్ని రహానేకు 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వాలని మహారాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్రీడాభివృద్ధి కోసం ఈ స్థలాన్ని వినియోగించాల్సి ఉంటుంది. ఈ స్థలాన్ని 1988లో గావస్కర్‌కు కేటాయించారు. ఇండోర్ క్రికెట్ ట్రెయినింగ్ అకాడమీ కోసం లీజుకు ఇచ్చారు. కానీ 30 ఏళ్లకుపైగా గావస్కర్ ఈ స్థలాన్ని సద్వినియోగం చేయలేదు. క్రికెట్ అవసరాలకోసం అభివృద్ధి చేయలేదు. ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం కేటాయించిన భూమి నిరుపయోగంగా మారడంపై 2021లోనే ఆ రాష్ట్ర మాజీ గృహనిర్మాణ మంత్రి జితేంద్ర అవ్హద్ విమర్శించారు. దీంతో గావాస్కర్ మరుసటి ఏడాదే (2022) ప్రభుత్వానికి అప్పగించారు. తాజాగా ఈ స్థలానే ఇప్పుడు రహానేకు కేటాయించారు.

సాహిల్ అజేయ శతకం

- యూత్ వన్డేలో 9 వికెట్లతో ఆసీస్‌పై భారత్ జయభేరి
- 2–0తో సిరీస్ కైవసం
- 26న ఆఖరి వన్డే

పుదుచ్చేరి: భారత్, ఆస్ట్రేలియా అండర్–19 జట్ల మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన రెండో వన్డేలో ఓపెనర్ సాహిల్ పరఖ్ (75 బంతుల్లో 109 నాటౌట్; 14 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. దీంతో భారత అండర్–19 జట్టు 9 వికెట్ల తేడాతో ఆసీస్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా జట్టు ముందుగా బ్యాటింగ్‌కు దిగి 49.3 ఓవర్లలో 176 పరుగులకే ఆలౌటైంది. యువ బౌలర్లు సమర్థ్ నాగరాజ్ (2/34), మొహమ్మద్ ఎనాన్ (2/30), కిరణ్ చోర్మళే (2/29), యుధజీత్ (1/36), హార్దిక్ రాజ్ (1/31) సమష్టిగా దెబ్బకొట్టడంతో ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్కరు కనీసం 40 పరుగులైనా చేయలేకపోయారు. మిడిలార్డర్ బ్యాటర్ అడిసన్ శెరిఫ్ (39; 2 ఫోర్లు) చేసిన పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోరర్! మిగతా వారిలో క్రిస్టియాన్ హోవ్ (28; 2 ఫోర్లు) ఇరవై పైచిలుకు స్కోరు చేశాడు. భారత బౌలర్ల ధాటికి ఇంకెవరూ కూడా చెప్పుకోదగ్గ స్కోరే చేయలేకపోయారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ జట్టు కేవలం 22 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది. సాహిల్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన రుద్ర పటేల్ (10) విఫలమవగా, వన్‌డౌన్ బ్యాటర్ అభిజ్ఞాన్ కుందు (50 బంతుల్లో 53 నాటౌట్; 9 ఫోర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీ సాధించారు. సాహిల్, అభిజ్ఞాన్ అబేధ్యమైన రెండో వికెట్‌కు 153 పరుగులు జోడించారు. తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ నెల 26న ఇదే వేదికపై ఆఖరి వన్డే జరుగుతుంది.



అభిజ్ఞాన్ సాహిల్ పరఖ్ కిరణ్ చోర్మళే

1,000 మైళ్లు 2 నెలలు

అంత దూరాన తప్పిపోయిన పెంపుడు పిల్లి రెణ్నెల్లలో క్షేమంగా స్వస్థలం చేరిన వైనం

పెంపుడు జంతువులంటేనే ఎంతో విశ్వాసంగా ఉంటాయి. ఎంత దూరం వెళ్లినా తిరిగి తమ ఆవాసాలకు చేరి ఆశ్చర్యపరుస్తుంటాయి. కానీ ఏకంగా ఎన్నో మైళ్ల దూరాన తప్పిపోయిన ఓ పెంపుడు పిల్లి ఒకరకంగా చరిత్రే సృష్టించింది. అక్షరాలా వెయ్యి మైళ్లు వెనక్కు ప్రయాణించి మరీ రెండు నెలల తరవాత ఇల్లు చేరింది! ప్రాణప్రదమైన పిల్లి తిరిగి రావడంతో యజమానుల ఆనందానికి పట్టపగ్గాల్లేవు. అమెరికాలో కాలిఫోర్నియాలోని సాలినాస్‌కు చెందిన సుసానే, బెన్నీ అంగుయానోలకు రెండున్నరేళ్ల పిల్లి ఉంది. ముద్దుగా రెయిన్‌బో అని పిలుచుకునేవారు. జూన్ 4న పిల్లితో పాటు వ్యోమింగ్‌లోని ఎల్లో స్టోన్ పార్కుకు వెళ్లారు. ఏమైందో గానీ పిల్లి ఉన్నట్టుండి భయపడి పారిపోయింది. ఎంత పిలిచినా వెనక్కి తిరిగి కూడా చూడకుండా పరుగు తీసింది. రోజుల తరబడి వెదికినా లాభం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగొచ్చారు. నెల తర్వాత మరో పిల్లిని దత్తత తీసుకున్నారు. 61 రోజుల తర్వాత కాలిఫోర్నియాలో సాలినాస్‌కు 190 మైళ్ల దూరంలోని రోజ్‌విల్లేలో దాన్ని గుర్తించారు. దాంతో దంపతులిద్దరూ పరుగెత్తుకుని వెళ్లి దాన్ని ఇంటికి తెచ్చుకున్నారు. 'మేం వెళ్లేసరికి ఆరోగ్యం పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. లేదంటే ఆ 190 మైళ్లు కూడా దాటేసి ఇంటికే వచ్చేసేదేమో'అంటూ సుసానే మురిసిపోయింది. అయితే దాదాపు 1,000 మైళ్ల దూరంలోని వ్యోమింగ్ నుంచి రోజ్‌విల్లే దాకా అది ఎలా రాగలిగిందన్నది మాత్రం పజిల్‌గానే మిగిలిపోయింది!

- సాక్షి, నేషనల్ డెస్క్



పెంపుడు పిల్లితో సుసానే

'కామ్ కీ బాత్' ఏనాడూ చెప్పలేదు

ఎప్పుడూ మన్ కీ బాత్ ముచ్చట్లే

- బాధ్యతలను విస్మరించారంటూ ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు



సురాన్‌కోట్(జమ్మూకశ్మీర్)/శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న నిరుద్యోగ సమస్య, ధరల కట్టడిని మోదీ నిర్లక్ష్యం చేశారని ఎండగట్టారు. సోమవారం పూంఛ్ జిల్లాలోని సురాన్‌కోట్ శాసనసభ నియోజకవర్గంలో, శ్రీనగర్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. ''నెలకోసారి 'మన్ కీ బాత్'ముచ్చట్లతో మోదీ మోతెక్కిస్తారు. కానీ ఏనాడూ తాను పూర్తిచేయాల్సిన కీలక బాధ్యతలను ప్రస్తావించరు. బాధ్యతలను విస్మరించారు. ఉద్యోగాల కల్పన, ధరల కట్టడి వంటి చేయాల్సిన పనులపై 'కామ్ కీ బాత్'ఏనాడూ చెప్పరు. గతంలో 56 అంగుళాల ఛాతి అంటూ గొప్పలు చెప్పుకుని తిరిగిన ఆనాటి మోదీ ఇప్పుడు లేరు. ఎందుకంటే ఆయన మూడ్‌ను లోక్‌సభ ఎన్నికల తర్వాత విపక్షాల 'ఇండియా'కూటమి మార్చేసింది. ప్రధాని మోదీ సైకాలజీని మా కూటమి దెబ్బకొట్టింది''అని రాహుల్ అన్నారు.

కశ్మీర్‌ను ఢిల్లీ సర్కార్ కాదు, స్థానికులే పాలించాలి

జమ్మూకశ్మీర్‌ను ఢిల్లీ ప్రభుత్వం కాకుండా స్థానికులే పాలించాలని రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసి మోదీ సర్కార్ నేరుగా పరిపాలిస్తున్న నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలుచేశారు. ''కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)లను రాష్ట్రాలుగా మార్చారుగాగానీ రాష్ట్రాన్ని యూటీగా మార్చడం భారత చరిత్రలో ఎన్నడూ జరగలేదు. పూర్తిస్థాయి రాష్ట్రమైన జమ్మూకశ్మీర్‌ను యూటీగా మార్చి ఇక్కడి పౌరుల హక్కులను కాలరాశారు''అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సైతం పాల్గొన్నారు.

వాళ్లు చేయకుంటే మేమే చేస్తాం

''జమ్మూకశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా కోసం కేంద్రప్రభుత్వంతో పోరాడతాం. అయినా వాళ్లు ఇవ్వకపోతే మేం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మేమే హోదా ఇస్తాం. యూటీకాకముందు స్థానికులే కశ్మీర్‌ను పాలించేవారు. ఇక్కడి వారి భవిష్యత్తు, ప్రయోజనాలకనుగుణంగా నిర్ణయాలు జరిగేవి. ఇప్పుడు 'బయటి'వ్యక్తులు మీ గొంతుక వినకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నడిపిస్తోంది. మేం మీ ప్రభుత్వాన్ని జమ్మూకశ్మీరే నడపాలని కోరుకుంటున్నాం. మీ సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎలుగెత్తి చాటేందుకు మీ గొంతుకనవుతా''అని స్థానికులను ద్దేశించి రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండో దఫాలో 26 స్థానాలకుగాను సెప్టెంబర్ 25న జరగబోయే పోలింగ్‌కు ప్రచారం సోమవారంతో ముగిసింది.

కుల గణన అనడానికే మోదీ జంకుతున్నారు

కుల గణన అనడానికి కూడా ప్రధాని మోదీ జంకుతున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, బీజేపీని విమర్శిస్తూ రాహుల్ సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో పలు పోస్టులుచేశారు. ''బీజేపీ పూర్తిగా బహుజనుల వ్యతిరేక పార్టీగా తయారైంది. వాళ్లు ఎన్ని పుకార్లు పుట్టించినా, అబద్ధాలు వ్యాపింపజేసినా మేం మాత్రం రిజర్వేషన్లకు ఎలాంటి ముప్పు రానివ్వం. సమగ్ర కుల గణన జరిగేదాకా మేం ఊరుకోం. సమాజంలోని ప్రతి వర్గానికి హక్కులు, వాటా, న్యాయం దక్కేలా చూస్తాం. అవసరమైతే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తేసి ఎక్కువ రిజర్వేషను కల్పిస్తాం. మోదీజీ కనీసం కులగణన అనడానికి కూడా భయపడుతున్నారు. బహుజనులకు న్యాయం దక్కడమనేది రాజకీయ అంశంకాదు అది నా జీవిత లక్ష్యం''అని రాహుల్ అన్నారు.





దాల్ సరస్సులో షికారాలతో ఎన్నికల ర్యాలీ. (ఇన్‌సెట్లో) ప్రచారం చేస్తున్న పీపుల్స్ కాన్ఫరెన్స్ అభ్యర్థి అబిద్ హుస్సేన్ అన్సారీ

ట్రంప్ నోట ఓటమి మాట

ఓడితే మళ్లీ పోటీ చేయనని వ్యాఖ్యలు



వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో ఓడితే ఇంకెప్పుడూ పోటీ చేయబోనని రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ చేతిలో ఓడితే మళ్లీ పోటీ చేస్తారా అని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రశ్నించగా ఈ మేరకు బదులిచ్చారు. అయితే విజయం తనదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ తన ఓటమి గురించి మాట్లాడటం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. తాను ఓడటమంటూ జరిగితే యూదు ఓటర్ల వల్లేనని గురువారం ఆయన వ్యాఖ్యానించారు. ''అమెరికాలోని యూదుల్లో 60 శాతం శత్రువుకు మద్దతిస్తున్నారు. ఆ కారణంగా నేనోడితే ఇజ్రాయెల్ ఉనికిలోనే ఉండదు''అంటూ హెచ్చరించారు. 78 ఏళ్ల ట్రంప్ గత మూడు ఎన్నికల నుంచి వరుసగా పోటీ చేస్తున్నారు. అమెరికా చట్టాల ప్రకారం అధ్యక్షునిగా రెండుసార్లకు మించి పని చేయడానికి వీల్లేదు. కనుక ఈసారి ట్రంప్ గెలిస్తే 2028లో పోటీ చేయలేరు.

పుణె ఎయిర్‌పోర్టుకు సంత్ తుకారాం పేరు

ముంబై: పుణెలోని విమానాశ్రయం పేరును జగద్గురు సంత్ తుకారాం మహారాజ్ పుణె ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా మార్చే ప్రతిపాదనను సోమవారం మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పుణెకు చెందిన పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ ఈ మేరకు పంపిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిందని అధికారులు తెలిపారు. తాజా ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపిస్తామన్నారు. మధ్యయుగాల **నాటి భక్తి ఉద్యమంలో కీలకంగా ఉన్న హిందూమత గురువుల్లో సంత్ తుకారాం ఒకరు. పుణె జిల్లాలో ఈయన జన్మించారు.**

కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ

కుమారి సెల్జాను అవమానించింది: అమిత్ షా



చండీగఢ్: హరియాణా శాసనసభ ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపణలు గుప్పించారు. సోమవారం రాష్ట్రంలోని ఫతేహాబాద్ జిల్లాలోని తోహనా పట్టణంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ ప్రసంగించారు. ''కా ంగ్రెస్ ముమ్మాటికీ దళితుల వ్యతిరేక పార్టీ. అశోక్ తన్వార్ కావొచ్చు, నాయకురాలు కుమారి సెల్జా కావొచ్చు.. ఇలా ప్రతి ఒక్క దళిత నేతను కాంగ్రెస్ పార్టీ అవమానించింది. ఎన్నికల్లో పాల్గొనకుండా కుమారి సెల్జాను కాంగ్రెస్ అడ్డుకుంది''అని అన్నారు. దేశం అభివృద్ధి చెందాక రిజర్వేషన్లతో పనిలేదని, అప్పుడు రిజర్వే షన్లను కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే తొలగించే అవకాశముందని రాహుల్ అమెరికాలో వ్యాఖ్యానించిన అంశాన్ని అమిత్ ప్రస్తావించారు. ''మన హరియాణా రాష్ట్రం ఇప్పుడు పూర్తిగా అభివృద్ధి చెందిన రాష్ట్రం. ఇప్పుడు మన రాష్ట్రంలో రిజర్వేషన్లు ఉండాలా ? వద్దా?''అని ర్యాలీలో పాల్గొన్న వందలాది మంది కార్యకర్తలను అమిత్ ప్రశ్నించారు. ''ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను పరిరక్షించే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం మన ప్రధాని మోదీ మాత్రమే''అని అన్నారు.

నేనెప్పుడూ కాంగ్రెస్ వాదినే..

త్వరలోనే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటా: సెల్జా



చండీగఢ్: 'నేనెప్పుడూ కాంగ్రెస్ వాదినే'అంటూ హరియాణాకు చెందిన ఆపార్టీ ఎంపీ కుమారి సెల్జా స్పష్టం చేశారు. హరియాణాలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమని ప్రకటించారు. ఈ వారంలోనే ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటానన్నారు. హరియాణా కాంగ్రెస్‌లో అంతర్గత పోరు ముదిరిందని, అసెంబ్లీ టిక్కెట్ల పంపిణీ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన సెల్జా ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారంట ఇటీవల వార్తలొచ్చాయి. కాంగ్రెస్‌లో అన్యాయానికి గురైన సెల్జాను బీజేపీలోకి రావాలంటూ రాష్ట్ర మాజీ సీఎం, కేంద్ర మంత్రి ఖట్టర్ ఆహ్వానించడం తెలిసిందే. సోమవారం హోం మంత్రి అమిత్ షా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ దళిత వ్యతిరేకి అయిన కాంగ్రెస్ పార్టీ కుమారి సెల్జా వంటి వారిని అవమానిస్తోందని ఆరోపించారు. వీటన్నిటి నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత రణదీప్ సూర్జేవాలా సోమవారం 'ఎక్స్'లో కుమారి సెల్జా ఈ నెల 26న నర్వానాలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని ప్రకటించారు. ఎంపీ సెల్జా చండీగఢ్‌లో మీడియాతో మాట్లాడారు. పార్టీ వైఖరిపై అసంతృప్తికి గురవుతున్నారా అన్న ప్రశ్నకు సెల్జా.. నా కంటే బీజేపీయే ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నట్లుగా ఉందంటూ సమాధానం దాటేయడం గమనార్హం.

కాంగ్రెస్‌తో బంధం తెంచుకోండి

దళిత నేతలకు బీఎస్పీ అధినేత్రి వినతి



సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. హరియాణా ఎన్నికల్లో దళితులకు ఏకైక ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదగాలని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బీఎస్పీల కూటమి భావిస్తున్న తరుణంలో మాయావతి సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టారు. ''కాంగ్రెస్ సహా ఇతర కులతత్వ పార్టీలు అవి కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే దళితులను వాడుకుంటున్నాయి. తర్వాత ఆ పార్టీలు దళితులను పూర్తిగా విస్మరించాయి. కాంగ్రెస్, కులతత్వ పార్టీలతో దళితులు, దళిత నేతలు తమ బంధాన్ని తెంచుకోండి''అని మాయావతి పిలుపునిచ్చారు.''రాహుల్ 'రిజర్వేషన్ల'వ్యాఖ్యలనూ మాయావతి ప్రస్తావించారు. ''చరిత్ర చూస్తే మొదట్నుంచీ దళిత, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం'అని ఆరోపించారు. ''రిజర్వేషన్లను తొలగిస్తామని మాట్లాడిన రాహుల్ వంటి రాజ్యాంగ వ్యతిరేకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి''అని దళితులకు సూచించారు.

లౌకికవాదం అనేది ఐరోపా భావన

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యాఖ్య



చెన్నై: లౌకికవాదం అనేది యూరప్ నుంచి భారత్‌లోకి ప్రవేశపెట్టిన ఒక భావన అని తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యాఖ్యానించారు. ఆదివారం కన్యాకుమారి జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''లౌకికవాదం పేరిట భారతీయులకు వ్యతిరేకంగా ఎన్నో మోసాలు జరిగాయి. వాటిల్లో లౌకికవాదం కూడా ఒకటి. ఐరోపా ఖండంలో పాటించే 'లౌకికవాద'సిద్ధాంతాన్ని అవసరం లేకపోయినా భారత్‌లోకి జొప్పించారు. యూరప్‌లో శతాబ్దాల క్రితం చర్చికి, ఆయా ప్రాంతాల పాలకులైన రాజులకు మధ్య జరిగిన ఘర్షణల ఫలితంగా లౌకికవాదమే కొత్త భావన పుట్టుకొచ్చింది. దానిని ఆయా దేశాలు అమలుచేశాయి. కానీ ధర్మాన్ని పాటించే భారత్‌కు దానితో ఏం పని?. ధర్మం అమలయ్యే దేశంలో లౌకికవాదంతో అవసరమేంటి?. యూరప్‌లో పురుడుపోసుకున్న లౌకికవాదం అక్కడే నప్పుతుంది. భారత్‌కు తగదు''అని అన్నారు.

ఐఎస్ఐ చీఫ్‌గా మహ్మద్ అసిం మాలిక్



ఇస్లామాబాద్: పాకిస్తాన్ గూఢచర్య విభాగం ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)నూతన డైరెక్టర్ జనరల్‌గా లెఫ్టినెంట్ జనరల్ మహ్మద్ అసిం మాలిక్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన రావల్పిండిలో ఆర్మీ జనరల్ హెడ్‌క్వార్టర్‌లో అడ్జుటెంట్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ఐఎస్ఐ చీఫ్ పదవి పాక్ ఆర్మీలోని కీలకమైన పోస్టుల్లో ఒకటి . దేశ భద్రత, రక్షణ సంబంధ అంశాల్లో ఐఎస్ఐ నిర్ణాయక శక్తిగా ఉంది. ఆర్మీ చీఫ్‌తో సంప్రదింపులు జరిపిన మీదట ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్‌ను పాకిస్తాన్ ప్రధాని నియమిస్తారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నియమించిన ఐఎస్ఐ చీఫ్ నదీమ్ అంజుం ఈ నెల 30న రిటైర్ కానున్నారు. ఈయన స్థానంలో ఆసిం మాలిక్ బాధ్యతలు చేపడతారు.

'రావూస్' సీఈవోకు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: బేస్‌మెంట్‌ను వరద ముంచెత్తి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు దుర్మరణం పాలైన కేసులో రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అభిషేక్ గుప్తా, కోర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌లకు ఢిల్లీ కోర్టు సోమవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. డిసెంబరు 7 వరకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. నవంబరు 30లోగా రెడ్‌క్రాస్ సొసైటీ వద్ద రూ.2.5 కోట్లను డిపాజిట్ చేయాలని అభిషేక్ గుప్తాను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి అంజూ బజాజ్ చందన ఆదేశించారు. ఈ భవనాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తిగా, రావూస్ సీఈవోగా.. ప్రాణ, ఆస్తి నష్టాలేవి సంభవించినా అభిషేక్ గుప్తానే బాధ్యుడవుతారని కోర్టు పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌ను వ్యాపార కార్యకలాపాలకు వాడారని, అందులో సందేహం లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. అలాగే మున్సిపల్ అధికారుల వైఫల్యాన్ని కూడా విస్మరించలేమన్నారు. దర్యాప్తు పూర్తయినందున నిందితులకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నామన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో పిడుగుపడి 8 మంది మృతి

మృతుల్లో నలుగురు పాఠశాల విద్యార్థులు

రాజ్‌నంద్‌గావ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని ఓ గ్రామంలో సోమవారం పిడుగుపాటుకు ఐదుగురు బాలురు సహా మొత్తం 8 మంది అసువులు బాశారు. సోమ్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని జోరాటరాయి గ్రామంలో భారీ వర్షం పడుతుండటంతో రోడ్డు పక్కనున్న ఓ నిర్మాణం వద్ద కొందరు చేరారు. అనూహ్యంగా ఆ నిర్మాణంపైనే పిడుగుపడింది. ఆ తీవ్రతకు ప్రాణాలు కోల్పోయిన 8 మందిలో నలుగురు ప్రభుత్వ పాఠశాలలో 11, 12 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులు. సైకిళ్లపై ఇళ్లకు వెళ్తూ వాన రావడంతో అక్కడికి చేరుకున్నారని పోలీసులు తెలిపారు. ఘటనలో మృతి చెందిన మరో బాలుడు వారిలో ఒకరిని ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చాడన్నారు. గాయపడిన ఒక వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

వక్ఫ్ జేపీసీకి 1.2 కోట్ల మెయిల్స్

విశేష స్పందన వచ్చింది: రిజిజు



పుణె: వక్ఫ్ (సవరణ) బిల్లు–2024పై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని పార్లమెంటరీ వ్యవహారాలు, మైనార్టీ శాఖల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని జేపీసీకి ఏకంగా 1.2 కోట్ల ఈ మెయిల్స్ వచ్చాయని సోమవారం వెల్లడించారు. 75,000 మంది తమ వాదనలకు మద్దతుగా డాక్యుమెంట్లను కూడా సమర్పించారని తెలిపారు. బిల్లు సమర్థకులు, వ్యతిరేకులు ఇందులో ఉన్నారన్నారు. వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లును ఈ ఏడాది ఆగస్టు 8న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో జేపీసీకి పంపిన విషయం తెలిసిందే. బిల్లుపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ముస్లింల ఆస్తులను ప్రభుత్వం లాగేసుకుంటుందని దుష్ప్రచారం చేస్తున్నారని రిజిజు మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ సక్రమంగా జరగాలనేదే ఈ బిల్లు ఉద్దేశమన్నారు.

తొలగించింది వారే... హెచ్చరించింది వారే

ఫిష్‌పేట్లను తొలగించి.. అధికారులకు సమాచారం

నైట్ డ్యూటీల కోసం ముగ్గురు ట్రాక్‌మెన్ దుశ్చర్య

సూరత్: నైట్ డ్యూటీలు ఉంటే.. రోజంతా కుటుంబంతో గడపవచ్చని భావించారు రైల్వే లైన్లను తనిఖీ చేసే ముగ్గురు ట్రాక్‌మెన్. దాంతో ఉద్దేశపూర్వకంగా ఫిష్‌ప్లేట్లను తొలగించి.. తామే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పెద్ద ప్రమాదాన్ని అరికట్టారనే పేరు వస్తుందని ఆశించారు. అధికారులు తమ అప్రమత్తతను మెచ్చుకొని నైట్‌డ్యూటీలు వేస్తారనేది వారి ఆశ. కానీ రైల్వే నిపుణుల దర్యాప్తులో వారి నిర్వాకం బయటపడి అరెస్టయ్యారు. సూరత్ ఎస్పీ హోతేష్ జాయ్‌సర్ సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. సుభాష్ పొద్దార్, మనీష్ మిస్త్రీ, శుభమ్ జైస్వాల్‌లు ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్నారు. కొసాంబా– కిమ్ స్టేషన్ల మధ్య దుండగులెవరో ఎలాస్టిక్ క్లిప్‌లను, రెండు ఫిష్‌పేట్లను తొలగించారని, వాటిని పక్కనున్న మరో ట్రాక్‌పై పెట్టి రైలు పట్టాలు తప్పేలా చేయాలని చూశారని ఈ ముగ్గురు శనివారం వేకువజామున 5:30 గంటలకు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. కిమ్ పోలీసుస్టేషన్‌లో కుట్ర కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. రైల్వే ఉన్నతాధికారులను అప్రమత్తం చేయడానికి ట్రాక్‌మెన్ పట్టాల వీడియోను పంపించారు. అంతకు కొద్ది నిమిషాల ముందు ఆ ట్రాక్ మీదుగా ఒక రైలు వెళ్లిందని రైల్వే అధికారులు పోలీసులకు తెలిపారు. ట్రాక్‌మెన్ ఉన్నతాధికారులను అప్రమత్తం చేసిన సమయానికి, రైలు వెళ్లిన సమయానికి.. మధ్య అవధి చాలా తక్కువగా ఉంది. ఇంత తక్కువ సమయంలో ఫిష్‌ప్లేట్లను, ఎలాస్టిక్ క్లిప్‌లను తొలగించడం సాధ్యం కాదు. దాంతో పోలీసులు ట్రాక్‌మెన్ మొబైల్ ఫోన్లను పరిశీలించారు. శనివారం వేకువజామున 2:50 గంటలనుంచి 4:57 గంటలకు వరకు వీరు ట్రాక్ దృశ్యాలను చిత్రీకరించినట్లు తేలింది. దాంతో పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో అసలు విషయం బయటపెట్టారు. రైలు ప్రమాదాన్ని నివారిస్తే.. అధికారులు సన్మానించి, ఇకపై కూడా నైట్‌డ్యూటీలో కొనసాగిస్తారని వీరు భావించారు. నైట్ డ్యూటీలు ఉంటే.. మరుసటి రోజు ఆఫ్ దొరుకుతుందని.. రోజంతా కుటుంబంతో గడపొచ్చని వీరు భావించారు. వర్షాకాలానికి సంబంధించి తమవంతు నైట్‌డ్యూటీలు ముగింపునకు రావడంతో వీరి దుశ్చర్యకు పాల్పడ్డారు. నిందితుల్లో ఒకరైన సుభాష్ పొద్దారు ఈ ఐడియా ఇచ్చాడు.

సునీత కోసం 26న క్రూ–9 ప్రయోగం

వచ్చే ఫిబ్రవరిలో భూమికి రానున్న భారత సంతతి వ్యోమగామి

కేప్ కెనవెరల్(అమెరికా): భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, అమెరికా వ్యోమగామి బుచ్ విల్మోర్‌లను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమికి సురక్షితంగా తీసుకువచ్చే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. వీరి కోసం ఈ నెల 26న క్రూ–9 ప్రయోగం ఉంటుందని నాసా తెలిపింది. స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్, డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ గురువారం కేప్ కెనవెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి నింగిలోకి దూసుకెళ్తాయని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ స్పేస్ క్రాఫ్ట్‌లో సునీత, విల్మోర్‌లతోపాటు అమెరికా, రష్యాకు చెందిన మరో ఇద్దరు వ్యోమగాములు కూడా భూమికి చేరుకుంటారని నాసా పేర్కొంది. జూన్‌లో సునీత, విల్మోర్ వెళ్లిన స్టార్‌లైనర్ స్పేస్ క్రాఫ్ట్‌కు ఐఎస్ఎస్ వద్దకు వెళ్లాక అనుకోని సమస్యలు ఎదురయ్యాయి. దీంతో, వీరిద్దరూ అక్కడే చిక్కుబడిపోవడం తెలిసిందే.

భూమికి సురక్షితంగా చేరుకున్న ముగ్గురు

మాస్కో: ఇద్దరు రష్యన్, ఒక అమెరికన్ వ్యోమగాములతో కూడిన సోయుజ్ క్యాప్సూల్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)నుంచి కజకిస్తాన్‌కు చేరుకుంది. సోమవారం అంతరిక్ష కేంద్రం నుంచి విడివడిన దాదాపు మూడున్నర గంటల్లో ఈ క్యాప్సూల్ కజక్‌స్తాన్‌లోని పచ్చిక మైదానాల్లో దిగింది. నేలను సురక్షితంగా తాకేందుకు వీలుగా అందులోని చిన్న రాకెట్లను మండించారు. ఆఖరు దశలో 7.2 మీటర్ల పారాచూట్ గంటకు 16 మైళ్ల వేగంతో కిందికి వచ్చింది. అనంతరం అందులోని వ్యోమగాములను బయటకు తీసుకువచ్చి, వైద్య పరీక్షలు జరిపారు. ఈ వ్యోమగాములు ఒలెగ్ కొనొనెంకో, నికొలాయ్ చుబ్‌లు 374 రోజులపాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. ఇది ప్రపంచ రికార్డని అధికారులు తెలిపారు. వీరితోపాటే వచ్చిన అమెరికన్ వ్యోమగామి ట్రేసీ డైసన్ ఆరు నెలలపాటు ఐఎస్ఎస్‌లో ఉన్నారు. కాగా, ఐఎస్ఎస్‌లో సునీతా, విల్మోర్ సహా ఇంకా 8మంది వ్యోమగాములున్నారు.

సాక్షి ప్లస్
మంగళవారం। 24-9-2024

ఆలోచనల వ్యక్తీకరణకు అభిమతం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

రాజ్యాంగ సారాంశం మొత్తం ప్రవేశికలో నిక్షిప్తమై ఉంటుంది. ఇది రాజ్యాంగంలో అంతర్భాగమా, కాదా అనే అంశంపై సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులను వెలువరించింది. 1960లో బెరుబారి వర్సెస్ యూనియన్ కేసులో సుప్రీంకోర్టు ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని పేర్కొంది. ఈ సందర్భంలో ప్రకరణ 143 ప్రకారం సలహా పూర్వక అభిప్రాయాన్ని చెప్పింది. కానీ 1973లో కేశవానంద భారతి కేసులో తీర్పునిస్తూ దీనికి పూర్తి భిన్నంగా.. ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమేనని వ్యాఖ్యానించింది. 1995లో ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కేసులో కూడా అత్యున్నత ధర్మాసనం ఇదే అభిప్రాయాన్ని పునరుద్ఘాటించింది.

రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశికపై ఓటింగ్ నిర్వహించినప్పుడు కూడా 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం' అని డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు స్థిరీకరించింది.

ప్రవేశిక ప్రయోజనం

ప్రవేశిక రాజ్యాంగ ఆత్మ, హృదయం. ఇది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను తెలుసుకోవడానికి ఆధారం. ఇది రాజ్యాంగానికి సూక్ష్మరూపం (Constitution in Miniature). ఇందులో రాజ్యాంగ తాత్విక పునాదులు ఉన్నాయి.

ప్రయోజనాలు

- ఇది రాజ్యాంగ ఆధారాలను తెలుపుతుంది.
- రాజ్యాంగ ఆమోద తేదీని తెలుపుతుంది.
- రాజ్యాంగాన్ని సక్రమంగా వ్యాఖ్యానించడానికి న్యాయస్థానాలకు చట్టపర సహాయకారిగా ఉపయోగపడుతుంది.

విమర్శ

- ప్రవేశికకు న్యాయ సంరక్షణ (Non-Justiciable) లేదు. ఇందులో పేర్కొన్న ఆశయాలను అమలు పరచకపోతే న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవు.
- ఇందులో పేర్కొన్న భావజాలానికి నిర్దిష్ట నిర్వచనాలు లేవు.
- హక్కుల ప్రస్తావన లేదు.
- శాసనాధికారాలకు ఇది ఆధారం కాదు.
- సమకాలీన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రవేశికలోని కొన్ని ఆదర్శాలు అమలుకు నోచుకోవట్లేదని చెప్పవచ్చు.

ప్రవేశిక - పరిశీలన

భారత రాజ్యాంగానికి హృదయం, ఆత్మగా పరిగణిస్తున్న ప్రవేశిక ప్రాముఖ్యంపై భిన్న అభిప్రాయాలున్నాయి. ప్రవేశికకు న్యాయ సంరక్షణ లేదు. అంటే ఇందులో పొందుపర్చిన ఆశయాలు, లక్ష్యాలు స్వతంత్రంగా అమల్లోకి రావు. వాటిని అమలుపరచాలని పౌరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు. ఆ విధంగా న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయలేవు. కాబట్టి అత్యంత పవిత్రమైన ఈ ఆశయాలకు ఆచరణ లేదా అమలు చేయకపోవడం వల్ల వాటి సార్థకతపై తీవ్ర విమర్శ ఉంది. అయితే రాజ్యాంగంలోని ప్రకరణల భావం లేదా ఆచరణీయతపై సక్రమంగా వ్యాఖ్యానించడానికి ప్రవేశికలోని సారాంశాన్ని న్యాయస్థానాలు ప్రాతిపదికగా తీసుకుంటాయి. ప్రవేశికకు స్వతంత్రంగా ప్రాముఖ్యం లేకపోయినా, ఇందులోని ఆదర్శాలను అమలు చేస్తూ పార్లమెంటు చట్టం చేసినప్పుడు లేదా ఆ విధంగా చేసిన చట్టాలను అమలు చేయనప్పుడు, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు.

ప్రవేశిక - సుప్రీంకోర్టు తీర్పులు వివాదం	సంవత్సరం	సుప్రీంకోర్టు తీర్పు సారాంశం
ఎ.కె. గోపాలన్ కేసు	1950	ప్రవేశిక రాజ్యాంగ ప్రకరణల అర్థాన్ని, పరిధిని నియంత్రిస్తుంది.
బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు	1960	ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు.
గోలక్‌నాథ్ కేసు	1967	ప్రవేశిక రాజ్యాంగ ఆదర్శాలకు, ఆశయాలకు సూక్ష్మ రూపం.
కేశవానంద భారతి కేసు	1973	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమే. మౌలిక నిర్మాణం పరిధిలోకి వస్తుంది. పరిమితంగా సవరించవచ్చు.
ఎక్సెల్ వేర్ కేసు	1979	సామ్యవాదం పద నిర్వచనం.
నకారా కేసు	1983	సామ్యవాదం అనేది గాంధీయిజం, మార్క్సిజం కలయిక.
ఎస్.ఆర్.బొమ్మాయ్ కేసు	1994	లౌకికతత్వం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది.
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా	1995	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమని పునరుద్ఘాటించింది.
అశోక్‌కుమార్ గుప్తా కేసు	1997	సామాజిక న్యాయం అనేది ప్రాథమిక హక్కు.
అరుణా రాయ్ కేసు	2002	విద్యా సంస్థల్లో మత విలువల బోధన లౌకికతత్వానికి వ్యతిరేకం కాదు.

ప్రవేశికపై ప్రముఖుల అభిప్రాయాలు

- ప్రవేశిక అనేది భారత ప్రజాస్వామ్య గణతంత్రానికి రాజకీయ జాతకం (Political Horoscope) -కె.యం. మున్షీ
- రాజ్యాంగంలో ప్రవేశిక అత్యంత పవిత్ర మైన భాగం. ఇది రాజ్యాంగ ఆత్మ. రాజ్యాంగానికి తాళంచెవి లాంటిది. - పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ
- రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది. - ఎం.ఎ. నాని పాల్కీవాలా
- రాజ్యాంగానికి ప్రవేశిక కీలక సూచిక లాంటిది. అలాంటి సూచికలు సాధారణంగా పాశ్చాత్య రాజ్య వ్యవస్థలో ఉంటాయి. ఇది భారత రాజ్యాంగంలో ఉన్నందుకు నేను పులకించి గర్వపడుతున్నాను. - సర్ ఎర్నస్ట్ బార్కర్
- ప్రవేశిక మన కలలు, ఆలోచనలకు రాజ్యాంగంలో వ్యక్తీకరించుకున్న అభిమతం. - అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
- భారత రాజ్యాంగ ప్రవేశిక అమెరికా స్వతంత్ర ప్రకటన మాదిరిగానే రాజ్యాంగ ఆత్మ. రాజకీయ వ్యవస్థ స్వరూపం, పవిత్ర నిర్ణయాన్ని తెలియజేస్తుంది. విప్లవం తప్ప మరొకటి దీన్ని మార్చలేదు. - జస్టిస్ హిదయతుల్లా
- ప్రవేశిక ఒక నిశ్చితమైన తీర్మానం, హామీ. - నెహ్రూ
- రాజ్యాంగ ప్రాధాన్యాల లక్షణ సారం ప్రవేశిక. - మథోల్కర్
- ప్రవేశిక అనేది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను, లక్ష్యాలను తెలుసుకోవడానికి ఒక తాళంచెవి లాంటిది. - జె. దయ్యర్
- ప్రవేశిక రాజ్యాంగానికి ఆధారం కాదు, అలాగే పరిమితి కాదు. - సుప్రీంకోర్టు

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రవేశిక భావాన్ని మన రాజ్యాంగకర్తలు ఏ దేశ రాజ్యాంగం నుంచి తీసుకున్నారు?
   ఎ) యు.ఎస్.ఎ. బి) యు.కె.
   సి) యు.ఎస్.ఎస్.ఆర్. డి) జర్మనీ
2. భారత రాజ్యాంగంలోని రిపబ్లిక్ అనే పదాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
   ఎ) ఫ్రెంచి రాజ్యాంగం
   బి) జర్మనీ రాజ్యాంగం
   సి) యు.ఎస్. రాజ్యాంగం
   డి) యు.కె. రాజ్యాంగం
3. రాజ్యాన్ని మతం నుంచి వేరు చేయడాన్ని ఏమంటారు?
   ఎ) నాస్తికవాదం బి) సామ్యవాదం
   సి) లౌకికవాదం డి) సాంఘికన్యాయం
4. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ అధికారాలను పరిమితం చేసేది?
   ఎ) ప్రజలు బి) రాజ్యాంగం
   సి) పార్లమెంటు డి) పత్రికలు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) సి; 4) బి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం అని, అదేవిధంగా కాదనీ పరస్పర వివాదాస్పదమైన తీర్పులను సుప్రీంకోర్టు ఏయే కేసుల్లో వ్యక్తీకరించింది?
   ఎ) ఎ.కె.గోపాలన్, గోలక్‌నాథ్
   బి) కేశవానంద భారతి, గోలక్‌నాథ్
   సి) మేనకాగాంధీ, మినర్వా మిల్స్
   డి) పైవేవీ కాదు
2. ప్రవేశిక నుంచి ఏం రాబట్టవచ్చు?
   ఎ) రాజ్యాంగానికి ఆధారం
   బి) రాజకీయ వ్యవస్థ లక్ష్యాలు
   సి) ప్రభుత్వ స్వరూపం డి) పైవన్నీ
3. సమగ్రత అనే పదజాలాన్ని ప్రవేశికలోకి చేర్చడానికి కారణం?
   ఎ) ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం
   బి) వేర్పాటువాద ఉద్యమాలు
   సి) సుప్రీంకోర్టు తీర్పులు డి) ఎ, సి
4. ప్రవేశికలో సమకాలీన ప్రాముఖ్యతను, వివాదాన్ని సంతరించుకున్న పదాలు?
   ఎ) లౌకికతత్వం, సామ్యవాదం
   బి) ఐక్యత, సమగ్రత
   సి) గణతంత్రం, సార్వభౌమాధికారం
   డి) పైవన్నీ
5. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ ప్రవేశికలో చేర్చిన పదాలేవి?
   ఎ) సామ్యవాద, లౌకిక
   బి) ప్రజాస్వామిక
   సి) సార్వభౌమ డి) రిపబ్లిక్
6. భారత రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యం అనే భావనను ఎక్కడ పొందుపరిచారు?
   ఎ) ప్రాథమిక హక్కులు
   బి) పీఠిక
   సి) రాజ్య విధానం - ఆదేశిక సూత్రాలు
   డి) నాలుగో షెడ్యూల్
7. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలు?
   i) దృఢ రాజ్యాంగం
   ii) ద్విసభా విధానం
   iii) సి.ఎ.జి. కార్యాలయం
   iv) సమష్టి బాధ్యత
   ఎ) i, ii, iii బి) i, iv
   సి) i, ii, iii, iv డి) i, ii
8. 'రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది' అని పేర్కొన్నవారు?
   ఎ) జస్టిస్ హిదయతుల్లా
   బి) అంబేద్కర్ సి) మహాత్మాగాంధీ
   డి) ఎం.ఎ. నాని పాల్కీవాలా
9. ప్రవేశిక-గ్రహించిన అంశాలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత?
   ఎ) ప్రజాస్వామ్యం - అమెరికా
   బి) గణతంత్రం - ఫ్రాన్స్
   సి) సామ్యవాదం - రష్యా
   డి) లౌకిక - బ్రిటన్
10. సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని తీర్పునిచ్చింది?
    ఎ) కేశవానంద భారతి కేసు
    బి) బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు
    సి) ఎస్.ఆర్. బొమ్మాయ్ కేసు
    డి) మినర్వా మిల్స్ కేసు

సమాధానాలు


1) బి; 2) డి; 3) బి; 4) ఎ; 5) ఎ; 6) సి; 7) డి; 8) డి; 9) డి; 10) బి.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

కమిటీలు - వివరాలు

కమిటీ	అధ్యక్షుడు/ చైర్మన్	పరిశీలన అంశం
మోహన్ కమిటీ	జస్టిస్ మోహన్	ప్రభుత్వరంగ సంస్థల స్థితిగతులపై
ఎంపీ లాడ్స్ కమిటీ	వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్	ఎంపీలాడ్స్ అవకతవకల విచారణకు
ముఖర్జీ కమిటీ	ముఖర్జీ	కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని సమీక్షించడానికి
మల్హోత్రా కమిటీ	ఆర్.ఎస్. మల్హోత్రా	బీమారంగ సంస్కరణల సమీక్ష కోసం
లింగ్డో కమిటీ	జేఎం లింగ్డో	విద్యార్థి సంఘాల ఎన్నికల సక్రమ నిర్వహణకు సంబంధించింది

విద్యుత్ బల్బును కనుగొన్న శాస్త్రవేత్త?



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం
భౌతిక, రసాయన శాస్త్రం - ఎస్ఏ కంటెంట్

అయస్కాంతత్వం, విద్యుత్

భూమి ఒక పెద్ద సహజ అయస్కాంతం. సహజ అయస్కాంతాలకు మరోపేరు లోడ్‌స్టోన్స్. కృత్రిమ అయస్కాంతాలను ఘర్షణ ద్వారా లేదా విద్యుత్ పద్ధతి ద్వారా తయారు చేస్తారు.

అయస్కాంతాలు - రకాలు

1) దండాయస్కాంతం
2) స్తూపాకార అయస్కాంతం
3) గోళీలు చివరలు ఉన్న అయస్కాంతం
4) గుర్రపు నాడ అయస్కాంతం
5) వలయాకార అయస్కాంతం

అయస్కాంత పదార్థాలకు ఉదాహరణ: ఇనుము, ఉక్కు, నికెల్.

అనయస్కాంత పదార్థాలకు ఉదాహరణ: కాగితం, రబ్బరు, ప్లాస్టిక్.

- అయస్కాంతాలు దిశా ధర్మాన్ని కలిగి ఉంటాయి. వాటిని వేలాడదీస్తే ఉత్తర, దక్షిణ దిశలను సూచిస్తూ నిశ్చల స్థితికి వస్తాయి.
- సజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి. విజాతి ధ్రువాలు ఆకర్షించుకుంటాయి. దీన్నే అయస్కాంత ధ్రువాల సూత్రం అంటారు.
- అయస్కాంతాలు ఏక ధ్రువాలు. ఇవి విడిగా ఉండలేవు. జతలుగా మాత్రమే ఉంటాయి.
- కృత్రిమ అయస్కాంతాలను ఏక స్పర్శా, ద్వి స్పర్శా, విద్యుత్, ప్రేరణ పద్ధతుల్లో తయారు చేస్తారు.
- శాశ్వత అయస్కాంతాల తయారీకి ఆల్నికోను ఉపయోగిస్తారు.
- ఎలక్ట్రిసిటీ అనే పదం క్రీ.పూ. 600 సంవత్సరంలో గ్రీకు శాస్త్రవేత్త థేల్స్ ప్రయోగించడంతో వాడుకలోకి వచ్చింది.
- సీమ గుగ్గిలాన్ని గ్రీకు భాషలో ఎలక్ట్రాన్ అంటారు.
- విద్యుదావేశం వస్తువులపై స్థిరంగా ఉండటం వల్ల ఈ భాగాన్ని స్థిర విద్యుత్ శాస్త్రం అంటారు.
- మేఘాల్లోకి గాలి పటాలను ఎగరేసి అవి విద్యుదావేశం కలిగి ఉంటాయని నిరూపించినవారు - బెంజిమన్ ఫ్రాంక్లిన్.
- ప్రాథమిక ఘటాన్ని నిర్మించినవారు వోల్టా.
- వోల్టా ఘటంలో సజల సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని విద్యుత్ విశ్లేష్యంగా, జింక్‌ను కాథోడ్‌గా, కాపర్‌ను ఆనోడ్‌గా ఉపయోగిస్తారు.
- వోల్టా ఘటంలో రసాయన శక్తి విద్యుచ్ఛక్తిగా మారుతుంది.
- వోల్టా ఘటంలోని లోపాలు.
  1) స్థానిక చర్య 2) ధ్రువీకరణం
- వోల్టా ఘటంలోని లోపాన్ని సవరిస్తూ నిర్మించిన ఘటం లెక్లాంచి ఘటం.
- లెక్లాంచి ఘటంలో జింక్‌ను కాథోడ్‌గా, కార్బన్ కడ్డీని ఆనోడ్‌గా, NH_4Clను విద్యుద్విశ్లేష్యంగా ఉపయోగిస్తారు.
- బైక్రోమేట్ ఘటంలో $K_2Cr_2O_7+H_2SO_4$ మిశ్రమాన్ని విద్యుద్విశ్లేష్యంగా ఉపయోగిస్తారు.
- అనార్ద్ర ఘటం లెక్లాంచి ఘటానికి మరో రూపం.
- అనార్ద్ర ఘటంలో జింక్‌ను రుణ ఎలక్ట్రోడ్‌గా, కార్బన్ $+MnO_2$ల మిశ్రమాన్ని ధన ఎలక్ట్రోడ్‌గా ఉపయోగిస్తారు.
- రేడియో, టార్చ్‌లైట్, టేప్ రికార్డ్‌లలో ఉపయోగించే ఘటం అనార్ద్ర ఘటం.
- వలయం ద్వారా విద్యుత్‌ను ప్రవహింప చేసేందుకు ఘటం చేయగలిగే పనినే దాని 'విద్యుచ్చాలక బలం' అంటారు.
- విద్యుచ్చాలక బలాన్ని వోల్టుల్లో కొలుస్తారు.
- విద్యుచ్చాలక బలంతో రసాయన శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చవచ్చు.
- వలయాన్ని పూర్తి చేయడానికి, తెరవడానికి స్విచ్‌ను ఉపయోగిస్తారు.
- విద్యుత్ ప్రవాహం వల్ల కలిగే అయస్కాంత క్షేత్రాన్ని ఆంపియర్ స్విమ్మింగ్ నిబంధన ద్వారా పరిశీలించవచ్చు.
- విద్యుత్ ప్రవహించే తీగ అయస్కాంతంలా ప్రవర్తించి అయస్కాంత క్షేత్రాన్ని ఏర్పరుస్తుంది.
- పొడవైన విద్యుత్ బంధక స్తూపాకార గొట్టాన్ని తీసుకొని దాని చుట్టూ విద్యుత్ బంధక పూత ఉన్న రాగి తీగను ఖాళీ లేకుండా దగ్గరగా చుడితే దాన్ని సోలినాయిడ్ అంటారు. విద్యుత్ ప్రవహించే సోలినాయిడ్ దండాయస్కాంతంలా పనిచేస్తుంది.
- విద్యుత్ ప్రవాహాన్ని సూచించడానికి గాల్వనోస్కోప్‌ను ఉపయోగిస్తారు.

విద్యుత్ పరికరాలు - సంకేతాలు	
1. బ్యాటరీ (ఘటం):	+ −
2. శ్రేణి పద్ధతిలో ఘటాల సంధానం:	
3. సమాంతర పద్ధతిలో ఘటాల సంధానం:	
4. ప్లగ్ కీ:	(·)
5. విద్యుత్ బల్బు	
6. టాప్ కీ:	
7. ఓల్ట్ మీటర్:	V
8. రియోస్టాట్:	
9. ఫ్యూజ్:	
10. విద్యుత్ నిరోధం:	
11. అమ్మీటర్:	A
12. గాల్వనో మీటర్:	G

- విద్యుత్ ఘటంలో గుర్రపు నాడ అయస్కాంతాన్ని ఉపయోగిస్తారు.
- దూర ప్రదేశాలకు తక్కువ కాల వ్యవధిలో వార్తలను పంపే ఆధునిక సాధనాల్లో మొదటిది టెలిగ్రాఫ్.
- మోర్స్‌కోడ్‌ను ఉపయోగించడం వల్ల టెలిగ్రాఫ్ మరింత సమర్థంగా పనిచేస్తుంది.
- మోర్స్‌కోడ్‌లో ప్రతి అక్షరానికి చుక్కలు, గీతలతో కూడిన గుర్తులను ఇస్తారు.
- మోర్స్ కీ.. K ని కొంచెం ఎక్కువ నొక్కి ఉంచితే దాన్ని (-) గీతతో సూచిస్తారు.
- మోర్స్ కీ.. K ని కొంచెం తక్కువ నొక్కి ఉంచితే దాన్ని (.) చుక్కతో సూచిస్తారు.
- విద్యుత్ విశ్లేష్యం ద్వారా విద్యుత్ ప్రవహించడం వల్ల జరిగే ముఖ్య రసాయన చర్య విద్యుత్ విశ్లేషణం.
  $H_2O \rightarrow 2H^+ + O^{2-}$
- కాపర్ సల్ఫేట్ ద్రావణ విద్యుత్ విశ్లేషణం
  $CuSO_4 \rightarrow Cu^{2+} + SO_4^{2-}$

విద్యుద్విశ్లేషణం అనువర్తనాలు:

1) ఎలక్ట్రోప్లేటింగ్
2) గిల్టు నగల తయారీ
3) లోహ సంగ్రహణం
4) ఎలక్ట్రిక్ ప్రింటింగ్, గ్రామ్‌ఫోన్ రికార్డ్‌ల తయారీ.

- విద్యుత్ ప్రవాహానికి కలిగే అవరోధాన్ని ఆ వాహక నిరోధం అంటారు.
- లోహపు తీగల ద్వారా జరిగే ప్రవాహం ఎలక్ట్రాన్‌ల వల్ల ఏర్పడుతుంది.
- వాహక విద్యుత్ నిరోధం దాని పొడవుకు అనులోమానుపాతంలో, మధ్యచ్ఛేద వైశాల్యానికి విలోమానుపాతంలో ఉంటుంది.
- విద్యుచ్ఛక్తి ఉష్ణశక్తిగా మారడానికి కారణం విద్యుత్ నిరోధం.
- విద్యుత్ ప్రవాహం వల్ల ఉష్ణ ఫలితాలు ఏర్పడతాయి అనే సూత్రం ఆధారంగా ఎలక్ట్రిక్ బల్బు, ఎలక్ట్రిక్ ఇస్త్రీపెట్టె, సోల్డరింగ్ గన్ మొదలైన పరికరాలు పనిచేస్తాయి.
- విద్యుదయస్కాంతాన్ని మెత్తని ఇనుముతో తయారు చేస్తారు.
- ఘటాలను శ్రేణిలో కలిపితే మొత్తం విద్యుచ్చాలక బలం పెరుగుతుంది.
- ఘటాలను సమాంతరంగా కలిపితే మొత్తం విద్యుచ్చాలక బలం విడిగా ఉన్న విద్యుచ్చాలక బలం కంటే ఎక్కువ ఉండదు.
- విద్యుత్ బల్బును కనుగొన్న శాస్త్రవేత్త: థామస్ ఆల్వా ఎడిసన్.
- విశిష్ట నిరోధానికి ప్రమాణం.. ఓమ్ - మీటర్
- నిరోధానికి ప్రమాణం: ఓమ్
- విద్యుత్ విశ్లేషణ నియమాలను ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త: ఫారడే.
- విద్యుత్ ప్రవాహానికి ప్రమాణం: ఆంపియర్.
- విద్యుత్ ప్రవాహాన్ని కొలిచే పరికరం: అమ్మీటర్.
- విద్యుత్ పొటెన్షియల్‌కు ప్రమాణం: ఓల్ట్.
- విద్యుత్ పొటెన్షియల్‌ను కొలిచే పరికరం: ఓల్ట్ మీటర్.

ఘటం	రుణ ఎలక్ట్రోడ్	ధన ఎలక్ట్రోడ్	ఎలక్ట్రోలైట్	EMF
వోల్టా	జింక్	కాపర్	H_2SO_4	1.08
లెక్లాంచి	జింక్	కార్బన్	NH_4Cl	1.5
బైక్రోమేట్	జింక్	కార్బన్	$K_2Cr_2O_7 + H_2SO_4$	2
అనార్ద్ర	జింక్	కార్బన్	NH_4Cl (Paste)	1.5

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అయస్కాంతం అనయస్కాంతీకరణం జరిగే విధానం?
   1) నిర్లక్ష్యంగా వినియోగించడం
   2) వేడి చేయడం
   3) వ్యతిరేక దిశలో అయస్కాంతీకరించడం
   4) పైవన్నీ
2. వాహకం ద్వారా విద్యుత్ ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి ప్రవహించడాన్ని ఏమంటారు?
   1) స్థిర విద్యుత్ 2) ప్రవాహ విద్యుత్
   3) రెండూ 4) ఏదీకాదు
3. సంకేతం సూచించే విద్యుత్ పరికరం?
   1) నిరోధం 2) రియోస్టాట్
   3) ప్లగ్-కీ 4) ఘటం
4. ఇళ్లలో వాడే విద్యుచ్ఛక్తి వినియోగానికి ప్రమాణాలు?
   1) WH 2) కెల్విన్
   3) KWH 4) వోల్ట్స్
5. బైక్రోమేట్ ఘటంలో రుణ ధ్రువంగా పనిచేసేది?
   1) రాగి పలక 2) జింక్
   3) కార్బన్ కడ్డీ 4) ఏదీకాదు

సమాధానాలు

1) 4; 2) 2; 3) 1; 4) 3; 5) 2.

మాదిరి ప్రశ్నలు

1. శాశ్వత అయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
   1) కాపర్ 2) ఇనుము
   3) ఆల్నికో 4) ఇత్తడి
2. సీమ గుగ్గిలాన్ని గ్రీకులో ఏమంటారు?
   1) ఎలక్ట్రాన్ 2) ప్రోటాన్
   3) న్యూట్రాన్ 4) పాజిట్రాన్
3. వోల్టా ఘటంలో విద్యుత్ విశ్లేష్యం?
   1) HNO_3 2) H_2SO_4
   3) HCl 4) NH_4Cl
4. బైక్రోమేట్ ఘటం విద్యుచ్చాలక బలం?
   1) 1.08 2) 1.5 3) 2 4) 1.6

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 3.

ఉద్యోగాలు

బెల్ బెంగళూరులో ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్-1(ఎలక్ట్రానిక్స్/మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.09.2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు మొదటి ఏడాది రూ.40,000, రెండో ఏడాది రూ.45,000, మూడో ఏడాది రూ.50,000, నాలుగో ఏడాది రూ.55,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.10.2024.
» వెబ్‌సైట్: https://bel-india.in/

బెల్ బెంగళూరులో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.09.2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు మొదటి ఏడాది రూ.40,000, రెండో ఏడాది రూ.45,000, మూడో ఏడాది రూ.50,000, నాలుగో ఏడాది రూ.55,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.10.2024.
» పని ప్రదేశాలు: విశాఖపట్నం, ముంబై.
» వెబ్‌సైట్: https://bel-india.in/

అతి పొడవైన కణాలను కలిగిన కణజాలం?

కణజాలాలు

జీవుల్లో నిర్మాణాత్మక, క్రియాత్మక ఆధార ప్రమాణం కణం. అనేక కణాల సముదాయాన్ని కణజాలం అంటారు. కణజాలాలు కలిసి వివిధ అవయవాలను, అవయవాలు కలిసి అవయవ వ్యవస్థలను ఏర్పరుస్తాయి. వివిధ వ్యవస్థల సముదాయమే జీవి. మొక్క లేదా జంతువు రూపొందేందుకు మొదట రెండు కణాల సంయోగం జరిగి సంయుక్త బీజ కణం (జైగోట్) ఏర్పడుతుంది. అది అనేక మార్పులకు (విభజనలు) గురై మొక్క లేదా జంతువుగా మారుతుంది. ఈ క్రమంలో వివిధ రకాల కణాలు కలిసి వివిధ రకాలైన కణజాలాలను ఏర్పరుస్తాయి. కణజాలాలు మొక్కల్లో, జంతువుల్లో నిర్మాణాలు, వాటి పనితీరును బట్టి వివిధ రకాలుగా ఉన్నాయి. కణజాలాల అధ్యయనాన్ని హిస్టాలజీ అంటారు. కణజాలం (టిష్యూ) అనే పదాన్ని మొదటవాడింది బిచాట్.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మొక్కల్లో కణజాలం

మొక్కల్లో సాధారణంగా మూడు రకాల కణజాలాలు ఉంటాయి. అవి..

1. సరళ కణజాలం
2. సంక్లిష్ట కణజాలం
3. ప్రత్యేక కణజాలం

1. **సరళ కణజాలం:** నిర్మాణం, విధుల్లో ఒకే విధంగా ఉండే కణాల సముదాయాన్ని సరళ కణజాలం అంటారు. ఇది మొక్కల్లో ఎక్కువ శాతం ఉండే కణజాలం. దీనిలో

ఎ. మృదు కణజాలం

బి. స్థూలకోణ కణజాలం

సి) దృఢ కణజాలం అనే రకాలుంటాయి.

మృదు కణజాలం: మొక్కల్లోని లేత, మెత్తని భాగాల్లో, పత్రాలు, పుష్పాలు, ఫలాలు, విత్తనాల్లో ఎక్కువగా ఉంటుంది. మృదు కణజాలం గాయాలను మాన్పడానికి, అంట్లు కట్టినప్పుడు, పునరుద్భవం మొదలైన అంశాల్లో దోహదపడుతుంది. కణజాల వర్ధనంలో అసంఖ్యాకంగా మొక్కలు ఏర్పడటానికి ఇది తోడ్పడుతుంది.

స్థూల కోణ కణజాలం (కోలెన్‌కైమా): ఇది ఎక్కువగా లేత కాండాలు, పత్ర వృంతాలు, పుష్ప వృంతాలు, పత్రాల అంచులు, ఈనెలు మొదలైన భాగాల్లో ఉంటుంది. ఏక దళ బీజ మొక్కల కాండం, పత్రాల్లో ఉండదు. ఈ కణాలు వివిధ ఆకృతులతో ఉంటాయి. వీటి కణ కవచం ప్రత్యేకత ఏమిటంటే సెల్యూలోజ్, పెక్టిన్‌తో నిర్మితమై ఉంటుంది. కణ కవచంలో 60 శాతం నీరు ఉంటుంది. స్థూల కోణ కణజాలం మొక్కల భాగాలకు సమ్యత (Flexibility), స్థితిస్థాపకతను కలగజేయడం వల్ల వృంత భాగాలు సులువుగా వంగుతాయి. పత్ర, పుష్ప వృంతాలు వంటి సున్నిత భాగాలు ప్రతిబలాన్ని (Stress), ప్రయాస (Strain) ను ఎదుర్కొంటాయి. పత్రాల పై భాగాన ముదురు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం స్థూల కోణ కణజాలమే.

దృఢ కణజాలం: ఇది నిర్జీవ సరళ యాంత్రిక కణజాలం. ఇది మొక్కల భాగాలకు యాంత్రిక బలాన్ని, గట్టిదనాన్ని కలుగజేస్తుంది. ఇది ఎక్కువగా ఎడారి మొక్కల్లో అభివృద్ధి చెంది ఉంటుంది. వీటి కణ కవచాలు లిగ్నిన్‌తో నిర్మితమై ఉంటాయి. నారలు, శిలా కణాలు ఈ కణజాలానికి చెందినవే. అతి పొడవైన నారలు.. రామి నారలు (బొహెమిరియా నీవియా). నారల్లో సెల్యూలోజ్ ఉన్న వాటిని ఫ్లాక్స్ నారలు అంటారు. ఇవి వాణిజ్య పరంగా విలువైనవి. ఫ్లాక్స్ నారలు, హెంప్, రామి నారల్లో లిగ్నిన్ ఉండదు.

కండ ఉన్న ఫలాలు, విత్తనాలు మొదలైన వాటిలో శిలా కణాలు ఎక్కువగా ఉంటాయి. **ఉదా:** కొబ్బరి, యాపిల్, పియర్.

2. **సంక్లిష్ట కణజాలం:** భిన్న రకాలైన కణాలు కలిసి ఒకే పనిని నిర్వర్తించేందుకు ఏర్పడే కణజాలం ఇది. ముఖ్యంగా మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను, ఆహార పదార్థాలను రవాణా చేసేందుకు ఉపయోగపడుతుంది. సంక్లిష్ట కణజాలంలో 1) దారువు (Xylem) 2) పోషక కణజాలం (Phloem) అనే రెండు రకాలుంటాయి. దారువును హైడ్రోమ్ అని కూడా అంటారు. ఇది నీటిని, ఖనిజ మూలకాలను మొక్కకు రవాణా చేస్తుంది. దీనిలో దారు కణాలు, దారు నారలు, దారు నాళాలు, దారు మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. దారువులో ఉండే కణాలు లిగ్నిన్ కణ కవచాలను కలిగి, కేంద్రకం లేకుండా నిర్జీవంగా ఉంటాయి. ఇవి మొక్కకు భౌతిక ఆధారాన్ని, దృఢత్వాన్ని ఇస్తాయి. పరిణతి చెందిన వృక్షాల్లో దారు నాళాల్లోకి బెలూన్ల వంటి నిర్మాణాలు ఏర్పడతాయి. వీటిని టైలోసిస్‌లు అంటారు. ఇవి కాండం దృఢత్వాన్ని పెంచుతాయి. కలప ఎక్కువ మన్నిక ఉంది అనడానికి కారణం టైలోసిస్‌లు ఏర్పడటమే.

పోషక కణజాలాన్ని లెప్టోమ్ అని కూడా అంటారు. ఇది ఆహార పదార్థాలను మొక్క అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది. దీనిలో చాలనీ కణాలు, చాలనీ నాళాలు, సహకణాలు, నారలు, మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణాలు చాలనీ నాళాలు (ఆర్‌బీసీ మాదిరిగా). కణాల మధ్య కణ ద్రవ్య పోగులు (ప్లాస్మా డెస్మెటా) కన్వేయర్ బెల్టుల మాదిరిగా పనిచేస్తాయి.

3. **ప్రత్యేక కణజాలం:** విభిన్న కణాలు విభిన్న ప్రక్రియలను జరిపే కణజాలాన్ని ప్రత్యేక కణజాలం అంటారు. ఇది ముఖ్యంగా స్రావక క్రియలో తోడ్పడుతుంది. కీటకాహార మొక్కల్లో జీర్ణరసాలను స్రవించేందుకు జీర్ణగ్రంథులుంటాయి. ఇవి కీటకాలను జీర్ణం చేసేందుకు ప్రోటియోలైటిక్ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేస్తాయి. తేనెటీగలు గ్రహించే మకరందం పుష్పాల్లో ఉండే మకరంద గ్రంథుల నుంచి వస్తుంది.

కొన్ని మొక్కలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతాయి. దీనికి కారణం ఆస్మోఫోర్‌లు. పైనస్ వంటి మొక్కల్లో రెసిన్లను ఉత్పత్తి చేసేది స్రావక కుహరాలు. శీతాకాలంలో కొన్ని మొక్కలు **ఉదా:** గడ్డి, టమాటా వంటి మొక్కల పత్రాల చివరి భాగం నుంచి నీరు బిందువుల రూపంలో వెలువడుతుంది. దీన్నే బిందుస్రావం (Guttation) అంటారు. ఇది జరిగేందుకు హైడథోడ్స్ (జలగ్రంథులు) తోడ్పడతాయి. కొన్ని మొక్కల్లో వాటిని గిల్లినప్పుడు తెల్లని పాల వంటి పదార్థం వెలువడుతుంది. దీన్నే లేటెక్స్ అంటారు. దీన్ని ఉత్పత్తి చేసే కణజాలం లాటిసి ఫెరస్ కణజాలం. లేటెక్స్ నుంచి రబ్బర్‌ను తయారు చేస్తారు. హీవియా బ్రెజిలియన్సిస్ నుంచి పారా రబ్బర్, ఫైకస్ ఎలాస్టికా నుంచి ఇండియన్ రబ్బర్‌ను తయారు చేస్తారు.

కణజాల వ్యవస్థలు: మొక్క భాగాలను వేరు, కాండం, పత్రం వంటి వాటిని ఛేదించినప్పుడు వాటిలో వివిధ రకాల కణజాలాలు వివిధ రీతుల్లో కనిపిస్తాయి. సాధారణంగా వెలుపలి వరుసలో బాహ్య చర్మం, మధ్యలో వల్కలం, లోపలి తలంలో ప్రసరణ స్తంభం అనే భాగాలుంటాయి.

వేరు బాహ్య చర్మంలోని కేశాలు నీటిని శోషించేందుకు, కాండంలోని బాహ్య చర్మ కేశాలు రక్షణకు తోడ్పడతాయి. పత్రం బాహ్య చర్మంలో పత్ర రంధ్రాలుంటాయి. పత్ర రంధ్రాలుండే భాగంలో రక్షక కణాలుంటాయి. పత్ర రంధ్రాల ద్వారా నీరు ఆవిరి అవడాన్ని భాష్పోత్సేకం అంటారు. వేరు, కాండం వంటి భాగాల్లో వల్కలం అధికంగా ఉంటుంది. ఇది ముఖ్యంగా పదార్థాల రవాణా నిల్వలో తోడ్పడుతుంది. ప్రసరణ స్తంభంలో దారువు, పోషక కణజాలం ఉంటాయి. సాధారణంగా వేరులో బాహ్య ప్రథమ దారుకం (Exarch), కాండంలో అంతర ప్రథమ దారుకం (Endwich) స్థితులు ఉంటాయి.

వృక్షాల కాండాలు బాగా వృద్ధి (లావెక్కడం) చెందడాన్ని ద్వితీయ వృద్ధి అంటారు. దీనిలో వార్షిక వలయాలు ఏర్పడతాయి. వీటి సంఖ్యను బట్టి వృక్షాల వయసును లెక్కిస్తారు. కాండం మధ్యలో ముదురు రంగులో ఉన్న భాగాన్ని డ్యురామెన్ అని, లేత రంగులో ఉన్న భాగాన్ని అల్బర్నం అంటారు. వెలుపలి భాగాన పొలుసుల మాదిరిగా ఏర్పడిన దాన్ని బెరడు అంటారు. బాగా వృద్ధి చెందిన వృక్షాల పై భాగాన సూక్ష్మ రంధ్రాలు ఏర్పడతాయి. వీటినే వాయురంధ్రాలు అంటారు.

జంతువుల్లో

జంతువుల్లో కణజాలాలు పని చేసే విధానాన్ని బట్టి నాలుగు రకాలు.

1. ఉపకళా కణజాలం
2. సంయోజక కణజాలం
3. కండర కణజాలం
4. నాడీ కణజాలం

1. **ఉపకళా కణజాలం (ఎపిథీలియల్):** ఇది ముఖ్యంగా శరీర బాహ్య తలంలోనూ, శరీరంలోని వివిధ అంగాల బాహ్య, అంతర తలాల్లోనూ పొర మాదిరిగా ఉంటుంది. **ఉదా:** చర్మం.

వెంట్రుకలు, గోళ్లు, కొమ్ములు మొదలైనవి ఉపకళా కణజాలాలతో నిర్మితమైనవే. ఇవి బాహ్య ప్రేరణను కూడా కలుగజేస్తాయి. ఉప కళాకణజాలంలో కణాలు ఘనాకారంలో, స్తంభాకారంలో, మరికొన్ని శైలికలను కలిగి ఉంటాయి. **ఉదా:** జీర్ణాశయంలో శైలికల వంటి నిర్మాణాలు ఆహార పదార్థాలను కదిలించేందుకు తోడ్పడతాయి. వివిధ రకాలైన హార్మోన్‌లను, రసాయన పదార్థాలను స్రవించడంలో కూడా ఉపయోగపడతాయి.

2. **సంయోజక కణజాలం:** ఇది వివిధ కణజాలాలను, అంగాలను కలిపి ఉంచుతుంది. శరీర రక్షణ, శరీర భాగాలను బాగు చేయడంలో ఉపయోగపడుతుంది. కొవ్వులను నిల్వ చేయడం మొదలైన పనులను నిర్వర్తిస్తుంది. వివిధ కణజాలాలను కలిపే కణజాలం ఏరియోలార్ కణజాలం. దెబ్బతిన్న భాగాలను బాగు చేసేది ఏరియోలార్ కణజాలమే.

మృదులాస్థి అనేది మరొక సంయోజక కణజాలం. ఇది ఎముకల చివర చెవిదొప్ప, వాయునాళం, ముక్కు మొదలైన భాగాల్లో ఉంటుంది. పిండ దశలో ఎక్కువగా ఉండేవి మృదులాస్థులే. వీటిలోని కణాలను ఆస్టియోసైట్స్ అంటారు. ఎముక నిర్మాణానికి కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం కార్బొనేట్‌లు అవసరం. వీటిని అస్థిమజ్జలో ఉండే ఆస్టియోసైట్స్ స్రవిస్తాయి.

లిగమెంట్ అనేది ఎముకను మరొక ఎముకతో కలిపి ఉంచే ఒక సంయోజక కణజాలం. ఇది కొల్లాజెన్ అనే ప్రోటీన్‌తో తయారై ఉంటుంది. టెండాన్ (స్నాయుబంధనం) అనేది ఎముకను, కండరాన్ని కలిపి ఉంచే మరొక సంయోజక కణజాలం. ఎడిపోస్ కణజాలం అనేది కొవ్వును నిల్వ చేస్తుంది. ఇది ఉపవాసం సమయంలో శరీరానికి శక్తిని సమకూరుస్తుంది. అదే మాదిరిగా శరీరంలోని వేడిని బయటకు పోకుండా చేస్తుంది.

రక్తం కూడా ఒక సంయోజక కణజాలం. దీనిలో ప్లాస్మా అనే ద్రవ పదార్థ రక్త కణాలు ఉంటాయి. ప్లాస్మాలో అనేక రకాల ఆహార పదార్థాలు, లాక్టిక్ ఆమ్లం, యూరియా వంటి విసర్జక పదార్థాలు, హెపారిన్, ప్రోత్రాంబిన్ వంటి ప్రోటీన్స్ మొదలైనవి ఉంటాయి.

రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, థ్రాంబోసైట్స్ అనే మూడు రకాల కణాలుంటాయి. ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం ఉండదు కానీ చేపలు, ఉభయ చరాలు, సరీసృపాలు, గుర్రం వంటి వాటిలో కేంద్రాన్ని కలిగిన ఎర్ర రక్త కణాలుంటాయి. ఇవి O_2, CO_2 రవాణాలో తోడ్పడతాయి.

తెల్ల రక్తకణాలు కేంద్రకాన్ని కలిగి వివిధ రీతుల్లో ఉంటాయి. ఇవి శరీరంలో వ్యాధి నిరోధకతను పెంచుతాయి. రక్త ఫలకికలు (థ్రాంబోసైట్లు) కేంద్ర రహితం. ఇవి రక్తాన్ని గడ్డ కట్టించేందుకు తోడ్పడతాయి.

3. **కండర కణజాలం:** శరీరంలోని దాదాపు ఎక్కువ భాగాలు కండర కణజాలంతో నిర్మితమై ఉంటాయి. పూర్తిగా కండర కణజాలంతో నిర్మితమైంది గుండె, నాలుక మొదలైన కండరాలు వివిధ భాగాల చలనానికి తోడ్పడతాయి. కండరాలు ముఖ్యంగా మూడు రకాలు.

1. రేఖీత కండరాలు
2. అరేఖిత కండరాలు
3. హృదయ కండరాలు

రేఖిత కండరాలు: ఇవి ఎముకకు అతుక్కొని ఉంటాయి. ఇవి కదలికలో తోడ్పడతాయి. ఇవి మన ఆధీనంలో ఉండే కదలికలను కలుగజేస్తాయి. కాబట్టి వీటిని నియంత్రిత లేదా ఐచ్ఛిక లేదా సంకల్పిత కండరాలు అని అంటారు.

అరేఖిత కండరాలు: ఇవి మన ఆధీనంలో లేని కదలికలను కలిగిస్తాయి. కాబట్టి వీటిని అనియంత్రిత కండరాలు అని అంటారు. రక్తనాళాలు, పేగు మొదలైన వాటిలో ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. శరీరంలో వివిధ అవయవ వ్యవస్థలు ఏర్పడేందుకు అవసరమైనవి?
   1) కణాలు 2) కణజాలం
   3) కేంద్రకం 4) కణాంగాలు
2. నిరంతరం కణ విభజన జరపని కణజాలం?
   1) హృదయ కండరం 2) అస్థి కణజాలం
   3) 1, 2 4) కండర కణజాలం
3. అతి పొడవైన కణాలను కలిగిన కణజాలం?
   1) కండర కణజాలం
   2) ఎడిపోజ్ కణజాలం
   3) నాడీ కణజాలం
   4) సంయోజక కణజాలం
4. పేగు గోడలపై ఉండే కణజాలం?
   1) సంయోజక కణజాలం
   2) ఉప కళా కణజాలం
   3) కండర కణజాలం 4) నాడీ కణజాలం
5. అసంకల్పిత చర్యలను జరిపే కండరాలు?
   1) హృదయ కండరాలు
   2) రేఖిత కండరాలు
   3) అరేఖిత కండరాలు 4) 1, 3
6. మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను రవాణా చేసే కణజాలం?
   1) సరళ కణజాలం 2) సంక్లిష్ట కణజాలం
   3) ప్రత్యేక కణజాలం 4) 1, 3
7. వృక్షాల్లో వాటి వయసును కొలవడానికి ఉపయోగపడే వార్షిక వలయాల్లో ఉండే కణజాలం?
   1) దారువు 2) పోషక కణజాలం
   3) దవ్వ 4) బాహ్య చర్మం

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 2; 5) 4; 6) 2; 7) 1.

How many such pairs of letters are there..

MODEL QUESTIONS

Directions (Q.No.1-5): Read the following information carefully and answer the questions which follow:

» If 'A * Z' means 'A is the wife of Z'.
» If 'A × Z' means 'A is the husband of Z'.
» If 'A + Z' means 'A is the sister of Z'.
» If 'A - Z' means 'A is the brother of Z'.
» If 'A > Z' means 'A is the son of Z'.
» If 'A < Z' means 'A is the daughter of Z'.

1. Which of the following relations will not be true if the expression 'A < P × T + F > L × M' is definitely true?
   1) A is the daughter of T
   2) F is the son of M
   3) P is the son-in-law of L
   4) A is the cousin of F
   5) M is the grandmother of A
2. Which of the following means N is the daughter-in-law of A?
   1) M + N * P > A 2) N < M + P + A
   3) M - N × P < A 4) A < P + N × M
   5) A < N < P * M
3. How is P related to F if 'Q × P < B + F'?
   1) Daughter 2) Niece
   3) Daughter-in-law
   4) Grand daughter 5) Aunt
4. Which of the following means P is the father of R?
   1) R > S < P * J
   2) J + R - S < P
   3) R > S * P- J
   4) S + J × R < P
   5) None of these
5. How is M related to B if 'A * B > Z × S + M'?
   1) Aunt 2) Grand father
   3) Uncle 4) Cousin
   5) Can't be determined

Directions (Q.No.6-10): Answer the following questions based on the three digit numbers

612 589 743 468 297

6. If two is added to the first digit of each of the numbers, how many numbers thus formed will be completely divisible by three?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. If the positions of the second and the third digits of each of the numbers are interchanged, in how many numbers thus formed will the last digit be a perfect square? ('1' is also a perfect square?
   1) One 2) Two 3) Three
   4) Four 5) Five
8. What will be the resultant if the third digit of the second lowest number is divided by the second digit of the highest number?
   1) 4 2) 1 3) 6 4) 5 5) 2
9. If all the digits in each of the numbers are arranged in descending order within the number which of the following will form the highest number in the new arrangement?
   1) 612 2) 589 3) 743
   4) 468 5) 297
10. If all the numbers are arranged in ascending order from left to right, which of the following will be the sum of all the three digits of the number which is second from the right of the new arrangement thus formed?
    1) 14 2) 9 3) 18
    4) 16 5) 12



BANK EXAMS

REASONING

Directions(Q.No.11-15): Answer these questions referring the symbol-letter -number sequence given below:

L 2 M 3 S P @ = J 5 B $ R 7 N # T D 6 B K V 9 4 % A F 8

11. How many such symbols are there each of which is either immediately preceded by a number or immediately followed by a letter?
    1) One 2) Two 3) Three
    4) More than three 5) None
12. Four of the following five are alike in a certain way based on their position in the above arrangement and hence form a group. Which one does not belong to the group?
    1) 2 S 2) 9 K % 3) # R D
    4) $ 5 7 5) = P 5
13. How many such numbers are there each of which is either immediately preceded by a symbol or immediately followed by a letter?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
14. Which of the following is the seventh to the left of 15^{th} from the right end of the above arrangement?
    1) @ 2) P 3) J 4) 5 5) B
15. If the positions of twenty four elements from the right end are reversed, which of the following will be the 15^{th} element from the left end?
    1) B 2) 4 3) 6
    4) # 5) None of these

Directions (Q.No.16-17): Study the following information carefully and answer the questions given below :

F is the grandson of U. M is the mother of F. M is married to P. P is the son of G. G is married to K.

16. How is K related to M?
    1) Cannot be determined
    2) Daughter-in-law
    3) Father 4) Mother 5) Daughter
17. If D is the father of M, then how is F related to D?
    1) Father 2) Grandson
    3) Son 4) Brother 5) Grandfather
18. How many such pairs of letters are there in the word SHARED each of which has as many letters between them in the word (in both forward and backward directions) as they have between them in English alphabetical series?
    1) Three 2) None 3) One
    4) More than three 5) Two
19. All the letters of the word GLACIERS are arranged in alphabetical order from left to right. Then all the consonants are replaced with the next alphabet (as per the English alphabetical order), then which of the following will be the fourth letter from the left end?
    1) I 2) C 3) R
    4) M 5) H
20. In a straight line of twelve persons (all facing north), only five persons sit to the left of L. Only three persons between C and L. G sits second to the right of C. Only five persons sit between G and M. How many persons sit between M and L?
    1) Two 2) None
    3) Five 4) Three
    5) Cannot be determined


Directions (Q.No.21-22): Study the following information carefully and answer the questions given below:

Point B is 4m to the south of point A.
Point C is 5m to the east of point B.
Point D is 4m to the north of point C.
Point E is 10m to the west of point D.
Point F is 4m to the south of point E.

21. Which of the following represents the direction of point A with respect to point C?
    1) North-west 2) North
    3) North-east 4) South-west
    5) South-east
22. How far is point B from point F?
    1) 7 metres 2) 5 metres
    3) 4 metres 4) 10 metres
    5) 2 metres

SOLUTIONS


1. A < P × T + F > L × M means



From the above it can be concluded that the relation "A is the cousin of F" is not true **Ans: 4**

2. In options (3) and (4) N is a male, hence these are eliminated in option (5) N and A have a direct relation. So this also can be eliminated. In option (2) N is the daughter of M and P, M are sisters of A. So N is the Niece of of A. So this option(2) can be eliminated. In option (1) N is wife of P and P is son of A. so N is daughter-in-law of A. **Ans: 1**

3.



P is F's sister's daughter
⇒ P is F's Niece **Ans: 2**

4. In option (1) P is A female and In option (2) and (4) P's gender is not known. Hence these options are ruled out.
Draw family tree for option (3)
S → P – J
|
R
∴ P is R's father **Ans: 3**

5. Here M is at the end of the relational string and M's gender is an unknown. Hence M's relation to B cannot be established. **Ans: 5**

6. Find the numbers whose sum of the digits is one more than 3 multiple (because after addition of 2 it will become a 3- multiple)
The only number satisfying the condition is 589 (5 + 8 + 9 = 22) **Ans: 2**

7. If the position of second and third are interchanged, then the second digit of the original number will become the last digit of the resultant number. So find out the original numbers whose second digits are perfect square. The numbers satisfying the conditions are 612 743 and 297
Ans: 3

8. Second lowest number is 468 and its third digit is 8. Highest number is 743 and its second digit is 4.
The Req. result = 8 ÷ 4 = 2 **Ans: 5**

9. If all the digits are arranged in descending order within the number the number 589 will become the highest number in new arrangement of D **Ans: 2**

10. If the numbers are arranged in ascending order the second highest number will be second from right in the new arrangement The second highest number is 612 and the sum of its digits
= 6 + 1 + 2 = 9 **Ans: 2**

11. The symbols satisfying the conditions are = J, $ R, # T, and % A. i.e. four symbols satisfy the condition **Ans: 4**


12. In each of the options second and third characters are second to the left of and second to the right of first character except in option (3) **Ans: 3**

13. The numbers satisfying the conditions are
2M 3 5B 7N 6B **Ans: 5**

14. 7^{th} to left of 15^{th} from right ⇒ 7 + 15 = 22^{nd} from right 22^{nd} from right ⇒ 30 – 22 = 8^{th} from left ⇒ @ **Ans: 1**

15. If the position of last 24 elements are reversed then 15^{th} from left end in new arrangement will be 10th letter from right in original arrangement (∵ First 5 elements remain same)
The 10^{th} element from right = 6 **Ans: 3**

(16-17)



16. K's gender is unknown. Hence K's relation to m cannot be established **Ans: 1**


17. If D is father of M then E is Grandson of D **Ans: 2**

18. The pairs satisfying the condition are AD, DE, DH and EH **Ans: 4**

19. Fourth letter from left if the letters arranged in alphabetical order = G
Now G is replaced by next consonant H **Ans: 5**

20. _ C _ G _ L _ _ _ M _ _
Three persons sit between M and L
Ans: 4

(21-22)



21. A's is in Northwest direction with respect to C **Ans: 1**

22. B is at a distance of 5m from F **Ans: 2**